ఈనాడు

హైదరాబాద్ 1-9-2026 మంగళవారం సిటీ సంపుటి 53. సంచిక 23

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Delhi, Mumbai

(c) eenadu

mangalam
బాప్పా రాక కోసం,
పవిత్రతను మాత్రమే ఎంచుకోండి
mangalam
BHIMSENI CAMPHOR
mangalam
100% PURE CAMPHOR
స్వచ్ఛతను పరీక్షించండి. మంగళాన్ని ఎంచుకోండి.
ఇతర కర్పూరం
నల్ల అవశేషాలను వదిలివేస్తుంది
mangalam కర్పూరం
పూర్తిగా కాలిపోతుంది. ఎలాంటి అవశేషం ఉండదు.
BUY NOW
blinkit
zepto
instamart
amazon.in
Flipkart
RelianceSMART
DMart

ఓ పక్క ఇల్లు...
మరో పక్క ఉద్యోగం...
ఎలా బ్యాలన్స్ చేయాలి?
www.vasundhara.net

ఈనాడు

తాజా బిజినెస్ వార్తలు,
ఆర్థిక సందేహాల నివృత్తికై
సిరి చూడండి
www.eenadusiri.net

హైదరాబాద్ 1-9-2026 మంగళవారం సిటీ సంపుటి 53. సంచిక 23
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Delhi, Mumbai

భారత్‌లో జావెలిన్ క్షిపణుల తయారీ

- టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్-జేజేవీ కీలక ఒప్పందం

14లో

అంబర్‌పేట-మూసారాంబాగ్ వంతెనను ప్రారంభించి దానిపై నడుస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మధుయాష్కీగౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, అహ్మద్ బలాల, అసదుద్దీన్ ఒవైసీ, కాలేరు వెంకటేష్, శ్రీగణేశ్, వీహెచ్, నవీన్‌యాదవ్ తదితరులు

యుద్ధవిరమణ వైపు కదలండి

- రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు భారత ప్రధాని మోదీ సూచన
- అదే యావత్తు మానవాళి ప్రాధాన్యమని స్పష్టీకరణ

బిష్కెక్: రష్యా-ఉక్రెయిన్ మధ్య సాగుతున్న అంతులేని పోరుకు తెరపడాలని భారత ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించారు. శాంతియుత పరిష్కారమే యావత్తు మానవాళి ప్రాధాన్యమని చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌కు వచ్చిన ఆయన సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. "యుద్ధంలో ఒక్కోరోజు.. మానవాళిని వెనక్కి నెట్టేస్తుంది. శాంతి దిశగా వేసే ప్రతి అడుగు మనలో కొత్త ఆశల్ని, ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. ముగింపులేని

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో బిష్కెక్‌లో భేటీ అయిన భారత ప్రధాని మోదీ

యుద్ధం నుంచి యుద్ధవిరమణ వైపు మనం వెళ్లాలి. మానవాళి సంక్షేమానికి ఇది కీలకం. అన్ని అంశాలకు శాంతియుత పరిష్కారం లభించాలనేదే భారత్ సందేశం. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారతదేశం- శాంతి యత్నాలన్నింటికీ ...మిగతా 3లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN Vencobb No. 1 Tastiest Chicken
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	122 kg	Dressed with Skin	231 kg
₹ 74	Retail Live Bird	149 kg	Skin Less	261 kg

Conditions Apply
Issued in the interest of consumers

కేసీఆర్ రాజీనామా చేయాలి

ఈ డిమాండ్‌తో నేటి నుంచి 6 వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించాలి

- కేసీఆర్ కుటుంబసభ్యులకు పదవులిస్తే.. నేను కార్యకర్తలకు ఇచ్చా
- అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్‌లకు అంజయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ.జయశంకర్‌ల పేర్లు
- అంబర్‌పేట మూసీ బ్రిడ్జి ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: "ఎవరైనా ఉద్యోగి ఏడాది పాటు పనిచేయకపోతే తొలగిస్తారు. ఈ మూడేళ్లలో కేసీఆర్ రూ.1,84,40,000 జీతం తీసుకున్నారు. వాహనాలు, భద్రత సిబ్బంది కోసం ప్రభుత్వం రూ.22,24,40,000 వెచ్చించింది. అంత ఖర్చు పెట్టినా.. ఆయన ఈ వెయ్యి రోజుల్లో ఒక్క రోజు కూడా ఎన్నుకున్న ప్రజలు, రాష్ట్రం కోసం పని చేయలేదు. మూడేళ్లుగా ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. వెంటనే రాజీనామా చేయాలి" అనే డిమాండ్‌తో కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మూసీ నదిపై రూ.52 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని సీఎం సోమవారం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కుటుంబ సభ్యులు, మన వడి కోసమే బయటకొచ్చే కేసీఆర్ ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని విమర్శించారు. ఒకటో తేదీ నుంచి 5 వరకు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి.. 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద సభ నిర్వహించాలన్నారు. 7 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకైనా కేసీఆర్ హాజరుకావాలని.. పదేళ్ల విధ్వంసమేందో.. వెయ్యి రోజుల సుపరిపాలన ఏమిటో చర్చిద్దామని సవాలు విసిరారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న తనను కేసీఆర్‌తో పోల్చడమా అంటూ రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనను.. పరిపాలన వైఫల్యంగా పేర్కొంటూ భారాస నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై విమర్శలు చేశారు. ఇంకా ఏమన్నారంటే "హైడ్రాతో చెరువులను సంరక్షిస్తున్నాం. ఈ ప్రాంతం భారాస నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి నుంచి బతుకమ్మకుంటను రక్షించాం. గత సర్కారు మాదిరి పేదలకు ఓఆర్ఆర్ అవతల ఇళ్లు నిర్మించకుండా..ఎక్కడికక్కడ నగరంలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నాం. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని భారాస ఆఫీసులో రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు, కేటీఆర్, ...మిగతా 3లో

స్కిల్స్ వర్సిటీలోకి పాలిటెక్నిక్‌ల విలీనం తాత్కాలికంగా నిలిపివేత?

- ఉన్నతస్థాయి కమిటీ నివేదిక వచ్చాక నిర్ణయం

2లో

COSMOS CO-OPERATIVE BANK LTD. (Multistate Scheduled Bank)
Enriching Life!
Cosmos Home Loan
Reasonable ROI 7.80%* onwards
Loan Available upto ₹ 3 Crores*
*T&C (ROI p.a.)
040-23231705 / 23738688

పోలైన ఓట్ల కంటే అనర్హులే ఎక్కువ!

- మలక్‌పేట, యాకుత్‌పురాలో సర్ ముసాయిదాలో గుర్తింపు
- నగరంలోని 15 నియోజకవర్గాల్లో పోలైనవి 21,72,111
- తొలగింపు జాబితాలో చేరినవి 19,41,444

ఈనాడు హైదరాబాద్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తొలగింపు జాబితాలో చేర్చిన వారి సంఖ్యను నియోజక వర్గాలవారీగా పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల సంఖ్య కన్నా అనర్హులైన వారే ఎక్కువగా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 21,72,111 ఓట్లు పోలవగా, తొలగింపు ముసాయిదాలో 19,41,444 మందిని చేర్చారు.

■ మలక్‌పేటలో 2026 జూన్‌లో మొత్తం 3,30,191 మంది ఓటర్లున్నారు. ఇక్కడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,31,354, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 1,35,807 ఓట్లు పోలవగా ఇప్పుడు అక్కడ ఏకంగా 1,47,799 ఓట్లను ఈసీ తొలగింపు జాబితాలో చేర్చింది. దాదాపు 44.76% మంది పేర్లు ఈ కేటగిరీలోకి వచ్చాయి.

■ యాకుత్‌పురాలో 3,74,948 మంది ఓటర్లకు 2023లో అసెంబ్లీకి 1,39,990, ...మిగతా 3లో

ప్రైవేటుకు భూగర్భ బొగ్గు గనులు!

- కేంద్ర బొగ్గు శాఖ సూచనలతో ఎండీవో విధానంలో అప్పగింత
- భారీ నష్టాలను తగ్గించుకునేందుకు సింగరేణి కసరత్తు
- 'శాంతిఖని'పై ప్రైవేటు కంపెనీ ఆసక్తి వ్యక్తీకరణ
- 2025 ఆఖరు నాటికి 21 గనుల్లో నష్టాలు రూ.1,924 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: భారీ నష్టాల్లో ఉన్న భూగర్భ(యూజీ) బొగ్గు గనులను.. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు 'ప్రైవేటు'కు అప్పగించేందుకు సింగరేణి సంస్థ యోచిస్తోంది. వీటిని 'గని అభివృద్ధి, నిర్వహణ(ఎండీవో)' విధానంలో ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు పరిశీలిస్తోంది. జాతీయ సంస్థలైన కోల్ ఇండియా, వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌లలో ఈ విధానం అమలుతో నష్టాలు తగ్గినందున సింగరేణి సైతం దీన్ని పరిశీలిస్తోంది. ప్రయోగాత్మకంగా మందమర్రి ప్రాంతంలోని శాంతిఖని భూగర్భ గనిని అప్పగించేందుకు 'ఆసక్తి వ్యక్తీకరణ' కోరుతూ ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా ఒక కంపెనీ ముందుకొచ్చింది. దీంతో త్వరలో టెండర్లు పిలిచేందుకు సింగరేణి కసరత్తు చేస్తోంది. ప్రైవేటు సంస్థకు ఇస్తే.. అది సొంత ఖర్చుతో బొగ్గు తవ్వి సింగరేణికి నిర్ణీత ధరకు అప్పగిస్తుంది. దాన్ని మార్కెట్‌లో సింగరేణి అమ్ముకుంటుంది. ప్రస్తుతం శాంతిఖని గనిలో ...మిగతా 2లో

మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు?

- నేడు దిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి
- ఏఐసీసీ పెద్దలతో భేటీ

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఎం మంగళవారం ఉదయం దిల్లీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం పలువురు కేంద్ర మంత్రులతో రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చిస్తారు. ఈ పర్యటనలో బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసి మంత్రి సురేఖ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిల గురించి పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వీరిద్దరినీ తప్పించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. మంత్రి సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ముఖ్యమంత్రి.. సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించాలని గట్టిగా పట్టుబట్టే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, కొత్తవారిని మంత్రివర్గంలోకి తీసుకోవడంపై కొంత సమయం తీసుకున్నా.. సురేఖ విషయంలో మాత్రం వెనక్కి తగ్గే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు ...మిగతా 2లో

నేపాల్‌లో వరదల కారణంగా నువాకోట్ జిల్లాలోని త్రిశూలి నది ఒడ్డున ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోయి మిగిలిన మొండిగోడలు, వాటిపై పేరుకున్న బురద

గుర్తించలేక.. ఖననం

- నేపాల్‌లో మృతదేహాల దయనీయ స్థితి
- తవ్వుతున్న కొద్దీ విషాదం
- బయటపడుతున్న మృతదేహాలు
- 939కి చేరుకున్న మరణాలు
- ఇంకా లభించని 4,247 మంది ఆచూకీ

కాఠ్‌మాండూ: మృతదేహాలు బయటపడుతున్నాయ్.. కట్టెలు కాలుతున్నాయ్.. సామూహికంగా సమాధి అవుతున్నాయ్.. అవి ఎవరివో.. ఎందుకు నేపాల్ వచ్చారో.. లేదంటే స్థానికంగా ఉంటున్న వారివైనా.. గుర్తించడానికి బంధువులెవరూ మిగిలి లేరో.. కానీ నేపాల్‌లో అత్యంత హృదయవిదారక దృశ్యాలు కలచివేస్తున్నాయి. చిన్న దేశమైన నేపాల్ వనరుల్లేక.. మృతదేహాలను గుర్తించలేక ఇలా సామూహికంగా సమాధి చేస్తోంది.

నేపాల్‌లో వరద, బురద విలయం చోటుచేసుకుని వారం సమీపిస్తున్నా విషాద ఛాయలు ఇంకా తొలగిపోవడం లేదు. రోజూ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. ...మిగతా 2లో

మంచు, రాళ్ల విస్ఫోటమే!

- 5,200 మీటర్ల ఎత్తు నుంచి దిగువకు..
- ఉప్పెనలా విరుచుకుపడ్డాయ్..
- నేపాల్ విలయంపై తేల్చిన అధ్యయనం

11లో

మృగాడిని పట్టిచ్చిన సీసీ ఫుటేజ్

- నర్సుపై హత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్
- మంచి అమ్మాయిని చంపారంటూ అమాయకత్వం నటించిన సనా ఉల్లా

ఈనాడు, హైదరాబాద్: గిరిజన కుటుంబానికి చెందిన ఆ యువతి.. ఇంటికి ఆసరాగా ఉండాలనే తపనతో చదువుకుంది. స్నేహితురాలి సూచనతో ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేరింది. కానీ, ఓ మృగాడు ఆమె ఆశలను చిదిమేశాడు. అశ్లీల వీడియోలకు బానిసగా మారి యువతిపై కన్నేసి హతమార్చి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసే నర్సు(21)పై హత్యాచారానికి పాల్పడిన నిందితుడు మహ్మద్ సనా ఉల్లా(34)ను పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో సోమవారం టాస్క్‌ఫోర్స్ ...మిగతా 14లో

కదులుతున్న బస్సులో బాలికపై అత్యాచారం

- దిల్లీలో నిర్భయ తరహా ఘటన
- లిఫ్ట్ ఇస్తామంటూ అఘాయిత్యం

11లో

సీఎం స్థానంలో కూర్చొని కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలా!

- భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

14లో

హైదరాబాద్‌కు ప్రఖ్యాత విదేశీ విద్యాసంస్థలు

- ఆఫ్ షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు అమెరికా, బ్రిటన్ సంస్థల అంగీకారం
- ముఖ్యమంత్రికి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం నివేదిక

3లో

రాజస్థాన్ హైకోర్టుకు కొత్త సీజే 11లో

ఇదీ సంగతి!



..చర్చలో పాల్గొనమంటావా డియర్?!

వాన అంతరాలు.. కరవు సంకేతాలు!

- రాష్ట్రంలో 219 మండలాల్లో డ్రైస్పెల్స్
- నేల పొడిబారడంతో పంటల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బిక్కుతండాకు చెందిన రైతు రాము ఎకరం విస్తీర్ణంలో మిర్చి వేశారు. సరైన వర్షాలు లేకపోవడంతో నారు ఎండిపోకుండా కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులంతా కలిసి బకెట్లు, బాటిళ్లతో నీరు పోస్తూ నారును బతికించుకుంటున్నారు.
– న్యూస్‌టుడే, పాల్వంచ

ఈనాడు, హైదరాబాద్: వాన వెనుక వాన కురవడం లేదు. అడపా దడపా కురిసినా నీరు మీటరు లోతు కూడా ఇంకడం లేదు. తేమ శాతం తగ్గి నేల పొడి బారిపోతోంది. మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మొత్తంగా ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వానకు వానకు మధ్య తీవ్ర అంతరం(డ్రై స్పెల్) ఏర్పడింది. వరుసగా మూడు వారాలు వర్షం కురవకపోతే దానిని ఒక డ్రైస్పెల్‌గా పరిగణిస్తారు. ఈ పరిస్థితుల వల్ల నేలలో కావాల్సినంత తేమ లభించక పంటల ఎదుగుదల కుంటుపడుతోంది.

వానాకాలం జూన్ 1న ప్రారంభం కాగా ఆగస్టు 16 నాటికి 11 వారాలు గడిచాయి. ఈ మధ్య కాలంలో కురిసిన వానలను వాతావరణ విభాగం(టీజీడీపీఎస్) పరిశీలించగా డ్రైస్పెల్స్ తీవ్రంగా ఉన్నట్లు తేటతెల్లమవుతోంది. జూన్ నుంచి ఆగస్టు మూడోవారం నాటికి రాష్ట్రంలో 509.7 మి.మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 17 శాతం లోటుతో 421.7 మి.మీటర్లు కురిసింది. ఈ మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 219 మండలాల్లో డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో జూన్‌లో వానల మధ్య అంతరం ఎక్కువగా ఉంది. జూన్ చివరి నుంచి జులై మధ్య వరకు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. 15 మండలాల్లో రెండేసి చొప్పున నమోదయ్యాయి.

ఎక్కడ ఎలా ఉందంటే..

- ప్రధానంగా హైదరాబాద్ జిల్లాలో 16 మండలాలు ఉండగా.. చార్మినార్ మండలం తప్ప మిగిలిన 15 మండలాల్లో డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. ...మిగతా 2లో

ఆర్మీ కంచుకోట మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల అపహరణ!

- నాలుగు ఏకే 47లు, ఆరు పిస్టళ్లు సహా మొత్తం 12 మాయం
- గది తాళం పగులగొట్టి చోరీ
- బొల్లారం ఠాణాలో ఆర్మీ అధికారుల ఫిర్యాదు

ఈనాడు– హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆర్మీ అధీనంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల దొంగతనం కలకలం రేపింది. గది తాళాన్ని పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు మొత్తం 12 ఆయుధాలను ఎత్తుకెళ్లారు. ఆర్మీ అధికారుల ఫిర్యాదుతో బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన వ్యవహారం కావడంతో పోలీసులు కేసు వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కంటోన్మెంట్ ప్రాంతంలో రక్షణ దళాల శిక్షణ సంస్థకు చెందిన వివిధ రెజిమెంట్‌లు కొనసాగుతున్నాయి. ఇందులో మద్రాస్ రెజిమెంట్ ఒకటి. ఇక్కడ ఆర్మీ సిబ్బంది ఆయుధాలు భద్రపరిచే విభాగం ఉంది. అనుమతి ఉన్న వ్యక్తులు మినహా ఎవరూ లోనికి వెళ్లలేరు. ఈ విభాగంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. గది తాళం పగులగొట్టిన ఆగంతకులు నాలుగు ఏకే 47లు, ఆరు పిస్టళ్లు, ...మిగతా 3లో

(c) eenadu

మొక్కలకూ ఉంటుందోయ్ క్వారంటైన్..!

దేశాన్ని కొవిడ్ మహమ్మారి పీడించినప్పుడు ఎక్కువగా వినియోగంలోకి వచ్చిన పదం క్వారంటైన్.

సాధారణంగా విదేశాలకు పెట్‌లు, ఇతర జంతువులు పంపించే క్రమంలో ఈ విధానాన్ని పాటిస్తారు.

వీటికే కాదండోయ్... విదేశాల నుంచి తీసుకొచ్చే మొక్కలకూ 45 రోజుల క్వారంటైన్ ఉంటుంది. అదెలాగో తెలుసా?

■ తూర్పుగోదావరి జిల్లా కడియంలో వందల సంఖ్యలో నర్సరీలుంటే వాటిలో అంతర్జాతీయ లైసెన్స్ ఉన్నవి 10 వరకు ఉన్నాయి. చైనా, స్పెయిన్, మలేసియా, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం తదితర దేశాల నుంచి సుమారు 50 వెరైటీలు ఇక్కడికి వస్తాయి.

■ విదేశాల నుంచి అరుదైన రకాలు వందల ఏళ్లున్న చెట్లను తెచ్చి స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మార్చుతారు. చైనా నుంచి సైకస్, స్పెయిన్ నుంచి ఆలివ్, అర్నమెంటల్, పామ్ వెరైటీలు, స్విట్జర్లాండ్ నుంచి పువ్వుల మొక్కలు, ఇండోర్ ప్లాంట్‌లో పువ్వుల రకాలు తెస్తారు. వీటిని దేశీయ మొక్కలతో మల్టిపుల్ చేసి స్థానికంగా ఉత్పత్తిచేస్తారు. వాటిని పెంచిన తరువాత విభిన్న ఆకర్షణీయ ఆకృతులతో సిద్ధంచేస్తారు.

■ విదేశాల నుంచి మొక్కలు దిగుమతి చేసుకునే ప్రక్రియ అంత సులభం కాదు. ఏ దేశం నుంచి మొక్కలు దిగుమతి చేసుకోవాలో ముందుగానే కస్టమ్స్ అధికారులకు జాబితా ఇస్తే, వాళ్లు ఆమోదించిన వాటిని మాత్రమే తెచ్చుకోవాలి. ఒక కంటెయినర్ బుక్ చేయాలంటే కనీసం రూ.25 లక్షల వరకు కాషన్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

■ ఇండోర్, అవుట్‌డోర్, ఫ్లవరింగ్ మొక్కలతో పాటు ఏళ్ల వయసున్న వృక్షాలను కూడా సముద్ర మార్గంలో ఏసీ కంటెయినర్లలో చెన్నై, ముంబయి పోర్టుకు తీసుకువస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నర్సరీలకు చేరుకుంటాయి. మొక్కలు వచ్చిన వెంటనే విక్రయించకుండా క్వారంటైన్ కేంద్రంలోకి తరలిస్తారు.

■ నిర్దేశిత ప్రమాణాలతో రూపొందించిన 'ప్లాంట్ క్వారంటైన్ సెంటర్'లో కనీసం 45 రోజులు ఉంచాలి. ఇది కూడా ఇండోర్, అవుట్ డోర్ ప్లాంట్లకు వేర్వేరుగా ఉంటుంది.

■ ఆ ప్రక్రియ పూర్తయిన తరువాత కస్టమ్స్ అధికారులు సమగ్రంగా పరిశీలించి, చీడపీడలు లేవని నిర్ధారించి, అన్ని వివరాలనూ ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. చెట్టు ఉన్న లొకేషన్‌ను, ఫొటోలతో సహా మ్యాపింగ్ చేస్తారు. క్వారంటైన్ ముగిశాకే వాటిని విక్రయానికి అనుమతిస్తారు.

-ఈనాడు, రాజమహేంద్రవరం

వాన అంతరాలు.. కరవు సంకేతాలు!

(మొదటి పేజీ తరువాయి)

● యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండలాలకు 10 చోట్ల డ్రైస్పెల్స్ నమోదు కాగా, తుర్కపల్లి, రాజపేట, బొమ్మలరామారం మండలాల్లో రెండేసి నమోదయ్యాయి. ● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలకు ఆరుచోట్ల డ్రైస్పెల్స్ నమోదయ్యాయి. భద్రాచలం మండలంలో మూడు నమోదయ్యాయి. ఈ మండలంలో 10 వారాల పాటు వర్షపాతం నమోదు కాలేదు. ● జోగులాంబ గద్వాల జిల్లాలో 13 మండలాలకు 7 చోట్ల నమోదుకాగా, వడ్డేపల్లి మండలంలో మూడు నమోదయ్యాయి. వడ్డేపల్లి మండలంలో వరుసగా 10 వారాలు వర్షాలు కురవలేదు. ● వికారాబాద్ జిల్లాలో 20 మండలాలకుగాను 15 మండలాల్లో వర్షాలు లేవు. బంట్వారం, పెద్దేముల్, బషీర్‌బాద్ మండలాల్లో రెండేసి నమోదయ్యాయి. ● వనపర్తి జిల్లాలో 15 మండలాలకు 9 చోట్ల నమోదుకాగా ఆత్మకూరు, వనపర్తి, అమరచింత మండలాల్లో రెండేసి నమోదు అయ్యాయి.

నేల పొడిబారి.. పంటలకు నష్టం: డా.దండా రాజిరెడ్డి, వైస్ ఛాన్సలర్, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయం



వర్షాల మధ్య ఎక్కువ అంతరం రావడంతో నల్లరేగడి నేలలు మినహా ఇతర నేలలు పొడిబారుతున్నాయి. కొన్ని చోట్ల నల్లరేగడి నేలల్లోనూ నష్టాలు ఉన్నాయి. డ్రైస్పెల్ కారణంగా మొక్కల ఎదుగుదల లోపిస్తోంది. దీనివల్ల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. అందుబాటులో ఉన్నచోట వరికి జాగ్రత్తగా నీటిని పెట్టుకోవాలి. వాన అంతరాలతో చీడపీడలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సెప్టెంబరులోనూ లోటు ఉంటుందన్న హెచ్చరికలు ఉన్నాయి. సాధారణంగా ఏటా ఒకటి రెండు డ్రైస్పెల్స్ ఉంటాయి. ఇంత ఎక్కువగా ఉండవు. ఇంకా సాగు చేయనివారు ఉంటే నిలిచిపోవడం మేలు.

నమోదైన డ్రైస్పెల్స్ వివరాలు జిల్లాలవారీగా www.eenadu.net లో..

గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్‌కు భట్టి, శ్రీధర్‌బాబు అభినందనలు

తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ఇటీవల ఫ్రాన్స్, స్పెయిన్‌లలో జరిగిన చెస్ ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించారు. రిత్విక్ సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబులను కలిశారు. ఈ సందర్భంగా వారు రిత్విక్‌ను సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. – ఈనాడు, హైదరాబాద్

ఇన్వెస్ట్ తెలంగాణ ఏర్పాట్లకు వార్‌రూమ్

● డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో వచ్చే డిసెంబరు 7, 8, 9 తేదీల్లో నిర్వహించే గ్లోబల్ సమిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్నీ ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ వార్‌రూమ్ ద్వారా రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖలను సమన్వయపరచాలన్నారు. సమిట్ నిర్వహణ కోసం కమిటీలను ఏర్పాటు చేసి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. సమిట్ ఏర్పాట్లపై సోమవారం ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎస్ సంజయ్ జాజు హాజరయ్యారు. సమిట్-2026కు లోగోను రూపొందించాలని, అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి కార్యాచరణపై చర్చించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పారిశ్రామికవేత్తలకు వివరించేలా కార్యక్రమాలను రూపొందించాలన్నారు. సమిట్‌కు అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబరు మొదటి లేదా రెండో వారంలో దిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో హోర్డింగులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు.

గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తెలంగాణ: భట్టి

ఐజీబీసీ 25వ వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న సుచిత్రా ఎల్ల, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క తదితరులు

ఈనాడు, హైదరాబాద్: హరిత ఇంధన ఉత్పత్తి పెంపులో తెలంగాణను గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) 25వ వార్షికోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో భట్టితోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్రా ఎల్ల తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... "రాష్ట్రాన్ని దక్షిణ కొరియా, జపాన్ వంటి అత్యంత అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థికంగా, పారిశ్రామికంగా, సుస్థిర గ్రీన్ టెక్నాలజీలో ప్రపంచపటంలో అగ్రస్థానంలో రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు చేపడుతున్న ఈ ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలి. పారిశ్రామిక, గ్రీన్ విధానాలకు దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేస్తున్న 'రాష్ట్ర సలహా మండలి'లో చేరి మార్గదర్శకత్వాన్ని అందించాలి. 'గ్రీన్' అంటే ఖరీదైనదనే అపోహ మారాలి. తక్కువ శీతలీకరణ అవసరమయ్యేలా భవనాలను సూర్యరశ్మిని, నీటిని, విద్యుత్‌ను సమర్థంగా వినియోగించుకునేలా నిర్మించడం ద్వారా పర్యావరణంపై, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించవచ్చు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, సామూహిక గృహ నిర్మాణాల్లోనూ గ్రీన్ విధానాన్ని అమలు చేయడానికి ఐజీబీసీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని చెప్పారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హరిత ఇంధన భవనాల నిర్మాణంతో అనేక ప్రయోజనాలున్నాయన్నారు.

ప్రైవేటుకు భూగర్భ బొగ్గు గనులు!

(మొదటి పేజీ తరువాయి)

టన్ను బొగ్గు ఉత్పత్తికి సింగరేణికి రూ.21,558 ఖర్చవుతుండగా కేవలం రూ.4,167కే విక్రయిస్తున్నందున భారీగా నష్టం వాటిల్లుతోంది. ఎండీవో విధానంలో అప్పగించి ఈ నష్టాన్ని తగ్గించాలనేది సంస్థ యోచన. యూజీ గనుల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం భారీగా పెరగడం.. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యూజీ గనుల్లో ఉద్యోగుల జీతాలు.. స్థిర, చర వ్యయం కలిపి టన్ను బొగ్గు ఉత్పత్తికి, మార్కెట్లో విక్రయధరకు మధ్య పొంతనే ఉండటం లేదు. 2025 ఆఖరునాటికి మొత్తం 22 భూగర్భ గనులకుగాను 21 నష్టాల్లో ఉన్నట్లు ఈ సంస్థ కేంద్రానికి ఇచ్చిన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఈ 21 గనుల నష్టాలు రూ.1,924 కోట్లకు పైగా ఉన్నాయి. ✦ ఉదాహరణకు ఆడ్రియాల యూజీ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి మొత్తం వ్యయం రూ.30,333 కాగా విక్రయ ధర రూ.2,492 మాత్రమే. అంటే టన్నుకు ఏకంగా రూ.27,841 నష్టం. ఈ ఒక్క గనిలోనే గతపడాది రూ.302.87 కోట్ల నష్టం వాటిల్లింది.

ఉపరితల గనులే లేకుంటే...: సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఉపరితల (ఓసీ) గనులను నిర్వహిస్తోంది. ఓసీ గనుల్లో భారీ యంత్రాలతో అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉండటంతో టన్నుకు ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది. భూగర్భ గనుల నష్టాలను ఓసీలతో వచ్చే లాభాలతో సరిచేస్తున్నారు. ఇవి లేకుంటే సింగరేణి సంస్థ ఈపాటికే నష్టాల్లో మునిగిపోయేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

FOOD CORPORATION OF INDIA | भारतीय खाद्य निगम
ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, హాకా భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్డు, హైదరాబాద్-500004
Regional Office, 3rd Floor, HACA Bhavan, Public Garden Road, Hyderabad, Telangana-500004
సం. RO TL-30.0011.0/17/2026-CONT-RO TL తేది : 29-08-2026
GeM పోర్టల్ ద్వారా ఇ-టెండర్లకు ఆహ్వానము
FCI, RO, హైదరాబాద్ ఈ క్రింది టెండర్లను జారీ చేసింది: 1) FSD సనత్‌నగర్ మరియు 2) BSC/FSD మిర్యాలగూడ వద్ద హ్యాండ్లింగ్ మరియు అంతర్గత రవాణా కాంట్రాక్ట్ నిమిత్తం నియామకం. మరిన్ని వివరాల కోసం, దయచేసి GeM పోర్టల్ (http://gem.gov.in) మరియు FCI వెబ్‌సైట్ (http://fci.gov.in) సందర్శించండి.
జనరల్ మేనేజర్ (రీజియన్)

గుర్తించలేక.. ఖననం

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా వేలమంది ఆచూకీ తెలియడం లేదు. సోమవారం నాటికి మృతి చెందినవారి సంఖ్య 939కి చేరుకుంది. 4,247 మంది జాడ తెలియలేదు. ఇందులో 591 మంది విదేశీయులు, 99మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ✦ టిబెట్‌లో ఇప్పటిదాకా 16 మంది మృతి చెందగా.. 550 మంది ఆచూకీ తెలియడం లేదు.

గుర్తు తెలియక..: నేపాల్‌లో వరదకు కొట్టుకొచ్చిన మృతదేహాలను అధికార యంత్రాంగం గుర్తించలేకపోతోంది. చనిపోయి చాలా రోజులు అవుతుండటంతో దొరికిన వెంటనే సామూహికంగా పూడ్చేస్తున్నారు. అయితే వాటిని గుర్తించేందుకు ప్రయత్నించకుండా, హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు చేయకుండా ఇలా చేస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు. ✦ పరిమిత ఫోరెన్సిక్ సౌకర్యాలే ఉండటంతో మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. ✦ సహాయక సామగ్రి కొరతతో నేపాల్ ఇబ్బందులు పడుతోంది. మృతదేహాల బ్యాగులు, రోప్‌లు, హెలికాప్టర్లు సరిపడినన్ని లేవు. ✦ అత్యధిక మరణాలు సంభవించిన చితవాన్‌లో ఇంకా 250 మృతదేహాలను గుర్తించలేదు.✦ భోటే కోశీ నది నుంచి వందల కిలోమీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు చితవాన్ జిల్లాలో బయటపడుతున్నాయి. ✦ శనివారం 100 మృతదేహాలను అధికారులు సామూహిక ఖననం చేశారు. వాహనాల్లో వాటిని అటవీ ప్రాంతానికి తరలించి ఎక్స్‌కావేటర్‌తో గుంతలు తవ్వి పూడ్చిపెడుతున్నారు. వాటిలో 50 మృతదేహాల నుంచి డీఎన్‌ఏలను సేకరించారు. మిగిలిన వాటి ఫొటోలను భద్రపరుస్తున్నారు. భారత్ నుంచి వచ్చిన 18 మంది ఫోరెన్సిక్ నిపుణులు సేవలందిస్తున్నారు. ✦ కనీసం శవాలను భద్రపరచడానికి ఫ్రీజర్లు కూడా లేని దయనీయ స్థితి నేపాల్‌లో నెలకొంది. దీంతో ఇప్పటికే చాలా మృతదేహాలు కుళ్లిపోయాయి. దీంతో చేసేదేమీలేక సామూహికంగా ఖననం చేస్తున్నారు.

ఫేక్ వీడియోలతో ఇబ్బంది: నేపాల్‌లో సహాయక చర్యలకు ఫేక్ వీడియోలు ఆటంకం కలిగిస్తున్నాయి. ఏఐతో చేసిన వీడియోలను కొందరు సామాజిక మాధ్యమాల్లో పెడుతుండటంతో అక్కడికి సహాయక సిబ్బంది వెళ్లాల్సి వస్తోంది. తీరా అక్కడికి వెళ్లాక ఎటువంటి విధ్వంసక పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటిదాకా తప్పుడు వీడియోలు పెట్టిన 72 మంది ఖాతాలను ప్రభుత్వం తొలగింపజేసింది.

జల విద్యుత్తు ప్రాజెక్టుల్లోనే 933 మంది అదృశ్యం: నేపాల్ విలయంలో దెబ్బతిన్న జల విద్యుత్తు ప్రాజెక్టులకు సంబంధించి 933 మంది ఆచూకీ ఇంకా లభించలేదు. అందులో చాలా మంది టన్నెళ్లలో చిక్కుకున్నారని భావిస్తున్నారు. ఇప్పటిదాకా టన్నెళ్లలో చిక్కుకున్న వారిలో 279 మందిని సహాయక బృందాలు రక్షించగలిగాయి.



కాఠ్‌మాండూలో నేపాల్‌కు సంఘీభావంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సద్గురు జగ్గీ వాసుదేవ్, బాలీవుడ్ నటి మనీషా కొయిరాలా తదితరులు

హిమాలయన్ బోర్డును ఏర్పాటు చేయాలి: సద్గురు

విపత్తుల సమయంలో సహకరించుకోవడానికి వీలుగా భారత్, చైనా, పాకిస్థాన్, నేపాల్, భూటాన్ కలిసి హిమాలయన్ బోర్డును ఏర్పాటు చేయాలని భారతీయ ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ సూచించారు. నేపాల్‌కు సంఘీభావంగా ఆదివారం కాఠ్‌మాండూలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేపాల్‌కు రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈశా ఫౌండేషన్‌కు చెందిన 77 మంది మానసరోవర్ యాత్రికులు గల్లంతైన నేపథ్యంలో ఆయన నేపాల్ వెళ్లారు. 'హిమాలయాలు భూగోళంపై అత్యంత అద్భుతమైన పర్వతాలు. అదే సమయంలో అవి అత్యంత సున్నితమైనవి. అందుకే 5 దేశాలు కలిసి బోర్డును ఏర్పాటు చేయడం ఎంతో అవసరం' అని సద్గురు పేర్కొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
టెండరు ప్రకటన/ప్రతిపాదన కొరకు అభ్యర్థన
RFP/Tender Notice No.:Roc.No.02/DEO/TTD/Tpt/2026-27, Date: 27.08.2026
2026–28 (2 సంవత్సరాలు) సంవత్సరాలకు టీటీడీ జూనియర్ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెడికల్, ఇంజినీరింగ్ మరియు ఇతర ప్రవేశ పరీక్షల కొరకు ఇంటిగ్రేటెడ్ ఆఫ్‌లైన్ క్లాస్‌రూమ్ కోచింగ్ ... www.tirumala.org లో 01.09.2026 నుండి ... 25.09.2026 మ॥ 3.00 గంటలకు. వివరాలకు ఫోన్ నెం. 0877–2264062, ఇ-మెయిల్: deottd@gmail.com, వెబ్‌సైట్: www.tirumala.org
TTD-40021(31)/1/2026-PRO SEC (Adv.No:167), Dt: 31-08-2026 కార్యనిర్వహణాధికారి

స్కిల్స్ వర్సిటీలోకి పాలిటెక్నిక్‌ల విలీనం తాత్కాలికంగా నిలిపివేత?

ఈనాడు, హైదరాబాద్: యువతకు నైపుణ్య శిక్షణతోపాటు మెరుగైన ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పాలిటెక్నిక్ కళాశాలల్ని స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల్లో నెలకొన్న సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ఈ నేపథ్యంలో కమిటీ సిఫార్సుల మేరకు ముందుకు వెళ్లేందుకు తాత్కాలికంగా పక్కనపెట్టినట్లు సమాచారం. ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్‌లను స్కిల్స్‌వర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ జూన్ 16న సాధారణ పరిపాలన శాఖ జీవో 97 జారీచేసింది. ఇటీవల జరిగిన మంత్రి మండలి ఈ మేరకు ఆమోదం తెలిపింది.

సందేహాలు నివృత్తి చేసేందుకు...

స్కిల్స్‌వర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న నిర్ణయంపై పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు, సాంకేతికవిద్య బోర్డు ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. విలీన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా సంఘాలు పలుమార్లు కార్మికశాఖ మంత్రి, ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. అయితే విలీనం కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని, అప్రెంటిస్‌షిప్ కింద వివిధ పరిశ్రమల్లో అవకాశాలు వస్తాయని ప్రభుత్వం పేర్కొంది. నెలకు రూ.2వేల స్టైపెండ్ అందిస్తామని స్పష్టం చేసింది. కేవలం విద్యావిభాగం నుంచి శక్తిశాఖలోకి మారుతారని, లేటరల్ ఎంట్రీ, ప్రవేశపరీక్ష ఇతరత్రా వెసులుబాట్లలో ఎలాంటి మార్పులు ఉండబోవని వెల్లడించింది. అధ్యాపకుల ప్రస్తుత పే, పీఆర్‌సీ, ఇతర సర్వీసు నిబంధనల్లో మార్పుల ఉండబోవని తెలిపింది. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు వారితో చర్చలు నిర్వహించి.. ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఆధ్వర్యంలో ఆగస్టు 24న సాధారణ పరిపాలనశాఖ జీవో 1239 జారీచేసింది. చర్చలు, అధ్యయనం నిర్వహించి 30 రోజుల్లోగా నివేదిక అందించాలని కోరింది.

మంత్రి కొండాసురేఖ, చిన్నారెడ్డిపై వేటు?

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ అంశంపై ముఖ్యమంత్రి చర్చించినట్లు సమాచారం. ఒకరిద్దరు మంత్రులు, నాయకులు..సురేఖపై చర్యలు లేకుండా చూడాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జితో మాట్లాడినట్లు తెలిసింది. అయితే ఆమె నుంచి ఎలాంటి హామీ రాలేదని సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం రేవంత్‌రెడ్డికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తే నిర్ణయంలో ఏమైనా మార్పు ఉండొచ్చేమో కానీ.. లేదంటే మాత్రం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మెట్రో, మామునూరు విమానాశ్రయంపై..

రెండ్రోజుల దిల్లీ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. మెట్రో రైలు ప్రాజెక్టుపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను, మామునూరు విమానాశ్రయం పురోగతిపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును కలవనున్నారు. డిసెంబరు 7-9 తేదీల్లో ఫ్యూచర్‌సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' సదస్సులో పలు డిఫెన్స్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోనున్న నేపథ్యంలో.. ఈ విషయాలపై చర్చించేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోనూ సమావేశం కానున్నట్లు తెలిసింది.

DIRECTORATE OF ADMISSIONS
JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
Kukatpally, Hyderabad - 500 085, Telangana, India.
Notification for Six Months Online Certificate Courses - September-2026
Advt. No.: JNTUH/Admissions/DILT/Certificate Courses/2026-27 Date:01.09.2026
Online applications are invited from the eligible **candidates, faculty members, working employees, and other interested candidates** who have completed or are pursuing any **Diploma / UG/PG Degree** in relevant branches of Engineering and Technology, with a minimum basic knowledge of computers, for admission in to the following **Six-Months Online Certificate Courses - September 2026**, offered by the **Directorate of Innovative Learning & Teaching (DILT), JNTUH, Kukatpally, Hyderabad,** for the Academic Year **2026-27** on or before **01.10.2026.**
1. Data Analytics and AI-Powered Business Intelligence (DA & AI-PBI)
2. Artificial Intelligence and Deep Tech (AI & DT)
• For more details, visit website: www.jntuh.ac.in For any queries contact: 9154251963 e-mail: pa2scdedirector@gmail.com
Sd/- **DIRECTOR, DILT** Sd/- **DIRECTOR, ADMISSIONS**
DIPR R.O.No.8957-PP/CL/ADVT/2026-27 Dt.31-08-2026

తెలంగాణ పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ లిమిటెడ్
(తెలంగాణ ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, ఇంటి నెం.5-9-58/బి, ఫతే మైదాన్ రోడ్, హైదరాబాద్-04, ఫోన్: 23238290-250
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నెం.32, 33, 34 అండ్ 35/సిఇ-I/TGIIC/2026-27, తేది: 24-8-2026
టిఎన్. నెం.32: మెదక్ జిల్లా, మనోహరాబాద్ (మం), కొండాపూర్ (గ్రా)వద్ద ఐపి- కొండాపూర్ యొక్క అన్ని అంతర్గత రోడ్లకు వరదనీటి కాలువల నిర్మాణం. ఇసివి రూ. 7,80,07,647.00
టిఎన్. నెం.33: తెలంగాణ, సిద్దిపేట్ (జిల్లా), ములుగు (మం), తుణికిబొల్లారం (గ్రా), ఇండస్ట్రియల్ పార్క్- తుణికిబొల్లారం వద్ద ఇఎల్ఎస్ఆర్ 500కెఎల్ మరియు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో అంతర్గత నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయుట. ఇసివి రూ. 5,97,43,004.00
టిఎన్. నెం. 34.: నల్గొండ సర్కిల్‌లోని నల్గొండ డివిజన్ యొక్క నల్గొండ రూరల్ సబ్‌డివిజన్‌లో చిట్యాల సెక్షన్, వెల్మినేడు గ్రామంవద్ద ఎల్‌టి Cat-II క్రింద మొత్తం 56 కెడబ్ల్యు నాన్ డొమెస్టిక్ లోడ్‌కు సరిపోయే ఎల్‌టి-II క్రింద 2 నెం. 15కెడబ్ల్యు మరియు 1 నెం.26 కెడబ్ల్యు నాన్ డొమెస్టిక్ లోడ్స్ కొరకు విద్యుత్ సరఫరాను పొడిగించుట.
ఇసివి రూ. 36,26,287.00
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 27-8-2026 సా.5.00 గం.నుండి.
బిడ్స్ దాఖలుకు చివరి తేది: 10-9-2026 మ.3.00 గం.వరకు.
టిఎన్. నెం. 35: రంగారెడ్డి జిల్లా, మీర్‌ఖాన్‌పేట్ (గ్రా), కందుకూర్ (మం) నుండి మేడిపల్లి (గ్రా) యాచారం (మం) వరకు హెచ్‌జిసిఎల్ లేఔట్‌కు అప్రోచ్ ఏర్పాటు చేయుటకు ప్రస్తుతమున్న గ్రామ బిటి రోడ్డను వెడల్పు చేయుట మరియు పటిష్టపరచుట. ఇసివి: రూ. 25,23,12,273.00
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25-8-2026 సా.5.00 గం.నుండి.
బిడ్స్ దాఖలుకు చివరి తేది: 1-9-2026 మ.3.00 గం.వరకు.
టెండరు ప్రకటన వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్: www.tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR R.O. No. 8986-PP/CL/ADVT/2026-27, తేది: 31-8-2026 సం/- చీఫ్ ఇంజనీర్-I

గ్రహం అనుగ్రహం

1-9-2026 మంగళవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; దక్షిణాయనం;
వర్షరుతువు, శ్రావణ మాసం, బహుళ పక్షం
చవితి: ఉ. 7-25 తదుపరి పంచమి; అశ్విని: తె. 3-24
తదుపరి భరణివర్జ్యం: రా. 11-31 నుంచి 1-04 వరకు;
అమృత ఘడియలు: రా. 8-25 నుంచి 9-58 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8-17 నుంచి 9-07 వరకు; తిరిగి రా. 10-51 నుంచి 11-37 వరకు;
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు;
సూర్యోదయం: ఉ.5.49; సూర్యాస్తమయం: సా.6.13

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ	ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	37.8	26.5	కర్నూలు	32.3	25.7
ఒంగోలు	37.3	29.4	శ్రీకాకుళం	32.0	27.0
నెల్లూరు	37.3	29.0	విజయనగరం	32.0	27.0
కడప	36.6	26.9	రామగుండం	31.4	25.6
అనంతపురం	35.3	25.6	మెదక్	31.4	21.5
రాజమహేంద్రవరం	35.0	27.5	నిజామాబాద్	31.0	23.9
విజయవాడ	34.1	27.3	ఖమ్మం	31.0	22.6
విశాఖపట్నం	33.8	28.0	ఆదిలాబాద్	30.8	23.4
గుంటూరు	33.0	28.0	మహబూబ్‌నగర్	30.5	23.1
			భద్రాచలం	30.2	25.0
			హనుమకొండ	30.0	23.0
			హైదరాబాద్	30.0	22.8

PROFESSOR JAYASHANKAR TELANGANA AGRICULTURAL UNIVERSITY
ADMN. OFFICE, RAJENDRANAGAR, HYDERABAD-500 030.
NOTIFICATION
Ref. No.6087/Acad./A1/2026 Dated:29-08-2026
Applications are invited from the eligible candidates for the posts of "Medical Officers" (Male 1 & Female - 1) purely on contract and temporary basis for University Health Centre, Rajendranagar Campus Last date of application is 11-09-2026, 04.00 PM. For details visit University website www.pjtau.edu.in
CH. VENU GOPALA REDDY
REGISTRAR (FAC)
DIPR R.O.No.8958-PP/CL/ADVT/2026-27 Dt.31-08-2026

Glenfield Malla Reddy Brain Heart Hospital Advanced Stroke Center
WE ARE HIRING
Applications are invited from qualified, competent, and dedicated candidates with 2–3 years of hospital experience for the following positions:
• Front Office Executive (Graduation)
• Pharmacist (B Pharm. or M Pharm.)
• DMO - Duty Medical Officer (MBBS with Registration Certificate)
• Nursing (Scrub Nurse, Staff Nurse with Registration Certificate)
• Cath Lab Technician (Diploma with Registration Certificate)
• Typist (Radiology)
• Gas Plant Technician
• Painter • Carpenter
Date of Interviews : 6th September, 2026
From **10 AM** to **4 PM**, **Salary :** Negotiable
Venue : Glenfield Malla Reddy Brain Heart Hospital, Chapel Road, Nampally, Telangana. Ph: **92814 68046**
Email: contact@gmbhhospital.com

इंस्टीट्यूट ऑफ बैंकिंग पर्सोनेल सिलेक्शन®
INSTITUTE OF BANKING PERSONNEL SELECTION
(An autonomous body set up by Reserve Bank of India, Central Financial Institutions and Public Sector Banks)
असेसमेंट में, हम पर भरोसा रखता है भारत | In assessment, India trusts us
CRP RRBs XV
ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (RRBs) లో ఆఫీసర్లు (స్కేల్-I, II & III) మరియు ఆఫీసు అసిస్టెంట్ల (మల్టిపర్పస్) యొక్క నియామకం కొరకు ఉమ్మడి నియామక ప్రక్రియ (CRP)
అధికారిక వెబ్‌సైట్: www.ibps.in
సందేహాలు/ ఫిర్యాదులు ఉన్న పక్షంలో https://cgrs.ibps.in ను చూడండి
గ్రూప్ 'ఎ' - ఆఫీసర్లు (స్కేల్-I, II & III) మరియు గ్రూప్ 'బి' - ఆఫీసు అసిస్టెంట్స్ (మల్టిపర్పస్) యొక్క నియామకం కొరకు RRBs (CRP RRBs XV) నిమిత్తం తదుపరి ఉమ్మడి నియామక ప్రక్రియకై ఆన్‌లైన్ పరీక్షలు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనెల్ సెలక్షన్ (IBPS)చే దిగువనీయబడిన తాత్కాలిక షెడ్యూలు ప్రకారం నిర్వహించబడును. ఇదే ప్రక్రియ క్రింద గ్రూప్ 'ఎ' - ఆఫీసర్లు (స్కేల్-I, II & III) నియామకం కొరకు ఇంటర్వ్యూలు తాత్కాలికంగా షెడ్యూలు చేయబడిన జనవరి/ ఫిబ్రవరి 2027 నెలలో సముచిత ప్రాధికారితో సంప్రదింపులతో NABARD మరియు IBPS సహాయంతో నోడల్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులచే సమన్వయపరచబడతాయి.

ముఖ్యమైన తేదీలు	
అంశం	తాత్కాలిక షెడ్యూలు
దరఖాస్తు ఫీజు/ ఇంటిమేషన్ చార్జీల చెల్లింపు & ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్	01-09-2026 నుండి 21-09-2026 వరకు
దరఖాస్తు ఫారంలో మార్పులు/ దిద్దుబాట్లకు అభ్యర్థులకు ఎడిట్ అవకాశం (ఎడిట్ కొరకు ఆన్‌లైన్ చెల్లింపు కలుపుకొని)	రిజిస్ట్రేషన్ ముగిసిన తర్వాత (అధికారిక IBPS వెబ్‌సైట్‌లో తెలియజేయబడును)
ప్రీ-ఎగ్జామ్ ట్రైనింగ్ (పిఇటి) నిర్వహణ	నవంబర్, 2026
ఆన్‌లైన్ పరీక్ష- ప్రిలిమినరీ (ఆఫీసర్స్/OA)	నవంబర్/ డిసెంబర్, 2026
ఆన్‌లైన్ పరీక్షా ఫలితం - ప్రిలిమినరీ	డిసెంబర్, 2026/ జనవరి, 2027
ఆన్‌లైన్ పరీక్ష - మెయిన్/ సింగిల్ (ఆఫీసర్స్/OA)	డిసెంబర్, 2026/ జనవరి, 2027

వివరాలు మరియు తాజా అంశాల కొరకు అధికారిక IBPS వెబ్‌సైట్ www.ibps.in ను క్రమం తప్పకుండా చూడవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.
CRP RRBs - XV కొరకు దరఖాస్తు చేయదల్చిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టరు చేసుకునేముందు అధికారిక IBPS వెబ్‌సైట్‌లో ఉంచిన మరియు జారీచేయబడిన వివరమైన నోటిఫికేషన్‌ను జాగ్రత్తగా చదువుకొనవలెను మరియు వివరమైన నోటిఫికేషన్‌లో నిర్దేశించిన విధంగా నిర్దేశిత తేదీలనాటికి కనీస అర్హతా ప్రమాణాలను వారు నెరవేర్చియుండవలెను. వివరమైన నోటిఫికేషన్‌లో పేర్కొనబడిన సూచనలను తప్పనిసరిగా పాటించవల్సిందిగా అభ్యర్థులకు విజ్ఞప్తి.
ముంబయి
తేది: 01.09.2026 **డైరెక్టర్**


A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
సోమాజిగూడ, హైదరాబాద్.
Cell: 8008567995

(c) eenadu

ఆర్మీ కంచుకోట మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల అపహరణ!

(మొదటి పేజీ తరువాయి)

ఒక ఇన్సాస్ రైఫిల్, మందుగుండు సామగ్రి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్మీ ఉన్నతాధికారులు.. ఇతరులెవరూ లోనికి ప్రవేశించే అవకాశం లేనందున సిబ్బందిలోనే ఎవరో ఈ పనిచేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు మద్రాస్ రెజిమెంట్ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో సోమవారం ఉదయం ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.

ఒక్కరితో సాధ్యం కాదు

మద్రాస్ రెజిమెంట్ చుట్టూ నాలుగు గేట్లు ఉంటాయి. ఆర్మీ అధికారులు, జవాన్లు, అనుమతి ఉన్న వ్యక్తులు మినహా మరొకరు లోపలికి ప్రవేశించడానికి అవకాశం ఉండదు. అలాంటి చోట ఏకంగా ఆయుధాలనే ఎత్తుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఆయుధాలు భారీవి కావడంతో ఒక్కరే వాటిని మోయడం సాధ్యపడదని పోలీసులు అనుమానిస్తున్నారు. కచ్చితంగా ఇద్దరు, అంతకంటే ఎక్కువమంది ఉండొచ్చని, ఆయుధాల గది వరకూ వచ్చారంటే తెలిసిన వారి పనై ఉంటుందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు మద్రాస్ రెజిమెంట్‌కు చేరుకొని, సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఆర్మీ ఉన్నతాధికారులు కూడా సిబ్బందిని అంతర్గతంగా విచారించి వివరాలు రాబడుతున్నట్లు సమాచారం.

సభ్యులకు నిజమైన స్నేహితుడిగా 'మార్గదర్శి'

మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజాకిరణ్ ◆ ఖమ్మం రోటరీనగర్‌లో 133వ శాఖ ప్రారంభం

ఖమ్మంలోని రోటరీనగర్‌లో మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ 133వ శాఖను ప్రారంభిస్తున్న సంస్థ ఎండీ శైలజాకిరణ్. చిత్రంలో వైస్ ప్రెసిడెంట్ జి.బలరాంకృష్ణ, ఖమ్మం చీఫ్ మేనేజరు పి.హనుమంతరావు, రోటరీ నగర్ బ్రాంచి మేనేజర్ ఏ.శ్రీనివాసరావు, జీఎం ఎ.బాలకృష్ణ, సంస్థ డైరెక్టర్ ఎస్.వెంకటస్వామి తదితరులు

ఈనాడు, ఖమ్మం, గాంధీచౌక్, న్యూస్‌టుడే: 'మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ నమ్మకానికి మారు పేరు. సంస్థ అనుసరిస్తున్న విధానాలు చూసి లక్షల మంది సభ్యులుగా చేరుతున్నారు. వారు అత్యవసరాల్లో ఉన్నప్పుడు ఒక నిజమైన స్నేహితుడిగా అండగా ఉంటున్నాం' అని ఆ సంస్థ ఎండీ శైలజాకిరణ్ తెలిపారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్‌లో సోమవారం ఆమె మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ 133వ(తెలంగాణలో 45వ)శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజాకిరణ్ మాట్లాడుతూ... 'ఖమ్మంతో మార్గదర్శికి 40 ఏళ్లకుపైగా అనుబంధముంది. జిల్లాలో వేల మంది సభ్యుల ఆదరణ ఉంది. మొదటి శాఖ మొదలైనప్పటి నుంచి సభ్యత్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నామని సభ్యులు చెబుతున్నారు. రాష్ట్రంతోపాటు ఖమ్మంలోనూ గ్రోత్ ఉండటంతో రెండోశాఖను ప్రారంభించాం. ఎవరికైనా జీవితకాలంలో వివిధ అవసరాలు ఉంటాయి. పిల్లల పెంపకం, చదువు, వివాహాలు, వారు ఉద్యోగాలు, పరిశ్రమల్లో స్థిరపడాలని కోరుకుంటారు. ప్రధానంగా ప్రతి కుటుంబంలో ఆర్థిక క్రమశిక్షణ ఉండాలి. చిట్స్‌తో అది అలవడుతుంది. ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరూ కనీసం 25 ఏళ్ల వయసు నుంచి పొదుపు చేయడాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. స్థిరాస్తి వ్యాపారం, గోల్డ్, మ్యూచువల్ ఫండ్స్ తదితర వాటిల్లో ఒడుదొడుకులు ఉంటాయి. కానీ చిట్‌ఫండ్‌లలో స్థిరత్వం ఉంటుంది. మనం పెట్టిన డబ్బులకు ఢోకా ఉండదు. మార్గదర్శిలాంటి చిట్‌ఫండ్ సంస్థలో మూడు, నాలుగు నెలల ముందస్తుగా ప్రణాళికలు వేసుకుంటే అవసరానికి డబ్బులు అందుతాయి. సభ్యుల అవసరాలకు అనుగుణంగా వేగంగా చెల్లింపులు చేస్తున్నాం. అదే మా లక్ష్యం. సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని కోరారు.

మూడ్రోజుల్లోనే చెక్కు ఇచ్చారు

మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ నియమ నిబద్ధతలతోపాటు ధైర్యానికి మారు పేరు. సంస్థ నిర్వహణ, విధానాలు బాగున్నాయి. చెక్కుల చెల్లింపు పక్కాగా ఉంటుంది. గత ఆదివారం చిట్‌పాడితే, మంగళవారం ష్యూరిటీ ఇస్తే మొత్తంగా మూడు రోజుల్లోనే చెక్కు ఇచ్చారు. ఇలా ఎక్కడా చూడలేదు. సంస్థ నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి.

- కిలారు విష్ణువర్ధన్ రావు, చందాదారు, ఖమ్మం

35 ఏళ్ల అనుబంధం

నమ్మకం అంటేనే మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ. 35 ఏళ్లుగా ఈ సంస్థలో చిట్టీలు వేస్తున్నాం. ఇప్పుడూ మూడు నడుస్తున్నాయి. మొదట్లో పిల్లల చదువుల కోసం చిట్టీలు వేశాం. అలా నిర్వహిస్తూనే తరువాత భూమి కొన్నాం. ఇప్పుడు కారు కొనుగోలు చేశాం. మమ్మల్ని చూసి పాల్వంచలో ఉంటున్న నా కుమార్తె మార్గదర్శిలో చిట్స్ వేస్తోంది.

- నెల్లూరి సత్యవతి, చందాదారు, రోటరీనగర్, ఖమ్మం

పోలైన ఓట్ల కంటే అనర్హులే ఎక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభ పోలింగ్‌లో 1,56,341 ఓట్లు పోలైతే 1,54,982 ఓటర్లను ఇప్పుడు తొలగింపు జాబితాలో చేర్చడం గమనార్హం. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ప్రతి పది మంది ఓటర్లలో నలుగురికి పైగా పేర్లు తొలగింపు జాబితాలో ఉన్నాయి.

◆ ఒక నియోజకవర్గంలో గత ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే పెద్ద సంఖ్యలో గైర్హాజరు, వేరే ప్రాంతాలకు తరలిపోయిన, మరణించిన లేదా ఇతర కారణాలతో గుర్తించలేని ఓటర్లు ఉంటే..గతంలో నమోదైన ఓటర్ల సంఖ్యతో పోలింగ్ శాతం లెక్కించడంపై ప్రభావం పడే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో తక్కువ పోలింగ్ నమోదవుతున్న నియోజకవర్గాల్లో సర్‌లో ఎక్కువ తొలగింపులు కనిపిస్తున్నాయి. మలక్‌పేట, యాకుత్‌పురాలు 2023లో తక్కువ పోలింగ్ నమోదైన నియోజకవర్గాల జాబితాలో ఉన్నాయి.

◆ తొలగింపు ముసాయిదా జాబితాతో ఓటర్ల పరిశీలనకు పోలింగ్ బూత్ అధికారులు(బీఎల్‌ఓ) ఇంటింటికి వెళ్లి గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన వారి పేర్లపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను తీసుకుంటున్నారు. నోటీసులు కూడా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ముసాయిదా జాబితాలో ఉన్నవారి ఓట్లన్నీ తుది జాబితా నుంచి శాశ్వతంగా తొలగిపోయాయని ఇప్పుడే తేల్చడం సరికాదని నేతలు చెబుతున్నారు. కానీ మలక్‌పేట, యాకుత్‌పురాలో గత రెండు ఎన్నికల్లో పోలైన ఓట్ల కంటే తొలగింపు ముసాయిదాలో పేర్కొన్న పేర్లే ఎక్కువగా ఉండటం తీవ్రంగా పరిశీలించాల్సిన అంశమని కాంగ్రెస్ సీనియర్ నేతలు తెలిపారు.

నగరంలోని 2023 అసెంబ్లీ ఎన్నికలో పోలైనవి, తొలగింపు ముసాయిదాలో చేర్చినవి

నియోజకవర్గం	2023 పోలైన ఓట్లు	2026 సర్ ముసాయిదా
యాకుత్‌పురా	1,39,990	1,54,982
మలక్‌పేట	1,31,354	1,47,799
జూబ్లీహిల్స్	1,82,962	1,79,510
చాంద్రాయణగుట్ట	1,52,898	1,48,869
ముషీరాబాద్	1,52,550	1,40,070
అంబర్‌పేట	1,45,470	1,20,303
ఖైరతాబాద్	1,54,146	1,23,472
సనత్‌నగర్	1,29,387	1,14,131
నాంపల్లి	1,51,595	1,37,126
కార్వాన్	1,75,107	1,41,766
గోషామహల్	1,49,857	1,10,148
చార్మినార్	97,830	94,174
బహదూర్‌పురా	1,44,094	1,21,350
సికింద్రాబాద్	1,41,105	1,02,710
కంటోన్మెంట్	1,23,766	1,05,034
మొత్తం	21,72,111	19,41,444

అంబర్‌పేట-మూసారాంబాగ్ వంతెన

కేసీఆర్ రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సంతోష్.. ఒక చుక్క రక్తాన్ని కూడా దానం చేయలేదు. కేసీఆర్ సీఎంగా పదేళ్లపాటు రాష్ట్రంలో కుటుంబ పాలన సాగింది. కుమారుడు, అల్లుడిని కేసీఆర్ మంత్రులను చేస్తే.. నేను భట్టి విక్రమార్క, సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి తదితరులను మంత్రులను చేశా. ఆయన తన బిడ్డకు పదవి ఇస్తే.. నేను శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిని చేశా. కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి అయిలమ్మ పేరు పెట్టా. ఆమె మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యురాలిని చేశా. పురానాపూల్ బిడ్డ అనిల్‌కుమార్‌ను రాజ్యసభకు పంపించా. అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీ చేశా. నీ పార్టీకి కొడుకును వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి బీసీ నేతను అధ్యక్షుడిని చేశా. వారంతా నా కుటుంబ సభ్యులు కాదు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు. ఆ పార్టీ వాళ్లు నన్ను గుంపుమేస్త్రీ అని.. కేటీఆర్‌ను ఐటీ కంపెనీ సీఈఓ అని అంటున్నారు. ప్రజలు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తున్నందుకు..నేను మేస్త్రీనే. కానీ.. కేటీఆర్ సీఈవో కాదు.

దివాలా తీసిందని చెబితే ఆశ్చర్యపోయా...

డిసెంబరు 7, 2023న ఎల్బీస్టేడియంలో సీఎంగా ప్రమాణస్వీకారం చేసి.. సచివాలయం వెళ్లా. అధికారులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఆరాతీస్తే.. ఏదో తేదీ వచ్చినా.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని ఫైనాన్స్ సెక్రటరీ చెప్పారు. ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందని చెబితే ఆశ్చర్యపోయా. రాష్ట్రం విడిపోయే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, రూ.70వేల కోట్ల అప్పులతో ఉన్న తెలంగాణను..తొమ్మిదిన్నరేళ్లలో కేసీఆర్ రూ.8లక్షల 11వేల కోట్ల అప్పుల్లోకి నెట్టారు. సంవత్సరానికి అసలు, వడ్డీ కలిపి రూ.6,500 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి నుంచి.. రూ.80 వేల కోట్లు చెల్లించే స్థితికి తీసుకెళ్లారు. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు, పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేక..వాళ్ల సర్వీసు పొడిగించారు. నేను ప్రభుత్వంలోకి వచ్చాక.. వారంతా పదవీ విరమణకు రావడంతో.. ప్రభుత్వంపై రూ.7వేల కోట్ల భారం పడింది.

ఉద్యోగ సంఘాలు నన్ను బెదిరిస్తున్నాయి..

జనవరి 1, 2024 నుంచి ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిస్తున్నాం. ఐదో తేదీలోపు ఒప్పంద, కాంట్రాక్టు ఉద్యోగులకు చెల్లిస్తున్నాం. అయినా.. ఉద్యోగ సంఘాలు నన్ను బెదిరిస్తున్నాయి. కార్పొరేట్ వైద్య సదుపాయంతో ఆరోగ్య కార్డులు, పీఆర్సీ వంటి అనేక సమస్యలను పరిష్కరించాం. ఉద్యోగ సంఘాలు వాస్తవాలను, గతాన్ని ఓసారి గుర్తు చేసుకోవాలి. గత సర్కారు ఉద్యమం చేస్తూ 60 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోతే పట్టించుకోలేదు. నేను సీఎం అయ్యాక ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టి.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించా. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని.. లాభాల్లోకి తెచ్చా. అక్కాచెల్లెళ్ల కోసం మా ప్రభుత్వం టికెటు కొంటోంది. రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల కోసం రూ.1.7 లక్షల కోట్లు ఖర్చు పెట్టిన తెలంగాణ ప్రభుత్వ ఘనతను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. రంగారెడ్డి జిల్లా కోహెడలో ప్రపంచ స్థాయి పండ్ల మార్కెట్‌ను కడుతున్నాం. మూడేళ్లలో 72వేల మందికి ప్రభుత్వ కొలువులిచ్చాం

ఆ టిమ్స్‌లకు.. వారి పేర్లు..

సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రికి మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి పేరు పెడితే.. భారాస వాళ్లు విమర్శిస్తున్నారు. చెన్నారెడ్డి సేవల గురించి వారికి తెలియదు. త్వరలో ప్రారంభించనున్న అల్వాల్ టిమ్స్‌కు పేదల బిడ్డ మాజీ సీఎం టి.అంజయ్య పేరు పెడతాం. ఎల్బీనగర్ టిమ్స్‌కు తొలి తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్ టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. రూ.3 వేల కోట్లతో 2వేల పడకల సామర్థ్యంతో ఉస్మానియా ఆసుపత్రిని కడుతున్నాం. వచ్చే సంవత్సరం దాన్ని కూడా ప్రారంభిస్తాం "అని సీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), సీఎంసీ(సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), ఎంఎంసీ(మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్)ల కొత్త లోగోలను ఆవిష్కరించారు. క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసి. . ప్రజలకు మంచి పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, అహ్మద్ బలాల, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్, శ్రీగణేశ్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరైన స్థానికులు

స్కాలర్‌షిప్‌ల సంఖ్య 13440కి పెంచబడింది

LIC GOLDEN JUBILEE FOUNDATION

ఎల్.ఐ.సి గోల్డెన్ జూబిలీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2026

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు

విద్యా సంవత్సరం 2023-24, 2024-25 లేదా 2025-26లో 10వ/12వ తరగతి/ డిప్లొమా లేదా తత్సమానమైన పరీక్షల్లో కనీసం 60%తో లేదా తత్సమానమైన సిజిపిఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైన మరియు విద్యా సంవత్సరం 2026-27లో మొదటి సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు అఖిల భారత ప్రాతిపదికపై స్కాలర్‌షిప్‌లను ప్రకటిస్తున్నందుకు ఎల్ఐసి గోల్డెన్ జుబిలీ ఫౌండేషన్ సంతోషిస్తుంది.

- **ఈ క్రింది కోర్సులు చదువుతున్న అబ్బాయిలు మరియు అమ్మాయిలకు సాధారణ స్కాలర్‌షిప్‌లు (12వ తరగతి లేదా డిప్లొమా తరువాత);**
  మెడిసిన్, ఇంజినీరింగ్, డిప్లొమా, వృత్తివిద్యా కోర్సులు, ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా ఇంటిగ్రేటెడ్ కోర్సులు.
- **ఈ క్రింది కోర్సులు చదువుతున్న అబ్బాయిలు మరియు అమ్మాయిలకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు (10వ తరగతి లేదా డిప్లొమా తరువాత);**
  తరగతి 11 మరియు 12/ ఇంటర్మీడియట్ 10+2 పేటర్న్ క్రింద, డిప్లొమా/వృత్తివిద్యా కోర్సు లేదా ఇంటిగ్రేటెడ్ కోర్సులు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి, ఇతర అర్హత పరిస్థితులు మరియు స్కీమ్ వివరాల కొరకు, దయచేసి https://licindia.inలో **గోల్డెన్ జుబిలీ ఫౌండేషన్** పేజీ చూడండి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు ఆఖరి తేదీ **30.09.2026**

గమనిక: దరఖాస్తుల స్టేటస్ గురించి ఏ విధమైన ప్రశ్నలు లేదా కరెస్పాండెన్స్ స్వీకరించబడదని దయచేసి గమనించండి. స్కాలర్‌షిప్ కోసం ఎంపికైన అభ్యర్థులకు రిజిస్టర్డు ఇ-మెయిల్ ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

హైదరాబాద్‌కు ప్రఖ్యాత విదేశీ విద్యాసంస్థలు

● సీఎంకు ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం నివేదిక

నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న శాంతికుమారి. చిత్రంలో రామకృష్ణారావు, శ్రీధర్

ఈనాడు, హైదరాబాద్: అమెరికా, బ్రిటన్‌లకు చెందిన ప్రఖ్యాత విదేశీ విద్యాసంస్థలు తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సంబంధిత వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను అమెరికా, బ్రిటన్‌లలో పర్యటించిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేసింది. నివేదికను స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం ఊపిరి పోసిందని హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్ర విద్యార్థులకు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ప్రకటించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గ్లోబల్ నాలెడ్జ్ హబ్ ఏర్పాటైతే.. మరిన్ని ప్రపంచస్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెలంగాణకు తరలివస్తాయన్నారు. రాబోయే డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడారంగాభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉన్నతస్థాయి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డా.ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ ఛైర్‌పర్సన్ ఎ.శాంతికుమారి, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు.

నివేదికలోని ముఖ్యాంశాలు..

◆ అమెరికాలోని అత్యుత్తమ 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ'తో పాటు.. బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్'.. భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపాయి. ముఖ్యంగా నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తోంది.

◆ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచే 'హార్వర్డ్ యూనివర్సిటీ'.. హైదరాబాద్‌లోని డా.ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ కోర్సులు నవంబరు నుంచే నగరంలో ప్రత్యక్షంగా ప్రారంభం కానున్నాయి.

◆ ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్'.. 'స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్'.. 'ఆక్స్‌ఫర్డ్'.. 'కేంబ్రిడ్జ్'.. 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'. . 'లండన్ బిజినెస్ స్కూల్'.. 'వర్జీనియా టెక్'.. 'ఇంపీరియల్ కాలేజ్ లండన్'.. వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో విస్తృత స్థాయి చర్చలు జరిపింది.

◆ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి.

బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ

యుద్ధ విరమణ వైపు కదలండి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇచ్చింది.. ఇకపైనా ఇస్తుంది. ఎల్లప్పుడూ మాది శాంతిపథం" అని మోదీ చెప్పారు. యుద్ధానికి సంబంధించిన అన్ని అంశాలపై ఇరువురు ఇదివరకు ఒకసారి చర్చించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. "గత ఏడాది మీరు భారత్‌లో చేసిన పర్యటన ఎంతో చిరస్మరణీయమైనది. మన సహకారం సరికొత్త ఎత్తులకు చేరుతుండటం ఎంతో సంతృప్తికరం. రెండు దేశాల ప్రజల సంక్షేమం కోసం మనం పనిచేస్తున్నాం. దేశ ప్రయోజనాలే మనకు పరమావధి. ఇకపైనా అదే మనకు పథనిర్దేశం చేస్తుంది" అని చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, ఎరువుల సరఫరా వంటి అంశాలపై సహకారం కొనసాగుతున్న తీరుపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. బిష్కెక్‌లో మహాత్మా గాంధీ స్మారకాన్ని మోదీ సందర్శించారు. ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. నోమడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి చేరుకునేందుకు పుతిన్‌తో కలిసి ఆయన కారులో మోదీ ప్రయాణించారు.

◆ ఎస్‌సీఓ సదస్సులో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ విడిగా భేటీ అయ్యారు. వీసారహిత ప్రయాణాలపై చర్చించుకున్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

ఉజ్బెక్ విద్యార్థుల నోట మోదీ పద్యాలు

మోదీ రాసిన 'అభీ తో సూరజ్ ఉగా హై', 'నయే భారత్ కే నయే సంకల్ప్', 'మానవతా కో కహీ న లగ్ జాయే దాగ్' వంటి పద్యాలను తాష్కెంట్‌లో ఉజ్బెక్ విద్యార్థులు హిందీ, ఉజ్బెక్ భాషల్లో ఆలపించారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మిర్జియోయెవ్ ఇచ్చిన విందు దీనికి వేదిక అయింది.

పశ్చిమాసియాలో శాంతి పరిఢవిల్లాలి

ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన మోదీ.. పశ్చిమాసియాలో శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. సముద్రయాన స్వేచ్ఛ, పౌరహక్కులు/ పౌర సదుపాయాల పరిరక్షణ ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. రాబోయే కాలంలో ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలను విస్తృతం చేసుకోవాలనుకుంటున్నామని వెల్లడించారు. శాంతి, భద్రతల కోసమే తాము ప్రయత్నిస్తున్నా దౌత్యమార్గాలకు బదులు యుద్ధపథాన్ని అమెరికా ఎంచుకుందని పెజెష్కియాన్ చెప్పారు. సొంత ప్రజల్ని ముప్పు నుంచి రక్షించుకునే బాధ్యత తమపై ఉందన్నారు. యుద్ధం, రక్త తర్పణాల నుంచి చర్చలు, ఒప్పందాలవైపు మళ్లేందుకు భారత్‌కున్న విస్తృత సంబంధాలను ఉపయోగించాలని మోదీని ఆయన కోరారు. యుద్ధం కొనసాగడం ఎవరికీ ఉపయోగకరం కాదన్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు ఝపరోవ్‌తోనూ మోదీ భేటీ అయ్యారు.

(c) eenadu

ఈనాడు

జలభద్రతకు చెరువుల బాగుసేత

చెరువులు కేవలం నీటివనరులే కాదు... గ్రామీణ ఆర్థిక, సామాజిక, పర్యావరణ వ్యవస్థకు అవి జీవనాడులు. చెరువులు సాగు, తాగునీటిని అందించడమే కాకుండా, వరదలను నిరోధిస్తాయి. భూగర్భ జలాలు పెరగడానికి తోడ్పడతాయి. పట్టణాల్లో విపరీత ఉష్ణోగ్రతలనూ అవి కొద్దిమేర తగ్గిస్తాయి. ఇంతటి విస్తృత ప్రయోజనాలను అందించే చెరువులు దేశవ్యాప్తంగా ఆక్రమణల గుప్పిట చిక్కి నానాటికీ కుంచించుకుపోతున్నాయి. పూడికతీతకు నోచుకోక నిరుపయోగంగా మిగులుతున్నాయి. ఎడతెగని మురుగునీటి వెల్లువతో అవి కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. దానివల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో రకరకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో జలభద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధులకు దన్నునిచ్చేలా చెరువులను పునరుద్ధరించాలన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సిఫార్సు అవశ్యం అనుసరణీయమైనది. చెరువులు కనుమరుగు కాకుండా కాపాడుకోవాలంటే కమిషన్ సూచించినట్లు ప్రత్యేకంగా చిన్ననీటిపారుదల చట్టం తేవాల్సిన అవసరం ఉంది. అన్ని రాష్ట్రాలు ఈ మేరకు ప్రత్యేక చొరవ తీసుకుంటేనే చెరువులు కలకాలం స్వచ్ఛ జలకళతో విరాజిల్లుతాయి!

కేంద్ర జలశక్తి శాఖ గణన ప్రకారం ఆసేతుహిమాచలం 24.24 లక్షల జలవనరులు ఉన్నాయి. వాటిలో దాదాపు పదహారుశాతం చెరువులే! మొత్తం నీటివనరుల్లో 97.1శాతానికి గ్రామీణ ప్రాంతాలే నెలవులు. కేంద్ర ప్రభుత్వ సమాచారం మేరకు ఏపీలో కుంటలు, చెరువులు, సరస్సులు, రిజర్వాయర్లు లాంటివన్నీ కలిపి 1.90 లక్షల దాకా లెక్కతేలుతున్నాయి. తెలంగాణలో వాటి సంఖ్య 64వేలు. దేశవ్యాప్తంగా 3.94 లక్షల జలవనరులు వినియోగంలో లేవు. ఏపీలో సుమారు 41వేలు, తెలంగాణలో 12వేలు అదే దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. వీటికితోడు వేలాది జలవనరులు కబ్జాల పాలయ్యాయి. హైదరాబాద్‌లోనే గడచిన కొన్నేళ్లలో వందలసంఖ్యలో చెరువులు కనుమరుగయ్యాయి. నాలాలూ బక్కచిక్కిపోవడంతో నగరంలో వరద ముప్పునకు గురయ్యే ప్రాంతాలు పాతికేళ్లలో దాదాపు రెట్టింపైనట్లు పరిశీలనలు చెబుతున్నాయి. ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, తిరుపతి, నెల్లూరు, విజయనగరం ఇలా చాలాచోట్ల చెరువులు అసలురూపు కోల్పోవడంతో లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. నీరు లేక పంటలు ఎండుతున్నాయి. జలవనరుల ఆక్రమణలపై న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారగణంలో చలనం లేకపోవడం సామాజిక సంక్షోభానికి దారితీస్తోంది!

మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా నిరుడు మార్చి నాటికి గ్రామీణ భారతంలో దాదాపు 69వేల చెరువులను కొత్తగా నిర్మించడమో, పునరుద్ధరించడమో చేశారు. పీఎం కృషి సించాయీ యోజనలో భాగంగానూ ఇటువంటి పనులు చేపడుతున్నారు. అమృత్2.0 కింద పట్టణాల్లోనూ చెరువులను చక్కదిద్దుతున్నారు. అయితే, ఒకసారి పనులు చేపట్టి మిన్నకుండిపోకుండా ఏటా వర్షాకాలంలో చెరువుల్లోకి నీరు చేరుతోందో లేదో గమనిస్తుండాలి. వాటిలో మురుగునీరు, ప్రమాదకర రసాయనాలు ఎట్టిపరిస్థితుల్లో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాలానుగుణంగా పూడిక తీయడంతోపాటు శాటిలైట్ మ్యాపింగ్, జియో ఫెన్సింగ్ వంటి వాటి ద్వారా కబ్జాలను ఎప్పటికప్పుడు అరికట్టాలి. జలవనరుల ఆక్రమణదారులను సామాజిక శత్రువులుగా పరిగణించి ఉక్కుపాదం మోపాలి. ఈ మేరకు యంత్రాంగం చిత్తశుద్ధితో పాటుపడితేనే జనభారత జలభద్రతకు భరోసానిచ్చేలా చెరువులు నూతన జవసత్త్వాలను సంతరించుకుంటాయి!

స్వేచ్ఛను అనుభవించాలంటే ముందు మనల్ని మనం నియంత్రించుకోవడం నేర్చుకోవాలి. మెదడు మాత్రమే పనిచేసే చోట ప్రేమ, సహానుభూతి, దయ, దాతృత్వం లాంటి హృదయగత భావాలకు ఊపిరి పీల్చుకునే అవకాశం కూడా ఉండదు.

– వర్జీనియా వూల్ఫ్, రచయిత్రి

సుఖదుఃఖాలు

ఈ సృష్టి మొత్తం ద్వంద్వాత్మకమైనది. ప్రకృతిలో పగలూ రాత్రి, ఎండా వానలు ఒకదాని వెంట మరొకటి వస్తూంటాయి. అలాగే మనిషి జీవితంలో కూడా సుఖదుఃఖాలు తప్పనిసరి. అన్నింటికీ శరీరం, మనసు తట్టుకోవాలి. ఇదే కాలపరీక్ష అంటే.

నిజానికి సుఖానికి, కష్టానికి ఎప్పుడూ ఒక పరిమితి అనేది ఉంటుంది. సుఖం వెన్నంటి కష్టం కలుగుతుంది. కష్టం పోయిన తరవాత సుఖం ప్రవేశిస్తుంది. అంటే... ఇవేవీ ఎల్లప్పుడూ ఉండేవి కావు. గీతలో భగవానుడు 'కష్టసుఖాలు అనిత్యమైనవి. వాటి పట్ల ఓర్పుతో ఉండు' అని తెలియజేస్తాడు. భక్తుడైనవాడు ఈ సుఖదుఃఖాలను సమభావంతో స్వీకరిస్తాడు. సుఖానికి పొంగడు, దుఃఖానికి కుంగడు. స్థితప్రజ్ఞత కలిగి ఉంటాడు.

అరణ్యాలలో అనేక కష్టాలు అనుభవించిన శ్రీరాముడే రాక్షస సంహారం చేసి విజయాన్ని సాధించాడు. అలాగే భారతంలో అరణ్య, అజ్ఞాత వాసాలతో కష్టాలనుభవించిన పాండవులే కురుక్షేత్ర సంగ్రామంలో విజేతలయ్యారు. కర్ణుడు అనుభవించిన అవమానాలూ శాపాలు, నలమహారాజు ఎదుర్కొన్న బాధలు, సత్యనిష్ఠ వల్ల హరిశ్చంద్రుడు పడిన కష్టాలు సామాన్యమైనవి కావు. అయినా వారు వాటిన్నింటినీ ధీరోదాత్తంగా ఎదుర్కొని కీర్తికాయులుగా నిలిచిపోయారు. అందుకే దుఃఖాలు తరుముకొచ్చినప్పుడు మనోబలంతో ప్రతిఘటిస్తూ ముందుకు సాగాలి. అప్పుడే అలలు పర్వతాన్ని చలింపచేయలేనట్లుగా ఆ మనిషి అన్నింటికీ అతీతంగా వ్యవహరిస్తాడు. 'సుఖమును దుఃఖమును జోడు కోడెలు, అఖిలము c గన్నవారు అడ్డమాడరెపుడు'- సుఖదుఃఖాలు జోడెడ్ల వంటివి, అనుభవజ్ఞానులు దీన్ని కాదనరు అంటాడు అన్నమయ్య. దీన్ని అర్థం చేసుకున్న మనిషే అసలైన భక్తుడు.

అంతర్యామి

పల్లానికి ప్రవహించే నీరు రాయి అడ్డం వస్తే పక్కకు తప్పుకొని ముందుకి ప్రవహిస్తుంది. తీవ్రమైన గాలులకు, నీటి ప్రవాహపు ఒత్తిడికి తలవంచి అయినా తట్టుకుని నిలబడుతుంది గడ్డిపోచ. మనిషి కూడా ప్రకృతిని ఆదర్శంగా తీసుకుని కష్టాలను అధిగమించడానికి ప్రయత్నించాలి. సుఖాలు అనుభవించేటప్పుడు ఆనందంతో విర్రవీగే మనిషికి భగవంతుడు గుర్తుకురాడు. కానీ కష్టం వచ్చినప్పుడు నువ్వు తప్ప దిక్కులేదంటూ దేవుణ్ని ప్రార్థిస్తాడు. ఇది మానవ నైజం. ఒకసారి కుంతీదేవితో శ్రీకృష్ణుడు 'అత్తా! నీకేం కావాలో కోరుకో. అనుగ్రహిస్తాను!' అన్నాడు. అప్పుడు కుంతీదేవి 'మేం కష్టాల్లో ఉన్నప్పుడు నువ్వు పరుగులు తీసుకుంటూ మా దగ్గరికి వచ్చావు. సుఖసంతోషాలతో ఉన్నప్పుడు ఒక్కసారైనా వచ్చావా! అందుకే నీ దర్శనం కలిగించే కష్టాలే కావాలి!' అందని భాగవతం చెబుతోంది. అది నిజమైన భక్తుల ఆలోచన.

సుఖంగా ఉన్నప్పుడు అంతా తమ గొప్పే అనుకుని; సమస్యలు వచ్చినప్పుడు మాత్రం ఎదుటివారినో, దైవాన్నో అందుకు బాధ్యులుగా చేస్తూంటారు కొందరు. అహంకారం, స్వార్థం వంటి స్వయంకృతాపరాధాలే మనిషిని దుఃఖవలయంలోకి నెట్టేస్తున్నాయని గ్రహించాలి. పరోపకారం, దయ, సేవ వంటి సుగుణాలు కలిగి ఎదుటివారి సుఖసంతోషాల కోసం చేతనైనంత సాయం చేసేవారే నిత్యసంతోషులుగా ఉంటారు. అదే అసలైన జీవన సాఫల్యత!

– విశ్వనాథ రమ

సయోధ్య కాదు... పరిమిత సహకారమే!

భారత్-చైనాల మధ్య సంఘర్షణ వాతావరణం కాస్త చల్లబడుతున్నట్లు కనిపిస్తోందనే విశ్లేషణలు తరచూ వినిపిస్తున్నాయి. 2020లో తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ వెంబడి సైనిక ఘర్షణలు జరిగిన తర్వాత 2024లో ఆయా ప్రాంతాల నుంచి రెండు దేశాల సైనిక దళాల ఉపసంహరణకు అవగాహన కుదిరింది. భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య నిరుడు మాటామంతీ జరిగింది. దీంతో భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు ఉపశమించాయనే వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. కానీ, పరిస్థితి అనుకున్నంత సజావుగా లేదు.

భారత్, చైనాల మధ్య కొంతకాలంగా విమాన ప్రయాణాలు తిరిగి ప్రారంభమయ్యాయి. వీసాలు సులభంగానే మంజూరవుతున్నాయి. భారతీయులు మళ్ళీ కైలాస మానస సరోవర యాత్రకు వెళ్తున్నారు. సరిహద్దుల్లో వాణిజ్య కేంద్రాలు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇటీవల బీజింగ్‌లో పర్యటించడం ఉభయ దేశాల మధ్య సాధారణ సంబంధాల పునరుద్ధరణ మొదలైందనే భావనకు తావిచ్చింది. అయితే, మరీ అంత ఆశావాదమూ పనికిరాదనే అనిపిస్తోంది. ఇరుదేశాల మధ్య ఇప్పటికీ సరిహద్దు వివాదాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. నిరంతర సైనిక మోహరింపులు, అసమతుల్య వాణిజ్యం, భారత పొరుగు ప్రాంతాల్లో చైనా ఆధిపత్య ధోరణి వంటి క్లిష్ట సమస్యలు కొనసాగుతున్నాయి. ఇండియా విధానం పరిమిత సహకారమే తప్ప సయోధ్య కాదు. సంఘర్షణ రగలకుండా నియంత్రించడమే భారత్ లక్ష్యం.

జిన్‌పింగ్ దిల్లీ వస్తారా?

మోదీ, జిన్‌పింగ్ 2024లో కజాన్‌లో, 2025లో టియాన్జిన్‌లో నిర్వహించిన సమావేశాల్లో అంగీకరించిన మార్గదర్శకాలను ఆచరణలో పెట్టడానికి మిస్రీ తన బీజింగ్ పర్యటనలో కృషి చేశారు. ఆయన అక్కడ ఉన్నతస్థాయి నేతలతో చర్చలు జరిపారు. వాణిజ్యం, ఆర్థిక, సాంస్కృతిక సహకారం, ప్రజల మధ్య మార్పిడులు, విద్యా సంబంధాలు, ముఖ్యంగా సరిహద్దు వెంబడి శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవడం వంటి అంశాలపై చర్చలు సాగాయి. పరస్పరం బెదిరింపు ధోరణితో కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా మెలగాలని రెండు పక్షాలు పునరుద్ఘాటించాయి. ఈ చర్చలతో ఇండియాకు ఒరిగిందేమిటంటే, ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా స్థిరీకరణ వైపు పయనిస్తున్నాయని చెప్పవచ్చు. లిపులేఖ్, షిప్కిలా, నాథూలా ద్వారా సరిహద్దు వాణిజ్య పునఃప్రారంభం, స్థానికులకు పరిమితమైన లబ్ధిని చేకూరుస్తుంది. అయితే, చైనాతో భారత్ సంబంధాల పురోగతిని జపాన్ వంటి భాగస్వాములతో ఉన్న సంబంధాలతో పోల్చలేం. జపాన్ వంటి మిత్ర దేశాలతో కుదిరిన రక్షణ, వాణిజ్య ఒప్పందాల వంటివి చైనాతో కుదరవు. కానీ, మిస్రీ పర్యటన రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఉన్నత స్థాయి భేటీలకు పునాది వేస్తుంది. రెండు దేశాల మధ్య వివాదగ్రస్త వాస్తవాధీన రేఖ వెంబడి అనుకోకుండా ఘర్షణలు ప్రజ్వరిల్లే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగని దీనివల్ల వ్యూహాత్మక ప్రయోజనం సిద్ధించకపోవచ్చు. సరిహద్దు వెంబడి 2020 ముందునాటి గస్తీ హక్కుల పూర్తి పునరుద్ధరణ, సరిహద్దు నిర్ణయంలో అర్థవంతమైన పురోగతి, వాణిజ్య లోటు తగ్గింపు వంటివి భారత్ లేవనెత్తుతున్న ప్రధాన సమస్యలు. వీటి పరిష్కారంలో ఎలాంటి పురోగతి లేదు. ఏతావతా మిస్రీ పర్యటన రెండు దేశాల మధ్య సంభాషణ ప్రక్రియ కొనసాగింపునకు పునాదిని ఏర్పరచినట్లయింది. మరోవైపు ట్రంప్ ఇండియాపై వాణిజ్య సుంకాలను భారీగా పెంచేశారు. బీజింగ్‌ను శాంతింపజేసే ప్రయత్నంలో ట్రంప్, అమెరికా-చైనాలతో 'జి-2' ఏర్పాటు గురించి ప్రతిపాదించారు. ఇది భారత్‌కు మంచి పరిణామమైతే కాదు. అలాగని ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా-చైనాల మధ్య వ్యూహపరమైన వైరుధ్యం సమసిపోయిందని చెప్పలేం. భారత్ ఇప్పటికీ క్వాడ్‌లో భాగస్వామిగా కొనసాగుతోంది. ఆర్థిక సంస్కరణల ద్వారా బలోపేతం అవుతున్న ఇండియా, ఇదే ఊపును కొనసాగించడానికి చైనాతో ఉద్రిక్త వాతావరణం అడ్డురాకూడదని భావిస్తోంది. అందుకే, దౌత్య మార్గంలో చర్చలు కొనసాగిస్తోంది. ఏ కూటమిలో చేరకుండా బహుళ ధ్రువ ప్రపంచ సాధనకు కృషి చేస్తోంది.

ఈనెల 12-13 తేదీలలో దిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ హాజరుకానున్నారు. ఈ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వడం భారత్‌కు ప్రతిష్ఠను తీసుకొస్తుంది. ఆర్థికాభివృద్ధి, వాతావరణ మార్పుల నిరోధం, అంతర్జాతీయ సంస్కరణలపై వర్ధమాన దేశాల అజెండాను రూపొందించడానికి ఈ సమావేశం తోడ్పడుతుంది. జిన్‌పింగ్ ఈ సభలో పాల్గొంటే సరిహద్దు నిర్వహణ, ఆర్థిక లోటు నివారణ వంటి అపరిష్కృత సమస్యలపై చర్చించడానికి భారత్‌కు అవకాశం లభిస్తుంది. జిన్‌పింగ్ వస్తారనే గ్యారంటీ లేకపోయినా, ఈ ఏడాది బ్రిక్స్‌కు ఇండియా అధ్యక్షత వహించడాన్ని చైనా సమర్థించింది.

పోటీకి సిద్ధం కావాల్సిందే

మనీలాలో జులైలో ఆసియాన్ దేశాల సమావేశం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీలు భేటీ వేశారు. ఆ తర్వాత తైవాన్, టిబెట్‌లపై తన సార్వభౌమత్వాన్ని భారత్ గుర్తించిందని జైశంకర్ ప్రకటించినట్లు చైనా చెప్పుకొంది. దీన్ని భారత్ గట్టిగా ఖండించింది. నిజానికి చైనా 1963 నుంచి జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలోని కొన్ని భారత భూభాగాలను ఆక్రమించి ఉంది. రెండు దేశాల మధ్య చర్చలు సరిహద్దులో ఉద్రిక్తతలను నివారించడంపై దృష్టి కేంద్రీకరించినా, పూర్తిగా శాంతి నెలకొనలేదు. మరోవైపు మయన్మార్‌లో పెరుగుతున్న చైనా ప్రభావం ఆందోళన కలిగిస్తోంది. 1962 సరిహద్దు యుద్ధం, డోక్లాం, గల్వాన్ ఘర్షణలు, చైనా-పాక్ ఆర్థిక నడవా ప్రాజెక్టు, చైనాతో భారత్ వాణిజ్య లోటు 10వేల కోట్ల డాలర్లను మించడం వంటివి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఇండియాను హెచ్చరిస్తున్నాయి. ఏదిఏమైనా చైనాతో దీర్ఘకాలిక పోటీకి భారత్ సిద్ధం కావాల్సిందే. తదనుగుణంగానే ఇండియా తన సరిహద్దుల్లో మౌలిక సదుపాయాలను విస్తరించింది. సొరంగ మార్గాలు, అధునాతన ల్యాండింగ్ గ్రౌండ్‌లు, ఎస్-400 వ్యవస్థలను ఏర్పాటు చేసింది. సమీప కాలంలో రెండు దేశాల మధ్య దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు కొనసాగుతాయి. కానీ సరిహద్దు వివాదం మాత్రం ఇంకా అపరిష్కృతంగానే ఉంది. ఈ వాస్తవికతకు అనుగుణంగానే భారతదేశం నడుచుకుంటోంది.

డాక్టర్ శ్రీపర్ణ పాఠక్

చైనా స్టడీస్ ప్రొఫెసర్, ఆగ్నేయాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్, ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ

చెప్పలేని చివరి మాట

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్నవారు ఎదుటివారికి ఏం చెప్పాలనుకుంటారు... ఒక్కసారి ఆలోచించండి...

- త్వరగా వెళ్లాలనే ఆతృతలో కారును గుద్ది పడిపోయాడు, తలకు బలంగా దెబ్బ తగిలి, కళ్లు మూతలు పడుతున్నాయి. 'బైక్‌లో హెల్మెట్ ఉండీ పెట్టుకోలేదు, ఎదురుగా వచ్చే కారు సిగ్నల్ పట్టించుకోలేదు, కాస్త జాగ్రత్తగా ఉంటే... ఈపాటికి ఆస్పత్రిలో నీకు సాయంగా ఉండాల్సినవాణ్ని, ఆస్పత్రి దాకా రాకుండానే వెళ్లిపోతున్నాను, క్షమించు నాన్నా...'
- సాయంత్రం పార్టీకి రెడీగా ఉండమని ఫ్రెండ్‌కి చెప్పడానికి 80 కి.మీ. వేగంతో వెళ్తూ ఫోన్ తీయబోయాడు. అంతే... తర్వాత ఏమైందో తెలియదు. రోడ్డుపక్కన రక్తం మడుగులో ఉన్నట్లు చుట్టుపక్కల వారి మాటల్ని బట్టి అర్థమవుతోంది. తెరచుకోని కనురెప్పల లోపల అమ్మానాన్నా, కడుపుతో ఉన్న భార్య మెదులుతుండగా 'బండి పక్కకు ఆపి, మాట్లాడి ఉంటే మిమ్మల్ని వదిలివెళ్లేవాణ్ని కాదు' అని అరిచి చెప్పాలనిపిస్తోంది.
- నలుగురు స్నేహితులు పొరుగూళ్లో పెళ్లికి కారులో బయలుదేరారు. మందు సీసాలు, వేడి వేడి బిర్యానీతో కబుర్లు చెప్పుకొంటూ బండిని గాల్లో పరుగులు పెట్టిస్తున్నారు. బస్సును ఓవర్ టేక్ చేయబోయి, ఎదురుగా వస్తున్న టిప్పర్‌ని గుద్ది... కారు నుజ్జునుజ్జయింది. నలుగురూ నాలుగు పక్కలకు ఎగిరిపడ్డారు. 'ఒకటీ రెండూ కాదు, అన్నీ తప్పులే చేశాం. మా నలుగురి నిర్లక్ష్యం నాలుగు కుటుంబాలను రోడ్డున పడేసింద'ని సాయం చేయడానికి వచ్చి ప్రాణముందా అని ముక్కు దగ్గర చేయిపెట్టి చూస్తున్నవారికి చెప్పాలనుకున్నారు, కానీ... నోరు పెగలదే!
- సినిమాకు వెళ్దామన్న భార్యా పిల్లల్ని బైక్‌పై ఎక్కించుకుని, టైమైపోయిందని వేగంగా వెళ్తున్నాడు. ఇంతలో ఫోన్ మోగింది. భార్య వద్దంటున్నా వినకుండా ఒక్కచేత్తో హ్యాండిల్ పట్టుకుని మరో చేత్తో ఫోన్ తీశాడు. ఇంతలో పిల్లాడు యాక్సిలేటర్‌మీద చేయివేయడం, బండి రయ్యిన వెళ్లి స్తంభానికి గుద్దుకోవడం జరిగిపోయాయి. నలుగురూ నాలుగు పక్కలకి పడిపోయారు. రయ్యిన దూసుకువచ్చి సడెన్‌గా ఆగుతున్న వాహనాల కీచు ధ్వని, జనాల అరుపులు... 'ఫోన్ కెన్ వెయిట్, లైఫ్ కెనాట్' ట్రాఫిక్ పోలీసుల నినాదం గుర్తొచ్చేసరికి అంతా అయిపోయింది.

నిర్లక్ష్యం, అజాగ్రత్త, అతివేగం, డ్రంకెన్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్... ఒకటీ రెండూ కాదు, చేజేతులా ప్రమాదాలు కొనితెచ్చుకోవడానికి సవాలక్ష కారణాలు. వాహనం అనేది మనకు లభించిన అద్భుతమైన రవాణా సౌకర్యం. తక్కువ సమయంలో శ్రమ లేకుండా కోరుకున్న చోటికి వెళ్లగలుగుతున్నాం. హెల్మెట్ డిక్కీలో పెట్టుకోడానికి కాదు, మద్యం ప్రయాణంలో తాగేది కాదు, సెల్‌ఫోన్ రోడ్డుమీద మాట్లాడేది కాదు. కాని పనులన్నీ చేస్తూ అవసరమైనవి వదిలేయడం వల్ల వచ్చే ఆనందం సంగతేమో కానీ జరగరానిది జరిగితే... ఆ తర్వాత జీవితమే ఉండదు. ఆ ఎరుక ఉన్నవాళ్లకు ఇవేవీ చెప్పనక్కర్లేదు!

– మేళం దుర్గాప్రసాద్

నగరాల పరిస్థితేంటి?

ప్రజల భద్రత, అవినీతి స్థాయి, క్రీడలూ సాంస్కృతిక కార్యకలాపాలకు అవకాశం, నాణ్యమైన విద్యా వైద్యం, మౌలిక వసతుల అందుబాటు తదితరాలను గణించి ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 173 నగరాల జాబితాతో ప్రపంచ జీవనయోగ్యత ఇండెక్స్‌ను రూపొందించింది. అందులో వివిధ నగరాలు, వాటి ర్యాంకులు...

దిల్లీ	120
ముంబయి	121
చెన్నై	123
బెంగళూరు	127
లాగోస్ (నైజీరియా)	168
అల్జియర్స్ (అల్జీరియా)	169
కరాచీ (పాకిస్థాన్)	170
ఢాకా (బంగ్లాదేశ్)	171
ట్రిపోలి (లిబియా)	172
డమాస్కస్ (సిరియా)	173

(ఆధారం: ఈఐయూ గ్లోబల్ లివబిలిటీ ఇండెక్స్-2026)

గోల్‌కు దూరమవుతున్న హాకీ!

ఒకప్పుడు ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లో హాకీలో ఇండియా 8 స్వర్ణ పతకాలు గెలవడం ఒక చరిత్ర. ఆ స్థాయిలో విజయాలు సాధించిన భారత్ గత 41 ఏళ్లలో దక్కించుకున్న పతకాలు రెండు మాత్రమే. అవికూడా 2020, 2024లలో కంచు పతకాలు దక్కాయి. మన జట్టు ప్రస్తుత పరిస్థితికి ఈ పతకాలు గొప్పే అని సరిపెట్టుకోవాల్సిన దుస్థితి! ఇక ప్రపంచకప్‌లో జట్టు పరిస్థితి మరీ తీసికట్టుగా ఉంది. 51 ఏళ్లుగా ఒక్క పతకం కూడా లేదు. బలమైన జట్లను పంపుతున్నామని చెబుతున్నా, మైదానంలోకి వచ్చేసరికి అవి తేలిపోతున్నాయి. తాజా ప్రపంచకప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు కీలక సమయాల్లో తడబడ్డాయి. ప్రతిభ ఉన్నా, ఒత్తిడిని జయించలేక రిక్తహస్తాలతో వెనుదిరిగాయి. అమ్మాయిలు సాధించిన అయిదో స్థానమే మన దేశానికి ఈసారి కప్‌లో మెరుగైన ప్రదర్శన అంటేనే ప్రమాణాలు ఎంతగా పడిపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఇక పురుషుల ఆట అంతంత మాత్రమే. ప్రపంచకప్ ముందు వరకు జట్టు కాస్త మెరుగైన ప్రదర్శనే చేసింది. ప్రో హాకీ లీగ్ లాంటి టోర్నీల్లో బలమైన నెదర్లాండ్స్, జర్మనీ లాంటి జట్లను ఓడించింది. ఎంతో పోటీ ఉండే ప్రపంచ కప్‌నకు వచ్చేసరికి తేలిపోయింది. సెమీస్ చేరడం పక్కనపెడితే కనీసం ఏడో స్థానం కూడా దక్కించుకోలేకపోయింది.

ఒకప్పుడు హాకీ పేరు చెబితే భారతదేశమే గుర్తుకొచ్చేది. ఇప్పుడదంతా చరిత్రగా మిగిలిపోయింది. జట్టు ఆటతీరు ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఇటీవలే కాస్త పుంజుకున్నట్లు కనిపించినా నిలకడ కొరవడింది. దూకుడు లోపించింది. తాజాగా హాకీ ప్రపంచకప్‌లో మన జట్టు ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. పతకం సంగతి పక్కన పెడితే, మన పురుషులు, మహిళల జట్లు కనీసం సెమీఫైనల్ కూడా చేరలేక చేతులెత్తేశాయి.

సమస్య ఎక్కడ ఉంది?

మిగిలిన క్రీడల మాదిరిగా హాకీని ముందుకు తీసుకెళ్లడంలో సమాఖ్య విఫలమైందనడంలో సందేహం లేదు. ఎందుకంటే క్రికెట్‌ను పిచ్చిగా ఆరాధించే మన దేశంలో హాకీకి ఇప్పటికీ విలువ ఉంది. గొప్పగా చెప్పుకొనే చరిత్ర ఉంది. వర్తమానం మాత్రం భిన్నంగా ఉంటోంది. ఆటలో లోపాలు కనిపిస్తున్నాయి. క్రీడాకారుల్లో ఒకప్పటి కసి, పట్టుదల లేవు. చాలా ఏళ్లుగా సీనియర్ జట్టులో ఆడుతున్న ప్లేయర్లే తాజాగా ప్రపంచకప్‌లోనూ పాల్గొన్నారు. మన్‌మీత్ సింగ్ లాంటి యువ ఆటగాళ్లకు చోటు దక్కలేదు. సీనియర్ జట్టుకు ప్రత్యామ్నాయంగా యువ జట్టును సిద్ధం చేయాల్సిన బాధ్యత మేనేజ్‌మెంట్ మీద ఉంది. కానీ కుర్రాళ్లకు ప్రోత్సాహం లేదు. వారిని ఎక్కువ టోర్నీలు ఆడించడంలేదు. చాలినన్ని శిక్షణ శిబిరాలు నిర్వహించడం లేదు. అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడి ఎలా ఉంటుందో యువ ఆటగాళ్లకు అనుభవంలోకి రావడం లేదు. దీంతో ప్రపంచ కప్‌నకు సీనియర్లనే ఎంపిక చేయాల్సి వచ్చింది. భారత జట్ల వైఫల్యం వెనక ఇది కూడా ఒక ప్రధాన కారణమే. మరోవైపు భారత్ నుంచి హాకీని అందిపుచ్చుకున్న ఐరోపా జట్లు దూసుకెళ్తున్నాయి. నెదర్లాండ్స్, అర్జెంటీనా, స్పెయిన్, జర్మనీ అదరగొడుతున్నాయి. ముఖ్యంగా నెదర్లాండ్స్ పురుషులు, మహిళల విభాగంలో తిరుగులేని శక్తిగా ఉంది. బలమైన దేహదారుఢ్యం ఉండటం కూడా ఐరోపా ప్లేయర్లకు అదనపు బలంగా ఉంటుంది. వాళ్ల స్థాయిలో లేకపోయినా ఫిట్‌గా ఉంటే మనం గట్టిగానే పోటీ ఇవ్వగలం. కానీ, సీనియర్ స్థాయిలో ఆడుతున్న ప్లేయర్లు అలా కనిపించడం లేదు. నైపుణ్యానికి కొరత లేకపోయినా, ఫిట్‌నెస్‌తో పాటు మానసిక బలం లోపించడం భారత్‌ను హాకీలో వెనక్కినెడుతోంది.

బడ్జెట్‌లో పెద్దపీట వేయాలి

ఒకప్పుడు భారత ఆటగాళ్లు గడ్డి మైదానాల్లోనే ఆడేవాళ్లు. ధ్యాన్‌చంద్ లాంటి దిగ్గజాలు స్టిక్‌తో ప్రత్యర్థిని మాయ చేసి గోల్ మీద గోల్ కొట్టేవాళ్లు. 1970 తర్వాత గడ్డి మైదానాల స్థానంలో ఆస్ట్రోటర్ఫ్‌లు రావడంతో భారత్ నెమ్మదిగా హాకీలో వెనకంజలో పడిపోయింది. ఆస్ట్రోటర్ఫ్ మైదానాల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావడమే ఇందుకు కారణం. హాకీ సంఘంలో రాజకీయాలు కూడా దేశీయంగా ఆటను కుదేలు చేశాయి. అయినప్పటికీ గత పదేళ్లలో కొంతమేర పుంజుకుంది. విదేశీ కోచ్‌లు రావడం, శిక్షణ కేంద్రాలు పెరగడంతో గత ఏడెనిమిదేళ్లుగా మళ్లీ ఊపొచ్చింది. కానీ, ఆ ఉత్సాహం అంతే వేగంగా చల్లారుతోంది. క్రమంగా ముమ్ముందుకు, పైపైకి వెళ్లాల్సింది పోయి, వేగంగా తిరోగమనం దిశగా సాగుతోంది. హాకీలో మళ్లీ ఇండియా స్వర్ణయుగాన్ని చూడాలంటే- దిగువ స్థాయిలో ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలి. బడ్జెట్‌లో ఈ క్రీడకు పెద్దపీట వేయాలి. దేశవాళీ టోర్నీలను పెంచి, యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించాలి. విదేశీ కోచ్‌ల పైనే ఆధారపడకుండా భారత దిగ్గజాలను కూడా ఆటలో భాగం చేయాలి. అప్పుడే ఒలింపిక్స్ స్థాయిలో భారత్ నుంచి ఒకప్పటి ఆటను ఆశించవచ్చు.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

చందమామ మన వెంటే...

హాయ్ ఫ్రెండ్స్. మనం రాత్రిపూట చందమామను చూస్తూ బోలెడు కబుర్లు చెప్పుకొంటాం కదా! 'అదుగో చూడు చందమామ నా వెంటే వస్తున్నాడు అంటే.. నా వెంటే వస్తున్నాడు' అని తెగ అల్లరి చేసేస్తాం. మరి చందమామ మన వెంట ఎందుకు వస్తున్నాడు? అసలు నిజంగానే మనం వెళ్లిన వైపే ప్రయాణిస్తాడా? తెలుసుకుందామా!

సాధారణంగా మనం ప్రయాణం చేసేటప్పుడు, నడుస్తున్నప్పుడు చెట్లు, స్తంభాలు, ఇళ్లు.. ఏవైనా వెనక్కి వెళ్తున్నట్లుగా అనిపిస్తాయి. ఎందుకంటే అవి మన కంటికి చాలా దగ్గరగా ఉంటాయి. అలాగే వాటి మీద మన దృష్టి కోణం కూడా చాలా వేగంగా మారిపోతుంది. దాన్ని మన మెదడు స్పష్టంగా గుర్తిస్తుంది. ఉదాహరణకు మనం కారులో ప్రయాణిస్తుంటే దగ్గరగా ఉన్న చెట్లు వేగంగా వెనక్కి పరిగెత్తినట్లుగా అనిపిస్తుంది. కాస్త దూరంగా ఉన్న భవనాలు, స్తంభాలు మెల్లగా కదులుతున్నట్లుగా కనిపిస్తాయి. అంటే మనం ప్రయాణం చేస్తున్నప్పుడు మన కంటికి కనిపించే వస్తువుల దూరాన్ని బట్టి, అవి వెనక్కి వెళ్లే వేగం మారుతుంది. దీన్నే 'పారలాక్స్ ఎఫెక్ట్' అంటారు. ఇక చందమామ విషయానికి వస్తే.. భూమికి చందమామ కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అంత ఎక్కువ దూరంలో ఉండటం వల్ల మనం రోడ్డు మీద ఎన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించినా, చందమామను చూసే దృష్టి కోణంలో మార్పు.. మనం గుర్తించలేనంత సూక్ష్మంగా ఉంటుంది. దాంతో.. 'చుట్టుపక్కల ఉన్నవన్నీ వెనక్కి వెళ్లిపోతున్నాయి.. చందమామ మనం ఎటు వెళ్తే, అటువైపే వస్తుంది' అనే భ్రమను మనకు మన మెదడు కల్పిస్తుంది. దీన్ని 'ఆప్టికల్ ఇల్యూజన్' అంటారు. అయితే సూర్యుడి విషయంలో కూడా ఇదే జరుగుతుంది. కానీ మనం సూర్యుణ్ని నేరుగా చూడలేం కాబట్టి, పెద్దగా పట్టించుకోము. ఇప్పుడు తెలిసిందా నేస్తాలూ చందమామ రహస్యం! ★

హాయ్! బుజ్జీ!!

గాడిదలు తల తిప్పకుండానే వాటి నాలుగు కాళ్లను ఒకేసారి చూడగలవు తెలుసా! కళ్లు కాస్త పక్కలకు ఉండటం వల్ల వాటి చూపు 300డిగ్రీల కంటే ఎక్కువ విశాలంగా ఉంటుందట. కొండల మీద నడుస్తున్నప్పుడు, వెనక నుంచి క్రూరమృగాలు వెంటాడుతున్నప్పుడు వాటిని అవి కాపాడుకోవడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది.

(c) eenadu

చారిత్రక నగరం.. ఆధునిక ఆభరణం

ఈనాడు, హైదరాబాద్: ఏకరూప పాలన, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి లక్ష్యంగా మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అంబర్‌పేట్‌లో మూసీపై నిర్మించిన మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి ఆయా కార్పొరేషన్ల కొత్త లోగోలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు శ్రీగణేష్, కాలేరు వెంకటేష్, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ ప్రియాంక, వీహెచ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్లు

- ప్రైవేటు, ఆర్మీ భూముల బదలాయింపులో జాప్యం
- రెండు ప్రాజెక్టుల పనులపై తీవ్ర ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల వైపు ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లు భూ గండంలో చిక్కుకున్నాయి. అనుకున్న సమయానికి ఆ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే ఇప్పటికే పనులు ప్రారంభం కావాలి. అయితే డిఫెన్సు, ప్రైవేటు భూములు పూర్తిస్థాయిలో హెచ్‌ఎండీఏ చేతికి రాకపోవడంతో అనుకున్న మేర పనులు ముందుకు సాగడం లేదు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ప్రైవేటు భూముల సేకరణకు సంబంధించి ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్-44 (డెయిరీఫాం) వైపు 5.40 కిలోమీటర్లు ఒక ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎస్‌హెచ్-01(శామీర్‌పేట్) వైపు మరొక ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ రెండు ప్రాజెక్టులకు చాలా వరకు రక్షణశాఖ, ప్రైవేటుకు సంబంధించి భూముల అవసరం ఉంది. కొన్ని చోట్ల కొంత భూమి సేకరించినా... ఇంకా చాలా ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉంది. ఎన్‌హెచ్44 కారిడార్‌లో పనులు కొంత ఊపందుకున్నప్పటికీ ఎస్‌హెచ్-01 కారిడార్‌లో ఇంకా ప్రాథమిక దశ దాటలేదు. భూ అప్పగింతలో జాప్యమే కారణమని అధికారులు చెబుతున్నారు.

రక్షణశాఖ భూములు ఇలా (రెండు ఎలివేటెడ్ కారిడార్లు కలిపి ఎకరాల్లో)

మొత్తం డిఫెన్స్ ల్యాండ్	ఇప్పటివరకు అప్పగించినది	ఇంకా అప్పగించాల్సింది
165.587	91.790	73.797

ఇదీ ప్రైవేటు భూముల పరిస్థితి...

ప్రాజెక్టు	మొత్తం ప్రైవేటు భూమి(ఎకరాల్లో)	ఇంతవరకు అప్పగించినది
ఎన్‌హెచ్-44(హైదరాబాద్)	9.07	-
ఎస్‌హెచ్-01(హైదరాబాద్)	22.37	0.04
ఎస్‌హెచ్-01(మేడ్చల్ మల్కాజిగిరి)	21.18	1.09
మొత్తం	52.62	1.13

ఎక్కడెక్కడ ఎలా..

- ఎన్‌హెచ్-44 కారిడార్‌కు సంబంధించి మొత్తం 5.40 కిలోమీటర్లలో 3.20 కిలోమీటర్ల మేరకు డిఫెన్స్ ల్యాండ్స్‌లో పనులు చేయాలి. ఇందులో 2 కిలోమీటర్ల వరకు రక్షణ శాఖ భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించారు. ప్రస్తుతం ఈ రెండు కిలోమీటర్ల మేరకు ఇప్పుడిప్పుడే పనులు ఊపందుకుంటున్నాయి. ఇంకా కిలోమీటర్ పరిధిలో భూముల అప్పగింత పూర్తి కాలేదు.
- ఇదే కారిడార్‌లో 1.6 కిలోమీటర్లు ప్రైవేటు భూములు ఉన్నాయి. ఆయా భూముల సమీకరణ పూర్తి చేసినా... ఇంకా అవార్డు పాస్ చేయాల్సి ఉంది. డిఫెన్స్ ల్యాండ్‌లో రక్షణ గోడలు నిర్మిస్తున్నారు.
- ఎస్‌హెచ్-01 కారిడార్‌లో 18.5 కిలోమీటర్లలో 9.813 కి.మీ. పరిధిలో రక్షణ శాఖ భూములు అవసరం కాగా.. ఇందులో 7.5 కి.మీ. వరకు ఆయా భూముల క్లియరెన్సు వచ్చింది. మిగిలిన భూమి విషయంలో సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.
- ఇదే కారిడార్‌లో ప్రైవేటు భూముల సేకరణ నత్తను తలపిస్తోంది. మొత్తం 8.327 కిలోమీటర్ల పరిధిలో పలుచోట్ల ప్రైవేటు భూముల అవసరం ఉంది. ఇప్పటివరకు 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రైవేటు భూముల సేకరణ పూర్తి చేశారు.

మీరాలం.. పర్యాటకానికి ఆలవాలం

ఐకానిక్ బ్రిడ్జ సహా పలు ఆకర్షణలు

ఈనాడు, హైదరాబాద్: మహానగరంలో కొత్త పర్యాటక ఆకర్షణలను అందుబాటులోకి తెచ్చేలా పర్యాటక శాఖ శ్రీకారం చుడుతోంది. నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందినవారు ఇక్కడికి వచ్చినప్పుడు విధిగా చూసేలా మీరాలం చెరువును ప్రత్యేక టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయనున్నారు. జూపార్కు సమీపంలోని ఈ తటాకాన్ని పర్యాటకం, ప్రకృతి, జల క్రీడలు, కుటుంబ వినోదానికి కేంద్రంగా రూపుదిద్దేలా సర్కారు చర్యలు చేపట్టింది. జాతీయ రహదారికి సమీపంలో కీలకమైన ప్రదేశంలో ఉండటంతో పాటు నగరంలోని ఏ ప్రాంతం నుంచి అయినా సులువుగా చేరుకునే అవకాశం ఉంది.

200 ఏళ్లకు పైగా చరిత్ర.. 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న మీరాలం చెరువు ఒకప్పుడు ప్రధాన తాగునీటి వనరు. ప్రస్తుతం దాన్ని పునరుజ్జీవింపజేసి చారిత్రక వారసత్వం, ప్రకృతి అందాలు, ఆధునిక వినోదాన్ని కలిపిన పర్యాటక కేంద్రంగా మార్చనున్నారు. ట్యాంక్‌ను పునరుజ్జీవనం చేసి, ట్యాంక్ చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధితో పాటు ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ వంతెన పూర్తయితే ట్యాంక్ అందాలను వీక్షించడానికి, నడకకు, ఫొటోగ్రఫీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటివరకు దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. బోటింగ్‌ను అందుబాటులోకి తీసుకురానుండగా వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజం అవకాశాలను పరిశీలిస్తున్నారు. కుటుంబంతో వచ్చే పర్యాటకులు రోజంతా గడిపేలా ఇక్కడ పర్యాటక ఆకర్షణలతో పాటు ఇతర వసతులు కల్పించనున్నారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. ప్లే ఏరియా, యాక్టివిటీ సెంటర్లు, వాకింగ్ ట్రాక్‌లు, రిలాక్సేషన్ జోన్లు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సదుపాయాలు, ఫుడ్ కోర్టులు ప్రత్యేక ఆకర్షణలు కానున్నాయి. పక్కనే జూపార్క్‌తో అనుసంధానాన్ని పరిశీలిస్తున్నారు.

వెంటాడిన మృత్యువు

- ఇన్నోవా ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు
- ఆసుపత్రికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మరో ప్రమాదంలో మృతి

రాయదుర్గం: మృత్యువు అతడిని వెంటాడింది. ఓ ప్రమాదంలో గాయాలతో బయటపడగా, అంతలోనే చోటుచేసుకున్న మరో ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ భూపతి కథనం ప్రకారం.. ఖాజాగూడ తౌటోనికుంట వద్ద సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి (35) రోడ్డు దాటుతున్నాడు. నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ వైపు నుంచి ఖాజాగూడ వైపు వెళ్తున్న ఇన్నోవా అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడ్డాడు. డ్రైవరు జైద్ షా కద్రి (21), అటుగా వెళ్తున్న మరో క్యాబ్ డ్రైవరు.. క్షతగాత్రుడిని పైకి లేపి చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. నడిచే స్థితిలో ఉన్న అతడిని పట్టుకుని రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో ఖాజాగూడ వైపు నుంచి నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ వైపు వేగంగా వెళ్తున్న రెండు కార్లు వారిని.. ఒకదాని తర్వాత మరోటి ఢీకొన్నాయి. ఘటనలో క్షతగాత్రుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

అడ్డంగా దొరికిపోతున్నారు!

- 32 ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు
- 5 నెలల్లో 6 లక్షలకు పైగా చలానాలు

ఈనాడు, హైదరాబాద్: చుట్టూ తిరగడం కష్టమని.. అడ్డదారిలో ప్రయాణిస్తున్నారా! ట్రాఫిక్ పోలీసులు లేరనే ధీమాతో ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారా! అయితే మీరు కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను అదుపు చేసేందుకు నిఘా నేత్రాలను అస్త్రంగా ప్రయోగిస్తున్నారు. ఏ వైపు నుంచి వెళ్లినా గుర్తించేందుకు వీలైన ప్రాంతంలో వాటిని అమర్చారు. తప్పని తెలిసినా చాలా మంది వాహనదారులు గమ్యం చేరేందుకు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ మృత్యువాత పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో జరిమానాలు విధించినా, అడ్డగించినా గొడవలకు దిగుతున్నారు. ట్రాఫిక్ రద్దీ, శాంతిభద్రతలకు కారకులవుతున్నారు. ఉల్లంఘనులపై సాంకేతిక అస్త్రం ప్రయోగించి సానుకూల ఫలితాలు రాబడుతున్నారు.

గాంధీభవన్- నాంపల్లి మార్గంలో రాంగ్‌రూట్‌లో వస్తూ..

జరిమానాతో మారుతున్నారిలా..

రాంగ్‌రూట్ రాకపోకలు సాగించే 100కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఎక్కువ వాహనాలు, ప్రమాదాలు జరుగుతున్న 32 మార్గాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అపసవ్య దిశలో ప్రయాణించే వాహనాలను ఫొటో తీసి వెంటనే వాహనదారులకు చలానా విధిస్తున్నారు. గోల్కొండ జోన్ పరిధిలో ప్రధానమైన మార్గంలో తొలి నెల 3వేలకు పైగా ఉల్లంఘనులను గుర్తించారు. కేసులు నమోదయ్యాక ఆ సంఖ్య ప్రస్తుతం 300లకు చేరాయి. ఏప్రిల్ - ఆగస్టు వరకు రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై సుమారు 6లక్షలకు పైగా చలానాలు విధించినట్లు సమాచారం. ట్రాఫిక్ పోలీసులు కనిపించకుండా, సీసీటీవీ కెమెరాల సాయంతో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల ఫోన్ నంబర్లకు చలానా సందేశం రావటంతో అప్రమత్తమవుతున్నారు. మరో 62 ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు.

వద్దంటే వినరు.. తప్పంటే గొడవలు

మాసబ్‌ట్యాంక్-మెహిదీపట్నం, టోలిచౌకి-రాయదుర్గం, రేతిబౌలి-మైలార్‌దేవ్‌పల్లి, పంజాగుట్ట-లక్డీకాపూల్, బేగంపేట్-సోమాజిగూడ, గుడిమల్కాపూర్-కార్వాన్, బషీర్‌బాగ్-అబిడ్స్, మలక్‌పేట్-చాదర్‌ఘాట్, కర్మన్‌ఘాట్- చాంద్రాయణగుట్ట, నారాయణగూడ-కాచిగూడ, బంజారాహిల్స్-మాదాపూర్, అమీర్‌పేట్- భరత్‌నగర్ తదితర ప్రధాన మార్గాల్లో నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటువంటి కీలకమైన ప్రాంతాల్లో రాంగ్ సైడ్ డ్రైవింగ్ ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. ఉల్లంఘనులను దారికి తెచ్చేందుకు ట్రాఫిక్ పోలీసులను కేటాయించినా ఆశించిన ఫలితం రాబట్టలేకపోయారు. నిత్యావసర వస్తువులు, ఆహారపదార్థాలు అందజేసేందుకు అధికశాతం డెలివరీ బాయ్స్ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా, అవగాహన సదస్సుల్లో నిబంధనలు పాటించమని సూచించినా పెడచెవిన పెడుతున్నారని పోలీసు అధికారి తెలిపారు.

భవిత తడబడి

సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్ ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలం చెత్త వాహనాలకు నిలయంగా మారింది. చెత్త డంపింగ్ చేసే టిప్పర్లు, ట్రాక్టర్లు నిలపడంతో దుర్వాసన తరగతి గదుల్లోకి వ్యాపిస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో నానాయాతన పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. - ఈనాడు, హైదరాబాద్

ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు భరోసా

- అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా శస్త్రచికిత్సలు
- అండగా డాక్టర్ అంబేడ్కర్ వైద్య సహాయ పథకం

ఈనాడు, హైదరాబాద్: ప్రాణాంతక వ్యాధులకు చికిత్సలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న దళితులు, గిరిజనులకు 'డాక్టర్ అంబేడ్కర్ వైద్య సహాయ' పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ సంయుక్తగా ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నాయి. ఎక్కువ మంది లబ్ధి పొందేలా కేంద్ర అధికారులు కొద్దిరోజుల క్రితం ఈ వైద్య సహాయ పథకంలో మార్పులు చేశారు. గుండె, మూత్రపిండాల శస్త్రచికిత్స, కీమో, రేడియో థెరపీ, బ్రెయిన్ సర్జరీ, అవయవ మార్పిడి, వెన్నెముక శస్త్ర చికిత్సలను ఉచితంగా పొందొచ్చు. రూ.5 లక్షల వరకూ వార్షికాదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీలు ఈ పథకానికి అర్హులు. దిల్లీ ఎయిమ్స్ సహా రాష్ట్రాల్లోని ఎయిమ్స్ ఆసుపత్రులు, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ, జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్సలు పొందేందుకు అవకాశాలున్నాయి.

- గుండె శస్త్రచికిత్స... రూ.1.50 లక్షలు
- మూత్రపిండాలు, అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు– 3.50లక్షలు
- కీమో/రేడియో థెరపీ– రూ.2.50 లక్షలు
- బ్రెయిన్ సర్జరీ– రూ.2 లక్షలు. ఇతర ప్రాణాంతక వ్యాధులకు- రూ.2 లక్షలు.
- శస్త్రచికిత్స అవసరమైన రోగులు ఆర్థిక సహాయం కోసం వారు చికిత్స పొందుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సంతకంతో ఖర్చు వివరాలను దరఖాస్తుతో పాటు జతపరచాలి.
- బాధితుల ఆరోగ్య పరిస్థితి, శస్త్రచికిత్స అవసరం ఆధారంగా కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ అధికారులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ సభ్యులు అనుమతి ఇస్తారు.
- అనుమతి వచ్చిన గంటల వ్యవధిలో శస్త్రచికిత్స ఖర్చు మొత్తం సంబంధిత ఆసుపత్రి బ్యాంకు ఖాతాలో జమ వుతుంది.

తపాలా ద్వారా దరఖాస్తులు పంపండి

-మను చౌదరి, జిల్లా కలెక్టర్, మేడ్చల్

ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్నవారు తపాలా ద్వారా దరఖాస్తులు పంపించాలి. దరఖాస్తు ఫారాలను http://dosje.gov.in/contact-us/ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

బస్సుల్లోనూ అగ్లా స్టేషన్..

ఎలక్ట్రిక్ బస్సుల్లో 'స్టేజీ అనౌన్స్‌మెంట్'లు

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణికులకు అత్యాధునిక ప్రయాణ అనుభూతిని అందించడంతో పాటు, స్థిరమైన టికెట్లేతర ఆదాయం సమకూర్చుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో డిజిటల్ అడ్వర్టయిజింగ్ తెరలను ఏర్పాటు చేస్తోంది. 'రూట్‌వేవ్' అనే సంస్థతో ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకుంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా హయత్‌నగర్-2 డిపోలోని పది బస్సుల్లో వీటిని ఏర్పాటు చేసింది. వచ్చే ఫలితాలు, ప్రయాణికుల స్పందన ఆధారంగా మిగిలిన డిపోల పరిధిలో విస్తరించనున్నారు.

ప్రకటనలతో పాటు స్టేజీల వివరాలు: రద్దీగా ఉండే లాంగ్ రూట్లలో ఒకటైన హయత్‌నగర్ - పటాన్‌చెరు మార్గాన్ని ఆర్టీసీ ఎంపిక చేసింది. గతంలో కేవలం వినోదం, ప్రకటనలు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు సరికొత్త ఇన్ఫోటైన్‌మెంట్ టెక్నాలజీని వీటిలో వాడుతున్నారు. ప్రకటనలే కాకుండా, ప్రయాణికులకు ఉపయోగపడేలా మెట్రోరైల్ తరహా 'స్టేజీ అనౌన్స్‌మెంట్‌లు' (రాబోయే స్టాప్ వివరాలు) వస్తాయి.

IN THE COURT OF THE CITY CIVIL AND SESSIONS JUDGE MAYO HALL (CCH-21) AT BENGALURU
O.S.No.25323/2021
BETWEEN: SHOBHA SRINIVAS REDDY
Aged about 48 years, D/O Late T. Srinivasa Reddy R/at No.330, G Block, Sumadhura Srinivasam, ITPL Road, Next to Euro school Mahadevapura, Bengaluru-560048. ...Plaintiff
AND
SOBHA BOLLU AND ANOTHER ... Defendants
NOTICE TO THE DEFENDANT NOS.1 AND 2 UNDER ORDER V RULE 20 (1-A) OF CIVIL PROCEDURE CODE
To, 1. SOBHA BOLLU,
Aged: Major, W/o Sanjeev Rao
2. SANJEEV RAO, Aged: Major
S/o Not known to the plaintiff
Both are R/at Apartment No.104, Hill Ridge Springs, Block 6, Gachibowli, Hyderabad-500032
WHEREAS, the above named plaintiff has filed the above suit against the defendant Nos.1 and 2 to pay a sum of Rs.59,333/- towards arrears of rent together with interest at 16% per annum from 09.10.2020; to pay a sum of Rs.75,000/- towards repainting and restoration of the schedule premises as per the terms of the lease agreement; to pay a sum of Rs.1,40,300/- being the value of the Apple iPhone 11 Pro forcibly snatched by the defendants, or in the alternative to procure and deliver an Apple iPhone 11 Pro of equivalent value to the plaintiff; to award damages of Rs.96,000/- and for such other reliefs.
The defendant Nos.1 and are hereby summoned to appear before this Court on 17th day of Sep 2026 at 11.00 a.m. in person or through advocate/pleader to answer the questions to the same. Take notice that, in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined ex-parte.
Given under my hand and seal of the Court, this 29th day of August, 2026.
SCHEDULE
Flat No. A 402, 4th Floor, A Block in the apartment complex 'Sumadhura Vasantham', Opposite Shell Petrol Bunk, Hoodi, Bengaluru 560 048. and consisting of three bedrooms with attached bathrooms, living room, dining hall, kitchen & balcony along with basement car park along with the following fitting and fixtures:
a. Bedroom Wardrobes with dressing table and mirror
b. Kitchen cabinets
c. Geyser-3 Nos.
d. Ceiling fan-5 Nos.
e. Tube light fitting-5 Nos.
f. CFL bulbs-5 Nos.
g. Bathroom exhaust fan-4 Nos.
h. Curtain rods with fittings-5 Nos.
By Order of the Court Deputy Registrar
City Civil Court Mayo Hall Unit, Bengaluru
Advocate for Plaintiff: SRI. S.RAJASHEKAR, 1st Floor, 'Jathi', No.28. N.S. Iyengar Street, Kumar Park, Sheshadripuram, Bengaluru-560020.

ఆశల లాటరీ

7,340 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' పథకంలో 7,340 ఫ్లాట్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యింది. తొలి విడత ప్రకటించిన 16 నియోజకవర్గాల్లో 15 సెగ్మెంట్లలో 480 మంది చొప్పున ఎంపిక చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో 140 ఇళ్లే నిర్మించనుండటంతో అంతే మందిని డ్రా ద్వారా తీసుకున్నారు. ఎంపికైన వారు తప్పుకొన్నా, తుది విచారణలో తొలగింపునకు గురైనా.. వారి స్థానంలో మిగతా వారికి అవకాశం కల్పించేందుకు ప్రతి నియోజకవర్గం నుంచి 20శాతం చొప్పున అర్హులను లాటరీ ద్వారానే ఎంపిక చేసి 'నిరీక్షణ జాబితా' కింద పెట్టారు. సనత్‌నగర్, మహేశ్వరం, కార్వాన్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన తుది లాటరీ ప్రశాంతంగా ముగిసిందని హౌసింగ్ బోర్డు పేర్కొంది.

ఆన్‌లైన్‌లో అభ్యంతరాలకు అవకాశం.. లాటరీలో ఎంపికైన వారి వివరాలను tghb.telangana.gov.in లో అందుబాటులోకి తెస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్ తెలిపారు. ఎంపికైన వారిలో ఎవరైన అనర్హులు ఉన్నట్లు ఆధారాలు ఉంటే వారిపై అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ప్రజలకు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యంతరాలు బోర్డు వెబ్‌సైట్‌లోనే పేర్కొనాలని సూచించారు. దరఖాస్తుదారులు తమ వివరాలను సరిదిద్దుకోవాలన్నా వెబ్‌సైట్‌లో ఆ వీలు కల్పించినట్లు తెలిపారు.

క్షేత్రస్థాయి విచారణ.. ఎంపికైన వారి వివరాలు పరిశీలించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అధికారులు వచ్చిన సమయంలో కుటుంబ వివరాలు, నివాసం, ఆదాయం, కుల ధ్రువపత్రాలు చూపించాల్సి ఉంటుంది. అన్నీ సరైనవిగా నిర్ధారించుకున్నాకే ఇళ్ల కేటాయింపు ఖరారు చేయనున్నారు.

అర్హులకే ఇల్లు దక్కాలని బహుళ తనిఖీలు

వీపీ గౌతమ్, వైస్‌ఛైర్మన్, హౌసింగ్ బోర్డు

లాటరీలో ఎంపికైన వారు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చే అధికారులకు సహకరించాలి. అవసరమైన పత్రాలు చూపించాలి. అర్హులకు ఇల్లు దక్కాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలనే బహుళ అంచెల తనిఖీలు ఏర్పాటు చేశాం. ఇప్పుడు ఎంపికకాని వారు నిరుత్సాహపడొద్దు. ఇది తొలి విడతే.. అర్హులైన అల్పాదాయ కుటుంబాలకు సొంతిల్లు అందించడం నిరంతరం ప్రక్రియ.

పొగమంచి నీరు

ముగ్గురు యువ ఇంజినీర్ల సృజనాత్మక ఆలోచన

డి.రిత్విక్

మహ్మద్ ఎజాజ్

మంచు నుంచి నీటి చుక్కలను ఆకర్షిస్తూ..

హాంసానికా రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పొగమంచు నుంచి నీరు తీసుకుందామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గిద్దామని నగరానికి చెందిన ముగ్గురు యువ ఇంజినీర్లు డి.రిత్విక్, మహ్మద్ ఎజాజ్, హాంసానికా రెడ్డి అంటున్నారు. సామ్‌సంగ్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సాల్వ్ ఫర్ టుమారో' పోటీల్లో సెమీ ఫైనల్‌కు ఎంపికైన ఈ ముగ్గురు నీటి పొదుపుపై ఒక ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. మేడ్చల్‌లోని ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదివిన వీరు... ఈ పోటీ గురించి తెలుసుకుని తమ ప్రాజెక్ట్ వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి 26 బృందాలు పోటీపడ్డాయి. మిస్టిఫై పేరుతో వీరు సమర్పించిన ప్రాజెక్ట్ సెమీఫైనల్ పోటీలకు ఎంపికైంది. వీరి ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేందుకు సామ్‌సంగ్ సంస్థ రూ.8 లక్షలు ఇవ్వడంతో పాటు ఒక్కొక్కరికీ ఒక్కో ల్యాప్‌టాప్ బహూకరించింది. రూ.8 లక్షలతో ముగ్గురు యువ ఇంజినీర్లు నీటి పొదుపుపై వినూత్న ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు.

చదువుకునే రోజుల్లో.. పొగమంచు నుంచి నేరుగా నీరు తీసుకునే పరికరాన్ని తాము తయారు చేశామని ఈ యువ ఇంజినీర్లు తెలిపారు. తాము చదువుకుంటున్నప్పుడు గాల్లోంచి నీరు తీసే పరికరాల గురించి విన్నామని, పొగమంచుతో నీటిని ఎందుకు తయారు చేయకూడదు? అన్న ప్రశ్న వేసుకున్నామని వివరించారు. ముగ్గురం కలిసి కళాశాలలో దీని గురించి ఆలోచించామని, ఏడాది పాటు శ్రమించి 'హైడ్రిఫ్ట్' పేరుతో ఒక పరికరాన్ని రూపొందించామని సౌర విద్యుత్‌తో పనిచేసే ఈ పరికరం పొగమంచులోంచి నేరుగా నీటిని తీస్తుందన్నారు. పొగమంచు కురిసే ప్రాంతాల్లో పరికరాన్ని ఏర్పాటు చేస్తే నీటి చుక్కలను ఆకర్షిస్తుందని తెలిపారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our HYDERABAD BRANCH.

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT C	50	30,000	15,00,000
FT WA	40	2,50,000	1,00,00,000
FT VZ	40	1,25,000	50,00,000
FT Z	40	25,000	10,00,000
FT N	40	12,500	5,00,000

Please contact Branch Manager Mr.SRISHAILAM, Sr.Manager for further details. Mobile Nos. 9959224364, Landline: 040-23423950, 040-23442150/ 51/ 52.

ఈనాడు
దినపత్రికలో అన్నిరకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు 99635 22257
అమీర్‌పేట్ డివిజన్ 80085 97633
ఎల్.బి.నగర్ డివిజన్ 90000 15736
కూకట్‌పల్లి డివిజన్ 80085 15142
క్లాసిఫైడ్స్ యాడ్స్ కొరకు : 9908016959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
9000239943, 9000239928
9000239948, 8008611167

ముగిసిన అధ్యయనోత్సవాలు

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గత నెల 29 (శనివారం) నుంచి ప్రారంభమైన శ్రీవారి అధ్యయనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం ఆళ్వారాదులకు తిరుమంజనోత్సవం, ప్రబంధ సేవా కాలం, ఆరగింపు, తీర్థ ప్రసాదగోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు : శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సెప్టెంబరు 1 నుంచి 4 వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 5 నుంచి శ్రీ శత చండీ సహిత మహా రుద్రయాగాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ తెలిపారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

తనువు చాలించి.. నలుగురికి కొత్త జీవితాన్నిచ్చి

నిమ్స్, న్యూస్‌టుడే : జీవన్మృతుడైన ఓ యువకుడి అవయవ దానం.. నలుగురికి పునర్జన్మను ప్రసాదించింది. నగరంలోని అల్వాల్ యాప్రాల్ బాపూజీనగర్‌కి చెందిన విశాల్(25).. తండ్రి చేసే వ్యాపార నిర్వహణలో అండగా ఉండేవారు. గత నెల 23న తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయారు. కుటుంబ సభ్యులు అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్ (జీవన్మృతుడు) అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌వోటీటీవో తెలంగాణ (రాష్ట్ర, అవయవ, కణజాల మార్పిడి సంస్థ - జీవన్‌దాన్) వైద్య బృందం విశాల్ తండ్రి బాలు, కుటుంబ సభ్యులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో గుండె, రెండు కిడ్నీలు, కాలేయం సేకరించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు శస్త్రచికిత్స ద్వారా అమర్చినట్లు నోడల్ అధికారి ప్రొఫెసర్ శ్రీభూషణ్‌రాజు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
యూసుఫ్‌గూడ	80085 73352
బంజారాహిల్స్	80085 73348
ఫిల్మ్‌నగర్	80085 73346
పంజాగుట్ట	8008573350
రహ్మత్‌నగర్	80085 73351
షేక్‌పేట	80085 73413

బంజారాహిల్స్, న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ రోడ్డు నం.1లోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలోని హైమాస్ట్ దీపాల్లో.. ఒక్క దీపమే వెలుగుతోంది. ఈ ప్రాంతంలో వెలుగు తక్కువగా ఉంటుంది. సమస్యను పరిష్కరించండి. – వీరస్వామి

✓ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– మోహన్‌రావు, జీహెచ్ఎంసీ ఏఈ

వీధి దీపాలకు మరమ్మతులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. జీహెచ్ఎంసీ ఏఈ మోహన్‌రావు స్పందించి పోలీస్ స్టేషన్ వీధితోపాటు పరిసర ప్రాంతాల్లోని వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

రక్షణ చర్యలు లేక.. ప్రాణాపాయం తప్పక

ప్రమాదాలకు నిలయాలుగా విద్యుత్తు నియంత్రికలు

ఫిల్మ్‌నగర్ రౌండ్ టేబుల్ స్కూల్ ముందు..

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: ఫిల్మ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్తు నియంత్రికల వద్ద రక్షణ చర్యలు లేక ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మరి కొన్ని ప్రదేశాల్లో తీగలు కిందికి వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఫిల్మ్‌నగర్, ఎమ్మెల్యే కాలనీ, గౌతంనగర్, భగత్‌సింగ్‌కాలనీ, దుర్గాభవానీనగర్, వినాయక్‌నగర్, ఎంజీనగర్, బసవతారకనగర్, బీజేఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ తదితర బస్తీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. దీంతో కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఒకరు మృతిచెందినా.. ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ గేటు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగిలి గతంలో ఒకరు మృతి చెందిన ఘటనను స్థానికులు గుర్తు చేస్తున్నారు. కొందరు మృత్యువు ఒడిలోకి వెళ్లి బయట పడిన ఘటనలూ ఉన్నాయి. అయినప్పటికీ నియంత్రికల వద్ద రక్షణ చర్యలపై దృష్టి పెట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఫిల్మ్‌నగర్‌లోని రౌండ్ టేబుల్ పాఠశాల ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ చర్యలు లేక విద్యార్థులు భయపడుతున్నారు. వర్షాకాలంలో ముప్పు మరింత పెరుగుతోందంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నీరు చేరినా, తీగ తెగిపడినా ప్రమాదం తప్పదని భయపడుతున్నారు. కొందరు వీటి పక్కనే చిరు వ్యాపారాలు చేసుకుంటుండగా, చిన్నారులు, వృద్ధులు నిత్యం ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.

గౌతంనగర్‌లో ప్రమాదకరంగా నియంత్రికలు, పక్కనే చిరు వ్యాపారులు

ఇంకెప్పుడు మేల్కొలుపు.. ప్రమాదాలు జరగక ముందే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు పలు మార్లు ఫిర్యాదులు చేసినా విద్యుత్తు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి చుట్టూ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న తీగలను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. 'ప్రాణం పోయాక పరిహారం రాదు.. పోకముందే రక్షణ కావాలి' అని కోరుతున్నారు.

హత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న నర్సింగ్ ఆఫీసర్లు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే : మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతిపై హత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (టీఎన్‌వోడబ్ల్యూఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం రాత్రి హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో నర్సింగ్ ఆఫీసర్స్ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. నర్సుపై అఘాయిత్యానికి పాల్పడి, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో నర్సింగ్ సిబ్బందికి భద్రత కల్పించాలని, ప్రతి ఆసుపత్రి డ్యూటీ స్టేషన్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, నర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక భద్రత చట్టం తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నర్స్ పనిచేసిన ప్రైవేటు ఆసుపత్రిని ప్రభుత్వం సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

కదిరావన్ పలనికి వినతిపత్రం ఇస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్ కమల్ రెడపాక డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కదిరావన్ పలనిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజ్‌కమల్ రెడపాక మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేటు కళాశాలల్లో చదువు పూర్తి చేసుకున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆయా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పిల్లి సంజయ్, సైదులు, పి.నర్సింగ్‌రావు, మల్లేష్, హర్షవర్ధన్, మోదీ రమేశ్, యాకూబ్ పాషా, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్‌బాబు ఫౌండేషన్‌తో బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ భాగస్వామ్యం

అబిడ్స్, న్యూస్‌టుడే: ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్, మహేశ్‌బాబు ఫౌండేషన్ మధ్య సాంకేతిక భాగస్వామ్యం కుదిరింది. ఈ విషయాన్ని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. సమాజ ఆరోగ్య, వెల్‌నెస్ కార్యక్రమాలకు మద్దతుగా బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ రూపొందించిన 'బ్లూహెల్త్' ప్లాట్‌ఫామ్‌ను వినియోగించేందుకు ఈ భాగస్వామ్యం ఏర్పడింది. దీన్లో తొలి కార్యక్రమంగా ఆగస్టు 31న 'జీఎంబీ లైఫ్' పేరుతో నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు, వెల్‌నెస్ సేవల కోసం ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించారు. తర్వాతి దశలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో బ్లూహెల్త్ ఆధారిత ఆరోగ్య కియోస్క్‌లను ఏర్పాటు చేయాలని బ్లూ క్లౌడ్ సాఫ్టెక్, మహేశ్‌బాబు ఫౌండేషన్ నిర్ణయించాయి.

భారతీయ సంస్కృతి మహోన్నతం

కళాకారులకు జ్ఞాపికలు అందజేసిన అతిథులు డా.వ్యాసకృష్ణ, లంక లక్ష్మీనారాయణ, పాలపర్తి సంధ్యారాణి తదితరులు

రవీంద్ర భారతి, న్యూస్‌టుడే : భారతీయ సంస్కృతి మహోన్నతమైందని, ప్రపంచ దేశాలు కూడా ఇప్పుడు అనుసరిస్తున్నాయని ఉగాండాలోని.. ఉగాండా (కంపాల) తెలుగు సంఘం ప్రతినిధి డా.వ్యాసకృష్ణ బూరుగుపల్లి అన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో తత్వ అకాడమీ, తరంగిణి సంస్థ సహకారంతో శ్రీఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో 'శ్రావణ సౌరభాలు' ప్రత్యేక సాంస్కృతికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి వ్యాసకృష్ణ మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తున్న శ్రీఆకాంక్ష సంస్థ నిర్వాహకులను అభినందించారు. యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షోపన్యాసం చేస్తూ.. కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిర్వాహకురాలు పాలపర్తి సంధ్యారాణి పర్యవేక్షించారు. తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు, గాయకులు వినుత, ప్రీతి, రవి, శంకర్, రాధారాణి పాటలను అద్భుతంగా పాడారు. మోహన్ కృష్ణ, సుబ్రహ్మణ్యం, రమణ, ఎల్ఎస్ఆర్ మూర్తి, రామచంద్రమూర్తి తమ హాస్యవల్లరితో కడుపుబ్బా నవ్వించారు. కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

టిఫిన్ సెంటర్‌లో ఘర్షణ

నారాయణగూడ: బిల్లు విషయంలో ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కస్టమర్ల మధ్య జరిగిన వాగ్వాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటన నారాయణగూడ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీవాణి కథనం ప్రకారం.. హిమాయత్‌నగర్ వీధి నంబరు 12లో నివాసముండే ఆశీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి నారాయణగూడలోని బత్తడ్ కీ ఇడ్లీ సెంటర్‌కు వచ్చారు. అక్కడే టిఫిన్ చేస్తూ.. తన సోదరీమణులతో రాఖీలు కట్టించుకుంటుండగా టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు యోగేశ్ బత్తడ్ అభ్యంతరం చెప్పారు. ఇతర కస్టమర్లకు ఇబ్బంది కలుగుతుందని చెప్పడంతో అదనంగా కొంత చెల్లిస్తామని ఆశీష్ చెప్పారు. దీంతో టిఫిన్‌కు రూ.5 వేలు, అదనంగా రూ.3 వేలు కలిపి మొత్తం రూ.8 వేలు బిల్లు వేశారు. అదనంగా ఇస్తామంటే ఏకంగా రూ.3 వేలు ఏంటని ఆశీష్ ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో టిఫిన్ సెంటర్ సిబ్బంది వచ్చి ఆశీష్ కుటుంబ సభ్యులను దూషిస్తూ.. బయటకు గెంటివేశారు. యోగేశ్ సోదరుడు రితేష్ బత్తడ్ ఆశీష్, అతడి సోదరుడిపై దాడి చేయడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ టిఫిన్ సెంటర్‌లో మూడు గంటల పాటు గడిపి తమ కస్టమర్లకు ఇబ్బంది కలిగించారని యోగేశ్ కూడా ఫిర్యాదు చేశారు.

గురుకులంలో ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే: హెచ్ఆర్‌సీ

నారాయణగూడ, న్యూస్‌టుడే: జులై 23న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్ఆర్‌సీ) సూమోటోగా విచారణ చేపట్టింది. దీనిపై జిల్లా కలెక్టర్ కమిషన్‌కు నివేదికను సమర్పించారు. అందులో బాధిత విద్యార్థినులకు చికిత్సం అందించామని, పిల్లలంతా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. వైద్య పరీక్షల్లో పిల్లల అస్వస్థతకు వారు తీసుకున్న ఆహారం, ఇతర తీవ్ర ఆరోగ్య సమస్యలేవి నిర్ధారణ కాలేదన్నారు. దీనిపై కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్పందిస్తూ.. విద్యార్థులకు అందించే ఆహారం తయారీ, వడ్డించే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిర్దేశిత ఆరోగ్య పదార్థాలు, పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా హాస్టల్ అధికారులను ఆదేశించి, చర్యలు చేపట్టాలని సిఫార్సు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కమిషన్ ఛైర్మన్ ఆదేశించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు విరాళం బాండు అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వెంకట శివప్రసాద్‌రెడ్డి రూ.1,00,116 మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడుకు సోమవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు.

హనుమాన్ దేవాలయంలో అన్నదానం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే : బంజారాహిల్స్ రోడ్డు నం.1లోని హనుమాన్ దేవాలయంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ ప్రాంగణంలోనే శివాలయం సహా ఎనిమిది ఆలయాలు ఉన్నాయి. శ్రావణ మాసం పూజల నేపథ్యంలో ఆలయ కమిటీ ఛైర్మన్ దయానంద్ ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బంజారాహిల్స్ : యువతి అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బంజారాహిల్స్ సింగాడికుంట ప్రాంతానికి చెందిన యువతి కొండాపూర్‌లోని ఓ కార్యాలయంలో ఉద్యోగం చేస్తోంది. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఉద్యోగం చేసేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. ఉదయం 7.30 గంటల సమయంలో ఆ యువతి ఉద్యోగం చేసే కార్యాలయం సూపర్‌వైజర్.. ఆమె ఇంటికి ఫోన్‌చేసి కార్యాలయానికి రాలేదని సమాచారం ఇచ్చారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు యువతికి ఫోన్ చేయగా అందుబాటులో లేదు. ఆచూకీ దొరకకపోవటంతో యువతి తల్లి బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బహుభాషా కోవిదుడు ఆదిభట్ల నారాయణదాసు

మాట్లాడుతున్న నాయుడు సత్యనారాయణ. చిత్రంలో జయరాములు, హనుమంతరావు, కళా జనార్దనమూర్తి, గీతాదేవి

గాంధీనగర్ , న్యూస్‌టుడే: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు హరికథలో గొప్ప విద్వాంసుడని తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం రాత్రి గుండవరపు హనుమంతరావు హాలులో నారాయణదాసు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నారాయణదాసు బహుభాషా కోవిదుడని కొనియాడారు. తెలుగునాటనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలు చూరగొన్నారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు జయరాములు, ఎస్వీ శ్రీరామభట్టర్, హనుమంతారావు, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారులకు వీడ్కోలు

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందితో అదనపు సీపీ ఎం.శ్రీనివాస్ తదితరులు

బంజారాహిల్స్, రహ్మత్‌నగర్: హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తించి, పదవీ విరమణ పొందిన 21 మంది పోలీస్ అధికారులకు ఆ శాఖ సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు సీపీ (క్రైమ్స్ అండ్ సిట్) ఎం.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని పదవీవిరమణ పొందిన అధికారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. సొసైటీ తరఫున రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందించారు. డీసీపీ (అడ్మిన్) వెంకటలక్ష్మి, ఏవో యాదగిరి, జూనియర్ ఏడీవో మహమ్మద్ ఇస్మాయిల్, సొసైటీ ఉపాధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ ఖాన్, కోశాధికారి జీఎంఎస్ విక్టర్, డైరెక్టర్లు రత్నకుమారి, శాంతి, లక్ష్మణ్ కుమార్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన బోరబండ ఎస్సై దీప్ కౌర్‌ను బోరబండ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

విద్యుత్తు శాఖ కార్యాలయంలో..

ఖైరతాబాద్: విద్యుత్తు సంస్థల్లో పని చేస్తున్న ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందారు. వారిని ఆయా విభాగాల్లో ఘనంగా సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్‌పీడీసీఎల్ సీఎండీ, రెడ్కో వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ పుష్పగుచ్ఛం, ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆర్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.ఎన్.నరసింహులు, చీఫ్ ఇంజినీర్ శ్రవణ్ కుమార్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కార్యశాలలో పాల్గొన్న డా.మురళీకృష్ణ, అధ్యాపకులు

షేక్‌పేట,న్యూస్‌టుడే: అధ్యాపకులు ఏఐ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మరింత ఉత్తమంగా బోధించవచ్చని ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఫొటోగ్రామెట్రి అండ్ రిమోట్ సెన్సింగ్ (ఐఎస్‌పీఆర్ఎస్) ఛైర్మన్, జేఎన్‌టీయూ మాజీ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డా.మురళీ కృష్ణ అన్నారు. సోమవారం షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు కాంపోజిట్ ఏఐ ఫ్రం డేటా ఫ్యూజన్ టు డెసిషన్ ఇంటెలిజెన్స్ ఇన్ స్మార్ట్ సిటీస్, హెల్త్ కేర్, ఇండస్ట్రీ అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కార్యశాలను ప్రారంభించి మాట్లాడారు. వివిధ వనరుల నుంచి లభించే డేటాను సమన్వయం చేసి మెరుగైన నిర్ణయాలు తీసుకోవడంలో కాంపోజిట్ ఏఐ కీలకంగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ ప్రిన్సిపల్ డా.కె.రమేశ్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు కె.రాగిణి, డా.ఎల్‌బీ రాజ్‌కుమార్, డా.టి.సునీత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభ 16న

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, బస్సు పాస్ కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. ఈ మేరకు ఈనెల 16వ తేదీన కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు భారీ సంఖ్యలో ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రహీం, కన్వీనర్ చందనాయక్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేశ్, ప్రతినిధులు గడ్డ యాదయ్య, కందుల శ్రీను పాల్గొన్నారు.

ద్వారకాపురి కాలనీలో భారాస నేతల పర్యటన

సోమాజిగూడ: ఎర్రమంజిల్ డివిజన్‌లోని ద్వారకాపురి కాలనీలో భారాస నేతలు పర్యటించారు. సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా పార్టీ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించి పలు సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలపై జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నాగార్జున సర్కిల్ పూల దుకాణాల చెంత ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు కేబుళ్ల సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. నాయకులు నిశాంత్ ముదిరాజ్, రవి కిశోర్, బిట్ల శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుండా మోసం.. కేసు నమోదు

యూసుఫ్‌గూడ: ట్రావెల్స్ సేవలను పొంది బిల్లులు చెల్లించకుండా మోసం చేసిన సంస్థపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట్‌లో ఉండే రిషి అండ్ లక్ష్య ట్రావెల్స్ సంస్థ గచ్చిబౌలిలోని జ్యోలో సంస్థకు ట్రావెల్స్ సేవలను అందిస్తోంది. వాటికి సంబంధించి రూ.8.48 లక్షల బకాయిలు ఉన్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి అనురాధ మధురానగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి పేరిట రూ.16 లక్షల టోకరా

యూసుఫ్‌గూడ: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందొచ్చని నమ్మించి రూ.16 లక్షలు కాజేసిన వ్యక్తిపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సనత్‌నగర్‌కు చెందిన చంద్ర కోటేశ్వర్‌రావు 2024-25 మధ్య కాలంలో ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో అద్దెకున్న సమయంలో పద్మారావునగర్‌కు చెందిన అబ్దుల్ మాజిద్‌తో పరిచయం ఏర్పడింది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడిపెడితే అధిక లాభాలను పొందొచ్చని కోటేశ్వర్‌రావును నమ్మించాడు. 2024 ఏప్రిల్‌లో అబ్దుల్ మాజిద్‌కు రూ.16 లక్షలు ఇచ్చాడు. అదే నెల 19న నకిలీ షేర్ పత్రాలను కోటేశ్వర్‌రావుకు అంటగట్టాడు. ఆ షేర్లు నకిలీవని తెలుసుకున్న కోటేశ్వర్‌రావు తన డబ్బు తిరిగిచ్చేయాలని అడగగా దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో కోటేశ్వర్‌రావు మధురానగర్ పోలీసులను ఆశ్రయించాడు.

బోడకాకర.. తినండి కరకరా

ఆగాకరకాయలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: వర్షాకాలం వచ్చిందంటే కూరగాయల మార్కెట్‌లో, తోపుడు బండ్ల మీద కాకరకాయ పోలికలతో ఆకుపచ్చరంగులో చిన్నగా గుండ్రంగా లేదా కోలగా ఉండి పైభాగంలో మృదువైన ముళ్లు, కుచ్చులుగా కనిపించే 'ఆగాకరకాయ' గురించి ఎంత మందికి తెలుసు. అదేనండి వాడుకలో 'బోడకాకర, ఆకాకర, బొంత కాకర, అడవి కాకర', 'కకోడా', ఆంగ్లంలో 'స్పైనీ గోర్డ్, టీసెల్ గోర్డ్' ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. ఇది కాకరకాయలాగున్నా.. చేదుగా ఉండదు. సాధారణంగా జూన్ నుంచి అక్టోబరు వరకు ఇవి దొరుకుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.200 వరకు ధర పలుకుతోంది. విటమిన్‌లు, ఖనిజాలు, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వీటిని తినడం వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు ఆయుర్వేద వైద్యనిపుణుడు శ్రీనివాస్‌రావు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పండే ఈ రకమైన కాకరకాయను ప్రస్తుతం రైతులు నగరానికి తీసుకొచ్చి అమ్ముతున్నారు. నగరంలోని రైతుబజార్లు, కూరగాయల మార్కెట్లతో పాటు తోపుడు బండ్లపై నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. వీటితో వేపుడు చేసుకోవచ్చు, కూరగా వండుకోవచ్చు. పచ్చడి కూడా చేసుకోవచ్చు.

వీటిని వండినప్పుడు మాత్రం ఆహ్లాదకరమైన, మట్టి వాసనతో కూడిన రుచి ఉంటుంది.

ఆరోగ్య ప్రయోజనాలు ఇవి

● రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించడానికి సహాయపడుతుంది. అందువల్ల మధుమేహంతో బాధపడేవారికి ఎంతో ఉపయోకరమైంది. ● ఇందులో ఫైటో-న్యూట్రియంట్లు, విటమిన్-సి, ఫోలేట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఇది రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. కాలానుగుణంగా వచ్చే ఇన్ఫెక్షన్లను దరిచేరనివ్వదు. ● అలాగే బోడకాకరలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉండటం వల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది. జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేసేలా చేస్తుంది. ● ఇందులో ఉండే ఫోలేట్‌లు గర్భిణులకు ఎంతో మేలు. గర్భస్థ శిశువు ఎదుగుదలకు, కొత్త కణాల వృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ● విటమిన్-ఎ పుష్కలంగా ఉండటం వల్ల కంటి సమస్యలు రాకుండా కాపాడుతుంది. కంటి చూపు మెరుగవుతుంది. ● వీటిలోని న్యూట్రియంట్లు శరీరంలోని క్యాన్సర్ కారకాలను నాశనం చేయడంలో సహాయపడుతుంది. దీంతో పాటు ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి పోషకం. వీటిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అలాగే కాలేయ సమస్యలు అంటే పచ్చకామెర్లు, అర్షమొలలు (పైల్స్) నివారణకు బోడకాకర మంచి ఔషధమని వైద్యులు పేర్కొంటున్నారు. అంతేకాదూ..శరీరంలోని కొవ్వు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతేకాదండి ఇందులో ఉండే ఫ్లేవనాయిడ్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ● గుండెకు ఆరోగ్యాన్నిస్తుంది. పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది.

(c) eenadu

సాయం అనుకునేరు.. నిండా ముంచేస్తారు!

బ్యాంకు రుణాలిప్పిస్తామంటూ మాయగాళ్ల బురిడీ

ఈనాడు, హైదరాబాద్

మహానగరంలో సామాన్యుల ఆర్థిక అవసరాలను ఆవకాశం చేసుకొని మాయగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు, వడ్డీ వ్యాపారుల నుంచి రుణం ఇప్పిస్తామంటూ ఆర్థిక, సైబర్ నేరస్థులు మోసాలకు తెగబడుతున్నారు. నకిలీ కన్సల్టెన్సీలు, దళారులు ఆస్తిపత్రాలు ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. భారీఎత్తున రుణం తీసుకొని ముఖం చాటేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా నకిలీ కన్సల్టెన్సీలు, దళారులను నమ్మి ఆస్తిపత్రాలు అప్పగించొద్దని సీసీఎస్ డీసీపీ చైతన్య కుమార్ సూచించారు. యుగంధర్ అనే వ్యక్తి ఏపీ, తెలంగాణల్లో బ్యాంకు రుణాలిప్పిస్తానంటూ 20 మందిని మోసగించినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు.

ఎవరి మోసాల లెక్క వారిదే

వ్యక్తిగత వివరాలు సరిగా లేకపోవటం, సిబిల్‌స్కోర్ తక్కువగా ఉన్న సందర్భాల్లో ఎక్కువమంది రుణాల కోసం కన్సల్టెన్సీలను ఆశ్రయిస్తున్నారు. కొందరు నిర్వాహకులు సామాన్యుల ఇబ్బందులను తమకు అనువుగా మలచుకుంటున్నారు. రుణం రావటం కష్టమని మాయమాటలు చెప్పి వారిఇల్లు, ఖాళీస్థలాలు, భూములను తమ ఏజెంట్లు, అనుచరులపేరిట సేల్‌డీడ్ చేయిస్తున్నారు. బ్యాంకు రుణం తీర్చాక ఆస్తిపత్రాలు ఇస్తామని నమ్మిస్తున్నారు. భారీమొత్తంలో రుణాలు పొంది కొంత సొమ్ము అసలు యజమానులకు ఇస్తున్నారు. తీసుకున్న సొమ్ము పూర్తిగా చెల్లించినా, బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల నుంచి నోటీసులు వచ్చిన సందర్భాల్లో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయిస్తున్నారని సీసీఎస్ ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. కమీషన్‌కు ఆశపడే బ్యాంకు ఉద్యోగులు ఏజెంట్లుగా మారుతున్నారు. బ్యాంకులు తిరస్కరించిన వారిని కన్సల్టెన్సీలు, దళారుల వద్దకు పంపుతున్నారు. వారి ద్వారా దరఖాస్తు చేస్తే తేలికగా రుణాలు వస్తాయని ఆశచూపుతున్నారు.

షరతులు వర్తిస్తాయి..

రూ.10లక్షల నుంచి రూ.100 కోట్ల వరకు తక్కువ వడ్డీతో రుణాలు. కఠిన నిబంధనలు, పత్రాలతో పని లేకుండా క్షణాల్లో మీ ఖాతాలో డబ్బులు జమచేస్తామంటూ సామాజిక మాధ్యమాలు, నకిలీ వెబ్‌సైట్లలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. ప్రముఖ ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకుల పేరిట ప్రకటన కనిపించగానే అధిక శాతం ఆకర్షితులవుతున్నారు. రుణం మంజూరు కావాలంటే బీమా పాలసీ తీసుకోవాలని షరతు విధిస్తున్నారు. నిజమని నమ్మి బాధితులు బీమా సొమ్ములు చెల్లిస్తున్నారు. అనంతరం అట్నుంచి స్పందన రాకపోవటం, ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాక మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు

> “ పాతబస్తీకిచెందిన వ్యాపారి ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఇంటి పత్రాలు తనఖా పెట్టి రూ.6 లక్షలు తీసుకున్నాడు. సక్రమంగా వాయిదాలు చెల్లించాడు. అదనంగా మరో రూ.3 లక్షలు చెల్లించాలని నోటీసు రావటంతో ఉలికిపాటుకు గురయ్యాడు. ఆరాతీస్తే తనకు రుణం వచ్చేందుకు సహకరించిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు చేసిన మోసమని గ్రహించాడు.
>
> • మూసారాంబాగ్‌కు చెందిన మహిళ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు బ్యాంకు రుణం కోసం ప్రయత్నించారు. సిబిల్‌స్కోర్ తక్కువగా ఉండటంతో విఫలమయ్యారు. బ్యాంకు ఉద్యోగి సూచనతో దళారి సాయంతో 300 చదరపు అడుగుల స్థలాన్ని మరో వ్యక్తి పేరిట సేల్‌డీడ్ చేసి రూ.75 లక్షలు రుణం తీసుకొని అసలు యజమానికి రూ.58లక్షలు ఇచ్చాడు. ”

అరుదైన నేత్ర వ్యాధుల రోగులకు ఊరట

దూర ప్రాంతాల నుంచి శాంపిళ్లు సులువుగానే తరలించే అవకాశం



ఈనాడు, హైదరాబాద్: కంటి సంబంధిత అరుదైన, తీవ్రమైన వ్యాధులను గుర్తించడంలో ఎదురవుతున్న భౌగోళిక, సాంకేతికత అడ్డంకులకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ శాస్త్రవేత్తలు కీలక పరిష్కారాన్ని గుర్తించారు. ఆక్యులర్ మ్యూకస్ మెంబ్రేన్ పెంఫిగోయిడ్(ఓఎంఎంపీ) లాంటి ఆటో ఇమ్యూన్ వ్యాధి కంటి రెప్పల లోపలి పొరను దెబ్బతీస్తూ, దీర్ఘకాలిక మంట, మచ్చలు చివరికి దృష్టి లోపానికి దారి తీస్తుంది. ఏటా వేలాది మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఇలాంటి రోగులకు తాజా అధ్యయనం ఎంతో ఉపశమనాన్ని కల్పిస్తోంది. ఈ వ్యాధిని నిర్ధారించడానికి డైరెక్ట్ ఇమ్యూనోఫ్లోరెసెన్స్(డీఐఎఫ్) అనే ప్రత్యేక పరీక్ష అవసరం. దీనికి కంటి పొర(కన్జంక్టివా) నుంచి కొద్దిపాటి కణజాలాన్ని తీసి ప్రయోగశాలకు పంపుతారు. సంప్రదాయ పద్ధతి ప్రకారం, ఈ కణజాలం పాడవకుండా ఉండటానికి అతి చల్లటి ఉష్ణోగ్రత వద్ద గడ్డకట్టించాలి. అయితే గ్రామీణ, చిన్న పట్టణాల్లోని కంటి ఆసుపత్రుల్లో ద్రవ నైట్రోజన్, క్రయోస్టాట్ మైక్రోటోమ్ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో లేవు. దీంతో ఇలాంటి అరుదైన కంటి వ్యాధుల రోగులు సుదూర ప్రాంతాల్లో ఉండే నగరాల్లోని ఆసుపత్రులపై ఆధారపడుతున్నారు. ఓఎంఎంపీ నిర్ధారణకు బయాప్సీ శాంపిళ్లలను తక్షణం అతి చల్లదనంలో(స్నాప్ ఫ్రీజింగ్) ఉంచాల్సిన అవసరం లేదని, సాధారణ ఐస్ ప్యాక్‌ల ద్వారా రవాణా చేసినా పరీక్ష ఫలితాల్లో ఎలాంటి మార్పు ఉండదని అధ్యయనంలో స్పష్టమైంది. శాంపిళ్లు చేర్చడంలో ఆలస్యం వల్ల వ్యాధి నిర్ధారణ నాణ్యత తగ్గలేదని ఈ అధ్యయనం నిరూపించిందని ఎల్వీపీఈఐ ప్రధాన పరిశోధకులు డాక్టర్ మారియా.బి పేర్కొన్నారు.

చేతబడి అనుమానంతోనే స్థిరాస్తి వ్యాపారి హత్య?

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: చేతబడి చేయించాడనే అనుమానంతోనే స్థిరాస్తి వ్యాపారి మహబూబ్ అలీని నిందితులు హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఫలక్‌నుమా పోలీసు స్టేషన్ పరిధిలోని వట్టేపల్లిలో మహబూబ్ అలీ దారుణ హత్యకు గురైన విషయం విదితమే. మహబూబ్ అలీ బావమరిది, వట్టేపల్లికి చెందిన ఖలీల్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మహబూబ్ అలీ చేతబడి చేయించడం వల్లనే ఖలీల్ చనిపోయాడని అనుమానంతో అతని మేనల్లుడు మోసిన్ మహబూబ్ అలీపై కక్ష పెంచుకున్నాడని, మరో ఐదుగురితో కలిసి మహబూబ్ అలీపై దాడి చేసి కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇప్పటికే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

బాలికపై అత్యాచారం.. ఆటోడ్రైవరుకు 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి జిల్లాకోర్టులు, న్యూస్‌టుడే: ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డ ఆటోడ్రైవరుకు కోర్టు 20 ఏళ్లజైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించింది. బాలాపూర్ మండలం ఎర్రకుంటకు చెందిన సయ్యద్ ముఖ్రమ్ ఆటోడ్రైవర్. అతడు 2023లో పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఉండే బాలిక(16)ను ప్రేమిస్తున్నట్లు వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు సమగ్ర దర్యాప్తు తర్వాత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. బాధితురాలికి కోర్టు రూ. లక్ష నష్టపరిహారాన్ని మంజూరు చేసింది.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

మియాపూర్: పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్సై సంగయ్య కథనం ప్రకారం.. మియాపూర్ సుభాష్‌చంద్రబోస్ నగర్‌కు చెందిన విద్యార్థి (16) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఆదివారం వివాహానికి హాజరయ్యేందుకు నిజామాబాద్ వెళ్లారు. రాత్రి ఫోన్ చేసిన స్పందించకపోవడంతో సమీపంలో ఉన్న బంధువులకు సమాచారమిచ్చారు. వారు ఇంటికి వచ్చి తలుపు పగలగొట్టి చూడగా ఫ్యానుకు చీరతో ఉరేసుకొని కనిపించాడు. కొంతకాలంగా చదువుల్లో ప్రతిభ చూపలేక పోతున్నాడని, ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చన్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నిమ్స్: నిమ్స్ అత్యవసర విభాగం డ్యూటీ వైద్యులను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులకు ఆసుపత్రి డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవ్‌రాజ్ ఫిర్యాదు చేశారు. 'ఆదివారం రాత్రి 12 గంటలకు మణెమ్మ అనే మహిళను ఎలాంటి కదలికలు లేని స్థితిలో తీసుకొచ్చారని, వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో రోగి బంధువు.. వైద్యులు, ఇతర సిబ్బందిని తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడి ఓ సెక్యూరిటీ గార్డుపై దాడి చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి, విచారణ జరిపి చర్యలు తీసుకోవాల'ని ఫిర్యాదులో కోరారు.

సంతకాలు ఫోర్జరీ చేసి.. ఆస్తికే ఎసరు పెట్టి

రామశర్మ, ప్రమీలారాణి

నిజాంపేట: విదేశాలకు వెళ్తూ తాళాలు అప్పగిస్తే ఇంట్లోని ధ్రువపత్రాలు కాజేసి యజమానుల సంతకాలను ఫోర్జరీ చేసి వారి ఆస్తికే ఎసరుపెట్టారు. బాచుపల్లి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్ లోని శ్రీకల్ప ప్రిస్టిన్ సముదాయంలో మందసపు భవ్య, నవీన్‌కుమార్ దంపతులు ఉంటున్నారు. వీరి పక్కింట్లోనే పూజారి చామర్తి రామలతారావు అలియాస్ రామశర్మ (50), ప్రమీలారాణి దంపతులు ఉంటున్నారు. రామశర్మ 2023లో నవీన్‌రావు నుంచి రూ.20 లక్షలను అప్పుగా తీసుకున్నారు. ఆ తర్వాత ఏడాదికి అమెరికా పారిపోయాడు. బాధితులు గతేడాది ఏప్రిల్‌లో బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా..ఈ ఏడాది జూన్ 25న శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

ధ్రువపత్రాలు చోరీచేసి..: 2020లో నవీన్‌రావు దంపతులు విదేశాలకు వెళ్తూ తమ ఇంట్లో ఉన్న అక్వేరియం చేపలకు ఆహారం వేయాల్సిందిగా చెప్పి రామశర్మ కుటుంబానికి ఇంటి తాళాలు అప్పగించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వారు నవీన్, భవ్య ఆధార్, పాన్‌కార్డులు, కరెంట్ బిల్లు చోరీచేసి, వాటి సాయంతో ఇద్దరి సంతకాలను ఫోర్జరీ చేశారు. అదే చిరునామాలో 'శ్రీ గురుదత్త లక్ష్మీనర్సింహ గురువాంబిక పీఠం'ను స్థాపించినట్లు నకిలీ వెబ్‌సైట్‌ను సైతం రూపొందించారు. తద్వారా భక్తుల నుంచి భారీగా విరాళాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఆశ్రమం పేరుతో కేపీహెచ్‌బీకాలనీలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతా తెరిచి లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన యజమానులు గతనెల 27న పోలీసులకు మరోమారు ఫిర్యాదు చేశారు. రామశర్మ దంపతుల కోసం గాలిస్తున్నట్లు సీఐ దాలినాయుడు తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

నెట్ నెట్ వెంచర్స్ సంస్థకు సిటీ స్మాల్ కాజెస్ కోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ పరిధిలోని ఓ భారీ వాణిజ్య భవన నిర్మాణ వివాదంలో సిటీ స్మాల్ కాజెస్ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిబంధనలు, మంజూరైన ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారంటూ జీహెచ్ఎంసీ జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్‌ను .సవాలు చేస్తూ 'నెట్ నెట్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్' దాఖలు చేసిన అప్పీలును కోర్టు కొట్టివేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ జారీ చేసిన ఆర్డర్ సరైనదేనని, అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించింది.

కేసు నేపథ్యం ఇదీ..: నెట్‌నెట్ వెంచర్స్ సంస్థ నందగిరి హిల్స్‌లో హెచ్ఎండీఏ వేలంలో కొన్న భూమితోపాటు, జూబ్లీహిల్స్ సొసైటీ పరిధిలోని కొంత స్థలాన్ని కలిపి వాణిజ్య సముదాయం, హోటల్ నిర్మాణానికి అనుమతులు పొందింది. ఒక సెల్లార్, 5 స్టిల్ట్ అంతస్తులు, ఎన్విరాన్‌మెంటల్ డెక్, 13 పైఅంతస్తుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ 2023లో సవరించిన ప్లాన్‌ను మంజూరు చేసింది. ఈ నిర్మాణంలో భారీగా ప్లాన్ మార్పులు, ఉల్లంఘనలు జరిగాయని నందగిరి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు నిర్మాణాన్ని నిలిపి వేయాలని షోకాజ్ నోటీసులు జారీ చేసి, విచారణ అనంతరం ఉల్లంఘనలను తొలగించాలని స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చారు. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ కోర్టును ఆశ్రయించింది.

తల్లిదండ్రులపై దాడి.. బాలిక అపహరణ

ఆపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

పటాన్‌చెరు అర్బన్: అర్ధరాత్రి స్నేహితులతో కలిసి బాలిక తల్లిదండ్రులపై దాడి చేసి, ఆమెను అపహరించారు... అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో వెలుగు చూసింది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులు, ఇద్దరు కుమార్తెలతో బతుకుతెరువు కోసం నగరానికి వలస వచ్చారు. కొంతకాలంగా ముత్తంగి డివిజన్ పోచారం శివారులోని ఓ భవన నిర్మాణ ప్రదేశంలో గుడిసె వేసుకొని నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి రామేశ్వరం బండ వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన మహ్మద్ అలీమ్ పాషా, తన స్నేహితులైన ముద్దం రాజు, వడ్డే రాజేశ్‌లతో కలిసి వారుంటున్న గుడిసె వద్దకు వచ్చారు. వారి పెద్ద కుమార్తె(17)ను అపహరించేందుకు యత్నించగా.. తల్లిదండ్రులు అడ్డుకోవడంతో వారిపై కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశారు. అడ్డొచ్చిన బాలిక సోదరిని మద్యం సీసాలతో కొట్టారు. అనంతరం బాలికను తీసుకెళ్లిపోయారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాషా ఇంటి సమీపంలో సోమవారం ఉదయం బాలికను గుర్తించారు. బాలికపై పాషా లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో.. ఆమెను భరోసా కేంద్రానికి తరలించారు. పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, పింఛను మొత్తం పెంచుతామని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకోసం 9 లక్షల మంది మంది దరఖాస్తు చేసుకున్నా నేటి వరకు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో మహేందర్, శ్రీనివాసరావు, కేఎన్ రాజన్న, దశరథ్, వరలక్ష్మి, మారయ్య, సి.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌పై తప్పుడు ప్రచారం ఆపాలి'

నారాయణగూడ, న్యూస్‌టుడే: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, జీవితం, రాజ్యాంగ నిర్మాణంపై సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన అంశాలను ప్రచారం చేస్తున్న హమారా ప్రసాద్ అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలి: కూనంనేని

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్రం ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు, భాజపా మత రాజకీయాలను నిరసిస్తూ సీపీఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో సెప్టెంబరు 1న దిల్లీలో లక్షల మందితో నిరసన చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే **కూనంనేని సాంబశివరావు** తెలిపారు. సోమవారం నగరంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రతీ మార్పు వెనక యువత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం ఆ యువతే విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తు అవకాశాలపై తీవ్ర ఆందోళనతో ఉందన్నారు. వారిలో ఎన్నోఏళ్లుగా పేరుకుపోయిన నిరాశ, ఆగ్రహం యువతను తిరుగుబాటు వైపు అడుగులువేయిస్తోందన్నారు. నీట్ సహా పలు పోటీ పరీక్షల్లో చోటు చేసుకున్న వివాదాలు విద్యార్థుల్లో ప్రభుత్వంపై అసంతృప్తిని పెంచాయన్నారు. ప్రైవేటీకరణతో ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గి ఔట్ సోర్సింగ్ కొలువులు పెరిగాయన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అమెరికా పర్యటనలో భారత్ అందరిదని చెప్పటంతో పాటు భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళిత అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇది విదేశాల్లో మాట్లాడటమే కాదు..ఇదే వైఖరిని దేశంలో ఆచరించి చూపించాలన్నారు. మతంపేరుతో రాజకీయ లబ్ధి పొందే విధానాన్ని విడనాడాలని, హిందూ మతాన్ని, రాముడిని ఒక పార్టీకే చెందినవారిగా చూపడం సరికాదన్నారు.

ఎసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్

మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

నల్లకుంట, న్యూస్‌టుడే: అన్యాక్రాంతం అవుతున్న పేదల భూములు తిరిగి వారికి దక్కేలా ప్రభుత్వంతో పోరాడతానని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. ఎసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ భూరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో చేపట్టిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన భూములకు ఇప్పుడే ఆ పార్టీయే హక్కులు కల్పించాలన్నారు. పేదల సంక్షేమం కోసం జరిగే పోరాటాలకు ఎల్లప్పుడూ తన మద్దతు ఉంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, సమితి పొలిట్ బ్యూరో సభ్యుడు తాళ్లపల్లి లింగం, శ్రీశైలం, కరుణాకర్‌గౌడ్, విజయ్‌కుమార్, హేమ, కడారి నాగేశ్వర్‌రావు, మల్లేష్, చింత స్వామి, కలకోటి రాములు,నాగమణి, వరలక్ష్మి, భారతి, రోజారాణి పాల్గొన్నారు.

నిన్న ప్రేమమయం.. నేడు మాయం



ఖైరతాబాద్ వంతెన వద్ద 'లవ్ హైదరాబాద్' అని తెలిపే అక్షరాలను మొక్కలతో ఏర్పాటు చేశారు. చుట్టూ పచ్చని మొక్కలతో అలంకరించారు. నెలక్రితం అక్షరాల మొక్కలు ఎండిపోవడంతో వాటిని తొలగించారు. కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో అందవిహీనంగా మారింది. - ఈనాడు, హైదరాబాద్

నగరానికి క్షేమంగా చేరిన మానసరోవర్ యాత్రికులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: సుందరదాస్ ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ పి.శ్రీనివాస్‌స్వామి ఆధ్వర్యంలో 34వ కైలాస మానసరోవర్ వెళ్లిన 31 మంది బృందం సోమవారం క్షేమంగా నగరానికి చేరుకుంది. శ్రీనివాస్‌స్వామి చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. నేపాల్‌లో అకస్మాత్తుగా వచ్చిన వరదలతో తాము వెళ్లిన మార్గం దెబ్బతినడంతో మూసివేశారన్నారు. దీంతో కొంత ఇబ్బందికరంగా మారిందన్నారు. టిబెట్‌లోని సాగానుంచి 12 గంటల పాటు అత్యంత కఠినమైన రోడ్డు మార్గంలో ప్రయాణించి నేపాల్‌కు చేరుకున్నామన్నారు. ప్రయాణంలో కనీసం టీ తాగేందుకు సమయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాఠ్‌మండు నుంచి ఎయిర్ ఇండియా విమానంలో దిల్లీ మీదుగా హైదరాబాద్ చేరుకున్నామన్నారు.

ప్రియుడితో పెళ్లికి ఒప్పుకోలేదని ఆత్మహత్య

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి తల్లిదండ్రులు ఒప్పుకోలేదని మనస్తాపం చెంది ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జేపీ కాలనీలో నివాసం ఉంటున్న వెంకటేశ్ పెద్ద కుమార్తె వైష్ణవి (23), అదే భవనంలో అద్దెకుంటున్న అబి అనే యువకుడిని ప్రేమించింది. కులాలు వేరు కావడంతో యువతి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. ఇటీవల ఆమెకు పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు.. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెయిల్‌పై భరోసా ఇవ్వని భార్య.. ఖైదీ బలవన్మరణం

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: బెయిల్ ఇప్పించాలని ఫోన్‌లో ప్రాధేయపడినా భార్య భరోసా ఇవ్వక పోవడంతో జైల్లోనే ఖైదీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చంచల్‌గూడ జైల్లో జరిగింది. నిజామాబాద్ జైల్లో రోడ్డుప్రమాదం కేసులో విచారణ ఖైదీగాఉన్న కంది సాగర్(30) కంటి వైద్యం కోసం చంచల్‌గూడ జైలుకు బదిలీపై జులై25న వచ్చారు. సోమవారం ఉదయం జైలు నుంచి తన భార్యతో జైలు అధికారులు కల్పించిన ఫోన్ ద్వారా మాట్లాడారు. ఆ తర్వాత కొంతసేపటికి బాత్‌రూమ్‌లోకి వెళ్లి తలుపుకున్న కొక్కానికి మెడలోని టవల్‌తో ఉరేసుకున్నారు. అర గంటైనా తలుపు తెరవక పోవడంతో ఖైదీలు తలుపు పైకెక్కి చూస్తే వేలాడుతున్నట్లు కనిపించింది. వెంటనే జైలు అధికారులు ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. బెయిల్‌పై తీసుకెళ్లాలని ఫోన్‌లో భార్యను వేడుకున్నా పట్టించుకోకపోవడంతోనే మనస్తాపానికి గురయ్యాడని జైలు అధికారులు పేర్కొన్నారు. డబీర్‌పుర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్ బ్రిడ్జికి లక్ష్మీబాయి పేరు పెట్టాలని ఆందోళన

ఆందోళనకు దిగిన జాజుల శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, వీహెచ్, గుజ్జ కృష్ణ తదితరులు

నారాయణగూడ: ఎలాంటి అర్హత లేకపోయినా ప్రభుత్వ స్థలాలు, పార్కులు, జిల్లాలకు, ఫ్లైఓవర్లకు అగ్రకులాల వారి పేర్లు పెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. అన్ని అర్హతలు ఉన్నా బీసీ కులమే అనర్హత అన్నట్లు బీసీల నాయకుల పేర్లు ఏ కట్టడానికి, జిల్లాకు పెట్టడం లేదన్నారు. సైదాబాద్‌లో నూతనంగా నిర్మించిన 'స్టీల్ బ్రిడ్జి'కి స్వాతంత్ర్య సమర యోధురాలు, తొలి మహిళా పార్లమెంటేరియన్ సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఐకాస వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ, కో-ఛైర్మన్ నందగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆందోళన చేపట్టారు.

శోభాయాత్ర రహదారులకు మరమ్మతులు

ఈనాడు, హైదరాబాద్: బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు, అలాగే వినాయకుడి శోభాయాత్ర జరిగే మిగిలిన రహదారులపై గుంతలన్నీ పూడ్చేందుకు ఇంజినీర్లు పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బల్దియా అదనపు కమిషనర్ బి.సంతోష్, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య చర్యలు మెరుగ్గా ఉండాలని, అదనపు సిబ్బందిని నియమించుకోవాలని కమిషనర్ సూచించారు.

చికెన్ ధరలు				
	ఫాంరేటు	122–00	డ్రెస్డ్	231–00
	రిటైల్	149–00	స్కిన్‌లెస్	261–00

ఉల్లి.. సామాన్యుడు తల్లడిల్లి

తగ్గిన దిగుబడి.. పెరిగిన ధరలు

ఈనాడు, హైదరాబాద్

మహానగరంలో ఉల్లి ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మూడు వారాల్లోనే ధర రెట్టింపు కాగా మార్కెట్లకు వస్తున్న సరకు సగానికి సగం తగ్గి డిమాండ్ పెరుగుతోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి బాగా తగ్గడమే కారణం. గతంలో రోజుకు 20-25 వేల క్వింటాళ్లు వచ్చేవి. సోమవారం 11870 క్వింటాళ్లు రాగా నాణ్యత మేరకు హోల్‌సేల్ ధరలు కిలో రూ.26 ఉండగా నాణ్యమైనవి కిలో రూ.36-42 ఉన్నాయి.

మధ్యప్రదేశ్ నుంచి అధికంగా..

నగరానికి ప్రధానంగా ఉల్లి మహారాష్ట్ర నాసిక్ నుంచి అత్యధికంగా వస్తోంది. కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి తక్కువ వస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంట సాగు ఆలస్యమైంది. నిల్వ ఉన్న పాత ఉల్లి తడిసిపోవడంతో దెబ్బతిని సరఫరా తగ్గింది. కొత్త పంట మార్కెట్‌లోకి రాకపోవడం, పాత నిల్వలు ముగింపు దశకు చేరుకోవడంతో హోల్‌సేల్ మార్కెట్లకు రోజువారీ వచ్చే ఉల్లి పరిమాణం తగ్గింది. మరింత డిమాండ్ ఏర్పడే అవకాశముందని కొందరు వ్యాపారులు నిల్వ చేసుకుంటుండటంతో సరకు లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయి. సాధారణ మార్కెట్లలో కనీస ధర కిలో రూ.40గా ఉండగా నాణ్యతను బట్టి కిలో రూ.60 వరకు పలుకుతోంది. రైతుబజార్లలో రూ.35-40 వరకు ఉండగా మహబూబ్‌మాన్షన్, బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్ మార్కెట్లలో క్వింటాల్ రూ.3,200 నుంచి రూ.4,000 వరకు ఉంది.

హోటళ్లకు సగభాగం

నగరంలో హోటళ్లు, ప్రధానంగా బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సర్వీసులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మొత్తం డిమాండ్‌లో దాదాపు సగం వాటాను ఆక్రమిస్తుండగా మిగిలిన సగం గృహోపయోగంగా ఉంది. మహారాష్ట్ర నాసిక్ మార్కెట్‌లో మూడువారాల క్రితం సగటు ధర కిలోకి రూ.20గా ఉండగా ప్రస్తుతం క్రమంగా పెరుగుతూ రూ.35 ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. రోజువారీ కూడా ఎంత సరకు వస్తుందో స్పష్టత ఉండటం లేదని ఒక రోజు ఐదువేల క్వింటాళ్లే రాగా తర్వాత రోజు 10వేల క్వింటాళ్లు వచ్చిందని మహబూబ్‌మాన్షన్ ఉల్లి వ్యాపారి మహమూద్ తెలిపారు.

యాదాద్రి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలి

ఐక్యత చాటుతున్న అనురాధ, నరసింహారావు, సీతారాములు, జాన్‌వెస్లీ, ఎస్.వీరయ్య, జాలకంటి రంగారెడ్డి బాబు తదితరులు

నల్లకుంట, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేసి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. యాదాద్రి జిల్లాలో అధిక శాతం ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని ఉన్నారని, ప్రస్తుతం బీడు భూములుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సాగు, తాగునీటికి ఉపయోగపడే ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడంలేదన్నారు. ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ కారణంగా తిమ్మాపూర్, చౌక్లానాయక్ తండా, లప్పనాయక్ తండాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

PUBLIC NOTICE

This is for the information of Public in General and any person or persons who may be concerned in particular, that my client namely: **ADIBATLA APARNA KAMESWARI W/o. LAKKIREDDY MADHUSUDHAN REDDY,** intend to purchase the land scheduled below from **Sri. MANDAVILLI VENKATA SUBBARAYUDU & MANDAVILLI BHASKAR RAMA RAO.** My client has paid substantial amount as advance and intend to register the same. If anybody is having any objection of whatsoever may contact the undersigned along with documents within **THREE DAYS (3)** from the date of publication. Thereafter we will not entertain any claim or objection and they will proceed further in the matter for getting the sale deed executed by the above said owner in respect of below said property.

SCHEDULE

All that the House Nos. 6-3-595/61 (PTIN:1100609739) & 6-3-595/61/1 (PTIN:1100612705), Consisting of Ground and First Floor, admeasuring 378 Square Yards, Or equivalent to 316.12 Sq. Meters, on Plot No.5, Situated at Padmavathi Nagar, Khairatabad, Hyderabad-500004, Telangana State and bounded as under: NORTH: Plot No.4. SOUTH: Plot No.6. EAST: Plot Nos.9 & 10. WEST: Road

Sd/- **M/S. P. VISHNUVARDHANA REDDY**
Advocate
O/o. Flat No. 402 & 403, R. K. Residency, Opp: Communist Office Behind Hotel Blue Fox, Street No. 15, Himayathnagar, Hyderabad-500 029.
Cell: **9848023375**
Mail: vishnuvardhan885@gmail.com

(c) eenadu

మాట్లాడుతున్న రామచందర్‌రావు

మోదీ @ 25 'సేవా సంకల్ప్ అభియాన్'
ఈనెల 17 నుంచి కార్యక్రమాలు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సేవలందిస్తూ అక్టోబరు 7 నాటికి పాతికేళ్లు పూర్తి చేసుకోవడంతోపాటు మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మోదీ @ 25 పేరిట నెలపాటు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు జరపనున్నారు. సోమవారం బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయంలో సేవా సంకల్ప్ అభియాన్ కార్యశాల నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కార్యక్రమ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త, ఏపీ మంత్రి సత్యకుమార్, పార్టీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, పార్టీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతంరావు, టి.వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నేతలు, జిల్లాల అధ్యక్షులు హాజరయ్యారు. విద్యాసంస్థల్లో పలు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మేడ్చల్ ఆబ్కారీ కార్యాలయానికి తాళం

తాళం వేస్తున్న యజమాని

మేడ్చల్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ఇంటి అద్దె చెల్లించకపోవడంతో మేడ్చల్ పట్టణంలోని ఆబ్కారీ కార్యాలయానికి ఇంటి యజమాని సోమవారం తాళం వేశారు. మేడ్చల్‌కు చెందిన విఠల్‌రెడ్డి 2011లో ఆబ్కారీ కార్యాలయానికి తన భవనాన్ని అద్దెకిచ్చారు. నెలకు రూ.7,550 చొప్పున బాకీ ఉందని చెప్పారు. కార్యాలయంలో సంప్రదిస్తే అద్దె ఇవ్వకపోగా భవనం బాగు చేసి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు.

ట్రిప్పులు తగ్గాయ్.. కష్టాలు పెరిగాయ్

బస్టాపుల్లోనే ప్రయాణికుల పడిగాపులు

ఈనాడు, హైదరాబాద్: మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక నగరంలో బస్సు ప్రయాణికుల సంఖ్య దాదాపు 40 శాతం పెరిగింది. దానికి అనుగుణంగా బస్సుల ట్రిప్పులు పెరగకపోగా పలు కీలక మార్గాల్లో సర్వీసుల ఫ్రీక్వెన్సీ తగ్గింది. ఒకప్పుడు ప్రతి 15 నిముషాలకు వచ్చే బస్సులు ఇప్పుడు గంటకోసారి కూడా రాకపోవడంతో ప్రయాణికులు స్టాపుల్లోనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆర్టీసీ 'గమ్యం' యాప్‌లో బస్సు వచ్చే సమయం సూచిస్తున్నప్పటికీ రాకపోకలకు దాంతో పొంతన ఉండటం లేదు.

- కోఠి మెడికల్ కాలేజీ నుంచి గౌలిదొడ్డి రూట్(116ఎన్), చాంద్రాయణగుట్ట నుంచి గౌలిదొడ్డి(116జి), కోఠి నుంచి కొల్లూరు(116/220కె) మార్గంలో బస్సులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రతి 30- 40 నిమిషాల ఫ్రీక్వెన్సీతో బస్సులు వస్తుండటంతో మెహిదీపట్నంలోనే బస్సులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దీంతో మిగిలిన స్టాపుల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల సంఖ్య పెంచడంతో పాటు ప్రతి 15 నిమిషాలకో బస్సు నడిపితే సమస్య పరిష్కారం అవుతుంది.
- దిల్‌సుఖ్‌నగర్ డిపో బస్సులను మొదట్లో ఇబ్రహీంపట్నం నుంచి దిల్‌సుఖ్‌నగర్(277డి రూట్) వరకు నడిపేవారు. ఇటీవల రూట్‌ను '277ఎల్'గా మార్చి ఎల్బీనగర్ వరకే పరిమితం చేయడంతో దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.
- కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ నుంచి మెహిదీపట్నం రూట్‌లో బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచాలి. ఈ మార్గంలో మధ్యాహ్నం 12 గంటల తర్వాత కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌కు బస్సులు లేవని అన్నీ టెంపుల్ బస్టాప్ వద్దే ఆగిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.
- ఉప్పల్- మెహిదీపట్నం మార్గంలో నడిపే (113ఐ/ఎం) బస్సులు హిమాయత్‌నగర్ వైపు నుంచి కాకుండా తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చే నంబర్, అంబర్‌పేట్ మీదుగా ఉప్పల్ చేరుకుంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఈ బస్సులుంటాయి. పైగా 'గమ్యం యాప్'లో బస్సులున్నాయని చూపిస్తుండటం గమనార్హం.

ఇబ్రహీంపట్నం మార్గంలో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

- ఘట్‌కేసర్ నుంచి అఫ్జల్‌గంజ్ సెంట్రల్ లైబ్రరీ(3కె/281) మార్గంలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. ఉదయం 6.30, 7.30 గంటల సమయంలో బస్సులు తక్కువ ఉన్నాయి. ఈసీఐఎల్ డిపో మేనేజర్‌కు వినతి పత్రాలిచ్చినా సమస్య పరిష్కారం కాలేదు.
- ఉప్పల్- మెహిదీపట్నం మార్గం(113ఎం)లో బస్సుల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని, ప్రతి 10 నిమిషాలకో బస్సు ఉండేలా చూడాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

రాత్రయితే బస్సు ఆపరు..

ఉదయం ఫ్రీక్వెన్సీ కష్టాలుంటే రాత్రివేళ కొందరు డ్రైవర్లు స్టాపుల్లో బస్సులు ఆపడం లేదు. ఖైరతాబాద్ ఆర్టీవో బస్టాప్‌లో రాత్రి 9 దాటితే ఒక్క బస్సునూ ఆపడం లేదు. ప్రయాణికులు చెయ్యెత్తి ఆపండి అని మొత్తుకుంటున్నా డ్రైవర్లు పట్టనట్టు వెళ్లిపోతున్నారు. ఉన్నతాధికారులకు దీనిపై ఫిర్యాదులందాయి. అయినా చర్యలు శూన్యం. యాప్రాల్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందంటూ ఆర్టీసీ కాల్‌సెంటర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి.


ఇన్‌డోర్ స్టేడియం.. ఔట్‌డోర్ అధ్వానం
యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆటల సంగతి ఎలా ఉన్నా బయటి నుంచి చూస్తే నిర్వహణ కరవై కళావిహీనంగా ఉంది. - ఈనాడు, హైదరాబాద్

గ్రామీణ కళాకారులకు 'పద్మ' పురస్కారాలు అభినందనీయం

మురళీమోహన్‌ను సత్కరించిన కళాకారులు

రవీంద్రభారతి: దాదాపు 140 కోట్ల మంది ఉన్న దేశంలో తనలాంటి వాళ్లకి గుర్తింపు రావడం సంతోషమే అయినా.. కేంద్ర ప్రభుత్వం ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉండే కళాకారుల ప్రతిభను గుర్తించి వారికి 'పద్మ' పురస్కారాలు అందించడం చాలా గొప్ప విషయమని ప్రముఖ నటుడు మాగంటి మురళీమోహన్ పేర్కొన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సారిపల్లి కొండలరావు ఫౌండేషన్, యువ కళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో 'ప్రపంచ జానపద దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఇటీవల 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న మురళీమోహన్‌ను జానపద కళాకారుల పక్షాన ఘనంగా సత్కరించారు. మురళీమోహన్ మాట్లాడుతూ.. జానపద కళాకారుల మధ్య జరిగిన ఈ సత్కారం మరచిపోలేనంటూ ఉద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘానికి రూ.5 లక్షలు ప్రకటించిన ఆయన మొదటి విడతగా రూ.2.50 లక్షలు చెక్కును రమణాచారి చేతుల మీదుగా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్యలకు అందజేశారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా.ఏనుగు నరసింహారెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సారిపల్లి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐజీపీ శ్రీనివాస్ సేవలు ఆదర్శం

తాళ్లతో జీపు లాగి శ్రీనివాస్ దంపతులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న ఏడీజీ రవిదీప్ సింగ్ సాహి, డీఐజీలు

కేశవగిరి, న్యూస్‌టుడే: పదవీ విరమణ చేసిన సీఆర్‌పీఎఫ్ సౌత్‌జోన్ ఐజీపీ ఎ.శ్రీనివాస్‌కు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్‌సెంటర్ ఏడీజీ కార్యాలయంలో ఆయన సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సౌత్‌జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) రవిదీప్ సింగ్ సాహి, డీజీపీలు సతీష్‌కుమార్, విశ్వనాథ్, అఖిలేష్ కుమార్ సింగ్ తదితరులు సత్కరించారు. జీపును ఉన్నతాధికారులు, జవాన్లు తాళ్లతో లాగి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏడీజీ రవిదీప్ సింగ్ సాహి మాట్లాడారు.

అమెరికాలో ఘనంగా 'రన్ ఫర్ తెలుగు'

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో 'సిలికానాంధ్ర మన బడి' ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలు గుర్తుచేసుకుంటూ 'తెలుగుకు పరుగు- రన్ ఫర్ తెలుగు-2026' కార్యక్రమం నిర్వహించారు. మనబడి అధ్యక్షుడు చమర్తిరాజు మాట్లాడుతూ.. భాషా సేవే భావితరాల సేవ అనే మనబడి నినాదాన్ని గుర్తుచేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పడంతో పాటు ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని సమాజానికి అందించాలనే లక్ష్యంతో 'మన బడి' భాషా సైనికుల ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు వల్లభాపురపు బాలాజీ, అల్లం శ్రీదేవి పేర్కొన్నారు.

దేశానికి గర్వకారణం రాజా రిత్విక్

రిత్విక్‌ను సత్కరించిన శివసేనారెడ్డి

నారాయణగూడ, న్యూస్‌టుడే: చెస్ గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ సోమవారం ఎల్బీ స్టేడియంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) ఛైర్మన్ కె.శివసేనారెడ్డి, ఎండీ డా.ఎ.సోనీబాలాదేవిలను మర్యాదపూర్వకంగా కలిశాడు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ టోర్నమెంట్‌లో రజత, కాంస్య పతకాలు సాధించిన ఆయన్ని సత్కరించారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ.. రిత్విక్ వరుస విజయాలు తెలంగాణ యువతలోని అపార క్రీడా ప్రతిభకు నిదర్శనమన్నారు. రాజా రిత్విక్ మాట్లాడుతూ.. రాబోయే అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని అన్నారు.

యువ స్కేటర్ ప్రణవ్‌కు అభినందనలు

అభినందిస్తున్న సోని బాలదేవి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నగరానికి చెందిన సూరపనేని ప్రణవ్ మాదవ్ ఆగస్టు 17 నుంచి 26 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన ఏషియన్ షార్ట్ ట్రాక్ ఛాంపియన్‌షిప్ 2026లో ప్రతిభ చూపి ఒక రజతం, 2 కాంస్య పతకాలు సాధించారు. సోమవారం నగరానికి వచ్చిన ప్రణవ్.. స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఛైర్మన్ శివసేనా రెడ్డి, వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ సోని బాలదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో జరిగే అంతర్జాతీయ పోటీలు, శిక్షణ అవసరాలు, దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రణవ్ అధికారులకు వివరించారు. శిక్షణ, సదుపాయాలు, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి సహకారం అందిస్తామని సోని బాలదేవి తెలిపారు.

జర్మనీ వర్సిటీతో ఓయూ ఒప్పందం

జర్మనీ వర్సిటీ ప్రతినిధులతో ఎంఓయూ మార్చుకుంటున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ విద్యా సహకారంలో భాగంగా జర్మనీలోని రాయిట్‌లింగ్ వర్సిటీతో ఓయూ సోమవారం ఎంఓయూ కుదుర్చుకుంది. విద్యార్థులకు అంతర్జాతీయ విద్య, పరిశ్రమల అనుభవం, ప్రపంచ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఒప్పందం చేసుకున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్, మాస్టర్స్ ప్రోగ్రాంతోపాటు విద్యార్థుల ఇమ్మర్షన్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నారు. తొలుత కంప్యూటర్ సైన్స్, ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డిజిటల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. 2026లో 30 మంది ఓయూ విద్యార్థులను ఎంపిక చేసి జర్మనీలో మూడేళ్లపాటు శిక్షణ, పరిశ్రమల్లో అనుభవం కల్పించనున్నారు. ఓయూ వీసీ కుమార్ మొలుగరం మాట్లాడారు.

తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

సమావేశంలో పాల్గొన్న అమరేందర్‌రెడ్డి, కల్యాణ్ సింగ్, అమిత్ సంఘీ, పి.మల్లారెడ్డి, అశోక్ కుమార్

బంజారాహిల్స్: తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ (టీఆర్ఏ) 13వ వార్షిక సర్వసభ్య సమావేశం సోమవారం బంజారాహిల్స్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికలు నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది పి.అమరేందర్‌రెడ్డి రిటర్నింగ్ అధికారిగా, పరిశీలకులుగా నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి కల్యాణ్‌సింగ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి మల్లారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధి అశోక్ కుమార్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా అమిత్ సంఘీ, సీనియర్ ఉపాధ్యక్షుడిగా వసీఫ్ హసన్ లతీఫ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ సోహైల్ ఉద్దీన్ ఫరూఖీ, డా.మహమ్మద్ సలీమ్ మూసా, ప్రధాన కార్యదర్శిగా జమాల్‌పురి కిరణ్, కోశాధికారిగా డా.వంశీధర్ నాలి, సంయుక్త కార్యదర్శిగా మహ్మద్ ముస్తఫా ఖాన్, కార్యవర్గ సభ్యులుగా ఏడుగురు ఎన్నికయ్యారు.

2030 నాటికి 500 గిగావాట్లు లక్ష్యంగా భారత్

కార్యక్రమంలో పాల్గొన్న అనుపమ్ కుమార్, ముషారఫ్ అలీ ఫరూఖి తదితరులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలో ఇంధన రంగం కొత్త దశలోకి ప్రవేశించిందని, 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ ఫ్యూయల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోందని కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి అనుపమ్ కుమార్ పేర్కొన్నారు. నవంబరు 2 నుంచి 5 వరకు దిల్లీలో జరగనున్న 'భారత్ రెన్యూవబుల్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026'కు ముందు నిర్వహిస్తున్న దేశవ్యాప్త రోడ్‌షోలలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాలతోపాటు ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టులతో విద్యుత్ అవసరాలు మరింత పెరగనున్నాయని టీజీరెడ్‌కో వైస్ ఛైర్మన్, ఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. ఎన్ఆర్ఈడీసీఏపీ వైస్ ఛైర్మన్, ఎండీ కమలాకర్ బాబు, తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.రాజేశ్వరి, గవర్నమెంట్ కౌన్సిల్ సభ్యుడు రవి వర్మ, సంజయ్ జి కరంధర్, సురేందర్ కుమార్, చిరంజీవి సింగ్ సుల్జా పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ సీఈ రత్నాకర్ పదవీ విరమణ

ఈనాడు, హైదరాబాద్: జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీరు సహదేవ్ రత్నాకర్ సోమవారం పదవీ విరమణ పొందారు. ముఖ్య ఇంజినీరుగా బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి ఆయన నగరంలో హెచ్-సిటీ ప్రాజెక్టు పనులు, రెండోదశ ప్రైవేటు రోడ్ల నిర్వహణ ప్రాజెక్టు, రెండోదశ వీధిలైట్ల నిర్వహణ ప్రాజెక్టులకు విధివిధానాలను రూపొందించడంలో కీలకంగా పనిచేశారు. సీఎం చేతుల మీదుగా జరిగిన మూసారంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమంతో సర్వీసు ముగిసిందని, సంతోష్‌నగర్ స్టీలు బ్రిడ్జిని కూడా ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామని ఈ సందర్భంగా రత్నాకర్ సంతోషం వ్యక్తం చేశారు. రత్నాకర్ పదవీ విరమణతో తర్వాతి సీనియర్ ఇంజినీరు జ్యోతిర్మయికి సీఈ బాధ్యతలు అప్పగించేందుకు దస్త్రం సిద్ధమైంది.

ఈఈపై వేటు?.. సెలవు విషయంలో నిబంధనలను పాటించనందుకుగాను గోల్కొండ సర్కిల్ కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలకు కమిషనర్ ఆర్వీ.కర్ణన్ సిఫార్సు చేసినట్లు తెలిసింది. దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు.

లక్ష్యాన్ని వదులుకోవద్దు.. మళ్లీ మొదలెట్టండి

పుస్తకాన్ని పరిశీలిస్తున్న డా.ప్రీతిరెడ్డి, ఆంచల్ బన్సల్

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: 'జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వదులుకోవద్దు. ఎప్పుడైనా మనల్ని మనం మార్చుకోవచ్చు. మళ్లీ కొత్తగా మొదలుపెట్టొచ్చు. ప్రతిఒక్కరి జీవితంలో ఏదో ఒకదశలో రీసెట్ అవసరమని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ ఛైర్‌పర్సన్ డా.ప్రీతిరెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ సీబీఐ కాలనీలో ఆదివారం రచయిత, విద్యావేత్త ఆంచల్ బన్సల్ రచించిన 'ద రీసెట్ - రీక్లెయిమ్ యువర్ ఐడెంటిటీ, రైజ్ విత్ ఇన్నర్ అథారిటీ' పుస్తకాన్ని డా.ప్రీతిరెడ్డి సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. రచయిత ఆంచల్ బన్సల్ తన అనుభవాలు, ఆలోచనలకు పుస్తక రూపమిచ్చారని అభినందించారు. ఈ పుస్తకాన్ని మహిళలే కాదు.. ప్రతి పురుషుడూ చదవాలన్నారు.

మాజీ డీజీపీ అంజనీకుమార్‌కు జీవిత సాఫల్య పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: విశ్రాంత డీజీపీ అంజనీకుమార్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. డెహ్రాడూన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్ గవర్నర్, లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్‌సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిసెంబరులో కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తాం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: జీసీసీ, డేటా సెంటర్లు, లెదర్ అండ్ లైఫ్‌సైన్స్, ఇండస్ట్రియల్ పాలసీ 2.0తో సహా మరిన్ని కొత్త పారిశ్రామిక విధానాలను డిసెంబరులో జరిగే తెలంగాణ రైజింగ్ సమిట్‌లో ప్రకటించబోతున్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి వెల్లడించారు. సమిట్ 2.0 ప్రచారానికి త్వరలోనే రోడ్‌షోలు ప్రారంభిస్తామన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవనంలో తెలంగాణలోని సంస్థలు జర్మనీతోపాటు యూరప్ మార్కెట్‌లోకి తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించడానికి వీలుగా ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ), జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (జీఐబీఏ), ఇన్నోవేషన్ హబ్ రైన్‌మైన్‌లు సంయుక్తంగా 'ఇండో-జర్మన్ గేట్‌వే ప్రోగ్రామ్' ప్రారంభించాయి. ఈ సందర్భంగా 'ఫ్రమ్ తెలంగాణ టు జర్మనీ' ఇంటర్నేషనలైజేషన్ పాత్‌వేస్ ఫర్ ఎంఎస్ఎంఈఎస్' అంశంపై సదస్సు నిర్వహించారు. నిఖిల్ చక్రవర్తి మాట్లాడుతూ.. డిసెంబరు 7 నుంచి 9 వరకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2.0 రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే కీలక వేదికగా నిలుస్తుంద'న్నారు. రీజినల్ పాస్‌పోర్టు అధికారి మాధవ్ ఆర్.సుల్బులే, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెళ్ల, పంకజ్ దివాన్, జీఐబీఏ సీఈఓ నిర్మల్ రామన్ కన్నయ్యన్, ఛైర్మన్ సెల్వకుమార్ పెరియస్వామి, ఇన్నోవేషన్ హబ్ రైన్‌మైన్ సీఈఓ స్టీఫెన్ విట్టెకిండ్, జర్మన్ ప్రతినిధి బృందంలో కెల్టర్‌బాచ్ మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ తదితరులున్నారు.

'ఉల్లాస్'లో మేడ్చల్ జిల్లాకు జాతీయ గుర్తింపు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నవ భారత సాక్షరతా మిషన్ ఉల్లాస్ కింద వినూత్న కార్యక్రమాలను చేపట్టడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీసీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉల్లాస్ డిప్యూటీ డైరెక్టర్ కె.అనిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఎంహెచ్ఎం కోర్సుకు దరఖాస్తు గడువు పెంపు

నిమ్స్: నిమ్స్‌లో మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో 2026 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసే గడువును పొడిగించినట్లు ఆసుపత్రి ఇన్‌ఛార్జి డీన్ ప్రొ.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీని సెప్టెంబర్ 18 వరకు పొడిగించామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేశాక హార్డ్ కాపీని 21వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. వివరాలకు nims.edu.in ను సందర్శించాలని కోరారు.

టీఎంఈసీవోడబ్ల్యూసీ అధ్యక్షుడిగా రాజిరెడ్డి ఎన్నిక

మాట్లాడుతున్న మొగుళ్ల రాజిరెడ్డి. చిత్రంలో ఆదిల్ షరీఫ్, చంద్రశేఖర్, నాగన్నగౌడ్

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ కాంగ్రెస్ - టీఎంఈసీవోడబ్ల్యూసీ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవనంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించగా రాజిరెడ్డిని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ ఎంప్లాయీస్, ఔట్‌సోర్సింగ్, ఒప్పంద కార్మికుల సమస్యలపై పోరాటంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర, ప్రధాన కార్యదర్శులు నాగన్నగౌడ్, ఆర్‌డీ చంద్రశేఖర్, రాష్ట్ర నేత ఆదిల్ షరీఫ్, ఐఎన్‌టీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేశ్, గ్రేటర్ సంఘం అధ్యక్షుడు పాశం రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

Andhra University Recognized by UGC- NAAC 'A' Grade. Degree Pass Certificate Join/ B.Sc, BBA, B.Com. Brilliant College, BHEL 'Y' Road, Hyd. ✆ 9491677226

REAL ESTATE

LAND FOR SALE

జనగాం- హుస్నాబాద్ హైవే దగ్గరలో 1.35 ఎకరం ఎర్ర నేల తూర్పు ఫేసింగ్‌తో 600ft పొడవు 150ft వెడల్పుతో బోర్ & జాలీ ఫెన్సింగ్‌తో అమ్మబడును. పౌల్ట్రీ ఫామ్స్/ ఏ ఫామ్ కైనా/ఏ తోటకైనా అనుకూలం. ✆ 8019095973.

INDUSTRIAL LAND FOR SALE
Industrial Plot N/A Converted, Ac. 2.80 Cents, Near NTPC Plant Parawada, Anakapalli District.
CONTACT: 7386776877

WANTED

Petrol Pump purpose 20 Yrs. Land Lease Wanted in Medchal- Malkajgiri and R.R. Dist, Financial City, within ORR limits. ✆ 9391026717

TO LET

COMMERCIAL

Commercial Space Rent. 6000 Sft at NGO's Colony, Vanasthalipuram, Hyd. 4 Floors, 1500 Sft each. ✆ 9550009075, 9550002075.

JOBS

Job Opportunity: Executive Assistant: Seeking a tech- savvy Executive Assistant under 30 with strong organizational and communication skills. Must be proficient in AI tools (ChatGPT, Gemini, Claude), cloud systems, advanced computer applications, file management, data handling, and software integration. Send resume and portfolio to: anaaafoundation@gmail.com

Wanted Sales Staff for Aggregate/ RMC/ Power Tools Sales Minimum 1 Year Experience. Interested Call: 8885041166 (Srinivas)

PVC పైప్స్ డిస్ట్రిబ్యూటర్‌కు హెల్పర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Sal: 20,000/-, Age: 21-45Y. Near కాళీమందిర్, కిస్మత్‌పూర్. Hyd. ✆ 8977873712/ 16

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ టెక్నికల్ ఆపరేషన్స్ లో అనుభవంగల M/F 8 మంది కావలెను. 2 సం॥ అనుభవం ఉండాలి. రాజమండ్రిలో నూతనంగా ప్రారంభించిన NBFC నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ హెడ్ ఆఫీస్ నందు మాత్రమే పని చేయుటకు కావలెను. అయోధ్య బిజినెస్ ఫైనాన్స్ Pvt. Ltd., ✆ 9100233999, 9866248160.

ప్రముఖ రియల్ ఎస్టేట్‌కు మార్కెటింగ్ మేనేజర్స్ VRS, Rtd. LIC, హౌస్ వైఫ్స్ P/F టైం (M/F) కావలెను. Age: 30+, జీతం+ కమీషన్ & ఫారన్ ట్రిప్స్. లక్ష్మి: 9505883856

ప్రముఖ అగర్‌బత్తి కంపెనీకి సేల్స్ మేనేజర్ హైద్రాబాద్ నందు అనుభవం గలవారు కావలెను. Attractive Salary. ✆ 9059960946, 9177699743

అనుభవంతో కావలెను. కొత్త ఇన్నోవా క్రిస్ట హైక్రాస్ డ్రైవర్- 25 వేలు, గ్రాఫిక్ డిజైనర్- 40 వేలు, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్- 20 వేలు, సూపర్‌వైజర్- 15 వేలు, లోడింగ్ బాయ్- 14 వేలు. ✆ 9100222333, 8885992363

స్కూల్‌లో పని చేయుటకు వాచ్‌మెన్- ఆయా (జంట) కావలెను. గది ఇవ్వబడును. రూ. 13K+ 13K. నోట్‌బుక్ స్కూల్, పిల్లర్: 179, అత్తాపూర్. ✆ 7207888177

NAVATA ROAD TRANSPORT
A Leading Logistics Organisation requires the following personnel to work at MAHESWARAM, RR DIST., and HYDERABAD CITY.
•CLERKS
•FIELD AREA COORDINATORS
•PICKERS / HELPERS
Qualification: SSC to PG
Freshers / Experienced
Interested candidates may walk in at: Plot No.1, Block No.1, Auto Nagar, Hyderabad – 70
7995545407

MARKETING/ SALES

Wanted Marketing Executives for a reputed Educational Institution. Experienced/Fresh MBA candidates may apply. Contact: 8790551173

రియల్‌ఎస్టేట్ శాలరీ బేస్ మార్కెటింగ్ డైరెక్టర్ కావలెను. స్మార్ట్ సిటీ, జహీరాబాద్ NIMZ 5KM, శే. 3,50,000/- ప్లాట్, EMI, స్పా. రిజి. Sal+inc= 50K ✆ 9281447559

షాద్‌నగర్- పరిగి హైవే ఫేసింగ్ HMDA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్ల ప్రాజెక్ట్స్ కోసం మార్కెటింగ్ డైరెక్టర్స్, టీమ్ మెంబర్స్ కావలెను. సంప్ర: 6281299738.

FACULTY/ TEACHERS

Wanted JL's (NEET/IIT) MATHS/ PHY/ CHE/ BIO(B/Z), Office Boy (A.25y) Lady Recpt. (Deg) Sri Chaitanya Academy, DSNR. ✆ 9885734904

ACCOUNTING

Wanted accountant male or female, should have experience in tally & GST Location at Saroornagar. ✆ 8297368368

TOURS AND TRAVELS

గోకర్ణ, శృంగేరి సౌత్ & నార్త్ గోవా, ధర్మస్థల, కుక్కే+ 28 క్షేత్రాలు 10 రోజులు SEP 27న, దసరాకు రామేశ్వరం+ 30 క్షేత్రాలు OCT 9న లక్ష్మి టూర్స్. ✆ 98662 46466

రామేశ్వరం, కన్యాకుమారి, మదురై 13వేలు, 8రో॥ 7-10. కాశీ, ప్రయాగ, నైమిశారణ్యం,అయోధ్య 14వేలు, 10రో॥ 26-9. అన్నిటూర్స్ మాస్వంత భో+రూం. సత్యసాయి. 9618933189

సాయి టూర్స్ Sep-16 రాజస్థాన్ జైపూర్. Sep-29 కేరళ Oct-12 కర్ణాటక టూర్ OCT-22 మహారాష్ట్ర NOV-15 కాశీ 9నిద్రలు Nov 29 శ్రీలంక ✆ 9848664831

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹3695/-
7 Ads Package ₹8580/-
★ GST 5% Extra
Call: 9908016959
Ph: 040-23440304, 23318181, Extn: 6422
Through online
www.eenaduclassifieds.com

నిర్యాణం

పంచమ వర్ధంతి

మంచికి మారుపేరుగా మా అందరి హృదయాలలో స్థానం సంపాదించుకున్న మీరు, మా నుండి దూరమైనారనే చేదు నిజం మరవ లేకున్నాం. మీ మధుర జ్ఞాపకాలు నిత్యం స్మరిస్తూ దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్తహృదయాలతో భార్య: S. లక్ష్మిప్రియ
అమ్మ, నాన్న - S. విశ్వనాథ్ యాదవ్ - ప్రమీల
అన్న, వదిన - S. శ్రీకాంత్ యాదవ్ - లక్షిత
అక్క, బావ - A. గౌరికృష్ణ యాదవ్ - పద్మావతి
కుమారులు - S. వియాన్, S. అరుదవ్, S. దక్ష
కుమార్తె - S. అవంతిక
అల్లుళ్ళు - A. చరిత్, A. ప్రమోద్, A. పవన్
S.V. కన్‌స్ట్రక్షన్స్ మరియు సంఘం కుటుంబ సభ్యులు బంధు మిత్రులు
కీ॥శే॥ సంఘం శివకుమార్ యాదవ్
జననం: 07-04-1986 మరణం: 01-09-2021

ద్వితీయ వర్ధంతి

మంచితనానికి మారుపేరుగా నిలిచి, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు కృషి చేసి మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మీ మరణం మాకు తీరని లోటు.. దైవ సన్నిధికి చేరి నేటికి 2 సం॥లు గడిచినను మీ మధుర స్మృతులు మరువలేకున్నాము. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో..
భార్య: కొమరబోయిన యశోద
కుమారులు - కోడళ్ళు: K. కృష్ణ - K. అనుష K. గోపాల్ - K. ఉష
కుమార్తె - అల్లుడు: J. రుషిత - J. శ్రీకాంత్
మనుమలు - మనవరాళ్ళు: K. చరణ్, K. హర్ష, J. నితీష్, K. ప్రణీత K. రోషిణి, J. నిఖిత
మరియు కొమరబోయిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
కీ॥శే॥ కొమరబోయిన యాదయ్య ముదిరాజ్ గారు
మరణం: 01-09-2024

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
పై సమాచారం సంబంధీకులందరికి చేరాలి ఎలా?
మీ ప్రయత్నానికి ఒక సులభ మార్గం
ఈనాడు లో ప్రకటన ఇవ్వడం ద్వారా
మీ సమస్యకు పరిష్కారం లభించును.
GST 5% అదనం
ఈనాడు హైదరాబాద్ సిటీలో కలర్ ప్రకటన రేటు చాలా తక్కువ
99635 22257
L.B.Nagar & Uppal: 90000 15736
Ameerpet, Oldcity & Sec-bad : 80085 97633
Kukatpally : 8008515142

వసుంధర

vasundhara@eenadu.in

ఈ వాసనల్ని దోమలు భరించలేవు...

ఈ కాలంలో దోమల బాధ కాస్త ఎక్కువే. వీటిని అరికట్టడానికి మార్కెట్లో దొరికే కెమికల్ కాయిల్స్, లిక్విడ్స్ వాడేస్తున్నారా? శ్వాసకోశ సమస్యలు వచ్చే ముప్పు ఉంది. ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధమైన పద్ధతులతో దోమలను తరిమేసే చిట్కాలివి.

- ప్రమిదలో కొద్దిగా వేప నూనె పోసి, అందులో కొన్ని కర్పూరం బిళ్లలు వేసి వెలిగించాలి. దీన్నుంచి వచ్చే పొగ, వాసనకు దోమలు, ఈగలు నిమిషాల్లో ఇల్లు వదిలి పారిపోతాయి.
- నిమ్మకాయను మధ్యలోకి కోసి, ఆ రెండు చెక్కల్లో లవంగాలను గుచ్చాలి. వీటిని హాల్లో, బెడ్‌రూమ్‌లో మూలల్లో ఉంచాలి. నిమ్మ, లవంగాల మిశ్రమ ఘాటు వాసనను దోమలు అసలు భరించలేవు.
- ఒక స్ప్రే బాటిల్లో నీరు తీసుకుని, అందులో కొన్ని చుక్కలు పెప్పర్‌మింట్ (పుదీనా నూనె) లేదా యూకలిప్టస్ ఆయిల్ (నీలగిరి తైలం) కలపాలి. ఈ మిశ్రమాన్ని ఇల్లంతా, ముఖ్యంగా కిటికీలూ, తలుపుల దగ్గర స్ప్రే చేస్తే ఆ సువాసనకు కీటకాలు అసలు లోపలికి రావు.
- కొన్ని వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి నీళ్లలో మరిగించాలి. ఆ నీటిని చల్లార్చి స్ప్రే బాటిల్లో పోసి ఇల్లంతా పిచికారీ చేయాలి. వెల్లుల్లి ఘాటైన వాసనకు దోమలు, ఈగలు క్షణంలో మాయమవుతాయి.
- మీ ఇంటి బాల్కనీ లేదా కిటికీల దగ్గర తులసి, పుదీనా, లెమన్‌గ్రాస్ లేదా బంతి మొక్కలను పెంచండి. ఈ మొక్కల నుంచి వచ్చే నేచురల్ అరోమా దోమలను సహజంగానే దూరం ఉంచుతుంది.

గిగ్‌లో గెలుపు... ఇంకెంత దూరం!

దేశంలో అధిక సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్న విభాగాల్లో ప్లాట్‌ఫామ్ ఎకానమీ ఒకటి. ఫుడ్ డెలివరీ, బైక్ ట్యాక్సీ సేవలు దీన్లో ప్రధానంగా ఉంటాయి. భారత్‌లో 2024-25 నాటికి 1.2కోట్లమంది గిగ్ వర్కర్లు ఉండగా, 2030 నాటికి ఈ సంఖ్య రెట్టింపు కానుంది. అయినా, ఇక్కడ మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువ. అంతర్జాతీయ కార్మిక సంఘం- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసర్చ్... సంయుక్తంగా దీని వెనక కారణాలపై తాజాగా ఓ నివేదిక తెచ్చాయి. ఆ వివరాలివి...

బ్యాంక్ అకౌంట్ల పరంగా మహిళలూ, పురుషుల మధ్య వ్యత్యాసం దాదాపుగా తగ్గింది. 2014 నాటికి 43 శాతం మహిళలకే బ్యాంకు అకౌంట్లు ఉంటే 2024 నాటికి 89 శాతానికి పెరిగింది. ఆ కాలానికి పురుషుల్లో చూస్తే 62 శాతం నుంచి 88 శాతానికి పెరిగింది. అదే సమయంలో డిజిటల్ ఆర్థిక నైపుణ్యాల్లో వెనకబాటు, రుణాలు లభించకపోవడం మహిళలకు సమస్యలుగా మారాయి.

ఒక్క శాతమైనా లేరు...

టూ వీలర్ డెలివరీ రైడర్లలో మహిళలు ఒక్క శాతంకంటే కాస్త తక్కువగా ఉన్నట్లు ఓ అధ్యయనాన్ని ఈ నివేదికలో ఉదహరించారు. వీళ్ల సగటు వయసు 28 ఏళ్లు.

డిజిటల్ వెనకబాటు...

బ్యాంకు అకౌంట్ ఒక్కటే మహిళల ఆర్థిక పురోగతికి సూచీ కాదు. ఆర్థిక సేవల్ని స్వతంత్రంగా, ప్రభావవంతంగా వినియోగించుకోవడమూ ప్రధానమే. ముఖ్యంగా ప్లాట్‌ఫామ్ ఉద్యోగాలకు డిజిటల్ చెల్లింపుల పరిజ్ఞానం అవసరం. 15 ఏళ్లు ఆపైన వయసున్న వారిలో కేవలం 25.2శాతం ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవల్ని ఉపయోగిస్తుండగా, పురుషుల్లో ఇది 47.1 శాతం.

రుణాలు అందక...

ఆర్బీఐ లెక్కల ప్రకారం 2023, మార్చి నాటికి బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నవాళ్లలో మహిళలు 22.9 శాతమే. ఎవరికైనా రుణాలు ఇచ్చేముందు బ్యాంకింగ్ సంస్థలు రుణ చరిత్ర చూస్తాయి. సాధారణంగా మహిళలకు రుణ చరిత్ర తక్కువ. దాంతో రుణాలు అందడం కష్టం, వచ్చినా పెద్ద మొత్తంలో ఉండవు. గిగ్ వర్కర్‌గా మారడానికి ప్లాట్‌ఫామ్‌లో చేరడానికి అవసరమయ్యే కనీస మొత్తమూ లేని మహిళలు 52 శాతం ఉన్నారు.

నిబంధనలు మారాలి...

మహిళల ఆదాయ మార్గాలకు తగ్గట్టుగా ఆర్థిక సేవలు ఉండేలా మార్పులు రావాలి. ప్లాట్‌ఫామ్ ఉద్యోగాల్లో చేరినప్పుడు ఆదాయంలో హెచ్చుతగ్గులు సహజం. అనారోగ్య సమస్యలకూ ఆస్కారం ఉంది. అలాంటప్పుడు చిన్న తరహా బీమా పథకాలు ఆదుకోవాలి. గిగ్ వర్కర్లుగా వచ్చే ఆదాయ వివరాల్ని చూపి మహిళలకు రుణాలు పొందే సదుపాయం రావాలి. తక్కువ ఆదాయం వచ్చే సమయంలో రుణ చెల్లింపుల్లో మినహాయింపులు ఉండాలి.

మహిళలు ■ పురుషులు ■

- దేశంలో బ్యాంకు ఖాతాల సంఖ్య

	2014లో	2024లో
మహిళలు	43%	89%
పురుషులు	62%	88%

	మహిళలు	పురుషులు
విభిన్నమైన డిజిటల్ ఆర్థిక నైపుణ్యాలు (ఆన్‌లైన్ చెల్లింపులు, సొంతంగా ఆర్థిక సేవల గురించి నెట్‌లో సర్చ్ చేయడం, మెయిల్ పంపడం)	18%	30.1%
15 ఏళ్లు దాటిన వాళ్లలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ చేస్తున్నవాళ్లు	25.2%	47.1%
గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ బ్యాంకింగ్	17.1%	39.2%
2023 మార్చి నాటికి వ్యక్తిగత రుణాలు పొందినవాళ్లు	22.9%	76.5
మొబైల్ అకౌంట్(డిజిటల్ వాలెట్) ఉన్నవాళ్లు	14%	32%

ఆమె పాటలకి... కోట్లలో ఆదరణ!

సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ జానపద గీతాలు తెగ వైరల్ అవుతున్నాయి. అలా ఇటీవల వచ్చిన 'బాసింగ బాసింగ బలాలే' అందరినీ ఆకట్టుకోవడమే కాదు... 11కోట్ల వీక్షణలూ దక్కించుకుంది. ఇది పాడింది నారెళ్ల శ్రీనిధి. ఇదే కాదు... ఈమె పాడిన చాలా పాటలకు ఆదరణ కోట్లలోనే! లాయర్ కావాలనుకున్న తను ఇటువైపు ఎలా వచ్చారు?

శ్రీనిధిది కరీంనగర్‌లోని మంకమ్మతోట. తండ్రి హన్మయ్య గుమస్తా.. తల్లి మంజుల. ఒకటో తరగతి నుంచే పాడటం, పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టారు శ్రీనిధి. పోటీ ఏదైనా ప్రథమ బహుమతి తనదే. ఆరో తరగతిలో ఉన్నప్పుడు జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో గెలిచారు. కానీ రాష్ట్రస్థాయి పాటల పోటీలకు పిలుపు రాలేదట. దీంతో ఆమె చాలా బాధపడ్డారట. అయినా పాటని మాత్రం ఆపలేదు. అదీగాక అమ్మానాన్నలు, టీచర్లు తనని ప్రోత్సహిస్తూ పోటీల్లో పాల్గొనేలా చేసేవారు. తగ్గట్టే శ్రీనిధి కూడా కచ్చితంగా బహుమతులు తెచ్చుకునేవారు. అయితే 2018లో రాష్ట్ర జానపద పోటీ తన దిశని మార్చింది. ఆ పోటీలో రెండో స్థానంలో నిలిచారామె. బహుమతిగా వచ్చిన మొత్తాన్ని చాలారోజులు గుర్తుగా దాచుకున్నారట కూడా.

అత్త కూతురి ద్వారా అవకాశం

శ్రీనిధి వాళ్ల అత్త కూతురు మానస ఫ్రెండ్ ఒకరు గాయనికోసం చూస్తోంటే... ఆమె శ్రీనిధిని పరిచయం చేశారట. అలా 2019లో తొలిపాట 'ఓ చందమామ నా మేన బావ' పాడే అవకాశం వచ్చింది. అప్పటికి శ్రీనిధికి పదోతరగతే పూర్తయ్యింది. ఆపై తన గొంతు నచ్చి మహేందర్ అనే మ్యూజిక్ డైరెక్టర్ 'చిలకపచ్చ చీర కట్టి' పాట పాడించారు. దీనికి 2.1 కోట్ల వీక్షణలొచ్చాయి. తనకి బ్రేక్ ఇచ్చింది మాత్రం 'సెలయేరు పారుతుంటే' అనే పాట. దీనికి 16కోట్ల వ్యూస్ వచ్చాయి. ఆపై నిండు పున్నమి వేళకి 23కోట్ల వీక్షణలున్నాయి. లాయర్ అవ్వాలనేది శ్రీనిధి లక్ష్యం. ఇంటర్లో సీఈసీలో చేరారు. తరవాత వరుస అవకాశాలు రావడం, వాటికి ఆదరణ పెరగడంతో లాయర్ కలను పక్కన పెట్టారు. ఇప్పటివరకు దాదాపు 700 జానపద పాటలు పాడారు. వాటిలో చాలావాటికి కోట్లలోనే వ్యూస్. తాజా బాసింగ బాసింగ బలాలే పాట రికార్డింగ్ సమయంలోనే కచ్చితంగా హిట్ అవుతుంది అనుకున్నారట. అనుకున్నట్టుగానే ఈ పాటకు తక్కువ సమయంలోనే 11 కోట్ల మందికి చేరువైంది. సోషల్‌మీడియా రీల్స్‌లోనూ ట్రెండ్ అయ్యింది. శ్రీనిధికి మంచి పేరునీ తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఫోక్ ఆర్ట్స్‌లో పీజీ చేస్తున్నారు. చదువులోనూ ముందే! సినిమాల్లోనూ పాడాలన్నది తన కోరికట!

– పొన్నం అజయ్, కరీంనగర్

మామగారిని రానివ్వట్లేదనే గొడవలు?

అమెరికాలో ఉంటున్నాము. మా మామగారికి ఉన్న చెడు వ్యసనాల వల్ల ఆయన్ని శాశ్వతంగా మా ఇంట్లో ఉండటానికి వ్యతిరేకించాను. దీంతో నా భర్త ప్రతి చిన్న విషయానికి గొడవ పడుతూ విడాకులు ఇస్తానని బెదిరిస్తున్నారు. 16సార్లు ఇల్లు వదిలెళ్లి తిరిగొచ్చారు. అమెరికా నిబంధనల ప్రకారం విడాకులు తీసుకుంటే నష్టపోయేది నేనే. పిల్లల బాధ్యతంతా నాపైనే ఉంది. నేనింకా భారతీయ పౌరసత్వాన్నే కలిగి ఉన్నాను. నాకు ఎలాంటి న్యాయపరమైన రక్షణ దొరుకుతుంది? – ఓ సోదరి

డియర్ వసుంధర

జి. వరలక్ష్మి, న్యాయవాది

మీ మామగారిని ఇంట్లో ఉండనివ్వకపోవడమే మీ భర్తకు మీమీద ఇష్టం లేకపోవడానికి కారణమై ఉండొచ్చు. పిల్లలు చెడిపోతే వాళ్ళని బయటికి పంపిస్తున్నామా? బాగు చేసుకోవడానికి ప్రయత్నిస్తాం కదా? తండ్రిని మీ మూలంగా బయటికి పంపాల్సి వచ్చిందని ఆయన బాధ పడుతుండొచ్చు. అయినా మీ భర్త ఎందుకు ప్రతిసారి ఇల్లు వదిలి వెళ్లిపోతున్నారు? వెళ్లి ఎక్కడ ఉంటున్నారు? తిరిగి వస్తున్నారంటే మిమ్మల్ని వదిలెళ్లే ఉద్దేశం లేదనే కదా అర్థం. మీరు విడాకులు కావాలి అనుకుంటున్నారా? ఆయన తీసుకోవాలనుకుంటున్నారా? ముందుగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ని సంప్రదించండి. పిల్లల బాధ్యత ఇద్దరి మీదా ఉంది. విడాకులు తీసుకున్నా... పిల్లలు వారి వారి జీవితాల్లో స్థిరపడే వరకు వాళ్ల పోషణ బాధ్యత తల్లిదండ్రులు ఇద్దరికీ సమానంగా ఉంటుంది. హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ -26 ప్రకారం కస్టడీ మెయింటెనెన్స్ అనేవి కోర్టు పరిస్థితులను బట్టి నిర్ణయిస్తుంది. హిందూ మైనారిటీ గార్డియన్‌షిప్ యాక్ట్ ప్రకారం 5 ఏళ్లలోపు పిల్లల కస్టడీ మాత్రం తల్లికి చెందుతుంది. పిల్లల సంక్షేమాన్ని బట్టీ కోర్టు నిర్ణయిస్తుంది. మిమ్మల్ని మీరు పోషించుకోలేని స్థితిలో ఉంటే మీకు, పిల్లలకు మీ భర్త సంపాదన, ఆస్తులను బట్టి మెయింటెనెన్స్ కోరవచ్చు. అది ఎంతనేది అతని జీతం, ఆస్తులు, మీ అవసరాలు మొదలైనవి పరిగణనలోకి తీసుకుని నిర్ణయిస్తారు. విడాకుల కేసు మీరు వేయాలనుకుంటే హిందూ వివాహ చట్టంలోని 13(1) ప్రకారం ఫ్యామిలీ కోర్టులో వేయాలి. ఇందులోని సెక్షన్ 25 ప్రకారం మీకు ఇచ్చిన కట్నకానుకలు, పిల్లల భవిష్యత్తు అవసరాలు, మీకు సంపాదన లేకపోతే మీకు కావాల్సిన పరిహారం... అన్నీ కలిపి ఒకే మొత్తంగా కోరవచ్చు. సెక్షన్ 144 బీఎన్ఎస్ఎస్ ప్రకారం తనని తాను పోషించుకోలేని స్థితిలో ఉన్న భార్య, మైనర్ చిన్నారుల పోషణ ఖర్చులు భర్త భరించాల్సిందే. కాబట్టి తగిన సాక్ష్యాధారాలతో కోర్టులో కేసు వేయండి.

మగువల హారం.. ముగ్గుల సింగారం!

సంధ్యవేళ వాకిట్లో ముగ్గులు... వాటికి రంగుల సిరులు అద్దడం మన సంప్రదాయం. ఇప్పుడు అవి కేవలం నేలకే పరిమితం కావడం లేదు. అందమైన డిజైన్లుగా మారి... మహిళల మెడలో హారాలై మెరుస్తున్నాయి. తెలుగు, తమిళ సంస్కృతిలో భాగమైన 'ముగ్గు(కోలమ్) కళను మేళవిస్తూ రూపొందిస్తున్న ఈ ఆభరణాలు ఇప్పుడు ట్రెండ్‌గా నిలుస్తున్నాయి. ఆధునికతకు సంప్రదాయాన్ని అద్ది వీటిని అందంగా తీర్చిదిద్దుతున్నారు. చుక్కలతో పెట్టిన మెలికల ముగ్గులు పెండెంట్లుగా తళుక్కుమంటున్నాయి. బంగారు వర్ణపు తీగలతో అల్లినట్లుండే ఇవి చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటూనే మన మూలాలను గుర్తుచేస్తున్నాయి. పట్టు చీరలకైనా, మోడ్రన్ కుర్తీలకైనా ఈ ట్రెండీ కోలమ్ చోకర్లు, లాంగ్ నెక్లెస్‌లు అద్భుతమైన లుక్‌ని ఇస్తున్నాయి. కేవలం నెక్లెస్‌లే కాకుండా, వాటికి సరిపోయేలా జుంకాలు, చెవి దిద్దులు కూడా ఇదే ముగ్గుల డిజైన్‌లో రావడం విశేషం. ముఖ్యంగా సంప్రదాయ వేడుకలు, పండుగలు, వివాహ వేడుకల్లో ప్రత్యేకంగా నిలవాలనుకునే యువతులు ఈ జ్యూవెలరీకి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. మీ అందానికి మరింత వన్నె తెచ్చే ఈ కోలమ్ జ్యూవెలరీతో ఈ సీజన్లో ప్రత్యేకమైన ట్రెండ్‌ని క్రియేట్ చేయండి మరి.

నాన్న దినసరి కూలీ... కూతుళ్లు రగ్బీ క్రీడాకారిణులు!

'పొట్టి నిక్కర్లలో తిరుగుతున్నారు' 'రాత్రుళ్లు ఎప్పటికో ఇంటికి చేరతారు ... ఇలా అమ్మాయిల్ని పెంచుతారా' అంటూ అందరూ తిట్టేవాళ్లే! కానీ ఆ అమ్మాయిలు పట్టించుకోలేదు. ఆటపైనే దృష్టిపెట్టారు. కాబట్టే, జాతీయస్థాయి క్రీడాకారిణులుగా ఎదిగారు... కోమల్ కుమారి, ప్రియాన్షూ కుమారి!

బిహార్‌లోని రఘుబిషా అనే పల్లె కోమల్, ప్రియాన్షూలది. తండ్రి ధర్మేంద్ర సావో దినసరి కూలీ. తల్లి పింకీ దేవి టైలర్. ముగ్గురమ్మాయిలు, ఒకబ్బాయి. వాళ్లని పోషించడమే కష్టం. అయినా కూతుళ్ల కలను కాదనలేదా తల్లిదండ్రులు. 'అమ్మాయిల్ని ఆటలంటూ అలా తిప్పుతారా? పైగా పొట్టి నిక్కర్లు వేసుకుని ఆడుతుంటారు. ఏ రాత్రికో ఇంటికి చేరుతుంటారు. ఇలాగైతే వాళ్ల భవిష్యత్తు ఏంటి? అయినా ఆటలంటే మాటలా? బోలెడు డబ్బులు కావాలి' ఇలా ఎన్ని మాటలన్నా వాళ్లు మాత్రం కూతుళ్లని ప్రోత్సహిస్తూనే వచ్చారు.

ఈ ఇంట్లో క్రీడా ప్రయాణం మొదలవ్వడానికి కారణం పెద్దమ్మాయి 17ఏళ్ల కోమల్ కుమారి. తను మొదట్లో ఖోఖో ఆడేది. స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడు రగ్బీ వైపు వెళ్లేలా ప్రోత్సహించారు. మొదట్లో ఆడలేక, గాయాలను చూసి కోమల్ భయపడిందట. అయినా ఆడుతూ వెళ్లింది. ఆత్మవిశ్వాసం పెంచుకుంది. ఏడాదిలోనే పట్నాలో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో అండర్-17 కేటగిరీలో బంగారు పతకం సాధించింది. ఆ తరవాత గ్వాలియర్ ఓపెన్ గేమ్స్‌లో రెండు బంగారు పతకాలు, ఒడిశాలోనూ బంగారం, రగ్బీలీగ్‌లో వెండి, హైదరాబాద్ జూనియర్ నేషనల్ రగ్బీ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం... ఇలా వరుస పతకాలు సాధిస్తూ వెళ్లింది. 'జాతీయస్థాయి పోటీల్లో చాలా పతకాలు సాధించా. ఆటలోకి వచ్చేటప్పుడు భయపడ్డా. ఇప్పుడు ఆస్వాదిస్తున్నా. అందరూ నిరాశపరిచినా నాన్న, ఇంట్లోవాళ్లు అండగా ఉండటం వల్లే కొనసాగగలుగుతున్నా' అంటుంది కోమల్.

అక్కని చూసి ప్రియాన్షూ కూడా రగ్బీ ఎంచుకుంది. తొలిరోజుల్లో చాలా తడబడేదట. సాధనతో మెరుగైంది. తొలి నేషనల్ స్కూల్ గేమ్స్‌లోనే బంగారం అందుకుంది. ఒడిశాలో జరిగిన సబ్ జూనియర్ రగ్బీ ఛాంపియన్‌షిప్‌లోనూ అండర్-15 కేటగిరీలోనూ బంగారం సాధించింది. నేషనల్ రగ్బీ టోర్నమెంట్, నేషనల్ రగ్బీ స్కూల్ గేమ్స్‌లోనూ వెండి పతకాలు సాధించింది. వీళ్లని చూసి ఇంకో చెల్లీ ఆటలోకి అడుగుపెట్టింది. 'భారత్ తరఫున ఆడటం మా కల. ఇండియా జెర్సీలో మమ్మల్ని మేం చూసుకోవాలనుంది. అప్పటివరకూ శ్రమిస్తాం. అంతర్జాతీయ పోటీల్లో దేశానికి పతకాలు తెస్తాం' అంటున్నారీ అక్కాచెల్లెళ్లు. ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా?

ఈటీవీ భారత్

మీకు తెలుసా!

గర్భధారణ సమయంలో కొంత మందికి ఆహార పదార్థాల రుచి తెలియదు, నోరంతా చప్పగా అనిపిస్తుంది కదా! దీన్నే డిస్గ్యూజియా అంటారట. గర్భిణులలో ఈ లక్షణాలు మొదటి మూడు నెలల్లో ఎక్కువగా కనిపిస్తే... కొందరిలో ప్రసవం అయ్యేవరకూ ఉంటాయని చెబుతున్నారు నిపుణులు. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ల స్థాయిలు వేగంగా పెరగడమే దీనికి కారణమట.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



31న ముగింపు

	బంగారం (24క్యా)(10గ్రా)	ఆర్నమెంట్ (22క్యా)(10గ్రా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,59,730	1,44,150	2,42,543
విజయవాడ	1,54,715	1,43,700	2,41,700
ప్రొద్దుటూరు	1,50,000	1,38,000	2,35,000
రాజమహేంద్రవరం	1,56,770	1,43,700	2,60,000
విశాఖపట్నం	1,56,700	1,43,700	2,45,000
తమిళనాడు	-----	1,43,700	2,60,000

మేకప్‌లో ఈ రూల్ పాటిస్తున్నారా?

ఆఫీసు లేదా ఫంక్షన్‌కి వెళ్లడానికి రెడీ అవుతామా! ఫేస్ క్రీమ్ దొరికితే... లిప్‌స్టిక్ దొరకదు ... ఈ రెండూ దొరికితే ఐలైనర్ కనిపించదు. దాంతో డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు మొత్తం వెతికేస్తాం. కావాల్సిన వస్తువులు ఒకటికి రెండున్నా సమయానికి చేతికి దొరక్కపోతే... ఆ టైమ్‌లో చిరాకు రాకమానదు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే మేకప్ డ్రాయర్ రూల్ పాటించి చూడండి. ఈ పద్ధతిలో సౌందర్య ఉత్పత్తుల్ని సర్దుకుంటే వస్తువులు త్వరగా దొరకడంతోపాటు ముస్తాబయ్యే సమయం కూడా ఆదా అవుతుంది. దీనికోసం ఏంచేయాలంటే...

- సన్‌స్క్రీన్, కాజల్, లిప్‌స్టిక్... రోజూ వాడేవే కాబట్టి వీటిని ముందు భాగంలో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు వాడే ఐషాడో ప్యాలెట్లు, బ్రైట్ షేడ్స్ వంటివి వెనక భాగంలో సర్దుకుంటే పని సులువవుతుంది.

- కొన్ని మేకప్ వస్తువులకు గడువు తేదీ ఏడాది ఉంటే... మరికొన్ని మూడు నాలుగు నెలల్లోనే ఎక్స్‌పైర్ అయిపోతాయి. గడువు ముగిసినా వాటిని బయటపడేయకుండా... కొత్తగా తెచ్చుకున్నవి వాటితో కలిపేస్తుంటాం. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే గడువు చెల్లిన వాటిని తొలగించాకే కొత్తవాటిని సర్దుకోవాలి.
- ఒక్కోసారి హడావుడిలోపడి మేకప్ పూర్తయ్యాక వాటి మూతలు పెట్టకుండా ర్యాక్‌లో పడేస్తుంటాం. దీనివల్ల అవి ఇతర సామగ్రికి అంటుకొని సొరుగు మొత్తం చిందరవందరగా కనిపిస్తుంది. అంతేకాదు, వాటిల్లోకి తేమ చేరి బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఎక్కువ. అందుకే మేకప్ పూర్తికాగానే మూత పెట్టడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి.
- మేకప్ అంటే స్కిన్ కేర్ ఒక్కటేనా.. హెయిర్ కేర్ కూడా ఉంటుంది కదా. ఈ రెండు రకాల ఉత్పత్తులనీ కలపొద్దు అంటున్నారు సౌందర్య నిపుణులు. ఒకవేళ ఒకేచోట ఉంచితే రెండింటి మధ్యా పార్టిషన్ ఉండేలా డ్రా ఆర్గనైజర్ ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడే చూడ్డానికి అందంగానూ వాడుకోవడానికి వీలుగానూ ఉంటుంది.

(c) eenadu

...చూసుకోండి బాస్!

ఆఫీస్‌కు వెళ్లే సమయంలో షూస్ శుభ్రం చేయడం లేదా? ద్విచక్ర వాహనం దిగాక హెల్మెట్‌ను వాహనానికే వదిలేస్తారా? అయితే ఈ అలవాట్లు మార్చుకోవాల్సిందే. వస్తువులైనా.. వాహనాలైనా శుభ్రత ఎంతో ముఖ్యం. లేదంటే దుమ్ము పేరుకుపోతుంది. అది ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తుంది. ఇంకా అశ్రద్ధగా ఉంటే అందులోకి విషకీటకాలు చేరితే ప్రాణాలమీదకూ రావొచ్చు.
నిత్యం ఇల్లు, వంటపాత్రలు ఎలా శుభ్రం చేస్తారో.. రోజూ వాడే వస్తువుల్ని కూడా అంతే శ్రద్ధగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

ద్విచక్ర వాహనాన్ని రోడ్డు వారగానో, ఆరుబయటో నిలిపి.. హెల్మెట్ దానికే తగిలించి వెళ్లిపోతుంటాం. తిరిగొచ్చాక తీసి తలకు పెట్టుకుని డ్రైవింగ్ ప్రారంభిస్తాం. ఈలోగా అందులో ఏ పురుగో దూరితే చాలా ప్రమాదం. హెల్మెట్ లోపల, చెవుల వద్ద చిన్నపాటి ఖాళీలు ఉంటాయి. అందులో ఏదైనా పురుగు చేరి... తలకు పెట్టుకోగానే చెవిలోకి వెళ్లిందంటే చాలా ప్రమాదం. వాహనం నడిపే సమయంలో అది బయటకు వస్తే ఆందోళనకు లోనవుతాం. వాహనంపై పట్టు కోల్పోవచ్చు. అందుకే హెల్మెట్ తలకు తగిలించుకునే ముందు.. లోపల ఏమైనా ఉన్నాయేమో చూసుకోవడం ఎంతో ముఖ్యం.

పొద్దున్నే హడావుడిగా ఆఫీసుకు బయల్దేరుతుంటాం.. రాత్రి వరండాలో విడిచిన షూస్ బయటకు లాగి. అందులో కాలు పెట్టేస్తాం. ఫోను మాట్లాడుతూనో, ఆఫీసుకి టైమ్ అవుతుందనే ఆత్రుత వల్లనో షూ లోపల ఏముందో చూడాలనే ఆలోచన కూడా రాదు. తేలు, కాళ్లజెర్రి, పాము తదితర విషకీటకాలు అందులోకి చేరే ప్రమాదం ఉంది. కాలు ఒత్తిడి తగలగానే అవి కాటేయొచ్చు. పిల్లల్ని బడికి పంపే హడావుడిలో షూస్ తొడిగి పంపేస్తుంటారు. అప్పుడు ఒకసారి లోపల ఏముందో తప్పనిసరిగా చూడాలి.

కారు తీసుకుని బయటకు వెళ్లే ముందు సాధారణంగా.. ముందు అద్దాలు శుభ్రం చేస్తారు. డ్రైవర్ సీటుపై దుమ్ము తుడిచేస్తారు. కానీ నిన్న రాత్రి తాగి వదిలేసిన వాటర్ బాటిల్స్, ఖాళీ కూల్‌డ్రింక్ డబ్బాలు కారులో ఉన్నాయనే సంగతి మీకు తెలియకపోవచ్చు. కారు ప్రయాణించే సమయంలో అవి నిదానంగా డ్రైవర్ కాళ్ల వద్దకు వచ్చి బ్రేక్, యాక్సిలేటర్, క్లచ్‌కు అడ్డు పడొచ్చు. హఠాత్తుగా బ్రేక్ నొక్కితే పడదు. తేరుకునే లోపే ఎదురున్న వాహనాన్ని ఢీకొట్టే ప్రమాదముంది. అందుకే ఒకసారి కారును శుభ్రం చేసుకున్నాకే కదిలించడం ఉత్తమం.

కారు నిలిపేసి హడావుడిగా ఇంట్లోకి వెళ్తున్నారా? లాక్ ఒకసారి తరచి చూసుకోండి. ఒక్క క్షణం పాటు ఆగి చూస్తే వచ్చే నష్టమేమీ ఉండదు. చూడకపోతే ప్రాణాలమీదకు వచ్చే ప్రమాదముంది.. ఎలాగంటారా? మీరు ఇంట్లోకి వెళ్లాక.. చుట్టుపక్కల ఇళ్లకు చెందిన పిల్లలెవరైనా అందులోకి ప్రవేశించొచ్చు. ఆటోమేటిక్‌గా లాక్ పడిపోవచ్చు. ఇది ప్రాణాంతకంగా మారొచ్చు. కారు నడిపే సమయంలోనూ లోపల పిల్లలుంటే.. చైల్డ్‌లాక్ ఆన్ చేయడం మరచిపోవద్దు. పిల్లలు తెలిసీ తెలియక హఠాత్తుగా డోర్ తెరిస్తే వారితోపాటు పక్కన ప్రయాణించే వాహనాలకూ ప్రమాదమే.

- ఈనాడు,అమరావతి

సర్కారు ఆసుపత్రుల్లో మెరుగవుతున్న ఐవీఎఫ్ సేవలు

మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలు మెరుగవుతున్నాయని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లు ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గాంధీ, పేట్లబుర్జు ఆసుపత్రుల్లో ఇప్పటి వరకు 39,802 మందికి ఫెర్టిలిటీ వైద్యసేవలు అందించామని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతోమంది దంపతులు తమ సంతానం కలను నెరవేర్చుకోవడంలో గాంధీ, పేట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్లు ఉపయోగపడుతున్నాయన్నారు. జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సర్కారు సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు. 379 ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లను తనిఖీ చేయగా, 50 సెంటర్లలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించామని, వాటిపై చర్యలు తీసుకున్నట్లు కుటుంబ ఆరోగ్యసంక్షేమ కమిషనర్ సంగీత సత్యానారాయణ మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి క్రిస్టినా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన ఆయుష్ విద్యార్థులు

ఆయుష్ విద్యార్థులు సమ్మె విరమించినట్లు సోమవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సచివాలయంలో ఆయుష్ మెడికోలు దామోదర్ రాజనర్సింహను కలిసి తమ సమస్యలను విన్నవించారు. వారి స్టైపెండ్ పెంచుతామని మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు విద్యార్థులు వెల్లడించారు.

ఇళ్లు కట్టించిన ఊర్లలోనే ఓట్లు అడుగుతాం

- ప్రత్యేక రాష్ట్రం తెచ్చాననే పెద్దమనిషి ధరణితో రైతులను గోసపెట్టారు
- హరీశ్‌రావుకు కాంగ్రెస్ పథకాలు కనిపించడం లేదా?
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మహబూబాబాద్ జిల్లా నారాయణపురంలో పట్టాపుస్తకాల పంపిణీ

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులకు భూఆధార్ పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, చిత్రంలో కలెక్టర్ స్నేహాశబరీష్, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డీసీసీ అధ్యక్షురాలు ఉమ, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ తదితరులు

ఈనాడు, వరంగల్: 'గుడి లేని ఊరు ఉండచ్చేమోగానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు. మేము గృహాన్ని మంజూరు చేసేటప్పుడు.. కులం.. మతం అడగం.. కనీసం కాంగ్రెస్‌కు ఓటెయ్యండని కూడా అడగం. ఎందుకంటే.. అక్కచెల్లెమ్మల ఆశీర్వాదాలు ఈ ప్రజా ప్రభుత్వానికి ఎలాగైనా ఉంటాయని మా గట్టి నమ్మకం' అని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మంత్రి సీతక్క, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నారాయణపురంలోని పట్టా భూములు, భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో అధికారుల తప్పిదంతో అటవీ భూముల జాబితాలోకి చేరిపోయాయి. ఇటీవల రీసర్వే చేపట్టి ఆ వివాదాలను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో అర్హులైన రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు, భూధార్ కార్డులను స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి పంపిణీ చేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి పొంగులేటి ప్రసంగించారు. 'వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఊర్లో మాత్రమే ఓట్లు అడుగుతాం. మా ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు తెలుపుతామంటూ కొందరు బయలుదేరుతున్నారు. పదేళ్లు మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో ప్రజల ముందుకెళ్లి అడిగితే చెబుతారు. సన్నబియ్యం, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, వడ్డీలేని రుణాలు మాజీ మంత్రి హరీశ్‌రావుకు కనిపించటం లేదా? 'అమ్మ పుట్టిల్లు.. మేనమామకు ఎరుక' అన్నచందంగా ఆయన వ్యవహారాన్ని ఆ మేనమామ ఇంటి మనిషే బయటపెడుతోంది. ప్రత్యేక రాష్ట్రం తెచ్చానని చెప్పుకొనే పెద్దమనిషికి రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి రీసర్వే చేయించాలనే ఆలోచన రాలేదు. పైగా ధరణి తీసుకొచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేశారు. నారాయణపురంలో 1,468 ఎకరాలకు, తుంగతుర్తి నియోజకవర్గంలో 3,400 ఎకరాలకు హక్కులు కల్పించి పట్టా పాస్‌పుస్తకాలు పంపిణీ చేశాం' అని పొంగులేటి పేర్కొన్నారు. గల్లీగల్లీకి అభివృద్ధి.. గడపగడపకు సంక్షేమం అందించటమే కాంగ్రెస్ విధానమని మంత్రి సీతక్క అన్నారు. కేసముద్రంలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ..'ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తూ కేసముద్రం ప్రాంత అభివృద్ధికి రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి చొరవ చూపుతున్నారు. మేం చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తోంది. భారాస సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని వారు నమ్మరు. పింఛన్ల కోసం కొత్తగా 4.5 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఈసారి తలసేమియా బాధితులకు కూడా పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం' అని వెల్లడించారు. సభలో ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, గృహనిర్మాణశాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ స్నేహాశబరీష్, ఎస్పీ శబరీష్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాజరుకాని కొండా సురేఖ

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్న మంత్రి కొండా సురేఖ కేసముద్రం, మహబూబాబాద్‌లో నిర్వహించిన రెండు కార్యక్రమాలకు గైర్హాజరయ్యారు. బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటం వల్ల తాను హాజరుకాలేకపోయానని ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే కేసముద్రంలో బహిరంగసభ వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కొండా సురేఖ ఫొటో, అభివృద్ధి పనుల శిలాఫలకంపై ఆమె పేరు లేకపోవటం చర్చనీయాంశమైంది.

మంత్రి శ్రీధర్‌బాబుతో జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ ప్రతినిధులు

సెమీకండక్టర్ తయారీకి తెలంగాణ అనుకూలం

జీఐబీఏ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: సెమీకండక్టర్ తయారీ రంగానికి తెలంగాణ అత్యంత అనుకూలమని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కంపెనీలను ప్రోత్సహించాలని జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (జీఐబీఏ) ప్రతినిధులను ఆయన కోరారు. రాష్ట్రాన్ని సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సెమీకండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఆటోమేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులకున్న అవకాశాలు, అనుకూలతలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. "జర్మనీ కంపెనీల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రెసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యాలను తెలంగాణలోని టాలెంట్ పూల్, ఇండస్ట్రీ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం చేయనున్నాం. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 7, 8, 9 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలి" అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఐబీఏ ఛైర్మన్ సెల్వకుమార్ పెరియసామి, సీఈవో నిర్మల్ రామన్ కన్నయ్యన్, ఇన్నోవేషన్ హబ్ రైన్‌మెయిన్ సీఈవో స్టెఫాన్ విట్‌కిండ్ట్, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెళ్ల, వినోద్‌కుమార్ అగర్వాల్, లోకేష్ ఫతేపురియా తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాలకు పెద్దపీట

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వెయ్యి రోజుల ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ.. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని చేరుకున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ఇతర ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు సోమవారం వారు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. 'రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీతోపాటు 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాం. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాం' అని పేర్కొన్నారు.

✦ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ భాగస్వామ్యం లేదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడి పదవి నుంచి కేసీఆర్ దిగిపోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేయాలని సోమవారం ఆయనొక ప్రకటనలో కోరారు.

✦ సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే గొప్ప సంక్షేమ పాలనను అందిస్తున్నారని ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, మేడిపల్లి సత్యంలు పేర్కొన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై వీరేశం, రాజ్‌ఠాగూర్, సత్యం అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ మీడియా హాలులో మాట్లాడగా, ఆది శ్రీనివాస్ ఓ ప్రకటనలో స్పందించారు.

తెలంగాణలో ఒకేసారి 42 రైల్వేస్టేషన్ల అభివృద్ధి

జోగులాంబ రైల్వే స్టేషన్ పరిశీలనలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఉండవల్లి, అలంపూర్, మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒకేసారి 42 రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని, చర్లపల్లి, కొమురవెల్లి, వరంగల్, కరీంనగర్ స్టేషన్లను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2027 చివరి నాటికి ఆ పనులు పూర్తవుతాయన్నారు. ఎంపీ డీకే అరుణ, డీఆర్‌ఎం సంతోశ్‌కుమార్ వర్మ, ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వే స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వేస్టేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. ఉండవల్లి, గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నామని తెలిపారు. అనంతరం గద్వాల జిల్లా కేంద్రానికి వెళ్లారు. గద్వాల రైల్వేస్టేషన్ శతాబ్ది ఉత్సవాలను 2027 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. రూ.45 కోట్లతో బాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్వోబీ నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కేంద్రం రూ.37 కోట్లు మంజూరు చేసిందని, పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని చెప్పారు.

జోగులాంబ ఆలయంలో కిషన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సహాయ కమిషనర్ శ్రీనివాసరాజు. చిత్రంలో డీకే అరుణ తదితరులు

నల్గొండలో భాజపా కార్యాలయంపై దాడికి ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నల్గొండలో భాజపా, కాంగ్రెస్ మధ్య ఘర్షణ

ఈనాడు, నల్గొండ- నీలగిరి, న్యూస్‌టుడే: కాంగ్రెస్, భాజపా నాయకుల ఘర్షణలతో నల్గొండలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంపై యువజన కాంగ్రెస్ ముట్టడి, దాడిని నిరసిస్తూ నల్గొండ జిల్లా భాజపా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేవైఎం శ్రేణులు నల్గొండ శ్రీనగర్‌కాలనీలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని సోమవారం దాడులకు పాల్పడ్డారు. దిష్టిబొమ్మకు నిప్పుపెట్టారు. కార్యాలయం ముందున్న మంత్రి కటౌట్‌ను చింపివేసి మంత్రికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేవైఎం నాయకులు టమాటాలు, కోడిగుడ్లను మంత్రి కార్యాలయంపై విసిరారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలిసి నల్గొండ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న భాజపా కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. చైతన్యపురి కాలనీలోని వర్షిత్‌రెడ్డి ఇంట్లో సామగ్రి ధ్వంసం చేశారు. ఆ సమయంలో వర్షిత్‌రెడ్డి ఇంట్లో లేరు. పోలీసులు వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పి పరిస్థితులను చక్కదిద్దారు. ఇరుపార్టీల నాయకులు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఎవరిపై ఇంకా కేసులు నమోదు చేయలేదు. మంత్రి క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వర్షిత్‌రెడ్డిపై పీడీ యాక్టు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు.

భాజపా కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- గేటుకు నల్లరంగు పూసి యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసన
- కాంగ్రెస్ జెండా దహనం చేసి భాజపా కార్యకర్తల ఆందోళన

భాజపా కార్యాలయం వద్ద యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి తదితరుల నిరసన

ఈనాడు, హైదరాబాద్ - గన్‌ఫౌండ్రి, అబిడ్స్, న్యూస్‌టుడే: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయ ముట్టడి యత్నం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బదులుగా భాజపా యువ మోర్చా నేతలు గాంధీభవన్ ముట్టడికి యత్నించారు. దీంతో ఇరు పార్టీల రాష్ట్ర కార్యాలయాల పరిసర ప్రాంతాలు కార్యకర్తల నినాదాలు, పోలీసు పహారాతో ఉద్రిక్తంగా మారాయి. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై భాజపా అవమానకరంగా వ్యవహరిస్తోందని, బిహార్‌లో విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ఘటనను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భాజపా కార్యాలయ ముట్టడికి తరలివచ్చారు. పార్టీ కార్యాలయ గేటుకు నల్లరంగు పూసి.. దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. పోలీసులు యువజన కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వివిధ ఠాణాలకు తరలించారు. విషయం తెలుసుకున్న భాజపా యువ మోర్చా కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకుని గేటుపై నల్లరంగును తుడిచేశారు. అనంతరం గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించి గుడ్లు, టమాటాలు విసిరి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ కుండె, జి.హరీశ్వర్‌రెడ్డి తదితరులను పోలీసుస్టేషన్లకు తరలించారు. అనంతరం భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ జెండాను దహనం చేసి నినాదాలు చేశారు. పోలీసులు, యువ మోర్చా కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి.

ప్రశ్నిస్తే దాడులు చేయడం హేయమైన చర్య: కిషన్‌రెడ్డి

భాజపా రాష్ట్ర కార్యాలయంపై, నల్గొండ జిల్లా భాజపా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడులు చేయడం హేయమైన చర్య అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, 22ఏ కుంభకోణంపై కాంగ్రెస్ సర్కారును భాజపా ప్రశ్నిస్తుండటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ నేతలు ఈ విధ్వంస రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. భాజపా కార్యాలయాలు, కార్యకర్తల ఇళ్లపైకి వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

✦ భాజపా కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతలు దాడి చేస్తుంటే పోలీసులు ఎందుకు స్పందించలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

✦ భాజపా కార్యాలయంపై దాడి అత్యంత హేయమైన చర్య అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ అన్నారు. భాజపాకు ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ కార్యకర్తలు దాడులకు దిగుతున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ సర్కారు 30% కమీషన్లతో నడుస్తోంది

- 22ఏ భూముల అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద మహాధర్నాలో పాల్గొన్న రామచందర్‌రావు. చిత్రంలో అర్వింద్, రఘునందన్‌రావు తదితరులు

సిద్దిపేట, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు 30% కమీషన్లతో నడుస్తోందని, పేదల భూముల్లోనూ కమీషన్లు తీసుకుంటున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. 22ఏలో ఎన్ని ఎకరాలు చేర్చారు... ఎందుకీ పరిస్థితి వచ్చిందనే అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నిషేధిత జాబితా నుంచి రైతులు, పేదల భూములను తొలగించాలని డిమాండ్ చేస్తూ.. భాజపా ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ... 'సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వాన్ని స్థిరాస్తి సంస్థ మాదిరి నడిపిస్తున్నారు. భూములన్నింటిని అదే ధోరణిలో చూస్తున్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటే రెవెన్యూ అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారు. 22ఏ భూముల వ్యవహారంలో తప్పు ఒప్పుకొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి వారం రోజుల్లో దాన్ని సరిదిద్దాలి. లేదంటే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తాం' అని హెచ్చరించారు.

'తుమ్మిడిహెట్టి'పై నేడు తెలంగాణ, మహారాష్ట్ర చర్చలు

ఈనాడు, హైదరాబాద్: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజీ ఎత్తు ఖరారు విషయంలో చర్చించేందుకు మంగళవారం దిల్లీలోని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాలయంలో తెలంగాణ, మహారాష్ట్ర భేటీ కానున్నాయి. నీటిపారుదల, జలవనరుల శాఖల కార్యదర్శుల స్థాయిలో తొలి సమావేశం జరగనుంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, మహారాష్ట్ర జల వనరుల శాఖ అదనపు ప్రత్యేక కార్యదర్శి దీపక్ కపూర్ సమావేశమై చర్చలు జరపనున్నారు. సీడబ్ల్యూసీ ఇంజినీర్ల బృందంతోపాటు రెండు రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర జల వనరుల బృందాలు ఈ చర్చల్లో పాల్గొననున్నాయి. రెండు రాష్ట్రాల భేటీకి కేంద్రం చొరవ చూపడంతో ఈ సమావేశం ఖరారైన సంగతి తెలిసిందే.

మంత్రుల భేటీ...: తుమ్మిడిహెట్టి అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రాధాకృష్ణ పాటిల్‌తో మంగళ, బుధవారాల్లో భేటీ కానున్నారు. బ్యారేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలున్నట్లు నీటిపారుదల వర్గాలు వెల్లడించాయి. బుధవారం జరిగే మంత్రుల సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ కూడా చర్చల్లో భాగస్వామ్యం అయ్యే అవకాశాలున్నట్లు పేర్కొంటున్నాయి. మరిన్ని వివరాలు www.eenadu.net లో

ఏం తప్పుచేశానని తిహాడ్ జైల్లో పెట్టారు..

- కష్టాల్లో ఉన్నా భారాస నుంచి కర్కశంగా పంపేశారు
- నన్ను, కేసీఆర్‌ను విడదీసిన ప్రశాంత్‌రెడ్డిని క్షమించను
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ పాతకలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభకు హాజరైన జనం ✦ అభివాదం చేస్తున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ఈనాడు, నిజామాబాద్: 'ఏం తప్పుచేశానని నన్ను తిహాడ్ జైల్లో వేశారు. నాలుగేళ్ల పాటు ఈడీ, సీబీఐ అధికారులు సతాయిస్తే.. నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డ ఏ తప్పూ చేయలేదని చెప్పా. పార్టీ కోసమే జైలుకు పంపానని ఆనాడు పెద్ద నాయకులు అన్నారు. ఆడబిడ్డకు కష్టం వస్తే కడుపులో పెట్టుకుని చూసుకుంటారా? కర్కశంగా బయటకు పంపిస్తారా?' అని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగంతో కంటతడి పెట్టారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. 'సొంతగడ్డ కాబట్టి ఆపుకుందామన్నా కన్నీళ్లు ఆగడం లేదు. పిరికిదాన్ని కాదు.

వెయ్యి రోజులైనా.. ఒక్క హామీ నెరవేర్చలేదు?

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ముగిసినా 420 హామీల్లో ఒక్కదాన్నీ నెరవేర్చలేదు. సీఎం రేవంత్‌రెడ్డి తప్పించుకు తిరుగుతుంటే, ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం మౌనంగా ఉంటోంది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ పెద్ద కొడుకులా భావించి భోజనం పెట్టారు. ఆయనేమో కేసీఆర్ పార్టీ ఓడిన రోజునే అమెరికాకు వెళ్లి.. ముకుంద్‌రెడ్డి, వేంనరేందర్‌రెడ్డితో మాట్లాడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. హరీశ్‌రావు, సంతోష్‌నైనా క్షమిస్తాను కానీ.. నన్ను, కేసీఆర్‌ను విడదీసిన ప్రశాంత్‌రెడ్డిని ఎప్పటికీ క్షమించను. నా ఉసురు తగులుతుంది. ఎమ్మెల్యే కాకముందు.. ఆ తర్వాత ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డిల ఆస్తి ఏమిటో చూడండి. ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌ల అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలెందుకు తీసుకోవడం లేదో చెప్పాలి. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం కింద నిజామాబాద్ జిల్లాలో ఒక ఎకరమైనా తడవడం లేదు. భారాస హయాంలో నాలుగైదు ఇళ్లే బంగారు తెలంగాణగా మారాయి. బోధన్ చక్కెర కర్మాగారాన్ని కేటీఆర్ స్నేహితుడు, కోరుట్లకు చెందిన ఎమ్మెల్యే కొంటారని నాకు తెలిసింది. వాస్తవానికి రూ.18 కోట్లు ఇస్తే కర్మాగారం కార్మికులకు ఇళ్లు వస్తాయని చెప్పినా నాడు కేటీఆర్ వినలేదు. ఏడేళ్లుగా స్థానిక ఎంపీ ధర్మపురి అర్వింద్ కనీసం మాధవనగర్ రైల్వే వంతెనను పూర్తిచేయించలేదు. అప్పట్లో నేను కేకే ట్యాక్స్ తీసుకుంటున్నానని ఆరోపించారు. ఇప్పుడు మీరేం ట్యాక్స్ తీసుకుంటున్నారు' అని కవిత ప్రశ్నించారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అలీమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తే..

మీ తప్పును అంగీకరించేందుకు ఎప్పుడూ వెనుకాడకండి. ఎందుకంటే- తప్పును ఒప్పుకోవడం వల్ల ఆ క్షణంలో మాత్రమే మీ అహం దెబ్బతింటుంది! కానీ దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తే.. జీవిత కాలం అవకాశాలను కోల్పోతారు.
– శరణ్ శ్రీవత్స, ఆంత్రప్రెన్యూర్

(c) eenadu

సింధూ జలాల ఒప్పందంలో మీకు అధికారం లేదు

హేగ్ కోర్టు తీర్పును తిరస్కరించిన భారత్

దిల్లీ: పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందానికి కట్టుబడి ఉండాలంటూ హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పును భారత్ తిరస్కరించింది. భారత సార్వభౌమత్వానికి సంబంధించిన నిర్ణయాల్లో జోక్యం చేసుకునే అధికారం ఆ కోర్టుకు లేదని స్పష్టం చేసింది. అసలు శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం ఏర్పాటే అక్రమమని, దాని ఉనికిని తామెన్నడూ గుర్తించలేదని పేర్కొంది. హేగ్ కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉండబోమని తేల్చిచెప్పింది. "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు. పాక్ గడ్డపై సీమాంతర ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ధ్వంసం చేసే చర్యలను అక్కడి సర్కారు తీసుకోనంత వరకూ సింధూ జలాల ఒప్పందంపై సస్పెన్షన్ కొనసాగుతుంది'' అని విదేశీ వ్యవహారాల శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. పహల్గాంలో నిరుడు ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరగ్గా.. మరునాడు సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసింది.

వాళ్లు విశ్వసించే సిద్ధాంతాలు రెండే..

జీవితంలో విజయవంతమైన వ్యక్తులు ప్రధానంగా రెండే సిద్ధాంతాలను విశ్వసిస్తారు. అవి- 1. వర్తమానం కంటే భవిష్యత్తు మెరుగ్గా ఉంటుంది. 2. భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దుకోగల శక్తి నాకుంది.

– వాలా అఫ్జర్, కాలమిస్టు

లారక్ దీవిపై అమెరికా దాడులు

- ఇద్దరు ఇరానియన్ల మృతి
- జోర్డాన్‌పైకి దూసుకెళ్లిన టెహ్రాన్ క్షిపణులు

దుబాయ్: పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. దాదాపు నెల రోజుల విరామం తర్వాత. . అమెరికా, ఇరాన్ మళ్లీ పరస్పర దాడులు చేసుకున్నాయి. హర్మూజ్ జలసంధిలోని లారక్ దీవిలో ఇరాన్ రాకెట్ లాంచింగ్ వ్యవస్థలపై అమెరికా ఆదివారం రాత్రి తొలుత విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఇద్దరు ఇరానియన్లు మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. హర్మూజ్‌లోని కీలక రవాణా మార్గాల్లో మరోసారి సముద్ర మందుపాతరలను అమర్చేందుకు టెహ్రాన్ సిద్ధమవుతోందని సమాచారం అందడంతో వాషింగ్టన్ దాడులకు దిగినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపైకి క్షిపణులను ప్రయోగించింది. అయితే వాటిని అగ్రరాజ్య బలగాలు కూల్చివేశాయి. మరోవైపు- తమ దేశ జలాల్లోకి దూసుకొచ్చిన ఇరాన్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తెలిపింది.

మంచు, రాళ్ల విస్ఫోటమే!

- 5,200 మీటర్ల ఎత్తు నుంచి దిగువకు..
- ఉప్పెనలా విరుచుకుపడ్డాయ్..
- నేపాల్ విలయంపై తేల్చిన అధ్యయనం



కాఠ్‌మాండూ: మంచు, రాళ్ల విస్ఫోటమే నేపాల్‌లో వరద పోటెత్తడానికి కారణమని, భూకంపంగానీ, హిమనీనదం కరిగి వరద రావడంగానీ కారణం కాదని తాజా అధ్యయనం తేల్చింది. గత బుధవారం వచ్చిన ఆకస్మిక వరద, బురదతో వందల మంది మరణించారు. వేల మంది గల్లంతయ్యారు. దీనిపై నేపాల్ పర్యావరణ సొసైటీ (ఎన్‌ఈఎస్) అధ్యయనం చేసింది.

- రసువా జిల్లాలోని లాంగ్‌టంగ్ లైరుంగ్‌లో 5,200 మీటర్ల ఎత్తు నుంచి మంచు, రాళ్లు విస్ఫోటం చెంది లిండే నదిలో పడ్డాయి. అవి భోటే కోశీ, త్రిశూలి నదుల ద్వారా ఊళ్లపై పడ్డాయి.
- శాటిలైట్ చిత్రాలు, జల, వాతావరణ సంబంధ డేటా, నదీ వ్యవస్థ వెంట ఉండే భూభాగం తీరు, ఎత్తు, వాలులను పరిశీలించగా ఎటువంటి సరస్సులు ఉప్పొంగినట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదు.
- మంచు ఫలకం లాంగ్‌టాంగ్ లైరుంగ్‌వద్ద బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో దిగువకు రావడం ప్రారంభించింది. ఇది ఏటవాలుగా ఉన్న ప్రాంతం నుంచి వచ్చి 2,930 మీటర్ల ఎత్తున ఉన్న లిండే నదిపై పడింది.
- 10 చదరపు కిలోమీటర్ల పరిధిలో భౌగోళిక మార్పులను శాటిలైట్ చిత్రాలు సూచించాయి. అయితే 0.56 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న హిమనీనదం విస్ఫోటమైంది.
- మంచు ఫలకం 7 నిమిషాల్లోనే దాదాపు 22 కిలోమీటర్లు ప్రయాణించిందని, గంటకు 167 కిలోమీటర్ల వేగంతో రసువాగఢికి వచ్చిందని ఎన్‌ఈఎస్ అధ్యయనం తేల్చింది.
- రసువాగఢి నుంచి బెత్రబాతికి గంటకు 22 కిలోమీటర్ల వేగంతో వచ్చింది. ఈ ప్రవాహం భారీ మొత్తంలో రాళ్లు, శిథిలాలు, మట్టిని మోసుకొచ్చింది.
- భారీ వర్షపాతమేమీ నమోదు కాలేదు.
- తొలి విస్ఫోటం జరిగిన 3 గంటల 8 నిమిషాల తర్వాత ఒక మోస్తరు మంచు ఫలకం వచ్చి చిన్నపాటి డ్యాంలాగా ఏర్పడింది. ఆ తర్వాత అది విస్ఫోటమై వరదను సృష్టించింది. అయితే దీనివల్ల పెద్దగా నష్టం కలగలేదు.

కదులుతున్న బస్సులో బాలికపై అత్యాచారం

- దిల్లీలో నిర్భయ తరహా ఘటన
- లిఫ్ట్ ఇస్తామంటూ అఘాయిత్యం

దిల్లీ: దేశరాజధానిలో మరోసారి నిర్భయ తరహా ఘటన చోటుచేసుకుంది. కదులుతున్న బస్సులో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం- ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బాధిత బాలిక 11వ తరగతి చదువుతోంది. తల్లి తిట్టడంతో అలిగి ఆగస్టు 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నొయిడా సెక్టార్ 63లో ఉన్న తన బంధువును కలిసేందుకు బస్సులో బయల్దేరింది. తన బంధువు నివసించే ప్రాంతానికి చేరుకున్నానని భ్రమపడ్డ బాలిక.. భారీ వర్షంలో గ్రేటర్ నొయిడాలోని పరిచౌక్ ప్రాంతంలో దిగిపోయింది. ఆ తర్వాత తన బంధువు ఇంటికి తాను ఇంకా 25 కి.మీ దూరంలో ఉన్నానని గమనించింది. అప్పుడే అటువైపు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తుండటంతో.. దాన్ని ఆపింది. ఆ బస్సులో ప్రయాణికులెవరూ లేరు. డ్రైవర్, కండక్టర్ తాము నొయిడా వరకు లిఫ్ట్ ఇస్తామని బస్సులోకి పిలిచారు. ఆ తర్వాత బాలికను బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి.. కశ్మీరీ గేట్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద వదిలేశారు. బాలిక ఓ ఆటోలో సమీప పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం బస్సును సీజ్ చేశారు. మరమ్మతు చేయించుకొని తిరిగి వస్తుండటంతో బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరని పోలీసులు వెల్లడించారు. బాలికను తొలుత బాలల సంక్షేమ కమిటీకి, తర్వాత వారి తల్లిదండ్రులకు అప్పగించారు. 43 కి.మీ. దూరం ప్రయాణించిన ఆ బస్సు పలు బ్యారికేడ్లను, పోలీసు తనిఖీ కేంద్రాలను దాటుకుని వచ్చినా ఎక్కడా ఈ అఘాయిత్యం వెలుగుచూడకపోవడం గమనార్హం.

హెచ్-4 వీసాదారుల వర్క్ పర్మిట్‌కు మంగళం?

వాషింగ్టన్: అమెరికా వీసా నిబంధనలను కఠినతరం చేయడంపై దృష్టిపెట్టిన ట్రంప్ సర్కారు.. హెచ్-4 వీసాలకు సంబంధించి ఓ గట్టి షాక్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్-4 వీసాదారులు తమ దేశంలో పని చేసేందుకు అనుమతులిచ్చే (వర్క్ పర్మిట్) విధానానికి మంగళం పాడే యోచనలో అది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్లే భారతీయ నిపుణులకు గట్టి ఎదురుదెబ్బే. సాధారణంగా హెచ్-1బీ వీసాదారులు తమ జీవిత భాగస్వాములను హెచ్-4 వీసాలతో అమెరికాకు తీసుకెళ్తుంటారు. హెచ్-4 వీసాదారులు అక్కడ ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్లు (ఈఏడీలు) పొంది చట్టబద్ధంగా పని చేసుకోవచ్చు. దీర్ఘకాలంగా అమల్లో ఉన్న ఈ వర్క్ పర్మిట్ వెసులుబాటుకు ముగింపు పలకాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

సీజేపీ ర్యాలీపై నిషేధానికి సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సెప్టెంబరు 5న దిల్లీలో జరపతలపెట్టిన నిరసన ర్యాలీని నిషేధిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సోమవారం తోసిపుచ్చారు. జులై 25న ఆందోళన విరమణ సమయంలో తమకిచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చడంలేదని ఆరోపిస్తూ ఉపాధ్యాయ దినోత్సవం రోజు నిరసన ప్రదర్శన చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది. నీట్ పరీక్ష రద్దుతో ఆత్మహత్యలకు పాల్పడినవారి కుటుంబ సభ్యులు, ఉద్యమ సమయంలో పోలీసుల చేతిలో హింసకు గురైనవారిని కూడా ఈ ర్యాలీకి ఆహ్వానించింది. భద్రతపరంగా సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు పొందకుండా పెద్దఎత్తున జనసమీకరణ చేయడాన్ని నిషేధించాలని కోరుతూ విశ్రాంత పోలీసు అధికారి రాజేంద్ర సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఈ నెలా అల్ప వర్షాలే

దిల్లీ: దేశంలో ఈ ఏడాది సెప్టెంబరు నెలలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం తెలిపింది. సెప్టెంబరులో దీర్ఘకాలిక సగటు(ఎల్‌పీఏ)లో 91 శాతానికంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ప్రకటించింది. సెప్టెంబర్ నెలలో నెలవారీ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని కూడా ఐఎండీ తెలిపింది. బలమైన ఎల్ నినో పరిస్థితులే దీనికి కారణమని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ నినో రానున్న నెలల్లో మరింత బలపడే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఆగస్టు నెలలో నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి అవి మొత్తంగా 26 రోజుల పాటు కొనసాగినప్పటికీ, వాటి వర్షపాత ప్రభావం ఎక్కువగా గంగా-సింధు మైదాన ప్రాంతాలకే పరిమితమైందని, దీనివల్ల ఇతర ప్రాంతాలలో వర్షాభావం ఏర్పడిందని ఐఎండీ వెల్లడించింది.

ఎండలో నిలబెట్టిన టీచర్.. పదేళ్ల విద్యార్థిని మృతి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పుస్తకం తెచ్చుకోలేదని టీచర్ ఎండలో నిలబెట్టడంతో.. పదేళ్ల విద్యార్థిని మృతిచెందింది! తూర్పు వినోద్ నగర్‌లోని సర్వోదయ కన్యా విద్యాలయలో ఆగస్టు 27న చోటుచేసుకున్న ఈ ఘటనపై దిల్లీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతానికి టీచర్‌పై బదిలీ వేటు వేసింది. విద్యార్థిని తల్లి అంజలి కథనం ప్రకారం.. ఆగస్టు 27 ఉదయం ఆమెకు పాఠశాల నుంచి ఫోన్ వచ్చింది. అక్కడికి వెళ్లేసరికి ఆమె కుమార్తె ఎండలో నిల్చొని ఉంది. ఆరోగ్యం అప్పటికే బాగా క్షీణించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. పాఠశాలకు ఓ పుస్తకం తెచ్చుకోనందుకే పాపను టీచర్ ఎండలో నిలబెట్టినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.

అశ్లీల యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

- వాటి ముసుగులో మాల్‌వేర్ చొరబాటు
- సైబర్ నేరగాళ్లకు అవకాశమిచ్చినట్లే
- జాతీయ సైబర్ సెక్యూరిటీ సంస్థ హెచ్చరిక

దిల్లీ: సామాజిక మాధ్యమ వేదికలపై కనిపించే అశ్లీల (పోర్న్) యాప్‌ల ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని సెల్‌ఫోన్ యూజర్లను ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరించింది. ఆ యాప్‌ల ముసుగులో ప్రమాదకర మాల్‌వేర్ సెల్‌ఫోన్లలోకి చొరబడుతుందని తెలిపింది. వీటి ద్వారా జరిగే ఆర్థిక మోసాలు ఇటీవల బాగా పెరిగాయని వెల్లడించింది. ఈ యాప్‌లు ఫోన్ డివైజ్‌ను తమ నియంత్రణలోకి తీసుకుని, అనధికార ఆర్థిక లావాదేవీలకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొంది. ఆండ్రాయిడ్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఇతర విశ్వసనీయ యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ప్రకటనలు, వెబ్‌సైట్లు, అనుమానాస్పద లింక్‌ల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోరాదని హెచ్చరించింది. తెలియని యాప్‌లకు అనుమతులు ఇవ్వవద్దని కోరింది. ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లను క్రమం తప్పకుండా సమీక్షించి, తమకు తెలియని వాటిని తొలగించాలని కూడా వినియోగదారులకు సూచించింది.

★ నైట్ ఫ్లే, రీలూప్, కిస్, విమో, రివో, నెక్సో, విక్సా వంటి యాప్‌లు వినియోగదారులను సోషల్ మీడియా ప్రకటనల నుంచి అశ్లీల కంటెంట్‌ను అందించే వెబ్‌సైట్‌లకు మళ్లిస్తాయి' అని ఐ4సీ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ సైబర్‌క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ హెచ్చరించింది.

★ ఇప్పటికే ఫోన్ హ్యాకింగ్‌కు గురైతే మొదట దాన్ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి, అనుమానాస్పద అప్లికేషన్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయాలని సూచించింది. అప్పటికీ మాల్‌వేర్ పోకపోతే వినియోగదారులు యాప్ యాక్సెసిబిలిటీ యాక్సెస్‌ను డిసేబుల్ చేయాలని పేర్కొంది. ఫోన్ రీస్టార్ట్ చేసిన తర్వాత కూడా యాప్ తొలగకపోతే ముఖ్యమైన డేటాను బ్యాకప్ చేసి ఫోన్‌ను రీసెట్ చేయాలని సిఫార్సు చేసింది.

★ ఉగ్రవాదులు రహస్యంగా మాట్లాడేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారని ఇటీవలే జాతీయ భద్రతా సంస్థలు గుర్తించాయి.

రాజస్థాన్ హైకోర్టుకు కొత్త సీజే

- మరో మూడు హైకోర్టులకు కూడా..
- ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ శర్మ బదిలీ

ఈనాడు, దిల్లీ: నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల (సీజేల) పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమై ఈ మేరకు తీర్మానించింది. రాజస్థాన్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సంజీవ్ ప్రకాశ్ శర్మ పనితీరుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి సందీప్ మెహతా తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయన్ను బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానంలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కె.అగర్వాల్‌ను పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. జస్టిస్ శర్మను తొలగించాలనే డిమాండ్‌తో జోధ్‌పుర్, జైపుర్‌లోని రాజస్థాన్ హైకోర్టు న్యాయవాదులు ఆందోళనకు దిగారు. ఆయన ధర్మాసనం ముందు హాజరుకావడానికి నిరాకరించారు. దాంతో ఆయన సెలవుపై వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో కొలీజియం మొత్తం నాలుగు హైకోర్టులకు పూర్తిస్థాయి సీజేల నియామకానికి సిఫార్సులు చేసింది.

★ గుజరాత్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అల్పేష్ యశ్వంత్ కోగ్జేని మధ్యప్రదేశ్ హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుష్పేంద్ర సింగ్ భాటిని జమ్మూకశ్మీర్ లద్దాఖ్ హైకోర్టుకు, ఒరిస్సా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణరామ్ మహాపాత్రను ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు సీజేలుగా నియమించాలని సిఫార్సు చేసింది.

పాక్‌లో వందేళ్ల పురాతన ఆలయం కూల్చివేత

లాహోర్: పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో దాదాపు 100 సంవత్సరాల పురాతన ఆలయాన్ని కూల్చివేశారు. నరోవల్‌లోని సిరాజ్ గ్రామంలో ఉన్న ఈ ఆలయానికి సంబంధించి దాదాపు 1000 చ.మీ స్థలాన్ని పక్కనే ఉన్న మదర్సాలో కలిపేందుకు మతఛాందసులు ఈ ఆలయాన్ని కూల్చివేశారని స్థానిక ప్రజలు, మైనారిటీ సంస్థలు, రాజకీయ నేతలు పేర్కొన్నారు. అయితే, ఈ పాత ఆలయం భారీ వర్షాల కారణంగా ధ్వంసమయ్యిందని ప్రభుత్వం వెల్లడించింది. ఆగస్టు 21 ఈ ఆలయాన్ని కూల్చిన వారు.. నిషేధిత అతివాద ఇస్లామిక్ పార్టీ అయిన తహ్రీక్ ఎ లబ్బైక్ పాకిస్థాన్‌కు చెందినవారని సమాచారం.

ప్రభుత్వ అహాన్ని బద్దలుకొడతా

- పట్నాలో ధర్నా చేస్తున్న ఆరేళ్ల బుడతడి వ్యాఖ్య



పట్నా: 'మౌంటేన్ మ్యాన్'గా గుర్తింపు పొందిన దశరథ్ మాంఝీ కొండను చీల్చినట్లు.. తాను ప్రభుత్వ అహాన్ని బద్దలు కొడతానని బిహార్‌లో ధర్నా చేస్తున్న ఆరేళ్ల బుడతడు ఆదిత్య కుమార్ పేర్కొన్నాడు. తన తల్లిదండ్రులపై పోలీసుల దాష్టీకాన్ని నిరసిస్తూ ఆదివారం అతడు పట్నాలో ధర్నా ప్రారంభించిన సంగతి తెలిసిందే. అతడు విలేకర్లతో సోమవారం మాట్లాడుతూ.. "నా తల్లిదండ్రులకు న్యాయం జరగాలి. మా డిమాండ్లు నెరవేరే వరకూ ధర్నా ఉపసంహరించుకోను. నా తల్లిదండ్రులను చితకబాదినట్లు పోలీసులు ఇంకెవరి తల్లిదండ్రులనూ చితకబాదకూడదు. దశరథ్ మాంఝీ కొండను బద్దలు కొట్టినట్లు నేను ఈ ప్రభుత్వ అహంకారాన్ని బద్దలు కొడతా'' అని పేర్కొన్నాడు.

బాణసంచా పరిశ్రమలో పేలుడు 11 మంది మృతి

- ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘటన

కౌశాంబి: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పిప్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మనోరి గ్రామంలో ఉన్న బాణసంచా పరిశ్రమలో ఈ పేలుడు సంభవించిందని జిల్లా కలెక్టర్ అమిత్ పాల్ వెల్లడించారు. మనోరి పవర్ హౌస్ సమీపంలో సంభవించిన ఈ పేలుడు ధాటికి పరిశ్రమ పరిసరాల్లో ఉన్న పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ పేలుడు కారణంగా దిల్లీ-హావ్‌డా రైల్వే లైన్‌లో రాకపోకలను గంట పాటు నిలిపివేశారు. ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయాలైన వారికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించారు.

టిబెట్‌లోని గిరాంగ్ కౌంటీలో మట్టిచరియలు విరిగిపడిన ఘటనలో చిక్కుకున్న బాధితుల కోసం స్నిఫర్ డాగ్‌లతో గాలిస్తున్న చైనా సహాయక సిబ్బంది
✦ నేపాల్‌లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నువాకోట్ జిల్లా త్రిశూలి బజార్‌లో ఎత్తి పక్కకు పోసిన రాళ్లతో కూడిన బురదమట్టి

అమ్మో 26వ తారీఖు

- నేపాల్ వరదలూ ఆరోజునే..
- గతంలో చాలా దుర్ఘటనలకు ఆ తేదీయే సాక్షి

దిల్లీ: చరిత్రలో 26వ తేదీ అత్యంత విషాదకర తేదీల్లో ఒకటి. తాజాగా నేపాల్‌లో వచ్చిన ఆకస్మిక వరదలూ ఆ తేదీనే రావడం మరింత విషాదకరం. గతంలో ఈ తేదీన సంభవించిన విపత్తుల్లో భారీగా ప్రాణ నష్టం జరిగింది. ఈసారీ భారీగానే నష్టం చోటుచేసుకుంది. విపత్తులే కాదు 26వ తేదీనే భారీ ఉగ్రదాడులూ జరిగాయి.

విపత్తులు..

1930 నవంబరు 26: జపాన్‌లో భూకంపం. 272 మంది మృతి.
1932 సెప్టెంబరు 26: గ్రీస్‌లో భూకంపం. 500 మంది మృతి.
1939 డిసెంబరు 26, 27: తుర్కియేలో భూకంపం. 32,700 మంది మృతి.
1943 నవంబరు 26: తుర్కియేలో భూకంపం. 4,020 మంది మృతి.
1963 జులై 26: యుగోస్లేవియాలో భూకంపం. 1,070 మంది మృతి.
1983 మే 26: జపాన్‌లో భూకంపం, సునామీ. 104 మంది మృతి.
1987 నవంబరు 26: ఇండోనేసియాలో భూకంపం, సునామీ. 125 మంది మృతి.
1990 ఏప్రిల్ 26: చైనాలో భూకంపం. 100 మంది మృతి.
2001 జనవరి 26: గుజరాత్‌లో భూకంపం. 20,000 మందికిపైగా మృతి.
2002 మార్చి 25, 26: అఫ్గానిస్థాన్‌లో భూకంపం. 1,800 మంది మృతి.
2003 డిసెంబరు 26: ఇరాన్‌లో భూకంపం. 31,000 మంది మృతి.
2004 డిసెంబరు 26: హిందూ మహా సముద్రంలో భూకంపం. సునామీ. భారత్, శ్రీలంక, ఇండోనేసియా, థాయ్‌లాండ్‌లలో కలిపి 2,28,000 మంది మృతి.
2005 జులై 26: మహారాష్ట్రలో భారీ వర్షాలు. 1,094 మంది మృతి.
2006 మే 26: ఇండోనేసియాలో భూకంపం. 5,700 మంది మృతి.
2015 అక్టోబరు 26: హిందూకుశ్ పర్వత శ్రేణుల్లో భూకంపం. 400 మంది మృతి.

మరెన్నో..

1942 ఏప్రిల్ 26: చైనా బొగ్గు గనిలో ప్రమాదం. 1,549 మంది మృతి.
1986 ఏప్రిల్ 26: చెర్నోబిల్ అణు ప్రమాదం.
1991 మే 26: బ్యాంకాక్ నుంచి వియన్నా వెళ్తున్న విమానానికి ప్రమాదం. 223 మంది మృతి.
2008 నవంబరు 26: ముంబయిలో ఉగ్ర దాడి. 166 మంది మృతి.
2021 ఆగస్టు 26: కాబూల్ విమానాశ్రయంపై దాడి. 183 మంది మృతి.
2023 సెప్టెంబరు 26: ఇరాక్‌లో పెళ్లి వేడుకలో అగ్ని ప్రమాదం. 100 మంది మృతి.

ఎల్ నినో తీవ్రతకు మానవ కార్యకలాపాలే కారణం

- తేల్చిన తాజా అధ్యయనం

దిల్లీ: పారిశ్రామిక యుగానికి పూర్వం కన్నా ఎల్ నినో ఘటనలు గత 40 ఏళ్లలో సుమారు 40 శాతం తీవ్రతరమయ్యాయని అమెరికాలోని మిషిగన్ విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనం తేల్చింది. భూతల, సముద్రతల ఉష్ణోగ్రతలు పెరగడానికీ, వరదలు, అనావృష్టి వంటి విపత్తులకు ఎల్ నినో కారణమవుతుంది. దక్షిణ అమెరికాలో ఈక్వెడార్ దేశ తీరానికి సుమారు 1,000 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న గాలాపాగోస్ దీవులలో ఆధునిక, పురాతన పగడపు దిబ్బలను పరిశోధక బృందం పరిశీలించింది. పరిశోధకులు గాలాపాగోస్ దీవుల నుంచి 13 ఆధునిక, పురాతన పగడాల నమూనాలను సేకరించారు. పగడాలు సంవత్సరానికి ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల చొప్పున పెరుగుతాయి. ఇవి కాల్షియం కార్బొనేట్ పొరలను ప్రవిస్తాయి. ఈ పొరల విశ్లేషణతో సముద్రపు నీటి ఉష్ణోగ్రతలు ఎంత పెరిగాయో తెలుసుకోవచ్చు. గడచిన వెయ్యి సంవత్సరాలలో అగ్నిపర్వత విస్ఫోటనాలు, సౌర తుపానుల ప్రభావాల వల్ల ఎల్ నినో తీవ్రత ఏమీ పెరగలేదు. కాబట్టి మానవ కార్యకలాపాలే భూతాపం పెరుగుదలకూ, తద్వారా తీవ్ర ఎల్ నినోకూ దారితీస్తున్నాయని రూఢి అవుతోంది. ఈ ఎల్ నినో వల్ల పారిశ్రామిక యుగపూర్వ ఉష్ణోగ్రతల కంటే 1.7- 1.8 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత సంభవించవచ్చునని మిషిగన్ వర్సిటీకి చెందిన జూలియా కోల్ తెలిపారు.

మణిపుర్‌లో జన గణన వాయిదా

ఇంఫాల్: మణిపుర్‌లో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన జన గణన ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసింది. జన గణనకు ముందే జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సీ)ను అప్‌డేట్ చేయాలంటూ స్థానిక పౌర సమాజ సంస్థలు డిమాండ్ చేయడమే ఇందుకు కారణం. మణిపుర్‌లో పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిల్లీలో సోమవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం జన గణన కార్యకలాపాల వాయిదా ప్రకటన వెలువడింది. మయన్మార్ నుంచి కుకీలకు సంబంధించిన వలసదారులు అధిక సంఖ్యలో మణిపుర్‌కు వచ్చారని.. ఈ పరిస్థితుల్లో ఎన్‌ఆర్‌సీని అప్‌డేట్ చేయకుండానే జన గణనను నిర్వహిస్తే రాష్ట్రంలో జనాభాపరమైన మార్పులు అధికంగా కనిపిస్తాయని మైతేయ్, నాగా వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లోని గాంధీ మెమోరియల్‌లో మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

మహా శక్తిగా కాదు.. విశ్వ గురువుగా సేవ చేశాం

ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్య

వాషింగ్టన్: ప్రపంచానికి భారత్ 'విశ్వ గురువు'గా సేవ చేసిందే తప్ప, 'మహా శక్తి'గా కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ అన్నారు. దుర్విచక్షణకు తావు లేకుండా అందరికీ సహాయం చేయడమనే సిద్ధాంతమే భారత నాగరిక సంప్రదాయాలకు ఎల్లప్పుడూ మార్గదర్శనం చేసిందని పేర్కొన్నారు. కెనడాలోని టొరంటో నగరంలో 'హిందూ విశ్వ బంధు' పేరుతో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగవత్ ప్రసంగించారు. ప్రపంచమంతా ఒకే కుటుంబం (వసుధైవ కుటుంబకమ్) అనే సిద్ధాంతాన్ని భారత్ విశ్వసిస్తుందన్నారు. "సహాయం కోసం ప్రపంచంలో ఎక్కడి నుంచి వినతి వచ్చినా.. భారత్ ఏనాడూ తిరస్కరించలేదు. అంతేకాదు.. సహాయం అడగనివారికీ స్నేహహస్తాన్ని చాచింది. ఇది మా సంప్రదాయం. భారత డీఎన్‌ఏ. అందుకే- హిందువులు మేల్కొంటే ప్రపంచం మేల్కొంటుందన్న నానుడి కూడా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రేమ సందేశాన్ని అర్థం చేసుకోనంతవరకూ వ్యక్తుల జ్ఞానానికి అర్థమే లేదన్నారు.

మాపై బాహ్య ఒత్తిళ్లేమీ లేవు

- సోనియా గాంధీ ఆత్మకథ ప్రచురణ వివాదంపై పెంగ్విన్ ఇండియా వెల్లడి

దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' గ్రంథాన్ని ప్రచురించకపోవడానికి తమపై బాహ్య ఒత్తిళ్లే కారణం అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా (పీఆర్‌హెచ్‌ఐ) సంస్థ పేర్కొంది. ఆ పుస్తక రచయిత్రితో చర్చల సమయంలో ఒక నిర్దిష్ట అంశంపై ప్రతిష్టంభన నెలకొనడం వల్లే ప్రచురించలేకపోతున్నామని పీఆర్‌హెచ్‌ఐ అధికార ప్రతినిధి పల్లవీ నారాయణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందం, రచయిత్రి గోప్యతను కారణంగా చూపుతూ ప్రతిష్టంభనకు కారణమైన ఆ వివాదాస్పద అంశమేమిటో ప్రచురణ సంస్థ వెల్లడించలేదు. "ప్రచురణకు ముందు రాతప్రతిని నిశితంగా పరిశీలించడం మా బాధ్యత, విధి. కొన్ని ప్రశ్నలు అడగడం, సిఫార్సులు చేయడం సంపాదకీయ స్వేచ్ఛలో భాగమే. రచయిత్రి తరఫు బృంద సభ్యులు కొన్ని మార్పులకు అంగీకరించారు. మరికొన్నింటికి అంగీకరించలేదు. దురదృష్టవశాత్తు ఒకానొక అంశంపై అవగాహనకు రాలేకపోయాం. దీనిలో భాగంగానే ప్రచురణపై ముందుకు వెళ్లాలనుకోవడం లేదని రచయిత్రి తరఫు బృందం సభ్యులు తెలిపారు. వారి అభిప్రాయాన్ని మేం గౌరవించాం" అని పీఆర్‌హెచ్‌ఐ వివరించింది. ప్రతిష్టంభనకు కారణమైన అంశాన్ని వెల్లడించలేమని స్పష్టం చేసింది.

(c) eenadu

చాంపియన్

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సిని మళ్లీ ప్రపంచకప్‌లో చూడలేం. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు అభిమానులను ఉర్రూతలూగించిన ఈ మాంత్రికుడు.. అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరయ్యాడు. ఇకపై అర్జెంటీనాకు ఆడనని ప్రకటించాడు.

మెస్సి టాటా

అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరైన స్టార్

మెస్సి

బ్యూనోస్ ఐరెస్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో ఓ గొప్ప అధ్యాయం ముగిసింది. మేటి ఆటగాడు మెస్సి రిటైరయ్యాడు. అర్జెంటీనా జట్టుకు గుడ్‌బై చెబుతున్నట్లు అతడు శనివారం తెలిపాడు. "ఈ నిర్ణయం ఎంతో బాధిస్తుంది. కానీ రిటైర్ కావాల్సిన సమయం వచ్చేసింది. నేను ఎప్పుడు బరిలోకి దిగినా సర్వశక్తులూ ఒడ్డా. ఈ జెర్సీ కోసం మైదానంలో ఎంతో పోరాడా. మీకు ఆనందాన్నివ్వడం, అర్జెంటీనా పౌరులుగా మీరు గర్వపడేలా చేయడం కోసమే ఇదంతా" అని ఓ సోషల్ మీడియా పోస్ట్‌లో 39 ఏళ్ల మెస్సి పేర్కొన్నాడు. జూన్ 21నే రిటైర్మెంట్ లేఖ రాశానని, తన తండ్రి అనారోగ్యం కారణంగా పోస్ట్ చేయలేకపోయానని మెస్సి చెప్పాడు. అతడి తండ్రి జోర్జ్.. ఆగస్టు 8న కన్నుమూశారు. మెస్సి అర్జెంటీనా తరఫున 2006లో అరంగేట్రం చేశాడు. 2022లో ప్రపంచకప్పును అందుకున్నాడు. 20 ఏళ్ల పాటు తనకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సి కృతజ్ఞతలు తెలిపాడు.

207 మ్యాచ్‌లు 125 గోల్స్: మెస్సి తన రెండు దశాబ్దాల కెరీర్‌లో 207 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 125 గోల్స్ కొట్టాడు. 2006లో తన తొలి గోల్ (క్రొయేషియాపై) సాధించాడు. 2026 ప్రపంచకప్‌లో ఈజిప్ట్‌పై కొట్టిందే.. మెస్సి చివరి అంతర్జాతీయ గోల్. అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో రొనాల్డో (233 మ్యాచ్‌ల్లో 146 గోల్స్) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. అర్జెంటీనాకు గుడ్‌బై చెప్పినప్పటికీ మెస్సి.. క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగనున్నాడు. అతడు ప్రస్తుతం మేజర్ లీగ్ సాకర్ క్లబ్ ఇంటర్ మయామి కెప్టెన్. ఇటీవల ముగిసిన ప్రపంచకప్‌లో మెస్సి.. 8 మ్యాచ్‌ల్లో ఆరు గోల్స్ కొట్టాడు. రికార్డు స్థాయిలో ఆరు ప్రపంచకప్‌లు ఆడిన అతడు.. 2022లో అర్జెంటీనా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రపంచకప్పుల్లో అతడు మొత్తం 21 గోల్స్ కొట్టాడు. మెస్సి గతంలో ఓసారి అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైరవుతున్నట్లు ప్రకటించాడు. 2016 కోపా అమెరికా ఫైనల్లో నేపథ్యంలో వీడ్కోలు పలికిన అతడు.. త్వరగానే తిరిగొచ్చాడు.

బంగ్లా శుభారంభం

దుబాయ్: మహిళల ఆసియా కప్‌లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. ఆ జట్టు సోమవారం ఇండోనేసియాపై 71 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట శోభన (40), షోర్న అక్తర్ (31 నాటౌట్) రాణించడంతో బంగ్లా 8 వికెట్లకు 129 పరుగులు చేసింది. అరియాని 3, లూ డెవి 2 వికెట్లు తీశారు. ఛేదనలో నహిద అక్తర్ (3/15), మారుఫా అక్తర్ (2/6) బంతితో విజృంభించడంతో ఇండోనేసియా 17.3 ఓవర్లలో 58కే కుప్పకూలింది. మారియా కొరజాన్ చేసిన 12 పరుగులే అత్యధికం కావడం గమనార్హం.

తిలక్ 106 బ్యాటింగ్

తిలక్ అజేయ శతకం

- తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ 285/9
- సెంట్రల్ జోన్‌పై వైభవ్ 92
- దులీప్ ట్రోఫీ సెమీస్

బెంగళూరు

దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్షదీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.

వైభవ్ త్రుటిలో..: యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. అరుదైన ఘనతను అందుకునే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయాడు. సెంట్రల్ జోన్‌తో రెండో సెమీస్‌లో సూర్యవంశీ (92; 81 బంతుల్లో 7×4, 7×6) సెంచరీ ముంగిట ఔటయ్యాడు. అతడు వంద పూర్తి చేసుంటే.. దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ ఘనతను అధిగమించేవాడు. ధ్రువ్ పండోవ్ (14 ఏళ్ల 293 రోజులు) భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో ఫస్ట్ క్లాస్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పగా.. సచిన్ (15 ఏళ్ల 230 రోజులు) రెండో స్థానంలో ఉన్నాడు. వైభవ్ సోమవారం సెంచరీ కొట్టి ఉంటే 15 ఏళ్ల 157 రోజులకే ఈ ఘనత అందుకుని సచిన్‌ను దాటేవాడు. సెంట్రల్‌తో మ్యాచ్‌లో రెండో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన ఈస్ట్ 266కు ఆలౌటైంది. వైభవ్, మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (69) కలిసి ఇచ్చిన అదిరే ఆరంభాన్ని ఈస్ట్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఈ జంట తొలి వికెట్‌కు 161 పరుగులు జోడించింది. అయితే వైభవ్ ఔటయ్యాక కథ అడ్డం తిరిగింది. హర్ష్ దూబె (4/66), యశ్ ఠాకూర్ (3/66), అర్యన్ పాండే (3/43) విజృంభించడంతో.. ఈస్ట్

వైభవ్ 92

105 పరుగుల వ్యవధిలో 10 వికెట్లు చేజార్చుకుని సరిగ్గా ప్రత్యర్థి చేసిన స్కోరుకే (266) పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన సెంట్రల్.. ముకేశ్ కుమార్ (2/14), మహ్మద్ షమి (1/13)ధాటికి తడబడి.. ఆట చివరికి 45/3తో నిలిచింది. రజత్ పాటీదార్ (5) మరోసారి విఫలమయ్యాడు.

భారత్‌తో సిరీస్‌పై చర్చిస్తున్నాం

తమీమ్ ఇక్బాల్

దిల్లీ: భారత్‌తో వాయిదా పడిన పరిమిత ఓవర్ల సిరీస్‌ను నిర్వహించడానికి చర్చలు జరుగుతున్నాయని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ చెప్పాడు. "సిరీస్‌ను నిర్వహించడానికి భారత్-బంగ్లా దేశాల క్రికెట్ బోర్డులు కృతనిశ్చయంతో ఉన్నాయి. అనువైన సమయం కోసం చూస్తున్నాయి. సిరీస్ నిర్వహణకు తేదీలను కూడా పరిశీలిస్తున్నాయి. ఏం జరుగుతుందో చూద్దాం. మేమైతే ఆశాభావంతో ఉన్నాం" అని తమీమ్ చెప్పాడు. భారత్, బంగ్లాదేశ్ మధ్య గత ఏడాది ఆగస్టులో 3 వన్డేలు, 3 టీ20ల సిరీస్ జరగాల్సింది. కానీ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ సిరీస్ ఆగిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ సిరీస్ నిర్వహించాలని రెండు బోర్డులు అనుకున్నాయి. అయితే అదే సమయంలో (సెప్టెంబర్ 13 నుంచి) అఫ్గానిస్థాన్‌తో భారత్ మూడు టీ20ల సిరీస్ ఆడబోతోంది. ఈ నేపథ్యంలో ఏ తేదీల్లో ఈ సిరీస్ నిర్వహించాలా అని బీసీసీఐతో బంగ్లా బోర్డు చర్చలు సాగిస్తోంది.

యుఎస్ ఓపెన్

కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం జకోవిచ్ చాలా కాలంగా పోరాడుతున్నాడు. కానీ అది మాత్రం అందట్లేదు. జకోవిచ్ నిరీక్షణను పొడిగిస్తూ.. యుఎస్ ఓపెన్‌లో అతడికి షాక్ తగిలింది. తొలి రౌండ్లోనే అతడి కథ ముగిసింది. అర్జెంటీనాకు చెందిన అన్‌సీడెడ్ నవోన్.. జకోవిచ్‌పై సంచలన విజయం సాధించాడు. 2006 తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్లోనే ఓడిపోవడం సెర్బియా స్టార్‌కు ఇదే తొలిసారి. మరోవైపు మెద్వెదేవ్, సబలెంక ముందంజ వేశారు.

జకోవిచ్

జకోవిచ్‌కు షాక్

- తొలి రౌండ్లోనే పరాజయం
- మెద్వెదేవ్, సబలెంక ముందంజ

నవోన్

న్యూయార్క్

యుఎస్ ఓపెన్‌లో పెను సంచలనం. 24 సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్, నాలుగో సీడ్ నొవాక్ జకోవిచ్ ఇంటిముఖం పట్టాడు. పురుషుల తొలి రౌండ్లో అతడు 6-7 (5-7), 7-5, 6-4, 2-6, 1-6తో మరియానో నవోన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు యుఎస్ ఓపెన్ తొలి రౌండ్లో జకోవిచ్ రికార్డు 19-0గా ఉంది. 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత అతడు ఏ గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ తొలి రౌండ్లో ఓడిపోలేదు. నాలుగున్నర గంటల పోరులో జకోవిచ్ 10 డబుల్ ఫాల్ట్‌లు, 70 అనవసర తప్పిదాలు చేశాడు. ఆధిపత్యాన్ని ప్రదర్శించిన నవోన్.. ఆరుసార్లు జకోవిచ్ సర్వీసును బ్రేక్ చేశాడు. తొలి సెట్‌ను కోల్పోయాక పుంజుకున్న జకోవిచ్.. తర్వాతి రెండు సెట్లు గెలిచి ముందంజ వేసేలానే కనిపించాడు. కానీ అతడు అస్వస్థతకు గురి కావడంతో ఆఖరి రెండు సెట్లలో నవోన్ అలవోకగా పైచేయి సాధించాడు. మ్యాచ్ సందర్భంగా జకోవిచ్ వాంతులు చేసుకున్నాడు. అతడికి చికిత్స అవసరమైంది. ఆద్యంతం అతడు ఇబ్బందిపడ్డాడు. మరోవైపు ఏడో సీడ్ మెద్వెదేవ్ (రష్యా) శుభారంభం చేశాడు. మొదటి రౌండ్లో అతడు 6-4, 6-2, 6-4తో

మ్యాచ్ మధ్యలో కూలబడ్డ జకోవిచ్

గాస్టన్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. మ్యాచ్‌లో అతడు 10 ఏస్‌లు, 34 విన్నర్లు కొట్టాడు. మరో మ్యాచ్‌లో మునార్ (స్పెయిన్) 6-7 (5-7), 3-6, 6-1, 7-6 (7-4), 7-5తో అట్మేన్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. బబ్లిక్ (కజకిస్థాన్), టామీ పాల్ (అమెరికా) కూడా రెండో రౌండ్లో ప్రవేశించారు. పాల్ 6-7 (3-7), 6-1, 6-3, 6-3తో వాంగ్ (హాంకాంగ్)పై నెగ్గగా.. బబ్లిక్ 6-4, 6-2, 3-6, 6-1తో వూల్ఫ్ (అమెరికా)ను ఓడించాడు. ఇతర మ్యాచ్‌ల్లో లెహెకా (చెకియా) 6-1, 7-6 (7-5), 4-6, 6-2తో బుస్టా (స్పెయిన్)పై నెగ్గారు.

సబలెంక అలవోకగా..: మహిళల సింగిల్స్‌లో మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సబలెంక (బెలారస్) శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఆమె 6-2, 6-4తో ఒసోరియో (కొలంబియా)పై విజయం సాధించింది. ఏడో సీడ్ ముచోవా (చెకియా) 6-3, 6-0తో క్రాస్ (ఆస్ట్రియా)ను చిత్తు చేసి రెండో రౌండు చేరింది. 9వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-1, 6-2తో సియెర్రా (అర్జెంటీనా)పై నెగ్గగా.. 11వ సీడ్ కోస్త్యుక్ (ఉక్రెయిన్) 6-4, 6-1తో హంటర్ (ఆస్ట్రేలియా)ను ఓడించింది. వైల్డ్‌కార్డుతో టోర్నీలో అడుగుపెట్టిన మాజీ ఛాంపియన్ వీనస్ విలియమ్స్ (అమెరికా) తొలి రౌండ్లో 2-6, 6-7 (6-8)తో కెనిన్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. వెకిచ్ (సెర్బియా) 6-2, 4-6, 6-3తో తాలియా (ఆస్ట్రేలియా)పై, బౌల్టర్ (బ్రిటన్) 6-4, 3-6, 6-0తో లీ (అమెరికా)పై, వాంగ్ (చైనా) 6-4, 6-2తో అరాంగో (కొలంబియా)పై, ప్లిస్కోవా (చెకియా) 2-6, 7-5, 6-3తో వాండెవింకెల్ (జర్మనీ)పై గెలిచారు.

'25' ఇక కలేనా!

మూడేళ్లు అయింది సెర్బియా టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించి. ఆ తర్వాత 11 టోర్నీలు ఆడాడు.. ఎనిమిదింట్లో కనీసం సెమీఫైనల్ చేరాడు.. కానీ మరో ట్రోఫీ సాధించాలన్న అతడి కల నెరవేరలేదు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచి మార్గరేట్ కోర్ట్ (24)ను అధిగమించి అత్యధిక టైటిళ్ల రికార్డును సొంతం చేసుకోవాలనుకున్న ఆశ తీరలేదు. రానురాను జకోవిచ్ ప్రదర్శన తీసికట్టుగా మారుతుందేకానీ మెరుగుపడట్లేదు. తాజాగా యుఎస్ ఓపెన్లో తొలి రౌండ్లోనే అనామక ఆటగాడి చేతిలో ఓడడమే ఇందుకు నిదర్శనం.

ఈనాడు క్రీడావిభాగం

ఒకప్పుడు రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్‌లతో కలిసి టెన్నిస్ ప్రపంచాన్ని ఏలిన జకోవిచ్‌కు ఇప్పుడు కష్ట కాలం నడుస్తోంది. వయసు మీద పడింది. గాయాలు వెంటాడుతున్నాయి. మునుపటి ఫామ్ లేదు. సర్క్యూట్‌లోకి కొత్త కుర్రాళ్లు వచ్చేశారు. సినర్, అల్కరాస్ లాంటి వాళ్లు టైటిల్‌కు అతడికి మధ్య గోడలా నిలుస్తున్నారు. కొత్త కుర్రాళ్లు సైతం 39 ఏళ్ల నొవాక్‌ను తేలిగ్గా ఓడిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో మెద్వెదెవ్‌పై గెలిచి యుఎస్ ఓపెన్ సాధించాడు జకోవిచ్. ఇది అతడి కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్. అక్కడి నుంచి మరో టైటిల్ కోసం అతడు చేయని పోరాటం లేదు. అయితే ఫిట్‌నెస్ సమస్యలు అతడిని ప్రతి దశలోనూ అడ్డుకున్నాయి. 2024లో వింబుల్డన్‌లో మాత్రమే ఫైనల్ చేరుకోగలిగాడు. అల్కరాస్‌ను దాటలేకపోయాడు. ఆ ఏడాది అదే నొవాక్‌కు ఉత్తమ ప్రదర్శన. గత సంవత్సరం కాస్త స్థిరంగానే ఆడాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్లలో సెమీఫైనల్లో అడుగు పెట్టాడు. మూడు టోర్నీల్లో సినర్ లేదా అల్కరాస్ అతడికి అడ్డుపడ్డారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో మాత్రం గాయమే ఈ సెర్బియా యోధుడికి శత్రువైంది. ఒకప్పుడు ప్రత్యర్థులను తన టెక్నిక్, అనుభవంతో పాటు మానసికంగా ఇబ్బందిపెడుతూ దెబ్బ తీసేవాడు నొవాక్. ఇప్పుడు ఆ ఆయుధాలేమీ అతడికి పని చేయట్లేదు. వయసు మీద పడడం, పూర్తి ఫిట్‌గా లేకపోవడం ఒక కారణమైతే.. కొత్త కుర్రాళ్లు రెట్టించిన ఉత్సాహంతో దూసుకొస్తుండడం మరో కారణం. వరుస ఓటములు చవిచూస్తుండడంతో ఫెదరర్, నాదల్ ఇప్పటికే రిటైర్ అయ్యారు. జకోవిచ్ మాత్రం అలుపెరుగకుండా పోరాడుతున్నా అనుకున్న ఫలితాలు మాత్రం సాధించలేకపోతున్నాడు.

ప్రస్తుతం జకోవిచ్ ఫామ్ చూస్తుంటే మరో టైటిల్ సాధించడం, 25వ ట్రోఫీ కల నెరవేర్చుకోవడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తోంది. గతంలో అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ ఇలాగే కెరీర్ చివర్లో టైటిల్ కోసం ఎన్నో ప్రయత్నాలు చేసింది. జకోవిచ్ కంటే ఒకటి తక్కువగా సెరెనా 23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ట్రోఫీలు సాధించింది. మరో టైటిల్ గెలిచి మార్గరేట్ కోర్ట్‌ను సమం చేయాలని ఈ అమెరికా తార ఎంతో పరితపించింది. గాయాలు, ఫామ్ కోల్పోవడం లాంటి కారణాలు ఆమెకు అడ్డంకిగా మారాయి. ఇప్పుడు జకోవిచ్ ఎలా యువ ఆటగాళ్ల చేతుల్లో ఓడిపోయాడో.. సెరెనా కూడా అప్పట్లో అనామక ప్లేయర్ల చేతిలో పరాజయాలు చవిచూసింది. ఇక నా వల్ల కాదన్నట్లు కన్నీళ్లు పెట్టుకుని నిష్క్రమించింది. ఇప్పుడు జకోవిచ్‌ను కూడా చూస్తే ఆమె బాటలోనే వెళ్తున్నట్లు కనిపిస్తున్నాడు. ఈ సీజన్ చివరి టోర్నీ యుఎస్ ఓపెన్ తొలి రౌండ్లో నవోన్ (అర్జెంటీనా) చేతిలో ఓడాక.. నొవాక్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ ఓటమిని అతడు అసలు ఊహించలేదు. తనకు ప్రధాన అడ్డంకిగా ఉన్న యానిక్ సినర్ గాయంతో యుఎస్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. మరో ప్రత్యర్థి అల్కరాస్.. నాలుగు నెలల విరామం తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్నాడు. సెమీఫైనల్ వరకు అల్కరాస్ ఎదురుపడే అవకాశం లేదు. అన్నీ మంచి శకునములే ఉన్నా.. తనదైన శైలిలో ఆడలేక జకోవిచ్ ఇంటిముఖం పట్టాడు. మరి వచ్చే ఏడాది కొత్త సీజన్లోనైనా జకోవిచ్ 'ఆఖరి' పంచ్ విసురుతాడా లేదా '25'వ టైటిల్ లేకుండా నిష్క్రమిస్తాడా అనేది చూడాలి.

ఏడుగురు పాక్ ఆటగాళ్లు ఇంటికి


రిజ్వాన్

కోచ్ సర్ఫరాజ్

లాహోర్: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. కఠిన చర్యలు చేపట్టింది. తొలి రెండు టెస్టుల్లో ఆ జట్టు ఘోర పరాజయం పాలవడంతో.. సిరీస్‌లో ఆఖరిదైన మూడో మ్యాచ్‌కు ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. వారి స్థానంలో కొత్త ప్లేయర్లను ప్రకటించింది. ఒక సిరీస్ మధ్యలో జట్టులో ఒకేసారి ఇన్ని మార్పులు చేయడం అరుదు. మహ్మద్ రిజ్వాన్, ఇమాముల్ హక్, సల్మాన్ ఆఘా, అలీ ఉస్మాన్, ఆమిర్ జమాల్, మహ్మద్ అబ్బాస్, ఖుర్రమ్ షెహజాద్ టీమ్‌లో చోటు కోల్పోయారు. వారి స్థానాల్లో సయీమ్ ఆయూబ్, అబ్దుల్లా ఫజల్, అరాఫత్ మిన్హాస్, సాద్ బైగ్, మహ్మద్ రంధావా, రజావుల్లా, మహ్మద్ ఇమ్రాన్ జూనియర్ అవకాశం దక్కించుకున్నారు. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లకూ ఉద్వాసన తప్పలేదు. వారికి బదులు మైక్ హెసన్, ఆష్లీ నాఫ్కె బాధ్యతలు చేపట్టనున్నారు. పాకిస్థాన్, ఇంగ్లాండ్ మధ్య ఆఖరి టెస్టు ఈ నెల 9న మొదలుకానుంది.

అఫ్గాన్ సిరీస్‌కు హార్దిక్, నితీశ్!


హార్దిక్

నితీశ్‌కుమార్

ముంబయి: భారత స్టార్ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, నితీశ్‌కుమార్ రెడ్డి త్వరలో పునరాగమనం చేయబోతున్నారు. అఫ్గానిస్థాన్‌తో ఈ నెల 13న ఆరంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లో వీళ్లిద్దరూ ఆడే అవకాశం ఉంది. తొడ కండరాల గాయంతో కొన్ని నెలలుగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనే ఉన్న హార్దిక్.. ఫిట్‌నెస్ సాధించినట్లు తెలిసింది. ఇదే గాయాల నుంచి కోలుకున్న నితీశ్‌కుమార్, స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా అఫ్గాన్‌తో సిరీస్‌కు సిద్ధమయ్యారు. అఫ్గాన్‌తో పోరుకు మరి కొన్ని రోజుల్లో జట్టును ఎంపిక చేయబోతున్నారు. "హార్దిక్, నితీశ్‌కుమార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చాలా కాలంగా ఉంటున్నారు. వాళ్లు ఫిట్‌నెస్ సాధించారు. వ్యక్తిగత కారణాలతో ఇటీవలే హార్దిక్, నితీశ్ ఇళ్లకు వెళ్లారు" అని సీవోఈ వర్గాలు తెలిపాయి. సీవోఈలోనే ఉన్న మరో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అఫ్గాన్‌తో టీ20ల్లో ఆడడం అనుమానమే. ఈ నెల 19న మొదలయ్యే ఆసియా క్రీడల్లో అతడు పాల్గొనే అవకాశాలున్నాయి.

చైనా మాస్టర్స్‌పై లక్ష్య గురి

బరిలో శ్రీకాంత్, సాత్విక్- చిరాగ్ జోడీ

లక్ష్య సేన్

షెన్‌జెన్ (చైనా): భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ మరో ఆసక్తికర సమరానికి సిద్ధమయ్యాడు. బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో రౌండ్లోనే నిష్క్రమించిన అతడు.. మంగళవారం ప్రారంభం కానున్న చైనా మాస్టర్స్‌లో సత్తాచాటాలని పట్టుదలగా ఉన్నాడు. అయితే ఈ ప్రపంచ నంబర్ 13 ప్లేయర్‌కు తొలి పోరు అంత తేలికగా ఉండకపోవచ్చు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ విజేత అలెక్స్ లానియెర్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు లక్ష్య. ఈ మ్యాచ్ గెలవాలంటే అతడు చెమటోడ్చాల్సిందే. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్స్‌లో రన్నరప్‌గా నిలిచాక చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని లక్ష్య.. ఈ టోర్నీతో తిరిగి లయ అందుకోవాలని చూస్తున్నాడు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ కూడా బరిలో ఉన్నాడు. అతడు ఆరంభ పోరులో చి యుజెన్ (చైనీస్ తైపే)ను ఢీకొననున్నాడు. పురుషుల డబుల్స్‌లో నాలుగో సీడ్ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జోడీ భారత్ ఆశలు మోస్తోంది. ఈ జంట తొలి రౌండ్లో హు కె యువాన్, లిన్ జియాంగ్ (చైనా) ద్వయాన్ని ఎదుర్కోనుంది. హరిహరన్, అర్జున్ జంట ఎనిమిదో సీడ్ తకురో హోకి, యుగో కొబయాషి (జపాన్) జోడీతో తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వి శర్మ, దేవిక సిహాగ్ బరిలో ఉన్నారు. హాన్ యూ (చైనా)తో ఉన్నతి, అమేలియా షుజ్ (డెన్మార్క్)తో తన్వి, కలోయానా (బల్గేరియా) దేవిక పోటీ పడనున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో ద్వయం.. టాంకిడ్, టాంరగ్ (థాయ్‌లాండ్) జోడీని, రోహన్ కపూర్, రుత్విక శివాని గద్దె జంట.. వు గువాన్, లీ చియా (చైనీస్ తైపే) ద్వయాన్ని ఎదుర్కోనుంది.

(c) eenadu

అత్యవసర చికిత్సలో జాప్యానికి భారీ జరిమానా

- బాధితులకు రూ.కోటి చెల్లించండి
- సిటిజన్స్ హాస్పిటల్స్, వైద్యురాలికి వినియోగదారుల కమిషన్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: అత్యవసర సమయంలో చికిత్స అందించకుండా నిబంధనల పేరుతో కాలయాపన చేసి యువ స్కాలర్ ప్రాణం పోవడానికి కారణమయ్యారంటూ దాఖలైన కేసులో సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్స్, న్యూరాలజిస్ట్ డా.అపర్ణ విజయ్‌కుమార్‌కు హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్-1 భారీ జరిమానా విధించింది. మృతుని తల్లిదండ్రులకు ఆసుపత్రి, వైద్యురాలు సంయుక్తంగా రూ.కోటి పరిహారంతోపాటు కేసు ఖర్చుల కింద మరో రూ.50 వేలు చెల్లించాలని తీర్పు వెలువరించింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సూర్యప్రతాప్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) ఆంగ్ల విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. 2020 ఆగస్టు 17న అతను హాస్టల్ కారిడార్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండగా తోటి విద్యార్థులు మొదట వర్సిటీ హెల్త్‌సెంటర్‌కు, తర్వాత గచ్చిబౌలిలోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్(పక్షవాతం) వచ్చినట్లు గుర్తించారు. స్ట్రోక్ వచ్చిన మొదటి 24 గంటల కీలక సమయం లోపల క్లాట్‌ను తొలగించే 'మెకానికల్ థ్రాంబెక్టమీ' సర్జరీ చేయాల్సి ఉంది. అయితే సూర్యప్రతాప్ తల్లిదండ్రులు అందుబాటులో లేరని సిటిజన్స్ ఆసుపత్రి యాజమాన్యం సర్జరీ ఆలస్యం చేసింది. కొవిడ్ నెగెటివ్ రిపోర్టు వచ్చేవరకు చికిత్స ఆపకూడదనే నిబంధనలున్నా.. సూర్యప్రతాప్‌ను ఐసోలేషన్ వార్డుకు మార్చి సమయాన్ని వృథా చేశారు. ఆ తర్వాత వెంటిలేటర్‌పై ఉంచి అత్యంత విషమ స్థితిలో కాంటినెంటల్ హాస్పిటల్‌కు పంపారు. అక్కడ చేరిన కొద్దిసేపటికే బ్రెయిన్‌డెడ్ స్థితికి చేరుకొని ఆగస్టు 21న సూర్యప్రతాప్ మరణించారు. నిర్ధారణ పరీక్షలు, సాక్ష్యాలను పరిశీలించిన వినియోగదారుల కమిషన్.. సిటిజన్స్ హాస్పిటల్, న్యూరాలజిస్ట్ తీవ్ర సేవాలోపానికి పాల్పడ్డారని పేర్కొంది. ఏకైక ఆధారమైన కుమారుడిని కోల్పోయిన వృద్ధ తల్లిదండ్రులకు రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదేశించింది. తీర్పు వెలువడిన 45 రోజుల్లో ఈ మొత్తం చెల్లించకపోతే 9 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇందులో మిగతా పక్షాలైన కాంటినెంటల్ హాస్పిటల్, మెడిసిస్ ల్యాబ్‌లపై వచ్చిన ఆరోపణలకు తగిన ఆధారాలు లేనందున వారిపై కేసు కొట్టివేసింది.

బీసీ విదేశీవిద్య ఉపకార వేతనాల మంజూరు నిలిపివేయాలి

సంక్షేమశాఖకు బీసీ కమిషన్ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపులే విదేశీ విద్యానిధి కింద ఉపకార వేతనాల మంజూరు ప్రక్రియను నిలిపివేయాలని బీసీ సంక్షేమశాఖను బీసీ కమిషన్ ఆదేశించింది. గతంలో ఉపకార వేతనాల సంఖ్యలో ఈబీసీలకు 5% సీట్లు కేటాయించగా.. ఇప్పుడు 350లో 100 సీట్లు (28%) పెంచడానికి కారణాలు చెప్పాలని బీసీ సంక్షేమశాఖ కమిషనర్‌ను కోరింది. బీసీ రిజర్వేషన్లలో రోస్టర్ పాయింట్ల నిబంధనలపై అన్యాయం జరుగుతోందంటూ వచ్చిన విజ్ఞప్తులు సమీక్షించేందుకు ఉన్నతస్థాయి కమిటీని నియమించాలని ప్రభుత్వానికి తెలియజేయనున్నట్లు వెల్లడించింది. సోమవారం కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, కమిషన్ సభ్యకార్యదర్శి బాల మాయాదేవిలతో ఛైర్మన్ జి.నిరంజన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమిషన్ పలు అంశాలపై చర్చించింది. "ప్రస్తుత రోస్టర్‌పాయింట్ల నిబంధనలు సమీక్షించేందుకు కమిటీ వేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నాం. జీవో నం.46లోని అంశాలపై అధ్యయనంలో భాగంగా 33 జిల్లా కేంద్రాల్లో బహిరంగ విచారణలు నిర్వహిస్తాం. ఈ పర్యటనలు సెప్టెంబరు చివరి వారంలో ప్రారంభమై, డిసెంబరు వరకు కొనసాగుతాయి. తెలంగాణ ఆవిర్భావం తరువాత బీసీ జాబితాలో తొలగించిన కులాలకు ఇప్పటికే ధ్రువీకరణ పత్రాలు జారీచేస్తున్నట్లు కమిషన్ గమనించింది. ఈ విషయంలో సీసీఎల్ఏ నుంచి వివరణ, సమాచారం కోరనున్నాం" అని బీసీ కమిషన్ వెల్లడించింది.

'అనధికార సెలవులపై ఉన్న వైద్యుల వివరాలు ఇవ్వండి'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో పనిచేస్తూ ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై ఉన్న వైద్యుల వివరాలు తమకు అందజేయాలని సోమవారం డీఎంఈ వాణి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముందుగా వారి శాఖాధిపతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆరు నెలలకుపైగా అనధికార సెలవుల్లో ఉన్నవారి వివరాలు ఆయా కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు వెంటనే డీఎంఈ కార్యాలయానికి అందజేయాలని, తగిన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎ.శ్రీధర్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎ.శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కౌన్సిల్ తొలి సర్వసభ్య సమావేశం హైదరాబాద్‌లోని ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయంలో జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యురాలి హోదాలో డీఎంఈ డాక్టర్ వాణి సమావేశానికి నేతృత్వం వహించారు. సభ్యులు వినోద్‌కుమార్, పరమాత్మ, సుధాకర్, రాజు, ప్రమోద్, శ్రీకేశ్, రమేశ్, ప్రసన్నలక్ష్మి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు చెప్పినట్లు నూతన అధ్యక్షుడు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అలాంటివారితో సంబంధాలు తెంచుకోండి

మీ క్రమశిక్షణను, డబ్బు సంపాదించేందుకు మీరు పడుతున్న శ్రమను ఎవరైనా ఎగతాళి చేస్తున్నట్లయితే.. వారితో సంబంధాలు తెంచుకోండి! ఒకరకంగా పేదరికం కూడా అంటువ్యాధి వంటిదే. పెట్టుబడులను ఎంత జాగ్రత్తగా ఎంచుకుంటారో.. మీ చుట్టూ ఉండే వ్యక్తులనూ అంత జాగ్రత్తగా ఎంచుకోండి.

– అదితీ చౌధరీ, న్యాయవాది

కరవు నేలపై కొత్త చరిత్ర!

- వెలిగొండ తొలిదశ పూర్తి చేశాం
- రెండో దశా పూర్తి చేస్తాం
- ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఫీడర్ కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

రైతులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు, ఒంగోలు: 'కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర వెలిగొండ. ఇక పశ్చిమ ప్రాంతంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రే. నల్లమల సాగర్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరిచ్చే బాధ్యత మాదే. దుర్భిక్షంతో పోరాడిన రైతన్నకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురుచూసి అలసిన తరాలకు.. కృష్ణా జలాలతో స్వాగతం పలుకుతున్నా. ప్రాజెక్టు కోసం ఇళ్లు, ఊళ్లు, భూములు త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నా. వారి త్యాగం ఫలితంగానే లక్షల మంది జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలోని మార్కాపురం జిల్లా డోర్నాల మండలం గంటవానిపల్లెలో సోమవారం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను సీఎం చంద్రబాబు జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా కొల్లం వాగు జలాశయం నుంచి జంట సొరంగాల ద్వారా ఫీడర్ ఛానల్ వద్దకు చేరుకున్న కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. అనంతరం సాష్టాంగ ప్రమాణం చేసి.. నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేశారు. 'వెలిగొండ మొదటి దశ ప్రారంభించాం. తరతరాలుగా ఇక్కడి వారు ఎంతో నష్టపోయారు. నష్టపోయిన ప్రాంతాన్ని ఆదుకొనే అవకాశం రావడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను. ఇక్కడితో ఆగిపోం.. ఇదే వేగంతో వెలిగొండ ఫేజ్-2 కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యత మాదే. కృష్ణా పుష్కరాలు కూడా మార్కాపురంలోనే వైభవంగా నిర్వహించుకుందాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

విశాఖలో ఏఐజీ ఆసుపత్రికి శంకుస్థాపన

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఎండాడ: 'సాంకేతికత వినియోగంతోపాటు పరిశోధనలకు డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చిరునామా ఏఐజీ. ఇది కార్పొరేట్ ఆసుపత్రి మాత్రమే కాదు. నిరుపేదలకు అద్భుతమైన వైద్యం అందిస్తున్న దేవాలయం" అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం విశాఖలోని ఎండాడ వద్ద రూ.2 వేల కోట్ల పెట్టుబడితో వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఏఐజీ ఆసుపత్రికి ఆయన శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఏఐజీ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా ఆ సంస్థ దశలవారీగా 9వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశ నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయనున్నారు" అని చెప్పారు.

కమిట్‌మెంట్‌తో పనిచేసే వ్యక్తి నాగేశ్వరరెడ్డి

'ఏఐజీ ఆసుపత్రి గురించి మాట్లాడే ముందు ఒక అల్లరి పిల్లవాడి గురించి చెప్పాలి. విశాఖలో పుట్టి ఇక్కడే పెరిగారు. పెట్రోలు మండడం వల్లే కారు ముందుకెళుతుందని ఎవరో చెబితే అది నిజమో, కాదో తెలుసుకోవడానికి గ్యారేజీలో కారు ట్యాంక్‌లోని పెట్రోలును బయటకు తీసి కింద పోసి నిప్పు అంటించాడు. ఇంట్లో ఏసీ లేకపోతే చిన్న తమ్ముడిని ఫ్రిజ్‌లో పెట్టి డోర్ వేసి మర్చిపోయాడు. ఆ అల్లరి తట్టుకోలేక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చేర్చారు. ఆ అల్లరి పిల్లవాడు క్రమశిక్షణ కలిగిన కుర్రాడిగా మారారు. ఆయనే డాక్టర్ నాగేశ్వరరెడ్డి. కర్నూలు కళాశాలలో మెడిసిన్ చేశారు. పట్టుదలతో కృషిచేసి గ్యాస్ట్రో ఎంటరాలజీలో ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచారు' అని ప్రశంసించారు.

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్, డాక్టర్ నాగేశ్వర రెడ్డి. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డా.జి.వి.రావు తదితరులు

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల సహకారంతో..

–డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి

"విశాఖలో ఈ రోజు వైద్య చికిత్స రంగంలో చరిత్రాత్మక ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది భావోద్వేగ సమయం. నేను విశాఖ కేజీహెచ్‌లో జన్మించాను. నా జీవితంలో తొలి ఆరేళ్లు ఇక్కడే గడిచాయి. హైదరాబాద్‌లో ఏఐజీ ఆసుపత్రి అభివృద్ధి చేసిన తర్వాత విశాఖ రావాలని కోరిక ఉండేది. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకారంతో అది సాకారమైంది. విశాఖలో సాధారణ కార్పొరేట్ ఆసుపత్రిని నిర్మించడం లేదు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ఆసుపత్రిని నిర్మించబోతున్నాం. విశాఖను ఒక మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుదాం".

రోశయ్య చరిత్ర తెలిసేలా మ్యూజియం

- మాజీ సీఎం కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్

రాజకీయ విలువలకు మానవ రూపం, నిజాయతీకి నిలువెత్తు ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సోమవారం విశాఖలోని సిరిపురం సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో చంద్రబాబు, వైఎస్సార్ మధ్య ఎప్పుడైనా వాడీవేడిగా వాదన జరిగినప్పుడు రోశయ్య నిలబడి కాస్త చల్లబరిచేవారని గుర్తు చేసుకున్నారు. "రోశయ్య ఒక రాజకీయ పాఠశాల. నేటి తరానికి స్ఫూర్తి. అందుకే పాఠ్యాంశాలలో రోశయ్య చరిత్ర, రాజకీయ విలువలు, సమాజ సేవ గురించి ఒక అధ్యాయం పెట్టించే బాధ్యత నాది. రోశయ్య చరిత తెలిపేలా ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆర్యవైశ్య పెద్దలంతా ఆలోచించి మ్యూజియం కోసం స్థలం చూస్తే 18 నెలల్లో పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా దేశానికి అంకితమిద్దాం" అని చెప్పారు.

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి లోకేశ్

నేడో, రేపో మజ్లిస్ ఎమ్మెల్సీ రాజీనామా

- పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ రహమత్ బేగ్‌పై ఒవైసీ ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: వివాదాల్లో చిక్కుకున్న మజ్లిస్ పార్టీ బహిష్కృత నాయకుడు మీర్జా రహమత్ బేగ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనున్నారు. మంగళవారం లేదా బుధవారం తన రాజీనామా పత్రాన్ని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి సమర్పించనున్నారు. మజ్లిస్ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించినందుకు పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. రహమత్ బేగ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. తక్షణం రాజీనామా చేయడంతోపాటు పార్టీకి సంబంధించిన రికార్డులు, ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు ఆయన రాసిన లేఖలన్నింటినీ దారుస్సలాంలోని కేంద్ర కార్యాలయంలో అప్పగించాలంటూ ఆదేశించారు. పార్టీ నాయకుల నుంచి సమాచారం అందుకున్న బేగ్ రాజీనామా చేస్తానంటూ వారికి చెప్పినట్టు తెలిసింది.

మీర్జా రహమత్ బేగ్

కార్యకర్తల ఫిర్యాదులతో..

రహమత్ బేగ్ రాజీనామాకు సిద్ధమవడం వెనుక పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆగస్టు 26న కుటుంబ సభ్యులతో ఉమ్రా యాత్రకు వెళ్లిన బేగ్‌ను పార్టీ నాయకులు ఆగస్టు 27న వెనక్కి రప్పించారు. కొందరు నాయకులు శుక్రవారం బేగ్‌ను కలిసి పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామంటూ చెప్పారు. రాజీనామా సమర్పించాలంటూ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశించారంటూ ఆయనకు వివరించారు. బహిష్కరణ, రాజీనామాల అంశాల తెరవెనుక.. గోల్కొండ ప్రాంతంలో నివసిస్తున్న ఒక మహిళతో ఆయన సన్నిహితంగా మెలుగుతున్నారని కొంతకాలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పార్టీ కార్యకర్తలు అధిష్ఠానానికి ఫిర్యాదులు కూడా చేశారు. ఈ క్రమంలోనే వీడియో ఒకటి బహిర్గతమైంది. మరోవైపు పార్టీ కోసమంటూ రాజేంద్రనగర్‌లో, విదేశాల్లో ఉంటున్న మజ్లిస్ అభిమానుల నుంచి డబ్బు వసూలు చేశారని మజ్లిస్ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతోపాటు అభివృద్ధి పనులు చేయిస్తానంటూ, కాంట్రాక్టులు ఇప్పిస్తానంటూ కొందరి నుంచి కమీషన్లు తీసుకున్నారని కార్యకర్తలు కొన్ని ఆధారాలు ఇచ్చినట్టు తెలిసింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న పార్టీనేతలు.. బేగ్‌పై వేటు వేయాలంటూ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కోరారు. స్పందించిన ఆయన బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించాలంటూ నాయకులకు సూచించారు.

విత్తనాభివృద్ధి సంస్థలో 'ఆగ్రోస్' విలీనం!

- వచ్చే మంత్రి మండలిలో ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వరంగ సంస్థల విలీనంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(ఆగ్రోస్)ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసింది. వచ్చే మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం దీనికి ఆమోద ముద్ర వేయనుంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం కోసం ఈ సంస్థను ప్రభుత్వం ఐదు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసింది. దీని ద్వారా వ్యవసాయ భూముల అభివృద్ధి, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాల సరఫరా తదితర కార్యకలాపాలను చేపట్టింది. కాగా, ఆగ్రోస్‌లో సిబ్బంది పదవీ విరమణలతో కొత్త నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం 25 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో కార్యకలాపాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. సంస్థకు ఆదాయం లేకపోవడంతో నిర్వహణ భారమైంది. దీనికితోడు సంస్థకు నామినేటెడ్ పాలకవర్గం ఏర్పాటు కావడం, జీతభత్యాలు, ఖర్చులు అదనపు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆగ్రోస్‌ను తమ అనుబంధ సంస్థల్లో ఒకదానిలో విలీనం చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు.

ఆగ్రోస్ సంస్థ

కమిటీ సూచనల మేరకు ఏర్పాటు...

సంస్థ విలీనం విషయంలో ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయగా.. కంపెనీల చట్టం కింద ఏర్పడిన ఆగ్రోస్‌ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో విలీనం చేయాలని అది సూచించింది. ఆగ్రోస్ విలీనం ద్వారా సిబ్బంది సమకూరడంతోపాటు కార్యకలాపాలను విస్తృతం చేయవచ్చని, రాష్ట్రమంతటా దాని ద్వారా విత్తనాల పంపిణీ చేపట్టవచ్చని, భవనాలు, భూములను వినియోగించుకోవచ్చని తెలిపింది.

ప్రియురాలు బైక్‌పై కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం సహజమే

రోడ్డు ప్రమాదం కేసులో మదురై ధర్మాసనం వ్యాఖ్య

చెన్నై, న్యూస్‌టుడే: బైక్‌పై ప్రియురాలు కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం రావడం సహజమేనని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడులోని తేనికి చెందిన గోపాల్(19) 2018 మే 10న బైక్‌పై ఓ యువతితో కలిసి వెళుతుండగా వ్యాను ఢీకొంది. గోపాల్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి మృతికి పరిహారం కోరుతూ అతడి తల్లిదండ్రులు కేసు వేయడంతో తేని కోర్టు రూ.25 లక్షలు ఇవ్వాలని ఇన్సూరెన్స్ సంస్థకు ఉత్తర్వులిచ్చింది. వీటిని సవాలు చేస్తూ బీమా సంస్థ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేసింది. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతిల ధర్మాసనం విచారణ జరిపింది. ప్రమాదానికి ద్విచక్ర వాహనం నడిపిన గోపాల్ ఓ కారణమని, పరిహారంలో సగం తగ్గించాలని బీమా సంస్థ వాదించింది. 'బైక్ నడిపిన 19 ఏళ్ల యువకుడి వెనుకఅతడి ప్రియురాలి కూర్చుంది. అలాంటి సమయంలో ఎవరికైనా ఉత్సాహం వస్తుంది. వ్యాన్ సరైన మార్గంలో వెళుతున్నందున ప్రమాదంలో గోపాల్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు కన్పిస్తోంది. ఆ మేరకు పరిహారాన్ని 25% తగ్గించాలి' అని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

'మాలల' సచివాలయం ముట్టడి ఉద్రిక్తం

- పోలీసులు, నాయకుల మధ్య తోపులాట

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీ వర్గీకరణలోని రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర నష్టం జరుగుతోందని, దాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నించారు. సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చిన మాల మహానాడు నాయకులు సచివాలయం వద్దకు ర్యాలీగా వెళ్లడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రధాన గేటు వైపు కొందరు, ఎన్టీఆర్ మార్గ్ నుంచి భారీ సంఖ్యలో చేరుకోవడంతో పోలీసులు కొద్దిసేపు ఉరుకులు, పరుగులు చేపట్టారు. ముట్టడికి వచ్చిన వారిని అరెస్టు చేసి హైదరాబాద్ నగరంలోని ఏడు ఠాణాలకు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ జీవో 99ని రద్దుచేసి ఎస్సీ గ్రూప్-3లోని 26 కులాలకు న్యాయం చేయాలని, 20లోపు రెండు రోస్టర్ పాయింట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోలీసుల తోపులాటలో సంఘం జాతీయ అధికార ప్రతినిధి దార సత్యం గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన దార సత్యం

సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మాల మహానాడు నాయకులు

తిరుమలలో వరుణయాగం ప్రారంభం

యాగశాలలో అశ్వానికి పూజలు చేస్తున్న రుత్వికులు

తిరుమల, న్యూస్‌టుడే: దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో చేపట్టిన కారీరిష్టి యాగం, వరుణ యాగం, పర్జన్య శాంతి హోమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కె.ఎస్.ఎస్.అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద పండితులు యాగాలు, జపాలు, పారాయణాలు చేపట్టారు. ఆరుగురు రుత్వికులు కారీరిష్టి యాగంలో పాల్గొనగా, 12 మంది రుత్వికులు గోగర్భం తీర్థంలో నడుములోతు నీటిలో నిల్చొని వరుణ, పర్జన్య మంత్రాలు పఠించారు. ఏడు వేదశాఖలకు చెందిన 14 మంది రుత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. ఈ నెల 3వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు.

నేటి నుంచి తమిళనాడులోని ప్రధాన ఆలయాల్లో సెల్‌ఫోన్లు నిషేధం

చెన్నై(వేళచ్చేరి), న్యూస్‌టుడే: తమిళనాడులోని ప్రధాన ఆలయాల్లో మంగళవారం నుంచి సెల్‌ఫోన్ల వినియోగాన్ని నిషేధిస్తూ అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల వివిధ ఆలయాల్లో భక్తులు సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడంతో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నిషేధం అమల్లోకి తెచ్చారు. రామేశ్వరం రామనాథస్వామి ఆలయం, మదురై మీనాక్షి ఆలయం, తిరుచ్చి రంగనాథస్వామి ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం, చెన్నై తిరువల్లిక్కేణి పార్థసారథి, మైలాపూర్ కపాలీశ్వరాలయం సహా రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆలయాల్లో సెల్‌ఫోన్లను నిషేధించారు. భక్తులు తమ మొబైల్ ఫోన్లను ఆలయాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో రూ.5 రుసుము చెల్లించి భద్రపరుచుకోవచ్చని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

అసెంబ్లీ కమిటీల సమావేశంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సభ్యులు, అధికారులు

కమిటీలు నిర్మాణాత్మక సూచనలు చేయాలి

మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: సభల్లో అన్ని అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉండకపోవచ్చని, అలాంటి అంశాలను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. శాసన మండలి సమావేశ మందిరంలో సోమవారం అంచనాల కమిటీ, వన్యప్రాణులు, పర్యావరణ కమిటీ, సౌకర్యాల కమిటీ, గ్రంథాలయ కమిటీల సమావేశాలు జరిగాయి. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. "ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు, ప్రజాధనం సద్వినియోగం వంటి అంశాలపై కమిటీలు ప్రత్యేక దృష్టిసారించాలి. ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తున్న నిధులు సక్రమంగా, లక్ష్యాలకు అనుగుణంగా వినియోగమవుతున్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తూ ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని శాసనసభ గ్రంథాలయాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. "కేవలం ప్రభుత్వ చర్యలను సమీక్షించే బాధ్యతకే పరిమితం కాకుండా.. రాష్ట్రంలో జీవనానికి ఆధారమైన అడవులు, వన్యప్రాణులు, జల వనరులు, గాలి, పర్యావరణ సమతౌల్యతను పరిరక్షించడంలో కమిటీలు కీలక పాత్ర పోషించాలి" అని సూచించారు. మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, ఆయా కమిటీల సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన

ఈనాడు, హైదరాబాద్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందుకు ఉద్యోగుల ఐకాసలు, ఉపాధ్యాయ సంఘాలు, సీపీఎస్ ఉద్యోగుల సంఘాలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపనున్నాయి. ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భోజన విరామం సమయంలో నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. లచ్చిరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న మరో ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో సీసీఎల్ఏ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు.

ఇందిరాపార్కు వద్ద పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నా

ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల సాధన లక్ష్యంగా పీఆర్‌టీయూటీఎస్ మంగళవారం చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనుంది. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డిలు సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పీఆర్సీ ప్రకటన, సీపీఎస్ రద్దు- ఓపీఎస్ అమలు, 2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్ సాధన, పెండింగ్ డీఏల విడుదల అనే నాలుగు ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని సంఘాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, సంఘం ఆడిట్ కమిటీ ఛైర్మన్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు

- గతంలో వారి రిమాండ్‌ను కొట్టేసిన హైకోర్టు
- సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసిన ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిలకు జ్యుడీషియల్ రిమాండ్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రతివాదులిద్దరికీ నోటీసులు జారీ చేసింది. నిందితులిద్దరినీ రిమాండ్‌కు పంపుతూ జులై 20న విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసేటప్పుడు అందుకు కారణాలేమిటో వారికి చెప్పకపోవడాన్ని తప్పుబడుతూ హైకోర్టు రిమాండ్‌ను కొట్టేసింది. దాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం వేసిన ఎస్ఎల్‌పీపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపించారు.

గల్లా రామచంద్రనాయుడికి నాయుడమ్మ స్మారక పురస్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ ఏడాది యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, అమరరాజ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడికి ప్రదానం చేయనున్నట్లు శ్రీ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, వైస్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని సెప్టెంబరు 10న సాయంత్రం 4 గంటలకు తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

(c) eenadu

ఈ అదనాలు వద్దు!

రూ.లక్షలు పోసి వాహనం కొంటాం. ఆ తర్వాత షోరూం వాళ్లు సూచించారని కొన్ని, యాక్సెసరీస్ షాపుల వాళ్లు తప్పనిసరి అన్నారని మరి కొన్ని ఉపకరణాలు వాహనానికి బిగించుకుంటారు. రూ.లక్షలు పెట్టాం.. ఈ చిన్నవి అమర్చుకుంటే ఏంటి అన్న ఆలోచనో, వాహనం కూడా గ్రాండ్‌గా కనిపిస్తుందనో అవన్నీ పెట్టేసుకుంటారు. తీరా బండి రోడ్డెక్కాక తెలుస్తుంది. ఒక్కో నిబంధన. ఎప్పుడైనా అత్యవసర పని మీద ఊరెళ్తుంటే పోలీసులు ఆపి 'అదెందుకు పెట్టావ్.. ఇదెందుకు బిగించావ్' అని అడుగుతుంటే.. ఏమీ పాలుపోని స్థితి తలెత్తుతుంది. కొన్ని సార్లు ప్రమాదం జరిగే వరకూ తెలియదు. అందుకే వాహన ఉపకరణాలు, వాటి ప్రభావాలపై ముందే అవగాహన పెంచుకోవాలని ఆటో మొబైల్ నిపుణులు సూచిస్తున్నారు.

మాగ్నెటిక్ కర్టెన్లు

వాహన డోర్ల అద్దాలకు నల్ల ఫిలిం వాడొద్దన్నందుకు ఏకంగా సన్‌షేడ్‌లు, మాగ్నటిక్ కర్టెన్లు ఉపయోగిస్తున్నారు. ఇవికూడా చట్టవిరుద్ధమే.

సమస్య: కారు డోర్లకు పెట్టే ఈ తెరల వల్ల మలుపులను గుర్తించలేం.

● బయటి పరిసరాలు కనిపించకుండా వాడే నల్లటి తెరల వల్ల లైన్ మార్చేటప్పుడు, మలుపు తీసుకునేటప్పుడు, సైడ్ మిర్రర్ సరి చేసుకునేటప్పుడు ఇబ్బంది అవుతుంది.

అద్దంపై రాతలు

వాహనం ముందు అద్దం మూలల్లో పీయూసీ, టోల్ వంటి స్టిక్కర్లు రేర్‌వ్యూ మిర్రర్‌కు సరిగ్గా వెనుక అతికించుకోవచ్చు. అంతకు మించి డ్రైవర్ దృష్టి మరల్చే మరేవీ అతికించొద్దు.

సమస్య: వెనుక, ముందు ఏ అద్దంపైనైనా రేడియంతో ఎలాంటివి అతికించకూడదు. అద్దాలు 70శాతం కాంతి ప్రసరింపజేసేలా ఉండాలి.

● డ్రైవర్‌కు మిర్రర్‌లో వెనుక దృశ్యాలు కనిపించకుండా వెనుక గ్లాస్‌పై 'డాడీ గిఫ్ట్', గాడ్స్ గిఫ్ట్ రేడియం స్టిక్కర్లు వేయించొద్దు.

● ఇలా చేస్తే మోటారువాహన చట్టంలోని 177సెక్షన్ ప్రకారం జరిమానా విధిస్తారు.

అదనపు బంపర్స్

బండి బాహుబలిలా కనిపించాలని కొందరు, ట్రాఫిక్‌లో వాహనాలు తగిలి కారుకు డెంట్లు పడతాయేమోనని చాలా మంది ముందు, వెనుక స్టీల్ బంపర్ రాడ్లు అమర్చుకుంటారు. మోటారు వెహికిల్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం ఇవి నిషేధం.

సమస్య: ● మెటల్ బంపర్స్ వల్ల ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగ్స్ త్వరగా తెరుచుకోవు.

● ఆ రాడ్స్ ద్విచక్రవాహన చక్రాల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ప్రమాదం చోటుచేసుకుంటే వీటి వల్ల వాహనంపై ఉన్నవారికి తీవ్ర గాయాలవుతాయి.

ఫుట్ రెస్ట్

కారుతో సహా వచ్చేవి ఉంటే ఏమీ కాదు. ఎందుకంటే అవి కారు పొడవు, ఎత్తు తదితర ప్రమాణాల ఆధారంగా ఏర్పాటు చేస్తారు.

సమస్య: అదనంగా బిగించుకునే ఫుట్‌రెస్టులు, క్రాష్‌గార్డులు వాహన బరువును అసమతౌల్యం చేస్తాయి.

● ఒక్కోసారి వేగంగా వెళ్తున్నప్పుడు ప్రభావం చూపుతాయి.

● ఇవి బిగించుకున్న వాటికే కాదు.. పక్కనుంచి వెళ్లే వాహనాలకూ ప్రమాదకరమే.

నానా రకాల నంబర్ ప్లేట్లు

నంబరు ప్లేట్లలో ఏకరీతి కోసం ప్రభుత్వం హై సెక్యూరిటీ ప్లేట్లు తీసుకొచ్చింది. అవి ఉంటే పోలీసులకు వాహనాన్ని సులువుగా గుర్తిస్తారు.

సమస్య: నంబర్లు పేట్లను వంచడం, కావాల్సిన నంబరును పెద్దగా చేయడం వల్ల ఆపద సమయంలో కారును సులువుగా గుర్తించలేరు. నంబరు ప్లేటుపై పేర్లు, గుర్తులు, ఇతర ఎలాంటి అలంకరణలు ఉన్నా చట్ట విరుద్ధమే.

● పోలీసులకు వాహనంపై అనుమానాలు తలెత్తుతాయి.

మార్పులు వాహనాన్ని ప్రభావితం చేయొద్దు: వెంకటరమణ, జేటీసీ

ఎలాంటి అదనపు ఉపకరణాలు బిగించుకున్నా.. అవి వాహన అసలు ఫ్రేంను, దాని వేగాన్ని ప్రభావితం చేయొద్దు. డోర్ తీయగానే కాలు పెట్టుకునేలా కొన్ని వాహనాలకు ఫుట్‌రెస్టులు బిగిస్తారు. అవి పక్కన వెళ్లే వాహనాలకు తగిలేలా ఉంటాయి. ఇలా ఉపకరణాల వల్ల చాలా వరకు బీమా వర్తించదు. ఈ విషయం వాహనంలో ఉపకరణాలు బిగించే సంస్థలేవీ చెప్పవు. యాక్సరీస్ అంటే వాహనానికి, అందులో కూర్చున్నవారికి, ఇతర వాహనదారులకూ సౌకర్యంగా ఉండాలే తప్ప ఇబ్బంది కాకూడదని గుర్తించాలి.

- ఈనాడు, హైదరాబాద్

పరుగు గెలిచిన అమ్మ కథ..

సాదాసీదా చీర.. కాళ్లకు మామూలు స్లిప్పర్లు.. అయినా మొక్కవోని దీక్షతో పరుగెత్తిన 47 ఏళ్ల రమాబాయి రణ్వీర్ 3 కి.మీ.ల మారథాన్ గెలిచారు. మహారాష్ట్రలోని బీడ్ జిల్లా అంబాజోగాయి ప్రాంతానికి చెందిన ఈమె ఇద్దరు పిల్లల తల్లి. భర్త మరణించడంతో కుటుంబ భారం ఆమెపైనే పడింది. వంట పనిచేస్తూ కుమార్తెలను పోషిస్తున్నారు. ఇటీవల అంబాజోగాయిలో అమృత్ దౌడ్ పేరుతో 3 కి.మీ. మారథాన్ నిర్వహించగా రమాబాయి అందులో పాల్గొన్నారు. రేసులో ఆమె చెప్పులు తెగిపోయినా.. ఆగిపోలేదు. వాటిని చేతిలో పట్టుకుని మారథాన్ కొనసాగించి, మారథాన్ గెలిచి రూ.3 వేలు నగదు బహుమతి అందుకున్నారు. 'ఈ ప్రైజ్ మనీ చాలా చిన్న మొత్తమే కావొచ్చు.. కానీ ఇది నా కుమార్తె ఫీజు కోసం ఉపయోగపడుతుంది. తన చదువు ఆగిపోకుండా ఉంటుంది' అని చెబుతుంటే అక్కడున్నవారు ఉద్వేగానికి లోనయ్యారు. కన్న బిడ్డల భవిత కోసం ఆమె చూపిన దృఢసంకల్పాన్ని అభినందించారు.- బీడ్

అపాయమ్ము తప్పింది

విశాఖపట్నంలోని మల్కాపురం గాంధీగ్రాం పశు వైద్యశాలలో డా.సీహెచ్ సునీల్‌కుమార్ సర్పానికి అరుదైన శస్త్రచికిత్స చేశారు. సోమవారం జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో పాడైపోయిన నెట్‌లో 8 అడుగుల పొడవున్న పాము (నాగజెర్రి) చిక్కుకుంది. స్నేక్ క్యాచర్ నాగరాజు సర్పాన్ని పట్టుకునే క్రమంలో దాని తల భాగంలో ఉన్న గాయాలను గమనించారు. ఈ మేరకు పాముని స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లారు. సునీల్‌కుమార్ గాయాలైన రెండు చోట్ల దానికి శస్త్రచికిత్స చేశారు. రెండు రోజులు సంరక్షణలో ఉంచాలని సూచించారు.

- న్యూస్‌టుడే, విశాఖపట్నం

రంగు మార్చే తొండవా..
ఊసరవెల్లికి తమ్ముడివా!

రాయిలో కలిసిపోయినట్లుగా కనిపిస్తున్న ఈ తొండ పేరు 'బ్లాన్ ఫోర్డ్ రాక్ అగామా'. మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.రవీందర్‌రావు దీని గురించి ఆసక్తికర విషయాలు తెలియజేశారు. "బూడిద, గోధుమ మిశ్ర వర్ణ దేహంతో ఉండే.. ప్రపంచంలో మరెక్కడా కనిపించని ఈ జీవులు భారతదేశ దక్షిణ ద్వీపకల్ప తూర్పు భాగానికే పరిమితం. వీటి తోక శరీరం కన్నా పొడవుగా ఉంటుంది. సంతానోత్పత్తి కాలంలో, వేసవిలో మగ తొండలు తల భాగాన్ని సింధూర వర్ణం, మిగతా శరీర భాగాన్ని నలుపు రంగులోకి మార్చుకుంటాయి. ఆడ తొండలను ఆకర్షించడానికి, ఇతర మగ తొండలకు తమ సరిహద్దులను గుర్తు చేయడానికి ఈ రంగులను ప్రదర్శిస్తాయి. వీటికి చర్మం లోపలి భాగంలో అన్ని రంగుల్లో మెలనోఫోర్ కణాలుంటాయి. దీంతో అవి ప్రదేశాన్ని బట్టి చర్మం రంగులను మార్చుకునే గుణాన్ని కలిగి ఉంటాయి. ఈ ప్రక్రియను 'రక్షకవర్ణత్వం' అంటారని రవీందర్‌రావు తెలిపారు.- ఈనాడు, నల్గొండ

గన్ పేలిస్తే..
జంతువులు వలలో!

నీటిలో వల వేస్తే చేపలు చిక్కుతాయి. అదే గన్‌తో వల విసిరితే జంతువులు, పక్షులు పడతాయి. ఆసక్తిగా అనిపిస్తుంది కదూ! ఈ చిత్రంలోని వ్యక్తి చేతిలో ఉన్న పరికరం గురించే ఈ విషయమంతా. దీన్ని నెట్‌గన్ అంటారు. జంతువులు, పక్షులను గాయపరచకుండా, ప్రాణహాని లేకుండా పట్టుకోవడానికి దీన్ని ఉపయోగిస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ గన్‌ను జర్మనీ నుంచి రూ.5 లక్షలు వెచ్చించి తిరుపతికి తెప్పించారు. దీనిపై తిరుపతి అటవీశాఖ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.అరుణ్ మాట్లాడుతూ 'సాధారణ ఎస్ఎల్ఆర్ గన్ మాదిరే ఇది పనిచేస్తుంది. బుల్లెట్‌ను గన్‌కు ముందుభాగంలో అమర్చిన నెట్‌ను ఓపెన్ చేయడానికి ఉపయోగిస్తారు. 30-50 అడుగుల దూరంలోని చిన్న జంతువులను, పక్షులను పట్టుకోవడానికి దీనిని ఉపయోగిస్తాం. ఎస్వీయూ, వెటర్నరీ, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కపిలతీర్థం వద్దకు వచ్చే జింకలను పట్టుకుని సఫారీలో వదులుతున్నాం. నూలుతో తయారు చేసిన వల కావడంతో ఎంతటి బలమైన జంతువైనా బంధించవచ్చు. అవి వలను తెంపలేవు. రాష్ట్రంలో ఇక్కడ ఒక్కటే ఇది ఉంది' అని చెప్పారు. - ఈనాడు, తిరుపతి

బారు చిక్కుడు..

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన రైతు రాయల వెంకటేశ్వర్లు తన ఇంటి ఆవరణలో మూడు నెలల కిందట 15 గోరుచిక్కుడు విత్తనాలు నాటారు. వీటిలో ఒక మొక్క ఏకంగా 12 అడుగుల వరకు పెరిగింది. ఇప్పటివరకు మూడుసార్లు గోరుచిక్కుడు కాయలు కోసినట్లు రైతు తెలిపారు. సాధారణంగా గోరుచిక్కుడు మొక్కలు నాలుగు నుంచి ఐదు అడుగులే పెరుగుతాయి. వెంకటేశ్వర్లు ఇంటిలో భారీగా పెరిగిన ఈ మొక్కను స్థానికులు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. దీనిపై మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.రుక్మిణీదేవిని సంప్రదించగా సారవంతమైన నేల ఉండటంతో పాటు పక్కన పోటీ మొక్కలు లేకపోవడం, ఎరువులు సకాలంలో వేయడంతో కొన్ని మొక్కలు ఇలా ఎత్తు పెరుగుతాయని వివరించారు.

- న్యూస్‌టుడే, ముదిగొండ

ఆకులో కలిసిపోతా..
అందంతో మెరిసిపోతా

దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రంగురంగుల మిడత ఏదంటే పెయింటెడ్ గ్రాస్‌హాపర్ గురించి చెప్పాల్సిందే. శాస్త్రీయ నామం పోయేకిలోసెర్స్ పిక్టస్. దీని శరీరంపై కనిపించే ప్రకాశవంతమైన పసుపు, నీలం, నలుపు.. రంగులు పెయింట్ చేసినట్లుగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. ఈ కీటకం జిల్లేడు ఆకులను తింటుంటుంది. ప్రమాదం ఎదురైనప్పుడు, దాని ప్రకాశవంతమైన రంగులతో శత్రువులను భయపెడుతుంది. బలమైన వెనుక కాళ్లతో వేగంగా దూకుతూ.. రెక్కలను ఉపయోగించి ఎగురుతుంది. భయపెట్టే పెద్దపెద్ద కళ్లు, ప్రకృతిలోని రంగులతో మమేకం అవడం, విషపూరిత మొక్కల్ని ఆహారంగా తీసుకోవడం.. ఇలాంటి విశేష లక్షణాలతో కూడిన భారతీయ మిడత జాతి అరుదు అని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ జంతుశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.సునంద పేర్కొన్నారు. - ఈనాడు, ఖమ్మం

'చేయూత' దరఖాస్తుల గడువు సెప్టెంబరు 15 వరకు

ఈనాడు, హైదరాబాద్: చేయూత పథకం కింద కొత్త సామాజిక పెన్షన్ల కోసం దరఖాస్తుల గడువును సెప్టెంబరు 15 వరకు పొడిగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నిర్దేశించిన గడువు సోమవారంతో ముగిసింది. రాష్ట్రంలో సర్ నమోదు ప్రక్రియలో భాగంగా జారీ అయిన నోటీసులకు సమాధానాలు ఇవ్వడం, ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం తదితర కారణాలతో పెన్షన్లకు దరఖాస్తు చేసుకోలేకపోయామని పలువురు దివ్యాంగులు, ఇతర వర్గాల వారు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్క దరఖాస్తుల గడువు పెంచాలని ఆదేశించారు. కొత్త పెన్షన్ల కోసం ఆగస్టు 9 నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా సోమవారం వరకు మొత్తం 4,81,662 దరఖాస్తులు వచ్చాయి. 2,83,492 మంది వితంతువులు, 38,452 మంది ఒంటరి మహిళలు, 1,16,552 మంది దివ్యాంగులు, 30,416 మంది గీత కార్మికులు, 12,750 మంది చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు.

భారత్‌లో జావెలిన్ క్షిపణుల తయారీ

● టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్- జేజేవీ కీలక ఒప్పందం

ఈనాడు బిజినెస్ బ్యూరో : భారత రక్షణ ఉత్పత్తుల తయారీ రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ టాటా గ్రూపు సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీపీఎస్ఎల్) కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ట్యాంకు నిరోధక 'జావెలిన్ ఆల్ అప్ రౌండ్' క్షిపణి వ్యవస్థల ఉత్పత్తి కోసం అమెరికాకు చెందిన రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ భాగస్వామ్య సంస్థ జావెలిన్ జాయింట్ వెంచర్ (జేజేవీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా భారత్‌లోనే జావెలిన్ ఏయూఆర్ తుది అసెంబ్లీ, ఇంటిగ్రేషన్ ప్లాంట్‌తో పాటు విడిభాగాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పే ప్రణాళికలను రెండు సంస్థలూ సిద్ధం చేస్తున్నాయి.

భారత రక్షణ రంగం బలోపేతం

ఒప్పంద నిబంధనల ప్రకారం.. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన అలబామా (ట్రాయ్) ప్లాంట్‌లో సబ్-అసెంబ్లీ కిట్లు, రేథియాన్‌కు చెందిన అరిజోనా ప్లాంట్‌లో గైడెన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్లు తయారవుతాయి. అక్కడ ఉత్పత్తి చేసిన ప్రధాన విడిభాగాలను భారత్‌కు తరలించి, ఇక్కడి ప్లాంటులో తుది అసెంబ్లీ నిర్వహిస్తారు. ఈ విధానంతో అమెరికా ప్లాంట్లలో ఉద్యోగ భద్రత లభించడంతోపాటు, భారత్‌లో రక్షణ రంగానికి అవసరమైన ఉన్నతస్థాయి నైపుణ్యాభివృద్ధి, కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భారత సైనిక దళాలకు ఆధునిక యుద్ధ పరికరాలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. భారీ పరిమాణంలో ఉమ్మడిగా ఉత్పత్తి చేపట్టడం వల్ల ఒక్కో క్షిపణి తయారీ వ్యయం గణనీయంగా తగ్గుతుంది.

రూ.434.84 కోట్ల ఒప్పందంలో భాగంగా..

అమెరికా విదేశాంగశాఖ గతంలోనే భారత్‌కు జావెలిన్ క్షిపణి విక్రయానికి అనుమతినిచ్చింది. ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఎఫ్ఎంఎస్) కింద రూ.434.84 కోట్ల (45.7 మిలియన్ డాలర్ల) అంచనా వ్యయంతో 100 ఎఫ్‌జీఎం-148 జావెలిన్ క్షిపణులు, ఒక ఫ్లై-టు-బై క్షిపణి, 25 తేలికపాటి కమాండ్ లాంచ్ యూనిట్లను కొనుగోలు చేయడానికి భారత్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ భాగస్వామ్యంపై లాక్‌హీడ్ మార్టిన్ జావెలిన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ రిచ్ లిక్కియాన్ మాట్లాడుతూ.. భారత్‌లో అసెంబ్లీ ప్లాంటు ఏర్పాటు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. టీఏఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సుకరన్ సింగ్ మాట్లాడుతూ.. 'అమెరికా రక్షణ సంస్థలతో మా భాగస్వామ్యంలో ఇది మరో ముఖ్యమైన అడుగు.. నైపుణ్యాల మార్పిడి వల్ల భారత రక్షణ వ్యవస్థ బలోపేతం అవుతుంది' అన్నారు.

సీఎం స్థానంలో కూర్చొని కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలా!

● భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం స్థానంలో కూర్చొని రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. "సీఎంగా ప్రజల కష్టాలను పట్టించుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. కానీ మైకు దొరికిన ప్రతిసారీ కేసీఆర్‌పై దూషణలకు పాల్పడటం, నిందలు మోపడం మీ ఏకైక ఎజెండా. మీ డైవర్షన్ రాజకీయాలను తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోంది. తెలంగాణ అస్తిత్వం కోసం ప్రాణాలు పణంగా పెట్టి, ఉద్యమాన్ని ఉద్ధృతం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన పెట్టిన ఉద్యమ సారథి కేసీఆర్. పదేళ్లపాటు సాగునీరు, నిరంతర విద్యుత్, రైతుబంధు, సంక్షేమం, సమగ్ర మౌలిక వసతులతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన దార్శనికుడాయన. అలాంటి నేతను దూషించడం సులభం కావచ్చు. ఆయనలా నిబద్ధతతో పనిచేయడం.. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడం వెయ్యి జన్మలెత్తినా మీవల్ల కాదు. మీ పాలనలో ఏం సాధించారో చెప్పండి. ఆరు గ్యారంటీల అమలు ఏది? హైడ్రా పేరుతో పేదల గూళ్లను కూల్చివేయడం, మూసీ ప్రాజెక్టు పేరుతో సాగిస్తున్న వివాదాలు, భూముల వ్యవహారాలపై వెల్లువెత్తుతున్న నిరసనలకు మీవద్ద జవాబు ఉందా? ఎవరు మాట ఇచ్చి నిలబెట్టుకున్నారో.. నమ్మించి వంచన చేశారో.. ప్రజలకు తెలుసు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మృగాడిని పట్టిచ్చిన సీసీ ఫుటేజ్

(మొదటి పేజీ తరువాయి)

అదనపు డీసీపీ కె.శ్రీనివాస్‌రావు, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణమోహన్‌లతో కలిసి డీసీపీ బి.రాజేశ్ మీడియాకు వివరాలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి నర్సింగ్ కోర్సు పూర్తి చేసింది. తుక్కుగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ ఎదురుగా ఉన్న క్వార్టర్స్‌లోని గదిలో స్నేహితురాలితో కలిసి ఉంటోంది. కొద్దిరోజుల క్రితం స్నేహితురాలు ఊరెళ్లడంతో యువతి ఒంటరిగా ఉంటోంది.

మీడియాతో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్. చిత్రంలో టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీ కె.శ్రీనివాసరావు, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణమోహన్

క్వార్టర్స్ సమీపంలోని గదిలో బిహార్‌కు చెందిన బైక్ మెకానిక్ సనా ఉల్లా నివాసం ఉంటున్నాడు. యువతి గది వైపు కన్నేసి అదను కోసం ఎదురుచూశాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కిటికీ నుంచి నర్సు ఉన్న గదిలోకి ప్రవేశించాడు. అలికిడికి నిద్రలేచిన నర్సు కేకలు వేసేందుకు ప్రయత్నించింది. అతడిని ప్రతిఘటించి చేతి వేలును కొరికింది. ఛాతీపై గోళ్లతో రక్కటంతో ఆగ్రహంతో రెచ్చిపోయాడు. ఆమెను కిందపడేసి గొంతు నులిమి ఊపిరాడకుండా చేయటంతో అపస్మారక స్థితికి చేరింది. అచేతనంగా పడి ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అదే కిటికీ నుంచి బయటకు వచ్చి తన గదికి చేరాడు.

పోలీసులను గమనిస్తూ.. ఏమీ తెలియనట్లు

నర్సుపై హత్యాచారం అనంతరం నిందితుడు బిహార్ పారిపోయేందుకు విఫలయత్నం చేశాడు. ఏమీ ఎరుగనట్టు తన గదికి చేరాడు. శనివారం మధ్యాహ్నం డీసీపీ రాజేశ్ పర్యవేక్షణలో ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు. కిటికీ నుంచి నిందితుడు లోపలకు చేరినట్టు అంచనాకు వచ్చారు. సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. వీరిలో సనా ఉల్లా కూడా ఉన్నాడు. మరోవైపు నిందితుడు తనకేం తెలియనట్టు పోలీసులతో పాటు ఘటనాస్థలానికి వెళ్లాడు. మంచి అమ్మాయిని చంపేశారంటూ అమాయకత్వం నటించాడు.

హంతకుడు ఎలా చిక్కాడంటే..

సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లో.. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఒక వ్యక్తి మెకానిక్ షాపు నుంచి మూడుసార్లు బయటకు వచ్చి వెళ్లినట్టు గుర్తించారు. అతడి నడక ఆధారంగా సనా ఉల్లాను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. మొదట తనకేం తెలియదని బుకాయించాడు. అతడి సెల్‌ఫోన్‌లో పోర్న్ వీడియోలు, అదే ప్రాంతంలో ఉంటున్న ఒక యువతి ఫొటో ఉండటంతో పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో నేరం అంగీకరించాడు. నిందితుడిపై అత్యాచారం, హత్య, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు డీసీపీ తెలిపారు.

స్నేహితురాలు రమ్మన్నా..

నర్సు ఒంటరిగా ఉన్నట్టు పక్క గదిలోని మరో స్నేహితురాలైన నర్సు గమనించింది. శుక్రవారం రాత్రి 10 గంటల వరకూ ఆమెతోనే కలిసి ఉంది. ఇద్దరు కొంతసేపు మాట్లాడకున్నాక తన గదికి రావాలని కోరింది. బాధితురాలు రాననడంతో ఆమె తన గదికి వెళ్లిపోయింది. రాత్రి 11 గంటల వరకు స్నేహితులు, పిన్నితో బాధితురాలు మాట్లాడింది. ఆ తరువాత నిద్రలోకి జారుకుంది. అప్పటికే ఈమెపై కన్నేసిన సనా ఉల్లా ఒంటరిగా ఉన్నట్టు నిర్ధారించుకొని హత్యాచారానికి పాల్పడ్డాడు. స్నేహితురాలు పిలిచినప్పుడు ఆమె గదికి వెళ్లినా నర్సు ప్రాణాలు దక్కేవంటూ ఆసుపత్రి సిబ్బంది కన్నీరు పెట్టుకున్నారు.



ప్రతి అదనపు రూపాయినీ ఖర్చు చేస్తే..

ఆదాయం పెరిగినంత మాత్రాన మీ లైఫ్‌స్టైల్‌ను మార్చుకోకండి! బోనస్ వచ్చినప్పుడల్లా ఏదో ఒక కొత్త వస్తువు కొనుగోలు చేయకండి. అదనంగా వచ్చే ప్రతి రూపాయినీ ఖర్చు చేస్తూ వెళ్తే మీరు ఎన్నటికీ ఆర్థిక స్వేచ్ఛను సాధించలేరు.
- ఆడ్రే, పర్సనల్ ఫైనాన్స్ కోచ్

'సర్'లో నిర్లక్ష్యం.. ఇద్దరి సస్పెన్షన్

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. ఖమ్మం నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నం.221 బీఎల్‌ఓ వై.కృష్ణకుమారి(మెప్మా ఆర్పీ, ఖమ్మం), బీఎల్‌ఓ సూపర్‌వైజర్ జె.విజయకుమారి (ఐసీడీఎస్ సూపర్‌వైజర్)లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ దివాకర ఉత్తర్వులు జారీ చేశారు. భాజపా నాయకుడు వీరవెల్లి రాజేశ్, అతని కుటుంబ సభ్యులకు ఖమ్మంలోని పోలింగ్ కేంద్రం నం.221లో ఓటు ఉంది. ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు పూర్తి చేసి వీరంతా బీఎల్‌ఓకు అందించారు. భాజపా నుంచి రాజేశ్ బీఎల్‌ఏ(బూత్ లెవల్ ఏజెంట్)గా వ్యవహరిస్తున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అతని పేరు తొలగించి అతని కుటుంబ సభ్యుల ఓట్లు మాత్రం కొనసాగించారు. ఈ అంశం భాజపా రాష్ట్ర కార్యాలయానికి చేరింది. ఆ పార్టీ ఎన్నికల విభాగం ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి రాజేశ్ ఓటు తొలగింపుపై ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ దివాకర విచారణ నిర్వహించి.. ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు.

జీరాంజీ పనులపై నేటి నుంచి గ్రామసభలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో జీరాంజీలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి చేపట్టాల్సిన పనులపై మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు జరగనున్నాయి. సెప్టెంబరు 15 వరకు వాటిని నిర్వహించి గ్రామాల వారీగా పనుల నివేదికలను రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 266 పనులు ఉండగా.. కేంద్రం జీరాంజీలో వాటిని 318కి పెంచింది. నిబంధనలకు అనుగుణంగా నాలుగు కేటగిరీల్లో జాబితాలను సిద్ధం చేసి వాటిని చేపట్టాలని, 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని కేంద్రం ఆదేశించింది.

నిరసన దీక్షకు సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న రాంరెడ్డి, జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు

హామీలు నెరవేర్చాలని రెడ్ల మహా నిరసన దీక్ష 8న

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 8న హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్కు వద్ద వేల మందితో మహా నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పలు రెడ్డి సంఘాలు వెల్లడించాయి. దీక్షకు సంబంధించిన గోడపత్రికలను సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘాల నేతలు ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి జేఏసీ ఛైర్మన్ అప్పమ్మగారి రాంరెడ్డి, రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి, రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. మంత్రివర్గంలో రెడ్డి కార్పొరేషన్‌పై తీర్మానం చేసినా ఇప్పటివరకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకపోవడం, నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. రాజా బహదూర్ వెంకటరామారెడ్డి హాస్టల్ కోసం గత ప్రభుత్వ 15 ఎకరాల కేటాయింపును కొనసాగించాలని, కేంద్రం అమలు చేస్తున్న 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగాలు, మెడికల్ సీట్లలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా 8న నిర్వహించనున్న మహా నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు వెల్లడించారు.

EENADU Vol: 53, Issue: 23 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. 95 & 96, Survey No. 150, Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Hyderabad, Medchal District - 500 037, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist - 501 512, Telangana State. Editor: M Nageswara Rao. Phone: 040-22232223, RNI No. 27656/1975, Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు సినిమా

శివపార్వతి, ప్రశాంత్, మౌనిక, రచిత, రాధాకృష్ణ, ఈటీవీ డైరెక్టర్ సుజయ్ చెరుకూరి, శ్రీధర్, వెంకట చలపతి

ప్రతి పాత్ర ఓ హీరోగా...
సీతారామయ్య గారి మనవరాలు

"ఒక అమ్మాయి కథ కాకుండా... ఒక పూర్తిస్థాయి జీవితాన్ని ఆవిష్కరించాలనే ప్రయత్నమే 'సీతారామయ్య గారి మనవరాలు'. ప్రతి ధారావాహికలోనూ భావోద్వేగాలు, డ్రామా ఉంటాయి. అంతకుమించి నేటితరానికి అవసరమైన విలువల్ని ఇందులో చెప్పాం" అన్నారు మలినేని రాధాకృష్ణ. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ ధారావాహిక ఈటీవీలో సోమవారం రాత్రి 8.30 నుంచి మొదలైంది. తొలి రోజే విశేష ప్రేక్షకాదరణ పొందింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విడుదలకు ముందస్తు వేడుకలో రెండు ఎపిసోడ్స్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ వేడుకకి ఈటీవీ డైరెక్టర్ సుజయ్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "ఈ ధారావాహిక చూసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూసిన అనుభూతి కలిగిందని నమ్ముతున్నా. ఈ రెండు ఎపిసోడ్స్‌ని చూసినప్పుడు కథలోని భావోద్వేగం స్పష్టంగా అర్థమైంది. బలమైన భావోద్వేగాలు ఎటువంటి ప్రేక్షకుడినైనా కథలో లీనం చేసి, కూర్చోబెడతాయి. ఇవే భావోద్వేగాలు, గాఢతని కొనసాగిస్తే ఈ ధారావాహిక బృందం అంతటికీ ఓ వరం అవుతుందని నా నమ్మకం. నటీనటులు, సాంకేతిక బృందం అంతటికీ నా అభినందనలు. శుభాకాంక్షలు" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మహాభారతంలో ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. అదే తరహాలో ఇందులోని పాత్రల్ని రాశాం. సీతారామయ్య నుంచి శివ వరకూ ప్రతి పాత్ర కూడా ఇందులో హీరోనే. ఈటీవీ అనేది ఒక పెద్ద వేదిక. ఈ వేదికపై ఎన్నో అద్భుతాలు జరిగాయి. కొత్తతరానికి మనవైన విలువలు, మనవైన భావోద్వేగాల్ని చెప్పాలనే ఓ గొప్ప సంకల్పంతో ఈ ధారావాహికని తీశాం. తనకి తగిలిన గాయం కారణంగా ఓ అమ్మాయి ఇందులో గతాన్ని, వర్తమానాన్నీ మరిచిపోతూ ఉంటుంది. అంత కష్టం, అన్ని సవాళ్లు ఎదురైనా తన సంకల్పం కోసం ఎలా పరితపించిందన్నది కీలకం. ఎన్నో ప్రత్యేకతలున్న కథ ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివపార్వతి, ప్రశాంత్, మౌనిక, రచిత, శ్రీధర్, వెంకట చలపతి, స్క్రీన్‌ప్లే, సంభాషణల రచయిత మహేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

6న టైటిల్... విడుదల తేదీ!

చిత్రీకరణలో గాయపడిన అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం కోలుకుంటున్నారు. మోకాలికి శస్త్రచికిత్స జరిగినా తన 111వ సినిమాని ప్రణాళిక మేరకే విడుదల చేయాలనే సంకల్పంతో ఉన్నారాయన. అందుకు తగ్గట్టుగానే చిత్ర బృందం ఈ నెల 6న సినిమా పేరుని, విడుదల తేదీ వివరాల్ని వెల్లడిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. డిసెంబరులో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి. 'ఎన్.బి.కె.111' పేరుతో పట్టాలెక్కిన ఈ సినిమా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. విజయవంతమైన 'వీరసింహారెడ్డి' తర్వాత ఆ కలయికలో రూపొందుతున్న మరో చిత్రమిది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రం విడుదలైన సంగతి తెలిసిందే. ముంబయి నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా రూపొందుతున్న సినిమా ఇదని స్పష్టమైంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: అరవింద్ ఎస్.కశ్యప్, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా.

బాలకృష్ణ

ఓటీటీలో ఈ వారం

సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త 'సినీ' వారం వచ్చేసింది. ఈ వారం కూడా సరికొత్త చిత్రాలు, సిరీస్‌లతో ప్రేక్షకుల్ని అలరించడానికి ఓటీటీలు సన్నద్ధమయ్యాయి.

లవ్‌సిక్ (సిరీస్)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
ది జెంటిల్‌మెన్ సీజన్ 2 (సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
గాంధారి (చిత్రం)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
జగమే సంగీతం (సిరీస్)	శుక్రవారం	అమెజాన్‌ప్రైమ్
ఉన్మాదం (చిత్రం)	శుక్రవారం	సోనీలివ్
ది కోర్ట్ (సిరీస్)	శుక్రవారం	జియోహాట్‌స్టార్
ది గ్రాండ్ టూర్ (సిరీస్)	శుక్రవారం	అమెజాన్‌ప్రైమ్
డిసి (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్స్ట్

'ఐయామ్ గేమ్'లో ఆశ్చర్యపరిచే విషయాలు ఎన్నో: దుల్కర్ సల్మాన్

నాగ్ అశ్విన్, దుల్కర్ సల్మాన్, సంయుక్త విశ్వనాథన్

"నా నిర్మాణంలో చేసిన అతి పెద్ద సినిమా ఇది. తెలుగులో తీసిన ఓ పెద్ద చిత్రంలాగే ఉంటుంది. అందరినీ ఆశ్చర్యపరిచే విషయాలు ఇందులో చాలా ఉన్నాయి" అన్నారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా... నహాస్ హిదయత్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే 'ఐయామ్ గేమ్'. దుల్కర్ సొంత సంస్థ వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించింది. ఈ నెల 3న అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ "దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమాని చూశారు, ఎడిటింగ్‌లోనూ సాయం చేశారు. నాగి ఎప్పుడు పిలిచినా తనతో సినిమా చేయడానికి నేను సిద్ధం" అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ "నేను సినిమాని చూశా. ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్ ఇందులో ఉంది. అది అందరినీ ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు. ప్రభాస్‌తో తీస్తున్న 'కల్కి 2' సినిమాపై స్పందిస్తూ... "ఇప్పటివరకూ పది రోజులు చిత్రీకరణ చేశాం. ప్రభాస్ సమయం దొరికాక ఒక పెద్ద షెడ్యూల్ చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు సందీప్ గుణ్ణం, ఆంటోనీ వర్గీస్, సంయుక్త విశ్వనాథన్, కదిర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వస్తోన్న మంచి సినిమా ఇది

వి.వి.వినాయక్, కస్తూరి, వితికా షేరు

సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. మేరుం భాస్కర్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకని నిర్వహించింది చిత్రబృందం. ఈ వేడుకకు ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినాయక్ మాట్లాడుతూ.. "డ్రగ్స్‌కు వ్యతిరేకంగా దర్శకుడు జై జ్ఞాన ప్రభ మంచి చిత్రం చేశారు. ఈ సినిమా ఘన విజయం సాధించి దర్శకుడు, నిర్మాత, కథానాయకులకు మంచి పేరు తీసుకురావాలి. నా మొదటి సినిమా 'ఆది'లో ఫస్ట్ పాట రాసింది చంద్రబోస్. ఈ సినిమా కూడా 'ఆది' సినిమా అంత ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జై జ్ఞాన ప్రభ తోట, మేరుం భాస్కర్, చంద్రబోస్, రాజీవ్ కనకాల, కస్తూరి, రాజా రవీంద్ర, శివకుమార్, సత్య ప్రకాశ్, సాయికుమార్, మహావీర్ ఏలేందర్, వితికా షేరు, శివకుమార్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమకావ్యం

సంగీత దర్శకుడు కాలభైరవ, కథానాయిక కావ్య కల్యాణ్‌రామ్ కలిసి జీవితాన్ని పంచుకోనున్నారనే ప్రచారం చాలా రోజులుగా వినిపిస్తోంది. ఆ విషయాన్ని సోమవారం ఇన్‌స్టా వేదికగా అధికారికం చేసింది ఈ జోడీ. కాలభైరవ... కావ్యతో కలిసున్న ఫొటోల్ని పంచుకుంటూ తన మనసులోని ప్రేమని అందమైన కవితలా ఆ పోస్ట్‌లో ఆవిష్కరించారు. తామిద్దరం జీవితాంతం ఒకరికొకరం తోడూ నీడగా ఉంటామన్న విషయాన్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందంటూ తమ బంధం త్వరలోనే పెళ్లి పీటలపైకి చేరనుందనే విషయాన్ని స్పష్టం చేశారు. కావ్య ఇన్‌స్టాలో స్పందిస్తూ... "సాధారణమైన రోజుల్లోనూ వెలుగుల్ని నింపి, నేను ఈ ప్రపంచంలోనే అత్యంత అదృష్టవంతురాల్ని అనిపించేలా చేసినందుకు ధన్యవాదాలు" అంటూ తన అంతరంగాన్ని ఆవిష్కరించింది. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి కుమారుడైన కాలభైరవ తండ్రి అడుగు జాడల్లోనే నడుస్తూ స్వరకర్తగా, గాయకుడిగా మంచి గుర్తింపుని తెచ్చుకున్నారు. కావ్య కల్యాణ్‌రామ్ బాలనటిగా కెరీర్‌ని ప్రారంభించి, 'మసూద', 'బలగం', 'ఉస్తాద్' తదితర సినిమాలతో పేరు తెచ్చుకున్నారు.

కావ్య కల్యాణ్‌రామ్, కాలభైరవ

అనుపమ్ ఖేర్ 555వ చిత్రం

అనుపమ్ ఖేర్

నాలుగు దశాబ్దాలుగా తన నటనా జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నానని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్. దశాబ్దాలుగా చిత్రసీమలో రాణిస్తున్న ఆయన... తన 555వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్‌ను పంచుకున్నారు అనుపమ్. "కొన్ని విషయాలను కొంత కాలం పాటు మనసులోనే భద్రంగా దాచుకోవడం మంచిది. ఎందుకంటే సరైన సమయంలో వాటిని వెల్లడించడంలో ఉండే ఆనందమే వేరు. కాబట్టి ప్రస్తుతానికి నేను చెప్పేది ఒక్కటే. నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 555వ చిత్రాన్ని ప్రకటిస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలు త్వరలోనే ప్రకటిస్తాను" అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

కళలు లేకపోతే నా జీవితమే లేదు!

"అందరికంటే... అన్నిటికంటే సినిమాకి కథే ముఖ్యమని నమ్ముతాను. అందుకే కథని దృష్టిలో ఉంచుకునే సినిమాల ఎంపికపై నిర్ణయాలు తీసుకుంటా" అంటున్నారు అనంతిక సనీల్ కుమార్. 'మ్యాడ్', '8 వసంతాలు' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ అందం ఈమె. ఇటీవల 'రోమాంచకం' సినిమాలో కథానాయికగా నటించారు. సుమంత్ ప్రభాస్ కథానాయకుడిగా, వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించారు. ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పకులు. ఈ చిత్రం ఈ నెల 3న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా అనంతిక సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

● "ప్రేమ, హాస్యం, ఉత్కంఠ... అనేది ఈ సినిమాకి ఉపశీర్షిక. అందుకు తగ్గట్టే ఆ మూడు భావోద్వేగాల చుట్టూ సాగే బలమైన కథ ఇది. ఈ మూడింటిలో నాకు ఉత్కంఠ కోణం బాగా నచ్చింది. నేను గతంలో చేసిన పాత్రలకి పూర్తి భిన్నంగా ఇందులో కనిపిస్తా. '8 వసంతాలు' తర్వాత నేను చాలా కథలు విన్నా. అందులో నాకు బాగా నచ్చిన కథ ఇది. నచ్చడం మాత్రమే కాదు, నేను ఎప్పట్నుంచో ఇలాంటి ఓ కథలో భాగం కావాలని ఉండేది. అది ఈ సినిమాతో నెరవేరినట్టైంది. ప్రేమకథా చిత్రమే అయినా, కుటుంబ ప్రేక్షకులు సైతం ఆస్వాదించేలా ఉంటుంది".

● "చిన్నప్పట్నుంచీ నాకు కళలతో అనుబంధం ఏర్పడింది. కళ లేకపోతే నా జీవితమే లేదేమో. ఎల్.కె.జి నుంచే ఏదో ఒక కళారూపంలో శిక్షణ తీసుకుంటున్నా. దాంతో నృత్యం, యుద్ధ విద్యలు మొదలుకొని చిత్రలేఖనం వరకూ చాలానే నేర్చుకున్నా. ఇంకా నేర్చుకోవల్సినవీ ఉన్నాయి. నేను నేర్చుకున్న కళ ప్రతి సినిమాకీ ఏదో రూపంలో ఉపయోగపడుతూనే ఉంటుంది. నటిగా కొత్త తరహా పాత్రలు, కథలు చేయాలని ఉంది. నృత్య ప్రధానమైన కథలు వచ్చినా సిద్ధమే. ఏ పాత్రలో నటించినా సరే, ముందు నాకు సంతృప్తి దక్కాలి. అప్పుడే ప్రేక్షకుల్ని మెప్పించగలననేది నా అభిప్రాయం. తెలుగులో చేయాల్సిన కొత్త సినిమాలు కొన్ని ఉన్నాయి. నా సినిమా ఏదైనా ఆయా నిర్మాణ సంస్థలే చెబుతాయి".

అనంతిక

మొదలైంది వేట

అశోక్, సందీప్ సరోజ్, సాత్విక, నాగబాబు, ఫణి, జయలక్ష్మి

"మేం గతంలో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' తరహాలోనే ఓ గ్రామీణ కథతో తెరకెక్కుతున్న చిత్రమే 'వేట'" అన్నారు నిర్మాతలు ఫణి అడపాక, జయలక్ష్మి అడపాక. ఆ ఇద్దరూ ఈటీవీ విన్ ఒరిజినల్ సంస్థతో కలిసి ఎస్.ఆర్.డి ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రమిది. సందీప్ సరోజ్, సాత్విక జంటగా నటిస్తున్నారు. అశోక్ కోటిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ప్రముఖ నటుడు, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. నటుడు కె.ఎస్.రవికుమార్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌నివ్వగా, దర్శకనిర్మాతలు సాయిరాజేశ్, ఎస్.కె.ఎన్, వి.ఎన్.ఆదిత్య, ఫణి అడపాక కెమెరా స్విచ్చాన్ చేశారు. మెహర్ రమేశ్, యదు వంశీ, అనుదీప్ దేవ్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిత్ర ప్రారంభం అనంతరం కథానాయకుడు మాట్లాడుతూ "నటుడిగా 'కమిటీ కుర్రోళ్ళు' సినిమాతో పరిచయం అయ్యాను. మరో మంచి కథతో ఈ సినిమా చేస్తుండడం ఆనందంగా ఉంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నా కథని నమ్మి అవకాశం ఇచ్చిన నిర్మాతలకీ, ఈటీవీ విన్ సంస్థకూ కృతజ్ఞతలు" అన్నారు. నిర్మాత ఫణి అడపాక మాట్లాడుతూ "ఈటీవీ విన్‌తో కలిసి మేం చేస్తున్న మూడవ ప్రాజెక్ట్ ఇది. కె.ఎస్.రవికుమార్ ఓ గొప్ప పాత్రని పోషిస్తున్నారు. అశోక్ చెప్పిన ఈ కథలో సహజత్వంతోపాటు, వాణిజ్యాంశాలూ బలంగా ఉన్నాయి" అన్నారు. రాజీవ్ కనకాల, రఘుబాబు, రవీంద్ర విజయ్, ప్రభావతి, ప్రమోదిని, వికాస్ వశిష్ఠ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: వాజిద్ బేగ్, ప్రొడక్షన్ డిజైన్: అరవింద్ మూలే.

ఈ సినిమాతో అందరికీ 'గుడ్ టైం'

అన్వ్యుక్త నలాని, వంశీ నందిపాటి, నందు, నిఖిల్ గాజుల

బలమైన కథతో... ఎంతో నిజాయతీగా రూపొందించిన సినిమానే మా 'గుడ్ టైం' అన్నారు నిఖిల్ గాజుల. పేరుకి తగ్గట్టుగానే ఈ సినిమాతో మా అందరికీ మంచి సమయం మొదలైందన్నారు. ఆయన కథానాయకుడిగా, చాణక్య జిల్లా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. రమేశ్ జిల్లా నిర్మాత. అన్వ్యుక్త నలాని, హృతిక్ శెట్టి, ధనరాజ్, సునీతా మనోహర్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వంశీ నందిపాటి, శశికిరణ్ తిక్క, నందు, ఐశ్వర్య, రమణారెడ్డి, లక్ష్మణ్ గుంటూరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా, మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నాపైన నమ్మకంతో ఇందులో అవకాశమిచ్చారు దర్శకనిర్మాతలు. చిత్ర పరిశ్రమలో నా ప్రయాణం మొదలై ఆరేళ్లయింది. ఈ సినిమాతోనే మా అందరికీ గుడ్ టైం మొదలైంది. అందరినీ అలరించే ఓ మంచి సినిమా ఇది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రత్యేకమైన భావోద్వేగాలతో రూపొందిన సినిమా ఇద"న్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత దినేశ్ కార్తీక్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

మనందరి కథ

శ్రీవిష్ణు

ప్రతి యువకుడి జీవిత ప్రయాణాన్ని ప్రతిబింబించే కథతో శ్రీవిష్ణు కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. సన్నీ సంజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్నారు. ఎస్.నాగవంశీ సమర్పకులు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ కథా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ సోమవారం ఓ ప్రత్యేకమైన వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. ఇదీ మనందరి కథ, అందరిలాగే నా కథ అంటూ సాగుతుందీ వీడియో. "యువతరం కలలు, ఆశలు, ఆకాంక్షలతోపాటు.. జీవితంలో ఎదుర్కొనే అనుభవాలు, భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ప్రతి ఒక్కరి జీవితంలోని ఏదో ఒక సందర్భాన్ని గుర్తు చేస్తూ, ఇది మనందరి కథ అనే భావనని కలిగిస్తుంది. సహజమైన భావోద్వేగాలు, ఆహ్లాదం పంచే కథనం ఈ సినిమాకి ప్రధాన బలం" అని సినీ వర్గాలు తెలిపాయి.

గొప్ప విజన్‌తో... 'కూర్మ అవతార్'

నరేంద్ర, దిల్‌రాజు, శివరాజ్ కుమార్, వరలక్ష్మి, పూజిత, హర్షవర్ధన్

అద్భుతమైన విజన్‌తో రూపొందిన 'కూర్మ అవతార్' సినిమాలో తాను భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రధారిగా, హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కూర్మ అవతార్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, రాజ్ తరుణ్, శివాజీ, అతిరా రాజ్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. పూజిత.కె, కె.సేవిత నిర్మాతలు. సోమవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీజర్ విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ "దర్శకుడు హర్ష అందరినీ ఆశ్చర్యపరిచేలా ఈ సినిమాని తీసినట్టు టీజర్‌తోనే అర్థమవుతోంది" అన్నారు. శివరాజ్ కుమార్ మాట్లాడుతూ "తెలుగులో బాలకృష్ణ వందో చిత్రం 'గౌతమిపుత్ర శాతకర్ణి', మొన్ననే విడుదలైన 'పెద్ది' సినిమాల్లో నటించా. దర్శకుడు హర్ష వచ్చి ఈ కథ చెప్పగానే ఓకే చెప్పా. కథ నచ్చిందంటే, దర్శకుడు కొత్తా, పాతా అనేది చూడకుండా చేయడానికి ఒప్పుకుంటా. హర్ష గొప్ప విజన్‌తో ఈ సినిమా చేశారు. సాయికుమార్, నేను కలిసి ఎన్నో సినిమాలు చేశాం. మళ్లీ ఈ సినిమాలో కలిసి నటించడం ఆనందంగా ఉంది" అన్నారు. "శివరాజ్ కుమార్ కుటుంబంతో నాకు ఎంతో అనుబంధం ఉంది. మంచి మనసున్న మనుషులు. ఆయన, నేను కలిసి చాలా సినిమాలు చేశాం. ఈ సినిమా అద్భుతంగా వచ్చింది. అందరికీ శ్రీకూర్ముడి ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నా" అన్నారు సాయికుమార్. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

(c) eenadu

ఈనాడు బిజినెస్

జొమాటో హైదరాబాద్ సేవాకేంద్రం మూసివేత

250 మంది తొలగింపు

ఆహార డెలివరీ సంస్థ జొమాటో హైదరాబాద్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న తన వినియోగదారుల సేవా కేంద్రాన్ని శాశ్వతంగా మూసేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న సుమారు 250 మంది ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించింది. హైదరాబాద్ కేంద్రంలోని సేవలను గురుగ్రామ్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసింది. తొలగించిన వారికి పరిహారం కింద మొత్తం నాలుగు నెలల వేతనాన్ని అందించనుంది. మార్చి 31, 2027 వరకూ వైద్య బీమా సేవలను కొనసాగించనుంది.

కృత్రిమ పనీర్ పదార్థాల డెలివరీ ఉండదు: ఆన్‌లైన్‌లో పనీర్, చీజ్ వంటకాలను ఆర్డర్ చేసే వినియోగదారుల ఆరోగ్య రక్షణ కోసం కృత్రిమ పాల ఉత్పత్తులైన (అనలాగ్ డెయిరీ) పనీర్, చీజ్ వాడకంపై పూర్తిస్థాయి నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వచ్చాయని పేర్కొంది.

అమెరికా మార్కెట్లోకి అడ్వైర్ డిస్కస్ జనరిక్ ఔషధం

విడుదల చేసిన అరబిందో ఫార్మా

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అరబిందో ఫార్మా అమెరికా విపణిలోకి తన తొలి ఇన్‌హేలేషన్ విభాగానికి చెందిన జనరిక్ ఔషధం అడ్వైర్ డిస్కస్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది జీఎస్‌కేకి చెందిన బ్రాండెడ్ ఔషధం అడ్వైర్ డిస్కస్‌కు జనరిక్ రూపం. అరబిందో ఫార్మా యూఎస్‌ఏ అనుబంధ సంస్థ లానెట్ కంపెనీ ఎల్‌ఎల్‌సీ ద్వారా ఈ విక్రయాలు చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. ఈ జనరిక్ ఔషధాన్ని 100/150 ఎంసీజీ, 250/50 ఎంసీజీ మోతాదుల్లో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఆస్తమా, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న రోగులకు ఈ మందు ఉపయోగపడుతుంది. శ్వాసకోశ సంరక్షణ విభాగంలో సంక్లిష్టమైన, విస్తృతమైన ఇన్హేలేషన్ ఉత్పత్తులను పెంచే దిశగా ఇది కీలక ముందడుగు అని కంపెనీ వివరించింది.

జీఆర్‌టీ జువెలర్స్ చేతికి టీబీజెడ్

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదిత సంస్థ అయిన త్రిభువన్‌దాస్ భీమ్‌జీ జవేరీ లిమిటెడ్(టీబీజెడ్)లో 74.12% వాటాను ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జీఆర్‌టీ జువెలర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేయనుంది. వాటా కొనుగోలుకు సంబంధించి టీబీజెడ్ ప్రమోటర్లతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జీఆర్‌టీ తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రమోటర్ల వాటాను గరిష్ఠంగా రూ.1,033.71 కోట్లతో కొనుగోలు చేయనుంది. అయితే నియంత్రణ సంస్థల అనుమతులపై ఈ కొనుగోలు లావాదేవీ ఆధారపడి ఉంది. సెబీ నిబంధనలకు అనుగుణంగా మరో 26% వాటా కొనుగోలుకు ఓపెన్ ఆఫర్‌ను కూడా జీఆర్‌టీ ప్రకటించనుంది. '162 ఏళ్ల చరిత్ర కలిగిన టీబీజెడ్ బ్రాండును సొంతం చేసుకోవడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ సంస్థకు ఉన్న 37 కేంద్రాల ద్వారా భారత్‌లో విస్తరించాలన్న మా వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు వీలు ఏర్పడుతుంద'ని జీఆర్‌టీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

కోడి గుడ్లు

సెప్టెంబరు 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	530
వరంగల్	532
విజయవాడ	575
తూ/ప గోదావరి	555
విశాఖపట్నం	555
చిత్తూరు	573

ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల వ్యాపారం పెంచుతాం

- తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని శాఖల ఏర్పాటు
- రుణాల జారీలో ఏఐ వాడుతున్నాం
- కరూర్ వైశ్యా బ్యాంక్ ఎండీ, సీఈఓ రమేశ్ బాబు

ఈనాడు, హైదరాబాద్

బ్యాంక్ వ్యాపారాన్ని ప్రతి మూడేళ్లకు రూ.లక్ష కోట్ల మేర పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) బి.రమేశ్‌బాబు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 919 శాఖలుండగా, ఏడాది వ్యవధిలో 1,000 శాఖలు చేస్తామని.. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోనే 35 వరకు కొత్తగా ప్రారంభిస్తామని 'ఈనాడు' ఇంటర్వ్యూలో చెప్పారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో శాఖను సోమవారం ప్రత్యక్షంగా ప్రారంభించిన ఆయన, దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరో 15 శాఖలను దృశ్య మాధ్యమ పద్ధతిలో ఆవిష్కరించారు. అనంతరం బ్యాంక్ లక్ష్యాలను వివరించారు. ముఖ్యాంశాలివీ..

కొత్త శాఖలు ఎందుకంటే

సోమవారం 16 శాఖలు ప్రారంభించాం. ఇందులో తెలంగాణలో ఇంద్రేశం, గచ్చిబౌలి, కోకాపేట; ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ (రామవరప్పాడు), జగ్గయ్యపేట, సోంపేట, విశాఖపట్నం (కంచరపాలెం), రాజమండ్రి (కొంతమూరు) ఉన్నాయి. ఇవికాక తమిళనాడులో 6, కర్ణాటకలో 1, దిల్లీలో 1 ప్రారంభించాం. వీటితో కలిపి మా శాఖల సంఖ్య 919కి చేరింది. ఏడాది వ్యవధిలో శాఖల సంఖ్యను 1,000కి చేరుస్తాం. వచ్చే ఏడాది కాలంలో మరో 30-35 శాఖలు తెలుగు రాష్ట్రాల్లో నెలకొల్పుతాం. తెలంగాణలోని 33 జిల్లాల్లో 24 జిల్లాల్లోనే మా శాఖలున్నాయి. అందుకే తొలుత తెలుగు రాష్ట్రాల్లోనే విస్తరణకు చోటుంది. మా లావాదేవీల్లో 98% డిజిటల్‌గా జరుగుతున్నా, శాఖల్లో కార్యకలాపాలు సాగించడం సౌలభ్యంగా భావించే వారి కోసం, వారితో అనుబంధాన్ని బలోపేతం చేసేందుకే శాఖలు ఏర్పాటు చేస్తున్నాం.

రుణాల విషయంలో అత్యంత జాగ్రత్త

రిటెయిల్ ఖాతాదార్లతో పాటు ఎంఎస్‌ఎంఈలు, వ్యవసాయ రంగాలకు సేవలు అందించడంపైనే దృష్టి సారించాం. రుణాల జారీలో అత్యంత అప్రమత్తంగా ఉండటం వల్లే ఏప్రిల్-జూన్‌లో నికర నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.19 శాతానికి పరిమితం అయ్యాయి. సిబిల్ స్కోర్‌తో పాటు40, 45 సోర్సెస్ నుంచి సమాచారం సేకరిస్తున్నాం. కృత్రిమమేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతనూ వాడుతున్నాం. ఇన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.250 కోట్లు ఉండే నికరలాభం రూ.2,500 కోట్లు మించింది. 2026 జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.2,27,267 కోట్లకు చేరింది. ఇందులో డిపాజిట్లు రూ.1,22,587 కోట్లు, రుణాలు రూ.1,04,680 కోట్లు ఉన్నాయి. 110 ఏళ్ల చరిత్రలో, కొవిడ్ సమయంలో మినహా ప్రతీ ఏటా వాటాదార్లకు డివిడెండ్ ఇచ్చాం. వ్యాపారం పెంచుకోవడం, ఆస్తుల నాణ్యత అత్యుత్తమంగా ఉండేలా చూడటం, ఖాతాదారుకు మెరుగైన అనుభవం కల్పించడమే మా ధ్యేయం.

వ్యవసాయ రుణాల్లో 90% బంగారంపైనే

వ్యవసాయ రుణాల్లో 90% బంగారు ఆభరణాల తనఖాపైనే ఉంటున్నాయి. ఒక్కోశాఖలో రోజుకు 20-25 కూడా ఇలాంటివి మంజూరు చేస్తుంటారు. బంగారం విలువలో 75 శాతం మేర మాత్రమే రుణం ఉండేలా జాగ్రత్త వహిస్తున్నాం. మొత్తం రుణాల్లో పసిడి వాటా 30% వరకే ఉండేలా చూస్తున్నాం.

పెద్ద ఫండ్‌లకు విశ్వాసం పెరిగింది

మా బ్యాంక్ పనితీరుపై విశ్వాసం పెరగడం వల్లే దేశంలోని పెద్ద మ్యూచువల్‌ఫండ్ సంస్థలైన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌లు 9.9% వరకు వాటాలు కొనేందుకు రిజర్వ్ బ్యాంక్ వద్ద అనుమతులు తీసుకున్నాయి. రిటర్న్ ఆన్ అసెట్స్(ఆర్‌ఓఏ) 2.11%, రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌ఓఈ) కనీసం 15% ఉండటం ఇందుకు నేపథ్యం. కార్పొరేట్ రుణాల వాటా 45% నుంచి 15% శాతానికి తగ్గితే, ఎంఎస్‌ఎంఈ - రిటెయిల్- వ్యవసాయ రుణాల వాటా 85 శాతానికి చేరింది. అంకుర సంస్థల ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా, రుణాలు మంజూరు చేసేందుకు బెంగళూరులో సంప్రదింపులు సాగిస్తున్నాం. సరికొత్త పథకాలు తెస్తాం.

భారత్ వృద్ధి భళా

- ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో 7.8%
- అనిశ్చితులను తట్టుకొని అంచనాకు మించి నమోదు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా వేసిన 7 శాతం కంటే ఇది ఎక్కువ. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగానూ భారత్ కొనసాగింది. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్‌లో భారత వృద్ధి 6.9 శాతంగా నమోదైంది. '2025-26 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.75.46 లక్షల కోట్లుగా ఉన్న వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (స్థిర ధరల వద్ద జీడీపీ), 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.81.36 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 7.8 శాతం వృద్ధి రేటును సూచిస్తోంద'ని గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే అంతకుముందు త్రైమాసికమైన జనవరి- మార్చిలోని 8.6 శాతంతో పోలిస్తే ఏప్రిల్- జూన్‌లో నమోదైన వృద్ధి తక్కువే కావడం గమనార్హం. ఇక 2026-27 పూర్తి ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును 6.7 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్‌లో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీని రూ.88.27 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 2025-26 మొదటి త్రైమాసికంలోని రూ.80 లక్షల కోట్లతో పోలిస్తే 10.3 శాతం ఎక్కువ.

భారత ప్రగతి మళ్లీ వికసించింది: మోదీ

భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం జీడీపీ వృద్ధిని సాధించడాన్ని ఒక అసాధారణ ఘనతగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థితిని ప్రశ్నిస్తున్న వారిపై ఆయన స్పందిస్తూ 'భారత్ ప్రగతి బాటలో మళ్లీ వికసించింది. ఈ గణాంకాలు విమర్శకుల నోళ్లు మూయించాయ'ని అన్నారు.

సంస్కరణలతో సానుకూలత: ఆర్థిక మంత్రి

ఏప్రిల్- జూన్‌లో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదుకావడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థ సమర్థవంతమైన నిర్వహణ సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు.

ద్రవ్యలోటు రూ.3,07,833 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) ఏప్రిల్- జులైలో ద్రవ్యలోటు రూ.4,55,144 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇది 26.9 శాతానికి సమానం.

'రక్షణ'లో ఎఫ్‌డీఐ నిబంధనల సరళీకరణ!

ఆలోచనలో ప్రభుత్వం

దిల్లీ: విదేశీ పెట్టుబడిదార్లను మరింతగా ఆకర్షించే ఉద్దేశంతో రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) నిబంధనలను సరళీకరించడాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఒక అధికారి తెలిపారు. ఇందుకోసం సంబంధిత వర్గాలతో పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం చర్చలు జరుపుతోంది. 'నిబంధనల్లో కొంత సడలింపును పరిశీలిస్తున్నామ'ని ఆ అధికారి తెలిపారు. ప్రస్తుతం రక్షణ రంగంలో ఆటోమేటిక్ పద్ధతిలో (ప్రత్యేక అనుమతి అవసరం లేకుండా) 74 శాతం వరకు ఎఫ్‌డీఐకి అనుమతి ఉంది. అంతకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు, ఆధునిక సాంకేతికత లభించే అవకాశం ఉన్నట్లయితే 'ప్రభుత్వ ఆమోద మార్గం' ద్వారా అనుమతిస్తారు.

- 2025-26లో రక్షణ రంగ ఎగుమతుల్లో ప్రైవేట్ రంగం వాటా 45.16 శాతం (రూ.17,353 కోట్లు) కాగా.. ప్రభుత్వ రంగ సంస్థల వాటా 54.84 శాతం (రూ.21,071 కోట్లు)గా ఉంది. 2029 నాటికి రక్షణ రంగ వార్షిక ఉత్పత్తి రూ.3 లక్షల కోట్లు, ఎగుమతులను రూ.50,000 కోట్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

సుభాశ్ చంద్ర దివాలా పరిష్కార ప్రణాళికపై అయిదుగురు సభ్యులతో ధర్మాసనం

దిల్లీ: మీడియా దిగ్గజం సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో రుణదాతలు పేర్కొన్న రూ.22,000 కోట్లకు పైగా క్లెయిమ్‌లకు సంబంధించి రుణ చెల్లింపు ప్రణాళికపై నిర్ణయం తీసుకోవడానికి అయిదుగురు సభ్యులతో ధర్మాసనాన్ని ఎన్‌సీఎల్‌టీ ఏర్పాటు చేసింది. డివిజన్ బెంచ్ సభ్యుల నుంచి మెజార్టీ ఏకాభిప్రాయం రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వం వహిస్తారు. బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేది మిగతా సభ్యులుగా ఉండనున్నారు. ఎన్‌సీఎల్‌టీ ప్రధాన ధర్మాసనంలో ఈ బెంచ్ నేటి(మంగళవారం) ఉదయం గం.10.15లకు విచారణను ప్రారంభించనుంది. కాగా.. ఈ కేసు విషయంలో డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నాభిప్రాయాలతో వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో మూడో సభ్యుడిని నియమించగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రణాళికకే ఆయన ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

సంక్షిప్తంగా

- ఎయిర్‌బస్ ఏ320 నియో, ఏ321ఎక్స్‌ఎల్‌ఆర్ విమానాలకు సంబంధించి వెనుక భాగం, తోక భాగాల ఫ్యూజ్‌లేజ్ స్కిన్‌లను తయారు చేసి, సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ దక్కించుకుంది. 2028 నుంచి ఈ విడిభాగాలను బెంగళూరులోని ప్లాంట్‌లో తయారు చేసి, జర్మనీలోని ఎయిర్‌బస్ ఆగ్స్‌బర్గ్ కేంద్రానికి సరఫరా చేస్తారు.
- ఉజ్బెకిస్థాన్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఎన్‌ఐబీసీ ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్ వెలుపల యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చిన 11వ దేశంగా ఉజ్బెకిస్థాన్ నిలిచింది.
- కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సర్వీసెస్ ప్రొడక్షన్ ఇండెక్స్ ప్రకారం.. జూన్‌లో 19 సేవల రంగాల్లో 8 రెండంకెల వృద్ధిని నమోదుచేశాయి. స్థిరాస్తి (24.7%), రిటెయిల్ ట్రేడ్ (18%), హోల్‌సేల్ ట్రేడ్ (15.1%), ఐటీ, కంప్యూటర్ సంబంధిత సేవలు (13.5%) అత్యధిక వృద్ధిని సాధించాయి. వాయు రవాణా మాత్రం 6% క్షీణతను నమోదుచేసింది.
- క్యూఐపీ ద్వారా పిరమాల్ ఫైనాన్స్ రూ.2100 కోట్లు సమీకరించింది. దీనికి అదనంగా ప్రమోటర్ల నుంచి ప్రిఫరెన్షియల్ వారెంట్‌ల ద్వారా మరో రూ.1750 కోట్లను సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. మొత్తం మీద రూ.3850 కోట్ల ఈక్విటీ మూలధనాన్ని సమకూర్చుకోనుంది.
- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఛైర్మన్‌గా పార్థ్ జిందాల్ నియమితులయ్యారు. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది.
- మధ్య అమెరికా దేశమైన ఎల్ సాల్వడార్‌లో వెలోసా భాగస్వామ్యంతో తన ఫ్లాగ్‌షిప్ స్టోర్, రిటెయిల్ విక్రయశాలలను హీరో మోటోకార్ప్ ప్రారంభించింది.
- తమిళనాడులోని కయత్తార్‌లో 100 మెగావాట్‌ల క్యాప్టివ్ సోలార్ ప్లాంట్‌ను టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రారంభించింది. దీంతో సంస్థ నిర్వహణ సామర్థ్యం 7 గిగావాట్లకు చేరింది.
- ఆల్‌కార్గో టెర్మినల్స్ లిమిటెడ్ కొత్త ఎండీగా ప్రణవ్ చౌదరి సెప్టెంబరు 1 నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.
- టాటా గ్రూప్‌నకు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ వద్ద 80 గదుల లగ్జరీ రిసార్ట్ కార్బెట్ హైడ్‌అవే-సెలెక్షన్స్‌ను ప్రారంభించింది.
- మహారాష్ట్రలోని శిర్డీలో 58 గదులతో ఎకో సత్వ శిర్డీ హోటల్‌ను ఎకో హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రారంభించింది. రాబోయే 45 రోజుల్లో అయోధ్య, ఛత్రపతి శంభాజీనగర్‌లలో మరిన్ని హోటళ్లను తెరవనుంది.

ఇంటర్నెట్ లేకున్నా ఫోన్‌పేలో యూపీఐ సేవలు

దిల్లీ: ఫీచర్ ఫోన్ వినియోగదార్ల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా 'యూపీఐ 123పే' సర్వీసును ఆవిష్కరించింది. దీంతో 20 కోట్ల మందికి పైగా ఫీచర్ ఫోన్ వినియోగదార్లు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ123పే ఉపయోగించుకుంటుంది. ఈ సర్వీసును విస్తరించేందుకు నోకియా, హెచ్‌ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రీ బండిల్డ్‌గా అంటే ఫోన్ కొనుగోలు చేసేటపుడు ఫోన్‌తో పాటే వస్తుంది.

రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0

నోటిఫై చేసిన కేంద్రం

దిల్లీ: రూ.1,27,500 కోట్లతో సెమీకాన్ 2.0 పథకాన్ని నోటిఫై చేస్తూ ప్రభుత్వం సోమవారం అమల్లోకి తెచ్చింది. చిప్ తయారీ నుంచి స్వదేశీ డిజైన్, ఐపీ పరికరాలు, మెటీరియల్స్, అధునాతన ప్యాకేజింగ్, ఆర్ అండ్ డీ, నైపుణ్యాభివృద్ధి వంటివి ఉండే ఫుల్-స్టాక్ ఎకోసిస్టమ్ వరకు మన దేశ సెమీ కండక్టర్ ఆశయాలను మరింత పెంపొందించడం దీని లక్ష్యంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్లు ఒక కీలకమైన వ్యూహాత్మక వనరుగా మారిన తరుణంలో ఈ అడుగులు పడ్డాయి.

ఎందుకంటే: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో వస్తున్న విప్లవం అధునాతన చిప్‌లు, మెమొరీకి భారీ గిరాకీని సృష్టిస్తోంది. ఇదే సమయంలో సరఫరా చైన్‌లోని బలహీనతలపై పెరుగుతున్న ఆందోళనలు, మారుతున్న భౌగోళిక రాజకీయాలు, ప్రపంచ స్థాయి సంస్థలను తమ సెమీకండక్టర్ సామర్థ్యాలను విస్తరించుకోవడానికి, కేంద్రీకృత ఉత్పత్తి కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి పురికొల్పాయి. అందుకు తగ్గట్లుగా కేంద్ర మంత్రి వర్గం 2026 జులై 15న సెమీకాన్ 2.0 పథకానికి ఆమోదం తెలిపింది.

10% వాటాపై దృష్టి

రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమ మార్కెట్‌లో సుమారు 10 శాతం భారత్‌లో ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 'సెమీకాన్ 2.0 ద్వారా సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసే తదుపరి దశకు వెళ్లడానికి సమయం ఆసన్నమైంది. స్వయం సమృద్ధి, ప్రపంచ వ్యాప్తంగా పోటీపడగల పరిశ్రమను ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమ'ని ఐటీ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వెల్లడించారు. సోమవారం విడుదలైన నోటిఫికేషన్ ఈ కొత్త కార్యక్రమానికి సంబంధించిన వివరాలను స్పష్టం చేసింది. అవేంటంటే..

- వాణిజ్య రంగానికి సంబంధించిన చిప్‌ల రూపకల్పన విషయంలో అంకురాలు, భారతీయ పౌరులు లేదా ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) యాజమాన్యంలోని కంపెనీలు అర్హత కలిగి ఉంటాయి.
- అంకురాలకు ఆర్థిక సాయం గ్రాంట్.. ఈక్విటీ సహ-పెట్టుబడి రూపంలోనూ, కంపెనీలకు రాయల్టీ ఫైనాన్సింగ్ లేదా ఈక్విటీ సహ-పెట్టుబడి రూపంలోనూ ఉంటుంది.
- మరిన్ని ఫ్యాబ్‌ల (సెమీకండక్టర్ తయారీ కేంద్రాల) ఏర్పాటు విషయానికి వస్తే, ఈ కొత్త పథకం సిలికాన్ ఫ్యాబ్‌లకు 40 శాతం, కాంపౌండ్, డిస్‌ప్లే (ఎల్‌సీడీ, ఓఎల్ఈడీ, మైక్రో ఎల్ఈడీ), ఇతర ప్రత్యేక ఫ్యాబ్‌లకు 35 శాతం ఆర్థిక సాయాన్ని అందిస్తారు.
- అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్/అవుట్‌సోర్స్డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ (ఏటీఎంపీ/ఓఎస్ఏటీ)ను బలోపేతం చేయడానికి, ఇది అధునాతన ప్యాకేజింగ్‌కు మూలధన వ్యయంలో 35 శాతం, సంప్రదాయ ప్యాకేజింగ్‌కు 25 శాతం ప్రోత్సాహకంతో అధునాతన, లెగసీ ప్యాకేజింగ్‌కు మద్దతు ఇస్తుంది.

గతంలో సెమీకాన్ 1.0లో భాగంగా ప్రభుత్వం 6 రాష్ట్రాల్లో 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో మైక్రాన్ ఏటీఎంపీ ప్లాంట్, కైన్స్ సెమికాన్, సీజీ సెమీ ఓఎస్ఏటీ కేంద్రం ఈ ఏడాది ప్రారంభంలోనే వాణిజ్యపరమైన ఉత్పత్తిని మొదలుపెట్టాయి.

చిప్ పరిశ్రమలోకి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు

వచ్చే అయిదేళ్లలో సెమీకండక్టర్ రంగంలో రూ.5 లక్షల కోట్లకు పైగా ప్రైవేటు, పరిశ్రమల పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం సెమీకాన్ 2.0 పథకానికి ఉందని పరిశ్రమల సంఘం ఇండియా ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీ కండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్ఏ) పేర్కొంది. వచ్చే 5-7 ఏళ్లలో దేశంలో 5-7 తయారీ యూనిట్లు (వేఫర్ ఫ్యాబ్స్) ఏర్పాటవుతాయని ఐఈఎస్ఏ ప్రెసిడెంట్ అశోక్ ఛందక్ తెలిపారు.

భయపెట్టిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.7,986 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4,589 కోట్లు

సెన్సెక్స్ ▼ 307 76957

నిఫ్టీ ▼ 95 24080

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పెరగడంతో దేశీయ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు పెరగడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. యుటిలిటీస్, ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 21 పైసలు పెరిగి 95.22 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 3.63% లాభంతో 91.30 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా, షాంఘై లాభపడగా, జపాన్, హాంకాంగ్ నష్టపోయాయి. ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.59 లక్షల కోట్లు తగ్గి రూ.490.23 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
- సెన్సెక్స్ ఉదయం 134 పాయింట్ల నష్టం (క్రితం ముగింపు 77,264.51 పాయింట్లు)తో 77,130.73 వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే ట్రేడైన సూచీ, ఇంట్రాడేలో 513.19 పాయింట్లు తగ్గి 76,751.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 307.24 పాయింట్ల నష్టంతో 76,957.27 వద్ద ముగిసింది. నిఫ్టీ 95.25 పాయింట్లు కోల్పోయి 24,080.40 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,993.60-24,128.70 పాయింట్ల మధ్య కదలాడింది.
- సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 4.11%, ఐటీసీ 3.67%, భారతీ ఎయిర్‌టెల్ 2.76%, ఇన్ఫోసిస్ 1.50%, కోటక్ బ్యాంక్ 1.30%, టాటా స్టీల్ 1.18%, ఎన్‌టీపీసీ 1.15%, బజాజ్ ఫైనాన్స్ 1.14% డీలాపడ్డాయి. సన్‌ఫార్మా 1.87%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.74%, యాక్సిస్ బ్యాంక్ 1.50%, ఎస్‌బీఐ 1.33%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.02% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. యుటిలిటీస్ 2.64%, లోహ 2.42%, సేవలు 1.95%, కమొడిటీస్ 1.52%, హౌసింగ్ ఫైనాన్స్ 1.33%, విద్యుత్ 1.31%, ఎఫ్ఎంసీజీ 1.14% తగ్గాయి. ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రాణించాయి.
- అక్టోబరులో పదవీకాలం ముగిసిన తర్వాత పునర్నియామకానికి దూరంగా ఉండాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ నిర్ణయించుకోవడంతో సంస్థ షేరు ఇంట్రాడేలో 2.70% లాభంతో 739.50 వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం లాభాల స్వీకరణతో 1.53% నష్టపోయి రూ.709 దగ్గర స్థిరపడింది.
- ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఇష్యూ ధర రూ.788తో పోలిస్తే బీఎస్ఈలో 21.31% లాభంతో రూ.956 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.1019 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసి, చివరకు 15.19% పెరిగి రూ.907.75 దగ్గర స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,294.43 కోట్లుగా నమోదైంది.

మూలధన వ్యయాలు పెంచిన మారుతీ

- 2030-31 వరకు రూ.77,500 కోట్లకు
- ఎండీ, సీఈఓ హిసాచి టకూచి వెల్లడి

దిల్లీ: కార్ల తయారీ దిగ్గజ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా వచ్చే అయిదేళ్లకు రూ.77,500 కోట్ల మూలధన వ్యయాలను కేటాయించింది. 2030-31 వరకు సామర్థ్య విస్తరణ, కొత్త మోడళ్ల తయారీ, పరిశోధన-అభివృద్ధి(ఆర్ అండ్ డీ) తదితరాల కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈఓ హిసాచి టకూచి పేర్కొన్నారు. కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో భాగంగా వాటాదార్లు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ '2008 నుంచి తయారవుతున్న మారుతీ కార్లన్నీ ఇ20(పెట్రోలులో 20 శాతం ఇథనాల్ కలిసిన) ఇంధనానికి తగ్గట్లుగానే ఉన్నాయి. ప్రతిపాదిత మూలధన వ్యయాలను పెంచుతున్నాం. 2026-27 ఏడాదిలో రూ.10,000 కోట్లు కేటాయించగా, దానిని రూ.14,000 కోట్లకు చేర్చాం. మొత్తం మీద 2026-27 నుంచి 2030-31 వరకు రూ.77,500 కోట్లు వెచ్చిస్తామ'న్నారు. గతేడాది కంపెనీ ప్రకటించిన రూ.70,000 కోట్ల కంటే ఇది అధికం.

జీఎస్‌టీ 2.0 లేకుండా అనిశ్చితుల్లో భారత్ రాణించేది కాదు: జీఎస్‌టీ2.0 సంస్కరణలను అమలు చేయకపోతే వాహన పరిశ్రమతో పాటు భారత్‌లోని పలు ఇతర రంగాలు రాణించి ఉండేవి కాదని మారుతీ సుజుకీ ఇండియా ఛైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంలోనూ ఆర్థిక వ్యవస్థ రాణించగలగడానికి ఆ సంస్కరణలే కారణమన్నారు. '2031 నాటికి కార్ల పరిశ్రమ 63 లక్షలకు చేరవచ్చు. చిన్న కార్ల మార్కెట్ల వాటా కూడా వేగంగా పెరగగలద'ని ఆయన అంచనా వేశారు.

మార్చిలోగా కోల్ ఇండియా రెండు అనుబంధ సంస్థల ఐపీఓలు

కోల్‌కతా: తమ అనుబంధ సంస్థలైన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్), మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్)ల ఐపీఓలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేస్తామని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, ఎండీ బి.సాయిరాం సోమవారం వెల్లడించారు. ఎస్ఈసీఎల్, ఎంసీఎల్‌ల్లో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో 25 శాతం వరకు వాటాలను విక్రయించేందుకు సీఐఎల్ బోర్డు ఈ ఏడాది మార్చిలో సూత్రప్రాయ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

అవాంటెల్‌కు డీఆర్‌డీఓ నుంచి రూ.118 కోట్ల ఆర్డరు

రక్షణ, ఏరోస్పేస్ రంగంలోని అవాంటెల్‌కు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) నుంచి రూ.117.88 కోట్ల ఆర్డరు వచ్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా, వాయిస్, డేటా కోసం ఒక హబ్‌ను అభివృద్ధి చేయడం, కార్యకలాపాలకు సిద్ధం చేయడం వంటివి ఉంటాయని సంస్థ వెల్లడించింది. ఫిబ్రవరి 2029 నాటికి దీన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది.

ఐటీసీ ఇన్ఫోటెక్‌లో హ్యాపియెస్ట్ మైండ్స్ విలీనం

లావాదేవీ విలువ రూ.1,330 కోట్లు

దిల్లీ: హ్యాపియెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్‌లో 22.1 శాతం వాటాను ఐటీసీ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ ఐటీసీ ఇన్ఫోటెక్ సుమారు రూ.1,330 కోట్లతో కొనుగోలు చేయనుంది. ఈ రెండు సంస్థలు కలిసి బిలియన్ డాలర్ల (రూ.9,500 కోట్ల) విలువైన భారీ సాంకేతిక సంస్థగా విలీనం కావడానికి దారి తీసే ఒప్పందంలో భాగంగా ఈ కొనుగోలు జరగనుంది. వాటా కొనుగోలు అనంతరం ఐటీసీ ఇన్ఫోటెక్‌లో హ్యాపియెస్ట్ మైండ్స్‌ను విలీనం చేయనున్నారు. విలీనానంతరం విలీన సంస్థలో ఐటీసీకి 73.4 శాతం వాటా, హ్యాపియెస్ట్ మైండ్స్ వాటాదార్లకు 26.6 శాతం వాటా ఉంటుంది. విలీనం తర్వాత ఐటీసీ ఇన్ఫోటెక్ బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదయ్యే అవకాశం ఉంది. ● ఆమోదిత షేర్ల మార్పిడి నిష్పత్తి ప్రకారం, ఐటీసీ ఇన్ఫోటెక్ రూ.2 ముఖ విలువ కలిగిన 81 హ్యాపియెస్ట్ మైండ్స్ షేర్లకు రూ.10 ముఖ విలువ కలిగిన 25 ఈక్విటీ షేర్లను కేటాయించనుంది.

(c) eenadu

sukhi@eenadu.in

సుఖీభవ

ఈనాడు

17 హైదరాబాద్, మంగళవారం సెప్టెంబరు 1, 2026



ఒకట్రెండు సార్లు దగ్గితే? పొలమారిందేమో అనుకుంటాం. ఒకట్రెండు రోజులుగా దగ్గుతుంటే? జలుబు, ఫ్లూ కావొచ్చని భావిస్తాం. వారమైనా తగ్గకపోతే? అలర్జీ, బ్రాంకైటిస్ వంటి సమస్యలు మనసులో మెదలుతాయి. మూడు, నాలుగు వారాలు దాటినా వేధిస్తుంటే? ఏమైందో ఏమోననే భయం పుట్టటం ఖాయం. నిజానికి జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటి వాటితో వచ్చే దగ్గు ఆయా సమస్యలు నయం కాగానే తగ్గుతుంది. కానీ దీర్ఘకాల దగ్గు అలా కాదు. వారాలు, నెలల తరబడి వెంటాడుతూ వస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేయటానికి లేదు.

వెంటాడే దగ్గు!

సాధారణంగా దగ్గు రాగానే కంగారుపడతాం. కానీ అది మన శ్వాసకోశ వ్యవస్థను కాపాడే సహజ రక్షణ ప్రక్రియ. శ్వాసనాళాల్లోకి ధూళి, దుమ్ము లేదా క్రిములు చేరినప్పుడో.. కఫం (శ్లేష్మం) బాగా పేరుకున్నప్పుడో శరీరం వాటిని బయటకు పంపడానికి దగ్గు రూపంలోనే స్పందిస్తుంది. శ్వాసనాళాల్లోనే కాకుండా చెవి, ముక్కు చుట్టుపక్కల సైనస్ గదులు, గొంతు, అన్నవాహిక వంటి భాగాల్లోనూ అత్యంత సున్నితమైన నాడీ కణాలు ఉంటాయి. శ్వాసనాళాల్లో ఏదైనా నస లేదా ఆటంకం ఏర్పడగానే ఇవి వేగస్ నాడి ద్వారా మెదడుకు సంకేతాన్ని పంపుతాయి. దాన్ని అందుకున్న మెదడు వెంటనే శ్వాసకోశ, గొంతు కండరాలను బలంగా ఒత్తిడికి గురిచేసి గాలిని వేగంగా బయటకు నెట్టేలా ఆదేశిస్తుంది. ఈ క్రమంలోనే దగ్గు పుడుతుంది. అనవసరమైనవి లోపలికి పోకుండా కాపాడే ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యానికి ఎంతో కీలకం. అయితే దగ్గు అన్నిసార్లూ మంచిదే అనుకోవటానికి లేదు.

డా॥ శ్రీకంటి రఘు
సూపరింటెండెంట్
ప్రభుత్వ ఛాతీ మరియు సాంక్రమిక వ్యాధుల వైద్యశాల
గుంటూరు

కాలాన్ని బట్టి రకాలు

దగ్గు ఎంతకాలంగా వస్తుందనే దాన్ని బట్టి తీవ్రత, రకాలు ఆధారపడి ఉంటాయి.

- **అక్యూట్:** మూడు వారాల కన్నా తక్కువ కాలం ఉండేది అక్యూట్ రకం. ఇది చాలావరకూ సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లతో వస్తుంది. అయితే పిల్లల్లో శ్వాసనాళాల్లోకి ఆహారం, ద్రవాలు పోవటం, ఊపిరితిత్తుల్లో వాపు ప్రక్రియతోనూ రావొచ్చు.
- **సబ్ అక్యూట్:** మూడు నుంచి ఎనిమిది వారాల వరకు ఉండేది.
- **క్రానిక్:** ఎనిమిది వారాలకు మించి కొనసాగేది క్రానిక్ రకం. ఇది చాలా విసుగు కలిగిస్తుంది. అంతేకాదు, నిద్ర సరిగా పట్టకపోవటం, తీవ్ర అలసట వంటి ఇబ్బందులకూ గురిచేస్తుంది. రెండు నెలలు దాటినా దగ్గు తగ్గకపోతే ఊపిరితిత్తుల్లో తీవ్రమైన సమస్యలు, క్యాన్సర్ కణితులు, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ) వంటి జబ్బులు ఉన్నాయేమోనని నిశితంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సొంత వైద్యంతో, దగ్గు మందులతో తాత్కాలికంగా లక్షణాలను అణచివేయటం సరికాదు. దగ్గును ఒక జబ్బుకు సంకేతంగా మాత్రమే కాకుండా, దానికదే ఒక ప్రత్యేక సమస్యగా భావించాల్సి ఉంటుంది. దగ్గుకు కారణమవుతున్న అంశాలను గుర్తించి చికిత్స చేయటం చాలా ముఖ్యం.

ఇతర లక్షణాలూ..

దీర్ఘకాలిక దగ్గులో కొన్ని ఇతర లక్షణాలూ కనిపించొచ్చు.

- ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ
- గొంతు వెనుక భాగంలో కఫం జారటం (పోస్ట్‌నాసల్ డ్రిప్)
- తరచూ గొంతును సరిచేసుకోవడం
- గొంతు నొప్పి
- బొంగురు గొంతు (స్వరం మారడం)
- ఆయాసం, గాలి సరిగా అందకపోవటం (పిల్లనగ్రోవి ఊదినట్లు పిల్లికూతలు)
- ఛాతీలో మంట (అసిడిటీ), నోట్లోకి పుల్లటి నీరు రావటం
- దగ్గినప్పుడు అరుదుగా రక్తం పడటం

ప్రధాన కారణాలు ఇవీ..

1. బీపీ మందులు

అధిక రక్తపోటు, గుండె జబ్బుల కోసం క్రమం తప్పకుండా వాడే ఏసీఈ ఇన్‌హిబిటార్స్ రకం మందులు శ్వాసకోశ వ్యవస్థలో బ్రాడీకినిన్, సబ్‌స్టాన్స్-పి అనే రసాయనాలు పేరుకుపోయేలా చేస్తాయి. దీంతో 5-35% మందిలో పొడి దగ్గు వస్తుంటుంది. పొగతాగే అలవాటు లేనివారిలోనూ ఇది కనిపిస్తుంది.

గుర్తించటం: మొదటి మోతాదు మందు వేసుకున్న కొద్ది గంటల్లోనే దగ్గు రావచ్చు. కొందరికి కొన్ని నెలల తర్వాత రావచ్చు.

పరిష్కారం: వైద్యుల సలహాతో బీపీ మందును పూర్తిగా ఆపేసి, ప్రత్యామ్నాయ మందులను వాడుకోవచ్చు. మందు ఆపిన 1- 4 వారాల్లో దగ్గు తగ్గుతుంది.

2. ఆస్థమా, శ్వాసనాళాల వాపు

ఆస్థమాతో తలెత్తే దగ్గు ఆయా కాలాలను బట్టి వస్తుంటుంది, పోతుంటుంది. ఇది శ్వాసకోశ ఇన్ఫెక్షన్ తర్వాత కనిపించొచ్చు. చల్ల గాలి, కొన్ని రసాయనాలు, సువాసనలతో మరింత ఎక్కువ కావచ్చు. శ్వాసనాళాల్లో ఇసినోఫిల్స్ అనే తెల్ల రక్తకణాలు పెరగడం వల్ల వచ్చే కాఫ్-వేరియంట్ రకం ఆస్థమాలో ప్రధాన లక్షణం దగ్గు మాత్రమే.

గుర్తించటం: ఆయాసం స్పష్టంగా లేకపోయినా రాత్రి వేళల్లో పొడిదగ్గు తీవ్రమవుతుంది. రక్తంలో ఇసినోఫిల్స్ సంఖ్య, ఉచ్ఛ్వాస పరీక్ష ద్వారా దీన్ని నిర్ధారించొచ్చు.

పరిష్కారం: ఇన్‌హేలర్ ద్వారా పీల్చుకునే కార్టికోస్టెరాయిడ్స్ మేలు చేస్తాయి. అవసరమైతే శ్వాసనాళాల వాపు తగ్గటానికి నోటితో స్టెరాయిడ్లు తీసుకోవాల్సి ఉంటుంది.

3. ముక్కు, సైనస్ సమస్యలు

ముక్కు, దాని చుట్టుపక్కల గాలిగదుల వాపు (సైనసైటిస్) సమస్యలూ దగ్గుకు దారితీస్తుంటాయి. ముక్కు దిబ్బడ, ముఖంలో నొప్పి, వాసన తెలియకపోవడం వంటివి దీర్ఘకాలం ఉన్నట్టయితే శ్లేష్మం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంటుంది. ఇది గొంతు వెనుక భాగంలోకి చుక్కలు చుక్కలుగా జారటం (పోస్ట్ నాసల్ డ్రిప్) దగ్గుకు దారితీస్తుంది. దీన్నే అప్పర్ ఎయిర్‌వే కాఫ్ సిండ్రోమ్ అనీ అంటారు.

పరిష్కారం: యాంటిహిస్టమైన్లు, స్టెరాయిడ్ నాసల్ స్ప్రే, ఉప్పు నీటితో ముక్కు శుభ్రం చేసుకోవటం (సలైన్ వాషింగ్) ద్వారా ఉపశమనం లభిస్తుంది.

4. ఆమ్లం గొంతులోకి రావటం

జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఎగదన్నుకు రావటం (జీఈఆర్‌డీ) వల్ల ఛాతీలో మంట మాత్రమే కాదు, అన్నవాహిక చికాకుకు గురై దగ్గూ వస్తుంది. దీంతో జీఈఆర్‌డీ మరింత ఎక్కువవుతుంది కూడా. చివరికిదో విషవలయంగా మారుతుంది. విపరీతమైన గురక పెట్టటం, ఊబకాయం మూలంగానూ ఆమ్లం ఎగదన్నుకొచ్చి, దగ్గు రావచ్చు.

పరిష్కారం: ఛాతీమంట తగ్గించే పీపీఐ రకం మందులతో పాటు బరువు తగ్గటం, తిన్న వెంటనే పడుకోకపోవటం వంటి జీవనశైలి మార్పులు మేలు చేస్తాయి.

5. ఇన్ఫెక్షన్లు

న్యుమోనియా, ఫ్లూ, జలుబు వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు తగ్గినా, దగ్గు చాలాకాలం ఉండొచ్చు. పెద్దవారిలో దీర్ఘకాలిక దగ్గుకు కారణమయ్యే, పెద్దగా పట్టించుకోని మరో సమస్య కోరింత దగ్గు (పర్టుసిస్). ఊపిరితిత్తుల్లో తలెత్తే ఫంగల్ ఇన్ఫెక్షన్లు, క్షయ.. నేల, నీరు, దుమ్ములో ఉండే నాన్-ట్యూబర్క్యులస్ మైకోబాక్టీరియా (ఎన్‌టీఎం) కూడా దీర్ఘకాలిక దగ్గుకు దారితీయొచ్చు.

6. పొగ తాగటం, వాయు కాలుష్యం

సిగరెట్లు, చుట్టలు, బీడీలు, ఇ-సిగరెట్లు తాగటం వల్ల శ్వాసనాళాల్లో దీర్ఘకాల బ్రాంకైటిస్ తలెత్తి, ఉదయాన్నే కఫంతో కూడిన దగ్గు వస్తుంది. వాయు కాలుష్యమూ కారణం కావొచ్చు.

పరిష్కారం: పొగ తాగటం మానెయ్యాలి. అవసరమైతే నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవాలి. రసాయనాలు/ధూళి కాలుష్యానికి దూరంగా ఉండాలి.

7. క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ)

ఇది ఊపిరితిత్తుల నుంచి గాలి ప్రవాహాన్ని అడ్డుకునే దీర్ఘకాలిక శ్వాసకోశ జబ్బు. ఇందులో క్రానిక్ బ్రాంకైటిస్, ఎంఫిసెమా అనే రెండు రకాలుంటాయి. క్రానిక్ బ్రాంకైటిస్‌లో రంగు మారిన కఫంతో దగ్గు వస్తుంది. ఎంఫిసెమా ఊపిరితిత్తుల్లోని గాలి సంచులను దెబ్బతీసి ఆయాసానికి దారితీస్తుంది. సీఓపీడీ గలవారిలో ఎక్కువమంది పొగతాగేవారు, ఒకప్పుడు పొగతాగినవారే అయ్యుంటారు.

అరుదైన కారణాలు

- పొలమారటం (ఆస్పిరేషన్), శ్వాసనాళాలు వెడల్పయి దెబ్బతినడం వల్ల శ్లేష్మాన్ని బయటకు పంపే సామర్థ్యం తగ్గటం (బ్రాంకియెక్టాసిస్), ఊపిరితిత్తులలోని చిన్న శ్వాసనాళాల్లో వాపు, చికాకు, శ్లేష్మం పేరుకుపోయేలా చేసే ఇన్ఫెక్షన్ (బ్రాంకియోలైటిస్), ఊపిరితిత్తులు, జీర్ణ వ్యవస్థ, ఇతర అవయవాలను ప్రభావితం చేసే జన్యులోపం (సిస్టిక్ ఫైబ్రోసిస్), ఇదమిత్థమైన కారణం తెలియకుండా ఊపిరితిత్తులు క్రమంగా దెబ్బతిని గట్టిపడటం (ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్), ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్థమా లేకపోయినా శ్వాసనాళాలు వాయటం (నాన్-ఆస్థమాటిక్ ఈసినోఫిలిక్ బ్రాంకైటిస్), ఊపిరితిత్తుల్లో కణితులు (సార్కాయిడోసిస్) వంటివి.

దగ్గు ఒక్కటే కాదు..

విడవకుండా వేధించే దగ్గు మనిషిని తీవ్ర అలసటకు గురిచేస్తుంది. అలాగే రకరకాల ఇబ్బందులనూ తెచ్చిపెడుతుంది.

- నిద్ర సరిగా పట్టకపోవటం
- తలనొప్పి
- కళ్లు తిరగడం
- వాంతులు
- విపరీతంగా చెమటలు
- మూత్రం లీక్
- పక్కటెముకలు విరగటం
- స్పృహ తప్పటం
- మానసిక ఒత్తిడి

ఇవి ప్రమాదకర లక్షణాలు

- దగ్గుతో పాటు కఫంలో రక్తం పడటం
- తీవ్రమైన ఆయాసం, శ్వాస తీసుకోలేకపోవటం
- అకారణంగా బరువు తగ్గిపోవటం
- రాత్రి వేళల్లో విపరీతంగా చెమటలు, జ్వరం రావటం
- ఛాతీ భాగంలో తీవ్రమైన నొప్పి

- ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తాత్సారం చేయరాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

దగ్గు కేవలం తాత్కాలిక అసౌకర్యమే కాకపోవచ్చు. అది ఊపిరితిత్తుల్లో దాగిన సమస్యకు తొలి హెచ్చరిక కావచ్చు! కారణాన్ని సరిగ్గా గుర్తించి, సరైన చికిత్స తీసుకోవటమే ఊపిరితిత్తుల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష.

వరద నీటిలో నడుస్తున్నారా?

మురుగుతో కలిసిన వరద నీటిలో నడిస్తే పాదాలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. ముఖ్యంగా చర్మం కింది పొర వాపు (సెల్యులైటిస్) పెద్ద చిక్కే తెచ్చిపెడుతుంది. ఇది ప్రధానంగా స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియాతో వస్తుంది. ఇవి చర్మం గీసుకుపోయిన చోటు నుంచి తేలికగా లోపలికి వెళ్లి, ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఈ సమస్య కాళ్లు, పాదాలు, వేళ్లలో ఎక్కువ. చాలావరకూ చర్మం దిగువ, కొవ్వు పొరలకే పరిమితమవుతుంది.

సెల్యులైటిస్‌లో ఇన్‌ఫెక్షన్ తలెత్తిన చోట చర్మం ఎరుపెక్కుతుంది. కాలు వాపు, ఉబ్బు, తీవ్రమైన నొప్పి, బొబ్బల వంటివీ కనిపిస్తాయి. చూడటానికి చర్మం చిన్న గుంతలు పడినట్టుగా నారింజ తొక్కలా కనిపిస్తుంది. కొందరికి జ్వరం, చలి, బలహీనత కూడా తలెత్తొచ్చు. దీనికి యాంటీబయాటిక్ మాత్రలు అంతగా పనిచేయవు. రక్తనాళం ద్వారా 7-10 రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య ముదిరి, ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదమూ ఉంది.

నివారణ ఉత్తమం

- వర్షపు నీటిలో తడిచినప్పుడు ఇంటికి వచ్చాక వెచ్చటి నీటితో శుభ్రంగా పాదాలు కడుక్కోవాలి. గాట్లు ఉన్నట్టయితే యాంటీబయాటిక్ మలాము రాసుకోవాలి. ఒకవేళ ఒళ్లంతా తడిస్తే వేడి నీటితో స్నానం చేయాలి.
- పాదాలు పొడిగా ఉండేలా, గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాకాలంలో బయటకు వెళ్లేటప్పుడు నీటికి తడవని షూ వేసుకుంటే మేలు. పూర్తిగా ఆరిన తర్వాతే చెప్పులు, షూ తిరిగి ధరించాలి. చెప్పులు వేసుకోకుండా ఆరుబయట, వాననీటిలో నడవొద్దు.
- మధుమేహం వంటి సమస్యలుంటే డాక్టర్ సలహా మేరకు ప్రత్యేక చెప్పులు, షూ వేసుకోవాలి. తరచూ పాదాలు, కాళ్లను గమనించాలి. ఎరుపు, వాపు వంటి లక్షణాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇతరుల పాదరక్షలను వేసుకోవద్దు.

ఒకే రక్తపరీక్షతో పలు జబ్బుల గుర్తింపు

పలు క్యాన్సర్లు, రకరకాల కాలేయ జబ్బులు, అవయవ సమస్యలను ఒకేసారి గుర్తించగలిగితే? చాలా బాగుంటుంది కదా. యూసీఎల్‌ఏ శాస్త్రవేత్తలు అలాంటి వినూత్న రక్త పరీక్షనే రూపొందించారు. దీని పేరు మిథైల్‌స్కాన్. ఇది కణాలు చనిపోయినప్పుడు వాటి నుంచి విడుదలయ్యే సూక్ష్మ డీఎన్‌ఏ (సీఎఫ్‌డీఎన్‌ఏ) పోచలను విశ్లేషించటం ద్వారా పనిచేస్తుంది. అన్ని అవయవాల కణాల డీఎన్‌ఏ రక్తంలోకి చేరుతుంది. అందువల్ల సీఎఫ్‌డీఎన్‌ఏ ఆయా కణాల సంకేతాలను కలిగుంటుంది. శరీరమంతటా ఏం జరుగుతుందో ప్రతిఫలిస్తుంది. కాబట్టే శాస్త్రవేత్తలు దీనిపై దృష్టి సారించారు. జబ్బులను ముందుగానే గుర్తించటానికి, ఆరోగ్యాన్ని సమగ్రంగా పర్యవేక్షించటానికి మిథైల్‌స్కాన్ సమర్థమైన, చవకైన పరీక్ష కాగలదని చెబుతున్నారు. జబ్బులను ముందుగా పట్టుకోగలిగితే చికిత్స తేలికవుతుంది. ఉదాహరణకు- క్యాన్సర్లను నాలుగో గ్రేడ్‌లో కన్నా మొదటి గ్రేడ్‌లోనే గుర్తించి, చికిత్స చేస్తే బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ప్రతిరోజూ మన శరీరంలో 5000 కోట్ల నుంచి 7000 కోట్ల కణాలు మరణిస్తుంటాయని అంచనా. ఇవి ఊరికే కనుమరుగు కావు. కణసంబంధ జాడలను విడిచి పెడతాయి కూడా. ఇవి రక్తంలో కలుస్తుంటాయి. వీటిల్లో సీఎఫ్‌డీఎన్‌ఏ ఒకటి. ఆయా అవయవాల ఆరోగ్యం గురించి విలువైన సమాచారాన్ని అందిస్తాయి. నిజానికి రక్తం సాయంతో క్యాన్సర్‌ను గుర్తించటం కొత్తేమీ కాదు. దీన్ని ద్రవ బయాప్సీ అనీ అంటుంటారు. ఆయా క్యాన్సర్లను పట్టుకోవటానికి కణితి డీఎన్‌ఏలో మార్పులను గుర్తించే పరీక్షలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. కానీ అలాంటి పరీక్షలు కొద్ది జన్యు మార్పుల మీదే ఆధారపడతాయి. అతి సూక్ష్మమైన కణితి సంకేతాలను లోతుగా విశ్లేషించాల్సి ఉంటుంది కూడా. అందువల్ల ఖరీదూ ఎక్కువే. ఇలాంటి ఇబ్బందులను తొలగించటానికే యూసీఎల్‌ఏ శాస్త్రవేత్తలు జన్యు మార్పులను అన్వేషించటానికి బదులు డీఎన్‌ఏ మిథైలేషన్ మీద దృష్టి సారించారు. కణాలు జబ్బు లేదా క్యాన్సర్ బారినపడితే ఇదీ మారుతుంది. ఇలా మొత్తంగా కణజాలం ఆరోగ్యాన్ని పట్టి చూపుతుంది. అయితే ఒక చిక్కుంది. రక్తంలో కలిసే సీఎఫ్‌డీఎన్‌ఏ అంతా కణితులు లేదా దెబ్బతిన్న అవయవాల నుంచి రావాలనేమీ లేదు. సుమారు 80-90% మామూలు రక్తకణాల నుంచే పుట్టుకొస్తుంది. వీటిలోంచి తొలిదశ క్యాన్సర్‌ను సూచించే అరుదైన సంకేతాన్ని గుర్తించటమంటే మాటలు కాదు. ఖర్చూ ఎక్కువవతుంది. అందుకే అవయవాల నుంచి వెలువడే సీఎఫ్‌డీఎన్‌ఏను మాత్రమే కనిపెట్టేలా మిథైల్‌స్కాన్‌ను రూపొందించారు. దీంతో విశ్లేషించాల్సిన డీఎన్‌ఏ సంఖ్య, ఖర్చు తగ్గుతాయి. అదే సమయంలో కచ్చితత్వమూ ఇనుమడిస్తుంది.

మిత కాఫీ గుండెకు హితం!

పొద్దున లేవగానే కాఫీ నోట్లో పడకపోతే చాలామందికి రోజు గడవదు. గుక్క గుక్కకూ హుషారు ఊపందుకుంటుంది. కాఫీ చేదు, చక్కెర తీపి, పాల కమ్మదనం కలగలిస్తే చెప్పేదేముంది? అమృతమైనా దిగదుడుపే! ఫిల్టర్ అయితేనేమి? ఇన్‌స్టంట్ అయితేనేమి? దేని రుచి దానిదే. అందుకేనేమో ఒక కప్పుతో సరిపుచ్చటమంటే మనసు చివుక్కుమంటుంది. రోజుకు మూడు నాలుగు సార్లు రుచి చూస్తే గానీ తనివి తీరదు. ఇంతకీ దీంతో ఒనగూరే ప్రయోజనాలేంటి? రోజుకు ఎన్ని కప్పులు లాగించాలి? పాలు, చక్కెర కలపాలా? వద్దా? ఉత్త కాఫీ మాత్రమే తాగాలా? ఇలాంటి ప్రశ్నలెన్నో మనసులో మెదలటం సహజమే. కానీ ఒక్కో పరిశోధన ఒక్కో రకంగా చెబుతుంటే ఎలా? అదృష్టవశాత్తూ అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం కొన్ని సందేహాలను నివృత్తి చేసింది. దీన్ని కాఫీ విషయంలో కొత్త శాస్త్రీయ ప్రకటనగానూ పరిగణిస్తుండటం విశేషం.

కాఫీలోని ముఖ్యమైన దినుసు కెఫీనే. మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థను ఉత్తేజితం చేసేది ఇదే. మరింత శక్తిని ఉత్పత్తి చేసేలా, దాన్ని ఇంకాస్త ఎక్కువగా ఉపయోగించుకునేలా శరీరాన్ని ప్రోత్సహిస్తుంది. అందుకే అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం, గుండెలయ తప్పటం, ఇతర గుండె సమస్యలపై కెఫీన్ చూపుతున్న ప్రభావం మీద జరిగిన పలు అధ్యయనాలను పరిశోధకులు విశ్లేషించారు. వాటన్నింటినీ గుదిగుచ్చి కొత్త విషయాలను వెలుగులోకి తెచ్చారు.

- చాలామందికి రోజుకు 3 నుంచి 5 కప్పుల వరకు (రోజుకు కెఫీన్ 400 ఎంజీ వరకు) బ్లాక్ కాఫీ సురక్షితం. అంటే చక్కెర, తీపి పదార్థాలు, ఫ్లేవర్లు, క్రీమ్ వంటివి కలపని కాఫీ మేలన్నమాట.
- బ్లాక్ కాఫీతో టైప్ 2 మధుమేహం, గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం, కొన్నిరకాల అస్తవ్యస్త గుండె లయ సమస్యలు, వయసుతో ముడిపడిన డిమెన్షియా, అల్జీమర్స్ వంటి జబ్బుల ముప్పు తగ్గే అవకాశముంది. చక్కెర, రుచికారక సిరప్‌లు, పాలు, క్రీమ్ వంటివి కలిపితే మాత్రం ఈ ప్రయోజనాలు తగ్గొచ్చు. అదనంగా జతచేసే ఇలాంటి పదార్థాల ప్రభావాలను అర్థం చేసుకోవటానికి మరింత పరిశోధన చేయాల్సిన అవసరముందన్నది పరిశోధకుల అభిప్రాయం. వీటితో కేలరీలు ఎక్కువగా లభించటం కారణం కావొచ్చని భావిస్తున్నారు.
- పెద్దమొత్తంలో.. ముఖ్యంగా శక్తి పానీయాల్లోని కెఫీన్ గుండెకు హానికరం. వీటిల్లో మామూలు కాఫీతో పోలిస్తే 3-4 రెట్లు ఎక్కువ కెఫీన్ ఉంటుంది.

కెఫీన్ ప్రభావం ఇలా..

- **అధిక రక్తపోటు మీద:** కెఫీన్ ఎంత తీసుకుంటున్నారనే దాన్ని బట్టి రక్తపోటు మీద ప్రభావం కనిపిస్తోంది. కాఫీతో మొదట్లో తాత్కాలికంగా రక్తపోటు పెరుగుతున్నప్పటికీ.. అలవాటుగా రోజుకు 3 కప్పుల కన్నా ఎక్కువ తాగేవారికి అధిక రక్తపోటు ముప్పు తగ్గుతోంది. అయితే పెద్దమొత్తంలో.. ప్రధానంగా శక్తి పానీయాల వంటి వాటిల్లో ఉండే కెఫీన్‌తో రక్తపోటు గణనీయంగా పెరుగుతోంది. అప్పటికే అధిక రక్తపోటు గలవారిలోనైతే మరింత ఎక్కువవుతోంది.
- **మధుమేహం మీద:** క్రమం తప్పకుండా బ్లాక్ కాఫీ తాగటంతో మధుమేహం ముప్పు తగ్గుతోంది. అయితే ఇందుకు కెఫీన్ కన్నా కాఫీలోని ఇతర పదార్థాలే దోహదం చేస్తున్నాయి.
- **కొలెస్ట్రాల్ మీద:** కాఫీలోని కేఫ్‌స్టాల్ అనే పదార్థంతో చెడ్డ (ఎల్‌డీఎల్) కొలెస్ట్రాల్ ఎక్కువవుతుంది. ఫిల్టర్ చేయని కాఫీలో కేఫ్‌స్టాల్ ఉంటుంది. ఫిల్టర్ లేదా ఇన్‌స్టంట్ కాఫీలో ఉండదు.
- **గుండెలయ మీద:** రోజుకు 1-3 కప్పులు కాఫీతో గుండెలయ తప్పే ముప్పేమీ పెరగటం లేదు. కాకపోతే కింది గుండె గది ఇంకాస్త ముందుగా కొట్టుకునే అవకాశం ఉంటోంది. మరీ పెద్దమొత్తంలో కెఫీన్ తీసుకుంటే మాత్రం గుండె కొట్టుకునే తీరు అస్తవ్యస్తం కావొచ్చు.
- **గుండెజబ్బు, పక్షవాతం మీద:** రోజుకు 2-4 కప్పులు కాఫీ తాగేవారికి గుండెజబ్బు, గుండె వైఫల్యం, పక్షవాతం ముప్పులు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే 4 కప్పుల కన్నా ఎక్కువ తాగితే గుండె వైఫల్యం ముప్పు పెరిగే ప్రమాదముంది.

బీపీ పెరిగినా పైకి తెలియదు

అధిక రక్తపోటు (హైబీపీ) ఉన్నట్టయితే నిరంతరం తలనొప్పి వస్తుందని చాలామంది భావిస్తుంటారు. కోపం పెరుగుతుందనీ అనుకుంటుంటారు. 'బీపీ పెరిగితే నేను మనిషిని కాను' అని కొందరు ఊగిపోవటమూ చూస్తుంటాం. నిజానికి రక్తపోటు పెరిగినా చాలామందిలో ఎలాంటి లక్షణాలూ ఉండవు. పైకి అంతా మామూలుగానే అనిపిస్తుంది. పరీక్ష చేస్తే తప్ప రక్తపోటు ఎంతుందో తెలియదు.

అపోహ
నిజం

మందులతోనే అదుపులో

హైబీపీకి మందులు వేసుకుంటుంటారు. ఏదో సమయంలో పరీక్ష చేస్తే నార్మల్‌గా ఉంటుంది. ఇక బీపీ నయమైనట్టే అనుకొని మందులు ఆపేస్తుంటారు. ఇది ఎంత మాత్రమూ మంచిది కాదు. మందులు పని చేయటం వల్లనే రక్తపోటు అదుపులో ఉందని తెలుసుకోవాలి. వీటిని హఠాత్తుగా ఆపేస్తే తిరిగి రక్తపోటు పెరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ డాక్టర్ సలహా లేకుండా సొంతగా బీపీ మందులు మానెయ్యటం తగదు.

తేనె విషయంలోనూ పరిమితి

తేనె సహజ సిద్ధమైందని, అందువల్ల మధుమేహులకు హాని చేయదని కొందరు అనుకుంటుంటారు. తేనె సహజమైనదే అయినా దీనిలోనూ చక్కెరలు ఉంటాయి. పెద్ద మొత్తంలో తీసుకుంటే రక్తంలో గ్లూకోజూ పెరుగుతుంది. సహజమైందని అంటే మధుమేహులకు స్వతహాగా సురక్షితమైనదని అనుకోవద్దు. కాబట్టి పిండి పదార్థాలు, మిఠాయిలు, తీపి పదార్థాల మాదిరిగానే తేనె విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలి.

ఈసీజీ నార్మల్‌గా ఉన్నా..

ఈసీజీ ఫలితాలు నార్మల్‌గా ఉంటే గుండె పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టేనని కొందరు భావిస్తుంటారు. ఇది అన్నిసార్లూ నిజం కాదు. ఈసీజీలో గుండెకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం తెలుస్తుంది. కానీ దీని ఫలితం నార్మల్‌గా ఉన్నంత మాత్రాన ఎలాంటి గుండె సమస్య లేదనుకోవటం తగదు. విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, కొన్ని సెకండ్ల పాటు గుండె విద్యుత్ వ్యవస్థ పనితీరును మాత్రమే ఈసీజీ నమోదు చేస్తుంది. గుండె నిర్మాణంతో ముడిపడిన సమస్యలు, తొలిదశ పూడికలు, ఇతర సమయాల్లో గుండె లయ అస్తవ్యస్తం కావటం వంటివి తెలియదు.

మసక వెలుతురులో చదివినా..

మసక వెలుతురులో చదివితే శాశ్వతంగా చూపు తగ్గుతుందని కొందరు భావిస్తుంటారు. ఇందులో నిజం లేదు. మసక వెలుగులో చదివినప్పుడు తాత్కాలికంగా కళ్ల మీద ఒత్తిడి, తలనొప్పి, అసౌకర్యం వంటి ఇబ్బందులు తలెత్తొచ్చు. అంతేగానీ దీంతో సాధారణంగా ఆరోగ్యవంతుల కళ్లు శాశ్వతంగా దెబ్బతినవు.

టర్బినేట్స్‌తోనూ దిబ్బడ

చాలాకాలంగా ముక్కు దిబ్బడ వేధిస్తుంటే ముందుగా గాలిగదుల వాపు (సైనసైటిస్) సమస్యే గుర్తుకొస్తుంది. నిజానికి ముక్కులో వెలుపలి వైపు గోడలో ఉండే టర్బినేట్స్ కూడా కారణం కావచ్చు. ఇవి జిగురుపొరతో కూడుకొని ఉంటాయి. ముక్కు మొదట్లో ఉండే పెద్ద టర్బినేట్ శ్వాస తీసుకుంటున్నప్పుడు గాలి ఉష్ణోగ్రత, తేమను నియంత్రిస్తుంది. గాలితో పాటు లోపలికి వచ్చే దుమ్ము వంటి వాటిని వడ గడుతుంది. ఇలా ముక్కును కాపాడుతుంది. ఇది ఉబ్బితే గాలి ప్రవాహానికి అడ్డు తగులుతుంది. ఫలితంగా ముక్కు దిబ్బడ, ఆయాసం, నుదురు నొప్పి వంటి లక్షణాలు తలెత్తుతాయి. ముక్కుదూలం ఒక పక్కకు వంగటం, అలర్జిక్ రైనైటిస్, నాన్ అలర్జిక్ రైనైటిస్, దుమ్ము ధూళి, పొగ వంటి రకరకాల అంశాలు టర్బినేట్స్ ఉబ్బటానికి దారితీస్తుంటాయి. కొందరు గర్భిణుల్లోనూ ఇది కనిపిస్తుంటుంది.



గర్భధారణకు వీర్య బ్యాక్టీరియా సాయం

పేగుల్లోనే కాదు, వీర్యద్రవంలోనూ బ్యాక్టీరియా ఉంటుంది! ఆశ్చర్యంగా అనిపించినా ఇదీ సంతాన సాఫల్యానికి తోడ్పడుతుంది. ఒకప్పుడు వీర్యద్రవం సూక్ష్మక్రిమి రహితమని భావించేవారు. కానీ ఇందులోనూ రకరకాల సూక్ష్మక్రిములు ఉంటున్నట్టు కనుగొన్నారు. ఇవి ప్రోస్టేట్ గ్రంథి, వృషణాలు, మూత్రకోశం నుంచి పుట్టుకొచ్చి, వీర్యంలో కలుస్తుంటాయి. శుక్రకణాల ఆరోగ్యం, కదలికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ల్యాక్టోబాసిలస్ రకం క్రిములు ఎక్కువగా ఉంటే శుక్రకణాలు పెద్దమొత్తంలో ఉంటాయి. వీటి కదలికలూ బాగుంటాయి. అదే హానికారక ప్రివోటెల్లా, యూరియాప్లాజ్మా, కొన్నిరకాల సూడోమోనాస్ జాతుల వంటి క్రిములు ఎక్కువైతే శుక్రకణాల నాణ్యత, కదలికల వేగం తగ్గుతాయి. వీటి ఆకారమూ అస్తవ్యస్తంగా ఉండొచ్చు. గర్భధారణలో వీటి పాత్రపై తాజా డెన్మార్క్ అధ్యయనం సరికొత్త విషయాలను వెలుగులోకి తెచ్చింది. కృత్రిమ గర్భధారణకు ప్రయత్నిస్తున్నవారిని, తరచూ గర్భస్రావానికి గురవుతున్న వారిని ఇందులో పరిశీలించారు. కృత్రిమ గర్భధారణ బృందంలో సుమారు 24% మగవారిలో, గర్భం నిలవని బృందంలో 41% మగవారిలో వీర్యంలోని బ్యాక్టీరియా అస్తవ్యస్తంగా ఉంటున్నట్టు తేలింది. వీర్యం బ్యాక్టీరియా సమతులంగా ఉన్నప్పుడు- కృత్రిమ గర్భధారణ బృందంలోని 85% దంపతులకు సంతానం కలగగా.. బ్యాక్టీరియా అస్తవ్యస్తమైన బృందంలో కేవలం 57% దంపతులకు మాత్రమే సంతానం కలగటం గమనార్హం.



(c) eenadu

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, మంగళవారం, సెప్టెంబరు 1, 2026
18
◆ https://pratibha.eenadu.net ◆ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

★ ఎఫ్ఐఎస్‌యూ ప్రపంచ విశ్వవిద్యాలయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు?

జ: సూరజ్ కుమార్ చంద్ (ముంబయిలో జరిగిన ఐదు గేమ్‌ల ఫైనల్‌లో హంగేరీకి చెందిన బెనెడెక్ టకాక్స్‌పై సూరజ్ విజయం సాధించాడు.)

మాదిరి ప్రశ్నలు

★ ప్రకృతి జ్ఞాన్‌ధామ్ పేరిట సీఎస్ఐఆర్ – ఎన్‌బీఆర్ఐ దేశంలోనే తొలిసారిగా పర్యావరణ విద్యా కేంద్రాన్ని ఏ నగరంలో ఏర్పాటు చేసింది?

జ: లఖ్‌నవూ (కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించిన ఈ సంస్థను సీఎస్ఐఆర్ - నేషనల్ బొటానికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసింది. శాస్త్రీయ పరిశోధనా, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ విద్యను సమాజంతో అనుసంధానించే లక్ష్యంతో ఇది పనిచేస్తుంది.)

మరింత సమాచారం

★ 2026, ఆగస్టు 6న ఒడిశాలోని చాందీపుర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి ఏ మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది?

జ: అగ్ని-4 (దీనిని రక్షణ పరిశోధనా, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) రూపొందించింది.)

దరఖాస్తు చేశారా?

☛ హాల్, నాసిక్ - 627 డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్ ఖాళీలు
చివరి తేదీ: 04.09.2026

☛ రైల్ కోచ్ ఫ్యాక్టరీలో 734 పోస్టులు
చివరి తేదీ: 05.09.2026

సంక్షోభాలను దాటి.. స్వయంసమృద్ధిని చేరి!

బ్రిటిష్ పాలనా కాలంలో స్వల్ప మూలధనంతో మొదలైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రయాణం, తొమ్మిది దశాబ్దాల్లో భారత ఆర్థిక వ్యవస్థను శాసించే మహాశక్తిగా రూపాంతరం చెంది, కొనసాగుతోంది. రెండో ప్రపంచ యుద్ధం నాటి తీవ్ర ద్రవ్యోల్బణం, 1991 దివాలా సంక్షోభం, 2008 ప్రపంచ మందగమనాలను తట్టుకుని దేశాన్ని సురక్షితంగా నిలబెట్టిన ఆర్‌బీఐ, నేడు యూపీఐ, ఈ-రూపీ, ప్లాస్టిక్ నోట్లతో ప్రపంచ డిజిటల్ రంగానికే దిక్సూచిగా మారింది. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడే ఆహార ద్రవ్యోల్బణం, విదేశీ పెట్టుబడుల సంక్షోభం లాంటి కఠిన సవాళ్లను ఎదుర్కొంటూనే, తగినంత ద్రవ్య బలంతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద కొనుగోలు శక్తిగా భారత్‌ను నిలిపింది. దేశానికి ఒక అభేద్యమైన రక్షణ కవచంగా వ్యవహరిస్తున్న ఆర్‌బీఐ చారిత్రక పరిణామ క్రమాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దాంతోపాటు ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై, వాటిని అధిగమించడానికి ఆర్‌బీఐ అమలు చేస్తున్న పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

తొమ్మిది దశాబ్దాల ఆర్‌బీఐ ప్రస్థానం (1935–2026)

1) శైశవ దశ - కఠిన సవాళ్లు (1935-1947)

రూ.5 కోట్ల మూలధనంతో ప్రయాణం ప్రారంభించిన తొలినాళ్లలోనే రెండో ప్రపంచ యుద్ధం (1939-45) వల్ల ఏర్పడిన విపరీతమైన ద్రవ్యోల్బణంతో, ఆర్‌బీఐకి అత్యంత విషమ పరీక్ష ఎదురైంది. దీని పరిష్కారానికి తొలిసారి పరపతి నియంత్రణ చర్యలు చేపట్టింది. దేశ విభజన సమయంలోనూ సమర్థంగా వ్యవహరించింది.

2) జాతీయీకరణ-సార్వభౌమత్వ సాధన (1948-1960): నాటి ప్రధాని నెహ్రూ ‘రిజర్వు బ్యాంకు చట్టం-1948’ (పబ్లిక్ ఓనర్‌షిప్ చట్టం) తీసుకు వచ్చి 1949, జనవరి 1న ఆర్‌బీఐని జాతీయీకరణ చేశారు. అనంతరం ‘బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949’ని అమల్లోకి తెచ్చారు. ఇది అన్ని వాణిజ్య బ్యాంకులను నియంత్రించే సర్వాధికారాలను ఆర్‌బీఐకు కల్పించింది. 1951 పంచవర్ష ప్రణాళికల నుంచి నిధుల సరఫరానూ ఆర్‌బీఐ క్రమబద్ధీకరిస్తోంది.

3) సామాజిక బ్యాంకింగ్ - హరిత విప్లవం (1961-1990):
1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 పెద్ద ప్రైవేటు బ్యాంకులను, 1980లో మరో 6 బ్యాంకులను జాతీయం చేసింది. వీటి పర్యవేక్షణలో ఆర్‌బీఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఆర్‌బీఐ మరో కొత్త విభాగాన్ని 1982లో నాబార్డుగా ఏర్పాటు చేసింది. దీని ద్వారా హరిత విప్లవం వేగంగా ఫలితాలను ఇచ్చింది.

4) ఆర్థిక సంస్కరణల యుగం (1991-2015):
1991 ఆర్థిక సంక్షోభంలో దేశం దివాలా తీసే పరిస్థితి వచ్చినప్పుడు ఆర్‌బీఐ తన వద్ద ఉన్న టన్నుల కొద్దీ బంగారాన్ని లండన్, స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి దేశ ప్రతిష్ఠను కాపాడింది. ఎఫ్‌డీఐలు దేశంలోకి సులభంగా వచ్చేలా ఎఫ్ఈఎంఏ-చట్టం 1999 ద్వారా చర్యలు తీసుకుంది. 2008లో అమెరికా సబ్‌ప్రైమ్ సంక్షోభం వల్ల ప్రపంచమంతా కుప్పకూలినప్పటికీ, ఆర్‌బీఐ విధానాలు దేశాన్ని సురక్షితంగా నిలబెట్టాయి.

పోలీసు ఉద్యోగాల స్పెషల్ - ఇండియన్ ఎకానమీ

5) డిజిటల్ విప్లవం-పారదర్శకత - సంస్కరణలు (2016-2026):
ద్రవ్యవిధాన కమిటీ(ఎంపీసీ)-2016 ఏర్పాటు ద్వారా వడ్డీరేట్ల నిర్ణయంలో పారదర్శకత పెరిగింది. నోట్ల రద్దులో 2016లో అత్యంత దృఢంగా వ్యవహరించింది. ప్రపంచంలో అతి పెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ-యూపీఐ ఆవిర్భావానికి ఆర్‌బీఐ ప్రధాన కారణం, ఈ-రూపీ ప్రవేశం కూడా ఈ బ్యాంకు ఘనతే.

ఆర్థికవృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలు:
అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, వ్యవసాయ రంగంపై అకాల వర్షాల ప్రభావం లాంటి కారణాల వల్ల ఆర్‌బీఐ ఇటీవల తన గత అంచనాల్లో కీలక సవరణలు (జూన్ 2026) చేసింది. ★ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి - 6.6% ★ వినియోగదారుల ద్రవ్యోల్బణం - 5.1% ★ కోర్ ద్రవ్యోల్బణం - 4.7%



విదేశీ పెట్టుబడులు, రూపాయి స్థిరత్వం చర్యలు:
2026 ప్రథమార్ధంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐఎస్) సుమారు రూ.2.6 లక్షల కోట్ల పెట్టుబడులను భారత్ ఈక్విటీ మార్కెట్ నుంచి ఉపసంహరించుకోవడంతో రూపాయి విలువపై ఒత్తిడి పడింది. దీనిని ఎదుర్కోడానికి ఆర్‌బీఐ పలు చర్యలను తీసుకుంది.

ఎల్‌టీసీజీ పన్ను మినహాయింపు: విదేశీ పోర్ట్ పోలియో పెట్టుబడిదారులను (ఎఫ్‌పీఐఎస్) ఆకర్షించడానికి ప్రభుత్వ బాండ్లపై వచ్చే వడ్డీపై 12.5% దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును రద్దు చేసింది.

పుల్లీ యాక్సెసబుల్ రూట్ (ఎఫ్ఏఆర్) విస్తరణ: ప్రవాస భారతీయులు, విదేశీ పెట్టుబడిదారులు 15, 30, 40 ఏళ్ల దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లలో ఎలాంటి పరిమితులు లేకుండా పెట్టుబడి పెట్టే విధంగా నిబంధనలు సడలించింది.

కరెన్సీ నిర్వహణ, డిజిటల్ విధానాలు:

ప్లాస్టిక్ నోట్ల ప్రయోగం: 2026, జులైలో ఆర్‌బీఐ కరెన్సీ మన్నికను పెంచడానికి సుమారు రూ.3,000 కోట్ల విలువైన పాలిమర్/ప్లాస్టిక్ నోట్లను మార్కెట్‌లోకి విడుదలచేసింది. పాత కాగితం నోట్లు కూడా చెలామణిలో ఉన్నాయి.

యూపీఐ నిర్వహణ: ‘యూపీఐ లావాదేవీలపై ఉచిత సేవల భారం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ మౌలిక సదుపాయాల నిర్వహణకు అయ్యే ఖర్చులను ఎవరో ఒకరు భరించాల్సిందే’ అని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

టెక్నాలజీ, సైబర్ భద్రత: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) మోసాలు, సైబర్‌దాడులు బ్యాంకింగ్ వ్యవస్థకు అతిపెద్ద ముప్పుగా మారిన నేపథ్యంలో ఆర్‌బీఐ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ నిపుణులను భారీగా నియమించుకుంటోంది. అలాగే ఆన్‌లైన్ స్కామ్‌లో డబ్బులు కోల్పోయిన బాధితులకు త్వరగా రూ.25,000 వరకు పరిహారం ఇప్పించే కొత్త మార్గదర్శకాలనూ ప్రతిపాదించింది.

ఆర్‌బీఐకు సానుకూల అంశాలు:

☛ 692.87 బిలియన్ డాలర్ల (31 జులై, 2026 నాటికి) విదేశీ మారక నిల్వలను ఆర్‌బీఐ కలిగి ఉండటం భారతదేశానికి అంతర్జాతీయ ఇబ్బందులను తట్టుకునే శక్తిని ఇస్తోంది.
☛ నామినల్ జీడీపీ కొలమానంలో భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 3.92 ట్రిలియన్ డాలర్లతో (ఏప్రిల్, 2026) ప్రపంచంలో ఆరో స్థానంలో ఉంది.
☛ కొనుగోలు శక్తి సమానత్వం (ppp) రేటింగ్స్ పద్ధతిలో ప్రపంచంలో 3వ స్థానంలో ఉంది.
☛ ఆర్‌బీఐ ప్రారంభించిన డిజిటల్ రూపాయి (e₹) పైలట్ ప్రాజెక్టును ప్రస్తుతం ఆరు మిలియన్ల మంది ఉపయోగిస్తున్నారు.
☛ 2026 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ కరెన్సీ లావాదేవీలు సగటున 20% మేర తగ్గినప్పటికీ, భారత్‌లో మాత్రం 5% మాత్రమే తగ్గి అత్యంత నిలకడైన మార్కెట్‌గా గుర్తింపు పొందింది.

ఆర్‌బీఐకు ప్రతికూల అంశాలు: ◆ వడ్డీరేట్లను పెంచి ‘కోర్ ద్రవ్యోల్బణం’ను అదుపులోకి తెచ్చినప్పటికీ వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, ఎల్-నినో ప్రభావం వల్ల పప్పుదినుసులు, కూరగాయల ధరలు అదుపుతప్పి ‘ఆహార ద్రవ్యోల్బణం’ ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ◆ పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ ఘర్షణ, చైనా-తైవాన్ ఉద్రిక్తతల వల్ల ప్రపంచ సరఫరా గొలుసులు దెబ్బతిని, ముడిచమురు ధరలు పెరిగితే భారతదేశానికి ‘దిగుమతి ద్రవ్యోల్బణం’ నష్టం చేకూరుస్తుంది. ◆ అమెరికా ఫెడరల్ రిజర్వు వైఖరి భారత్‌లో వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల వాడకం అవసరానికి మించి విపరీతంగా పెరగడం అనేది మొండి బకాయిలను పెంచవచ్చు.

రచయిత: బి. ఉపేందర్ రెడ్డి

Excretion

Multiple Choice Questions

1. Bio diesel is extracted from the latex of -
   A) Jatropha B) Acacia
   C) Pinus D) Cassia
2. Which of the following is not a metabolic waste of dead RBC.
   A) Bilirubin B) Biliverdin C) Urochrome D) CO_2
3. Primary urine is formed in..
   A) Bowman's capsule B) PCT
   C) Loop of Henle D) DCT
4. Odd one out.
   A) Kidney B) Liver
   C) Lungs D) Heart
5. The endocrine gland present on kidney is.
   A) Thyroid B) Pancreas
   C) Adrenal gland D) Pituitary
6. Assertion (A): Plants do not have Special excretory organs
   Reason (R): Plants Store waste products in different parts.
   A) Both A and R are correct
   B) A is true R is false C) A is false, R is true
   D) Both A and R are false
7. Excretion Process involves removal of.
   A) Food particles B) Metabolic waste
   C) Blood D Hormones
8. The latex of Hevea braziliensis produces.
   A) Resin B) Rubber C) Gums D) Paints
9. Which anticoagulant is added to blood during dialysis.
   A) Heparin B) Insulin
   C) Bile D) Adrenaline
10. The first Kidney transplantation was performed by.
    A) Rene Lennec B) Charles Hufnagel
    C) William Harvey D) Lavoisier
11. Peritubular capillaries are formed from.
    A) Efferent arteriole B) Afferent arteriole
    C) Renal artery D) Renal vein
12. Which of the following is not a function of kidney.
    A) Remove nitrogenous, waste
    B) Osmoregulation C) Gases exchange
    D) Maintains blood pressure

TARGET-2027 10th Class SPECIAL Biology

For more Concepts

Answers: 1-A; 2-D; 3-A; 4-D; 5-C; 6-A; 7-B; 8-B; 9-A; 10-B; 11-A; 12-C.

Writer: D. Sandhya

పైకి విసిరిన వస్తువు యథా స్థానానికి చేరితే..!

ఒక కొండను రోజంతా గట్టిగా నెడుతూ నిల్చున్నప్పటికీ భౌతిక శాస్త్ర నియమాల ప్రకారం జరిగిన పని ‘శూన్యం’. విజ్ఞాన శాస్త్రంలో పని అనేది కేవలం బలప్రయోగం మీద మాత్రమే కాకుండా, అది కలిగించే స్థానభ్రంశంపై ఆధారపడి ఉంటుంది. ధనుస్సు నుంచి దూసుకెళ్లే బాణం నుంచి నింగిలోకి ఎగిరే విమానం వరకు విశ్వంలోని ప్రతి చలనం వెనుక, ప్రతి చోట స్థితిశక్తి, గతిశక్తుల రూపంలో శక్తి నిరంతరం తన రూపాన్ని మార్చుకుంటూనే ఉంటుంది. ఒక వస్తువుపై జరిగే పని, దాని సామర్థ్య గణనలకు యాంత్రికశాస్త్రం మూల సూత్రం. బావిలో నుంచి నీళ్లు తోడటం, ఎత్తు నుంచి పడే నీరు, స్ప్రింగ్‌ను సాగదీయడం తదితర నిత్య జీవిత సంఘటనలను భౌతికశాస్త్ర సూత్రాలతో అనుసంధానించుకుంటూ చదివితే మౌలికాంశాలు సులభంగా అర్థమవుతాయి. ప్రతి సూత్రానికి ప్రమాణాలను, వాటి మధ్య సంబంధాలను తెలుసుకుని, చిన్న చిన్న లెక్కలను సాధన చేయడం ద్వారా పోటీ పరీక్షల్లో ఈ విభాగం నుంచి వచ్చే ప్రశ్నలకు వేగంగా సరైన సమాధానాలను గుర్తించవచ్చు.

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

పని-శక్తి (యాంత్రిక శాస్త్రం)

1. కింది వాటిలో వస్తువు చేసే పనికి సంబంధించి సరైన వాక్యం.
   ఎ) వస్తువు పైన బలాన్ని ప్రయోగిస్తే ఆ బల ప్రయోగ దిశలో వస్తువు కొంతదూరం కదిలితే అక్కడ పని జరిగింది అంటాం.
   బి) పని W = బలం(F) × స్థానభ్రంశం(S)
   సి) పనికి SI ప్రమాణం → న్యూటన్ – మీటర్
   డి) బలం, స్థానభ్రంశం ఒకే దిశలో ఉంటే ఆ పని ధనాత్మకం.
   1) ఎ, బి, సి, డి
   2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి
   4) ఎ, సి, డి

2. కింది వాటిలో వస్తువు చేసే పనికి సంబంధించి సరికానిది?
   1) వస్తువుపై పని చేసే బలం F, స్థానభ్రంశం (లేదా) దూరం మధ్య కొంత కోణం చేస్తే జరిగిన పని $W = FS\cos\theta$
   2) వస్తువుపై పని అనేది రుణాత్మకంగా జరిగితే $W = -FS$
   3) వస్తువు వృత్తాకార మార్గంలో తిరిగినప్పుడు అక్కడ జరిగిన పని శూన్యం.
   4) తలపై 50 కేజీల బరువును మోస్తూ నిల్చున్న వ్యక్తి చేసే పని 50 జౌల్స్.
3. తలపై బరువును మోస్తూ నేలపై సమాంతరంగా 5 మీటర్ల దూరం కదిలిన వ్యక్తి చేసే పని?
   1) 5 జౌల్స్
   2) 10 జౌల్స్
   3) 0
   4) $2\frac{1}{2}$ జౌల్స్

4. కింది వాటిలో వస్తువు సామర్థ్యానికి సంబంధించి సరికాని వాక్యాలను గుర్తించండి.
   ఎ) వస్తువు పనిచేసే రేటు సామర్థ్యం.
   బి) సామర్థ్యానికి SI ప్రమాణం- జౌల్/సెకను
   సి) 1 కిలోవాట్ = 10^5 వాట్స్
   డి) 1 అశ్వ సామర్థ్యం = 446 వాట్స్
   1) ఎ, బి 2) సి, డి
   3) బి, సి, డి 4) బి, సి
5. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.
   ఎ) జేమ్స్ వాట్ ఆవిరి యంత్రాన్ని కనుక్కున్నారు. అతడి జ్ఞాపకార్థం సామర్థ్యానికి ‘వాట్’ అనే ప్రమాణం పెట్టారు.
   బి) 1 కిలో వాట్ అనేది 1.34 అశ్వ సామర్థ్యాలకు సమానం.
   సి) తక్కువ కాలంలో ఎక్కువ పనిచేసేవాడు అధిక సామర్థ్యాన్ని కలిగి ఉంటాడు.
   డి) పైకి విసిరిన వస్తువు తిరిగి యథాస్థానానికి చేరితే జరిగిన పని శూన్యం.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి



జేమ్స్ వాట్

6. కింది వాటిలో స్థితి శక్తికి సంబంధించి సరికానిది గుర్తించండి.
   1) వస్తువుకు దాని స్థితి/ స్థానం వల్ల కలిగే శక్తి స్థితిశక్తి.
   2) (PE) స్థితిశక్తి = mgh
   3) ఇది వస్తువు ద్రవ్యరాశి, ఎత్తులపై ఆధారపడుతుంది.
   4) కర్రలను కోసే చక్రం స్థితిశక్తిని కలిగి ఉంటుంది.
7. కింది వాటిలో స్థితిశక్తి ఉపయోగం కానిది?
   ఎ) లోహ సిలిండర్‌లో నింపిన వాయువులు
   బి) వేగంగా విసిరిన బంతికి
   సి) సాగదీసిన రబ్బరుకు
   డి) దగ్గరగా నొక్కిన స్ప్రింగ్
   1) ఎ, సి 2) బి 3) సి 4) డి
8. కింది వాటిలో గతిశక్తికి సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) వస్తువు చలనం వల్ల కలిగే శక్తిని గతిశక్తి అంటారు.
   బి) గతిశక్తి (KE) = $\frac{1}{2}mv^2$
   సి) వస్తువు గతిశక్తి ఆ వస్తువు ద్రవ్యరాశి, వేగంపై ఆధారపడుతుంది.
   డి) వదిలిన బాణానికి, కదిలే వాహనానికి గతిశక్తి ఉంటుంది.
   1) ఎ, బి, సి, డి
   2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, డి

9. 20 మీ. ఎత్తున్న భవనంపై నుంచి 0.5 కేజీల బంతిని కిందకు వేశారు. అయితే బంతి నేలను తాకే ముందు దాని గతిశక్తి ఎంత?
   1) 10 జౌల్స్
   2) 100 జౌల్స్
   3) 200 జౌల్స్
   4) 20 జౌల్స్



10. 1 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు వేగాన్ని 4 మీ./సె. నుంచి 8 మీ./సె.కు పెంచుకుంది. ఆ బలంతో చేసిన పని ఎంత?
    1) –8 జౌల్స్ 2) 50 జౌల్స్
    3) –24 జౌల్స్ 4) 24 జౌల్స్
11. 40 కేజీల బరువు ఉన్న ఒక అమ్మాయి 5 మీ. ఎత్తున్న మెట్ల వరుసను 4 సెకన్లలో ఎక్కేస్తుంది. అయితే ఆ క్రమంలో ఆమె సామర్థ్యం?
    1) 200 వాట్స్
    2) 500 వాట్స్
    3) 50 వాట్స్
    4) 100 వాట్స్

12. ఒక కూలీ భూమి ఉపరితలం మీద నుంచి 12 కేజీల వస్తువును పైకి లేపి ఉపరితలం నుంచి 1.5 మీ. ఎత్తులో పెట్టాడు. అయితే అతడు చేసిన పని?
    1) 140 జౌల్స్ 2) 150 జౌల్స్
    3) –180 జౌల్స్ 4) 180 జౌల్స్
13. ఒక విమానం 4,000 మీ. దూరం ప్రయాణించినా, అది చేసిన పని 20,000 జౌల్స్. అయితే దానిపై ప్రయోగించే బలం?
    1) 5 N 2) 50 N
    3) 0.2 N 4) 10 N
14. ఒక వస్తువుపై 10N బలం పని చేస్తుంది. వస్తువు అనువర్తిత బల దిశలో 5N స్థానభ్రంశం చెందింది. అక్కడ చేసే పని?
    1) 50 N 2) –50 N
    3) 50 జౌల్స్ 4) 20 జౌల్స్
15. 10 కేజీల సూట్‌కేస్ పట్టుకుని ఒక వ్యక్తి రైల్వే ప్లాట్‌ఫాంపై నిల్చుని ఉన్నాడు. అయితే అతడు చేసే పని?
    1) 100 జౌల్స్ 2) 0
    3) 98 జౌల్స్ 4) 980 జౌల్స్

16. 4 కేజీల బరువున్న ఒక వస్తువు సెకనుకు 5 మీటర్ల వేగంతో అడ్డంగా కదులుతోంది. దాని వేగాన్ని సెకనుకు 10 మీ./సె.కు పెంచడం కోసం ఆ వస్తువుపై చేయాల్సిన మొత్తం పని ఎంత?
    1) 150 జౌల్స్ 2) 100 జౌల్స్
    3) 200 జౌల్స్ 4) 75 జౌల్స్
17. 0.1 కేజీల బరువున్న బంతిని 2 మీ. దూరం నుంచి కిందకు వదిలితే గురుత్వాకర్షణ శక్తితో చేసే పని?
    1) 1.96 జౌల్స్ 2) -1.96 జౌల్స్
    3) 0.98 జౌల్స్ 4) 9.8 జౌల్స్
18. 1 కిలోగ్రాము – మీ.^{2}/సెకను^{2} అనేది దేనికి సమానం?
    1) న్యూటన్ 2) ఎర్గ్
    3) డైన్ 4) జౌల్
19. 1 గ్రాము – సెం.మీ.^{2}/సెకను^{2} అనేది దేనికి సమానం?
    1) న్యూటన్ 2) ఎర్గ్ 3) డైన్ 4) జౌల్
20. ఒక వస్తువు చేసే పని 100 జౌల్స్ అని అంటే అర్థం?
    1) 100 N బలం ఒక వస్తువుపై పనిచేసి దాన్ని 1 సెం.మీ. దూరం కదిలించిందని అర్థం.
    2) 100 N బలం ఒక వస్తువుపై పనిచేసి దాన్ని 1 మీ. దూరం కదిలించిందని అర్థం.
    3) 50 N బలం వస్తువుపై పనిచేసి దాన్ని 2 సెం.మీ. దూరం కదిలించిందని అర్థం.
    4) 50 N బలం వస్తువుపై పనిచేసి దాన్ని 1 సెం.మీ. కదిలించిందని అర్థం.
21. కింది వాటిలో ఎప్పుడు రుణాత్మక పని జరిగింది అంటారు?
    ఎ) మెట్లు ఎక్కినప్పుడు
    బి) నీటిపై ఈదుతున్నప్పుడు
    సి) బావిలో నీరు తోడుతున్నప్పుడు
    డి) బాణం వదిలినప్పుడు
    1) ఎ, బి, సి, డి
    2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, సి, డి

22. వ్యక్తి బావిలో నీరు తోడుతున్నప్పుడు ఆ సందర్భంలో రుణాత్మక పని?
    1) వ్యక్తిపై జరుగుతుంది 2) గురుత్వాకర్షణ బలం
    3) బకెట్ బరువుపై జరుగుతుంది 4) 2, 3
23. వర్షం పడుతున్నప్పుడు పని రుణాత్మకంగా జరిగేది?
    1) ప్రవాహం ఘర్షణ 2) గురుత్వాకర్షణ బలం
    3) వర్షం సాంద్రత 4) పైవన్నీ
24. ఒక వస్తువుపై పని ధనాత్మకంగా జరుగుతున్నప్పుడు ఆ వస్తువుపై జరిగే పని దేనికి సమానమవుతుంది?
    1) గతి శక్తి 2) యాంత్రిక శక్తి
    3) స్థితి శక్తి 4) కంపన శక్తి
25. ఒక వస్తువుకు దాని ఎత్తు వల్ల కలిగే శక్తిని ఏమని పిలుస్తారు?
    1) గతిశక్తి 2) గురుత్వ స్థితిశక్తి
    3) యాంత్రిక శక్తి 4) పైవన్నీ
26. కింది వాటిలో యాంత్రిక శక్తి కలిగి ఉండే సందర్భం కానిది..
    1) గాలిలో ఎగిరే పక్షి
    2) ఆకాశంలో కదిలే మేఘాలకు
    3) ఎత్తు నుంచి కిందికి ప్రవహిస్తున్న జలపాతానికి
    4) నదిలో ప్రవహించే నీటికి
27. ఎయిర్ పోర్టు రన్‌వేపై ఆగి ఉన్న విమానానికి ఉండే శక్తి?
    1) స్థితి శక్తి 2) గతి శక్తి
    3) యాంత్రిక శక్తి 4) శూన్యం
28. చెట్టు కాయలకు ఉండే యాంత్రికశక్తి అనేది?
    1) స్థితి శక్తి
    2) గతిశక్తి
    3) స్థితిశక్తి, గతిశక్తి
    4) 0

29. పని శూన్యం అయితే బలం, స్థానభ్రంశం మధ్య కోణం?
    1) 0 2) 90° 3) 45° 4) 180°
30. 10 N బలం ఉన్న వస్తువు 5 సెకన్లలో 20 మీ. దూరం కదిలితే ఆ వస్తువు సామర్థ్యం?
    1) 200 వాట్స్ 2) 100 వాట్స్
    3) 50 వాట్స్ 4) 40 వాట్స్
31. 450 జౌల్స్ పనిచేసే ఒక మనిషి 5 నిమిషాల్లో ఆ పనిని పూర్తి చేసినా అతడి సామర్థ్యం?
    1) 3 వాట్స్ 2) 5 వాట్స్
    3) 1.5 వాట్స్ 4) 2.5 వాట్స్
32. వస్తువు మీద పని జరగాలంటే ఉండాల్సిన కనీస పరిమితులు (షరతులు)
    1) వస్తువుపై ఏదైనా కొంత బలం పనిచేయాలి.
    2) వస్తువు కచ్చితంగా స్థానభ్రంశం చెందాలి.
    3) వస్తువు అక్కడే నిశ్చలంగా ఉండాలి.
    4) 1, 2
33. 200 N బరువున్న వస్తువును ఒక వ్యక్తి 2 మీ. పైకి ఎత్తితే అక్కడ జరిగిన పని?
    1) 400 జౌల్స్ 2) 200 జౌల్స్
    3) 100 జౌల్స్ 4) 800 జౌల్స్
34. 12 కేజీల ద్రవ్యరాశి ఉన్న వస్తువు భూమి పై నుంచి కొంత ఎత్తులో ఉంది. ఆ వస్తువు స్థితిశక్తి 480 జౌల్స్ అయితే ఆ వస్తువు భూమి నుంచి ఎంత ఎత్తులో ఉంది?
    1) 12 మీ. 2) 6 మీ.
    3) 4 మీ. 4) 8 మీ.

రచయిత: ఎస్.వై. నాయుడు

సమాధానాలు

1-1; 2-4; 3-3; 4-2; 5-1; 6-4; 7-2; 8-1; 9-2; 10-3; 11-2; 12-3; 13-1; 14-3; 15-2; 16-1; 17-1; 18-4; 19-2; 20-2; 21-1; 22-1; 23-2; 24-1; 25-2; 26-4; 27-4; 28-1; 29-2; 30-4; 31-3; 32-4; 33-1; 34-3.

(c) eenadu

భూఉష్ణ శక్తి.. పర్యావరణహిత శక్తి మూలం!



భూఅంతర్భాగంలో ఉన్న వేడిని విద్యుత్ లేదా ప్రత్యక్ష ఉష్ణ వినియోగంగా మార్చే పునరుత్పాదక శక్తి వనరే భూఉష్ణ శక్తి. సౌర, పవన విద్యుత్‌లతో పోలిస్తే ఇది వాతావరణంపై ఆధారపడకుండా రోజంతా స్థిరమైన విద్యుత్‌ను అందిస్తుంది. భూమి అంతర్గత వేడి ప్రధానంగా మౌలిక ఉష్ణం, రేడియోధార్మిక క్షయం, గ్రహ పరిణామంలో నిల్వ ఉన్న శక్తి నుంచి వస్తుంది. భూఉష్ణ విద్యుచ్ఛక్తి నిలకడైన, పర్యావరణహితమైన హరిత శక్తికి నిదర్శనం. ప్రారంభంలో బావుల తవ్వకానికి ఖర్చు ఎక్కువైనప్పటికీ, నిర్మాణం పూర్తయితే సుదీర్ఘకాలం పాటు అత్యల్ప నిర్వహణ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్‌ను పొందవచ్చు. భూఉష్ణ జలాశయంలో నీటి ప్రవాహం, ఉష్ణ మార్పిడి సూత్రాలపై ఆధారపడి విద్యుత్ ఉత్పత్తి చక్రీయ వ్యవస్థలు పనిచేస్తాయి.

భూఉష్ణ శక్తి

భౌతిక మూలాలు

మౌలిక ఉష్ణం, గ్రహ పరిణామం: సుమారు 4.5 బిలియన్ సంవత్సరాల క్రితం సౌర వ్యవస్థ ఏర్పడే సమయంలో ధూళి, రాళ్లు, లోహ కణాలు పరస్పరం ఢీకొని పెద్ద ద్రవ్యరాశులుగా మారాయి. గురుత్వ సంభావ్య శక్తి, ఢీకొనడాల గతిజ శక్తి ఉష్ణంగా మారింది. భూమి ఏర్పడిన తర్వాత అంతర్గత పొరలు (భూపటలం, ప్రావారం, భూకేంద్రం) ఏర్పడ్డాయి. ఈ పరిణామంలో నిల్వ అయిన ఉష్ణం పూర్తిగా అంతరించిపోలేదు. ఇప్పటికీ భూమి నెమ్మదిగా అంతర్గత వేడిని బయటకు విడుదల చేస్తోంది.

రేడియోధార్మిక ఉష్ణ ఉత్పత్తి: యురేనియం-238, యురేనియం-235, థోరియం-232, పొటాషియం-40 లాంటి రేడియోధార్మిక మూలకాలు క్షయకరణం చెందేటప్పుడు శక్తిని విడుదల చేస్తాయి. ఈ శక్తి చివరకు పరిసర శిలల్లో ఉష్ణంగా మారుతుంది. భూపటలంలోని గ్రానైట్ లాంటి శిలల్లో ఈ ఉష్ణోత్పత్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

భూఉష్ణ వ్యవస్థ – భాగాలు:

ఉష్ణ వనరు: లోతైన వేడి శిలలు లేదా మాగ్మా సమీప ప్రాంతాలు.

జలాశయం: వేడి నీరు/ఆవిరి నిల్వ ఉండే పారగమ్యత కలిగిన శిలా మండలం.

ద్రవం, మార్గం: భూగర్భ జలం వేడిని గ్రహించి, ప్రవహించే మార్గాలు.

ఉష్ణ ప్రసారం: భూమి లోపల ఉష్ణం ప్రధానంగా వహనం, సంవహనం ద్వారా కదులుతుంది. ఘన శిలల్లో ఉష్ణోగ్రత వ్యత్యాసం వల్ల ఉష్ణ వహనం జరుగుతుంది. నీరు లేదా ఆవిరి సాంద్రత వ్యత్యాసాల వల్ల కదిలినప్పుడు ఉష్ణ సంవహనం వేగంగా వేడిని తరలిస్తుంది.

భూఉష్ణ విద్యుత్ కేంద్ర నిర్మాణం

ఉత్పత్తి బావి: భూమి ఉపరితలం నుంచి వేడి జలాశయం వరకు కొన్ని కిలోమీటర్ల లోతుకు తవ్వే ప్రత్యేక బావి. దీని ద్వారా భూగర్భంలోని వేడి నీరు లేదా ఆవిరి ఉపరితల భూభాగానికి చేరుతుంది.

పునర్నివేషణ బావి: ఉష్ణాన్ని ఉపయోగించిన తర్వాత చల్లారిన నీటిని తిరిగి భూమి అంతర్భాగంలోకి పంపే బావి. ఇది భూగర్భ ఒత్తిడిని సమతౌల్యం చేయడమే కాకుండా వనరు సుదీర్ఘకాలం నిలిచేలా చేస్తుంది.

ఉష్ణ ప్రసారం, విద్యుత్ ఉత్పత్తి

పనిచేసే మూల సూత్రం: భూఉష్ణ విద్యుత్ కేంద్రం ప్రధానంగా 'ఉష్ణగతిక శాస్త్ర సూత్రాలు', 'శక్తి నిత్యత్వ' ప్రాతిపదికగా పనిచేస్తుంది.

దీని ముఖ్య సూత్రం: భూమి అంతర్భాగంలోని ఉష్ణ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చి, దాని ద్వారా విద్యుత్ జనకాలను (Generators) తిప్పి విద్యుత్ శక్తిగా మార్చడం.

భూమి లోపలికి వెళ్లే కొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత సుమారు 25°C నుంచి 30°C వరకు పెరుగుతుంది. లోతైన వేడి శిలలు, అంతర్గత ద్రవాల నుంచి సేకరించిన ఉష్ణం నీటిని ఆవిరిగా మారుస్తుంది. ఈ అధిక పీడనం కలిగిన ఆవిరి టర్బైన్ రెక్కలను వేగంగా తిప్పడం వల్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

బాష్పీకరణ ఘటకం: భూగర్భం నుంచి వచ్చే ఉష్ణ ద్రవంలోని నీరు, ఆవిరిని వేరుచేసే పరికరం.

ఆవిరి టర్బైన్: అధిక ఉష్ణోగ్రత, పీడనం ఉన్న ఆవిరి తాకిడికి వేగంగా తిరిగే లోహపు రెక్కలు కలిగిన పరికరం. ఇది ఉష్ణ శక్తిని యాంత్రిక శక్తిగా మారుస్తుంది.

విద్యుత్ జనకం: టర్బైన్ చక్రానికి అనుసంధానించి, శాశ్వత అయస్కాంత క్షేత్రంలో కాయిల్ తిరగడం ద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే పరికరం.

సాంద్రీకరణి, శీతలీకరణ గోపురం: టర్బైన్ నుంచి బయటకు వచ్చిన ఆవిరిని మరల నీరుగా మార్చే వ్యవస్థ. ఈ ప్రక్రియ వల్ల టర్బైన్ వెనుక తక్కువ పీడనం ఏర్పడి విద్యుత్ సామర్థ్యం పెరుగుతుంది.

పనిచేసే విధానం

పోలీస్ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

భూఉష్ణ విద్యుత్ కేంద్రం పనిచేసే క్రమాన్ని నాలుగు దశలుగా వర్గీకరించవచ్చు.

ఉష్ణ సేకరణ: ఉత్పత్తి బావి ద్వారా భూమి లోతుల్లో ఉన్న వేడి శిలల సంపర్కంతో ఉష్ణాన్ని పొందిన భూగర్భ జలాలు లేదా ఆవిరి అధిక పీడనంతో పైకి ప్రవహిస్తాయి.

టర్బైన్ భ్రమణం: సేకరించిన ఆవిరిని వేరుచేసి టర్బైన్ వైపు అధిక వేగంతో పంపుతారు. ఈ ఆవిరి బలం వల్ల టర్బైన్ చక్రం అత్యంత వేగంగా తిరుగుతుంది.

విద్యుత్ జననం: టర్బైన్ షాఫ్ట్ (Shaft) విద్యుత్ జనకానికి అనుసంధానించి ఉండటం వల్ల యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది. ఈ విద్యుత్‌ను ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా గ్రిడ్‌కు సరఫరా చేస్తారు.

శీతలీకరణ, పునశ్చరణ: టర్బైన్ నుంచి విడుదలైన ఆవిరి సాంద్రీకరణి ద్వారా నీరుగా మారి, పునర్నివేషణ బావి ద్వారా తిరిగి భూమి లోపలికి వెళ్తుంది. దీంతో నిరంతర వృత్తాకార ప్రక్రియ సాగుతుంది.

విద్యుత్ ఉత్పత్తి చక్రాలు

శుష్క ఆవిరి చక్రం: దీని ఉష్ణోగ్రత స్థాయి అధికం (> 200°C)గా ఉంటుంది. ఈ చక్రం ద్వారా భూగర్భం నుంచి వచ్చే ఆవిరిని ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా టర్బైన్‌కు పంపుతారు.

క్షణిక ఆవిరి చక్రం: దీని ఉష్ణోగ్రత స్థాయి మధ్యస్థం - అధికం (> 180°C)గా ఉంటుంది. ఈ చక్రం ద్వారా అధిక పీడనంలో ఉన్న వేడి నీటిని తక్కువ పీడన పాత్రలోకి పంపి, క్షణికంగా ఆవిరిగా మార్చి టర్బైన్‌ను తిప్పుతారు.

ద్వంద్వ చక్రం: దీని ఉష్ణోగ్రత స్థాయి తక్కువ - మధ్యస్థం (70°C - 180°C)గా ఉంటుంది. భూగర్భ నీటి ఉష్ణాన్ని ఉపయోగించి తక్కువ మరిగే ఉష్ణోగ్రత ఉన్న ద్వితీయ ద్రవాన్ని ఆవిరిగా మార్చి టర్బైన్ తిప్పుతారు.

ప్రయోజనాలు, ప్రతికూలతలు

వాతావరణ మార్పులతో సంబంధం లేకుండా భూఉష్ణ శక్తి నిరంతరం పనిచేస్తుంది (Capacity Factor > 85%).

- ◆ సౌర, పవన విద్యుత్ ప్లాంట్లతో పోలిస్తే తక్కువ స్థలం సరిపోతుంది.
- ◆ పర్యావరణహిత, నిలకడైన శక్తి మూలం.
- ◆ వ్యవసాయం, గృహాలు, ఆహార శుద్ధి, పరిశ్రమల ఉష్ణ అవసరాలకు నేరుగా వాడుకోవచ్చు.

అన్వేషణ, తవ్వకం ఖర్చులు: బావులు తవ్వడానికి ముందే జలాశయ లభ్యతపై స్పష్టత లేకపోవడం ఆర్థిక ప్రమాదానికి కారణమవుతుంది.

స్థల ఆధారిత సమస్యలు: అధిక ఉష్ణోగ్రత కలిగిన వనరులు కొన్ని భౌగోళిక ప్రాంతాలకే పరిమితమయ్యాయి.

ఖనిజాలు పేరుకుపోవడం, క్షయీకరణ: భూగర్భ ద్రవాల్లో ఉండే ఖనిజాలు పైపుల్లో పేరుకుపోవడం లేదా పైపులను క్షయింపజేయడం సవాలుగా మారుతుంది.

ప్రేరిత భూకంపాలు: లోతుగా నీటిని పంపడం వల్ల చిన్నపాటి భూకంప చలనాలు వచ్చే ముప్పు ఉంది.

రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

1120 Word of the Day

Overthrow

Telugu meaning: పడగొట్టు, అధికారం నుంచి దించు

***English meaning:* As a noun -** Overthrow (ఓవర్‌త్రో) meaning is the removal of a government, ruler, or system from power, usually by force.

As a verb: To remove a government, ruler, or system from power.

Synonyms: Depose, Topple;

Antonyms: Support, Reinstate

Usage: 1. (As a Verb): The revolutionaries planned to overthrow the oppressive ruler and establish a democratic government.

2. (As a Noun): The overthrow of the dictator marked the beginning of a new political era in the country.

Current Affairs

India and Uzbekistan elevated their bilateral relations to a Comprehensive Strategic Partnership on 30 August 2026 during Prime Minister Narendra Modi's state visit to Tashkent. The two countries also set a target of USD 5 billion in annual bilateral trade by 2030 and agreed on a long-term framework for uranium supply from Uzbekistan for India's civil nuclear energy sector.

☛ Prime Minister Narendra Modi was conferred with the Oliy Darajali Do'stlik Order, which is Uzbekistan's highest state honour for foreign leaders.

NASA launched its new flagship space telescope named Nancy Grace Roman Space Telescope with a SpaceX Falcon Heavy rocket from Launch Complex 39A at NASA's Kennedy Space Center in Florida on 30 August 2026. The $4.3 billion observatory separated from the Falcon Heavy upper stage 31 minutes after liftoff and began a three-month journey to its science orbit near the Sun-Earth Lagrange Point 2, about 1 million miles from Earth.

Germany retained the FIH Men's Hockey World Cup title after a resolute 1-0 victory over Spain in the final, drawing level with Pakistan on four World Cup crowns. The result also saw Germany join Pakistan as the most successful team in Men's Hockey World Cup history.

For more Current Affairs: Scan QR code

భారతదేశ టైం జోన్ - ఇండియన్ స్టాండర్డ్ టైం (ఐఎస్‌టీ)

జనరల్ నాలెడ్జ్
స్టడీ జోన్

మన దేశంలో టైం జోన్ అనేది దేశవ్యాప్తంగా అనుసరించే ప్రామాణిక సమయాన్ని సూచిస్తుంది. భారతదేశం భౌగోళికంగా సువిశాలంగా విస్తరించి ఉంది. అయినప్పటికీ పరిపాలనా సౌలభ్యం, జాతీయ ఏకరూపకత కోసం ఒకే అధికారిక టైం జోన్‌ను అనుసరిస్తుంది. ఇది రవాణా, వ్యాపారం, సమాచార రంగాల్లో సమన్వయాన్ని కొనసాగించడానికి సాయం చేస్తుంది. ఇండియన్ స్టాండర్డ్ టైం (ఐఎస్‌టీ) అనేది భారతదేశ అధికారిక కాలమానం. 1947, సెప్టెంబరు 1న ఐఎస్‌టీని దేశమంతటా ప్రామాణిక సమయంగా ప్రవేశపెట్టారు. పోటీపరీక్షల కోణంలో దీని గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

☛ భూమిపై ఒకే ప్రామాణిక సమయాన్ని పాటించే ప్రాంతాన్ని టైం జోన్ అంటారు. ప్రామాణిక సమయం అనేది సాధారణంగా సూర్యుడికి సాపేక్షంగా ఉన్న భౌగోళిక స్థానంపై ఆధారపడి ఉంటుంది (geographical position relative to the sun). ప్రపంచం 24 టైం జోన్‌లుగా విభజితమైంది. ఇవి ప్రాథమికంగా రేఖాంశ ప్రాంతాలు. భూమి భ్రమణానికి అనుగుణంగా ప్రతి ఒక్కటి 15 డిగ్రీల రేఖాంశం వరకు విస్తరించి ఉంటుంది.

☛ ప్రపంచవ్యాప్తంగా సమయపాలన అంతా కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైం (యూటీసీ)పై ఆధారపడి ఉంటుంది. టైం జోన్‌లను యూటీసీ నుంచి వాటి గంటలు, నిమిషాల వ్యత్యాసాల ద్వారా నిర్వచిస్తారు. ఉదాహరణకు +5.30 అనేది యూటీసీ కంటే అయిదు గంటల 30 నిమిషాలు ముందు ఉంటుంది. ఈ జోన్‌లు వివిధ రేఖాంశాలు అంతటా సమయాన్ని ప్రామాణీకరించడంలో సాయం చేస్తాయి.

ఇండియన్ స్టాండర్డ్ టైం, టీ గార్డెన్ టైం, భారత్, ఇతర దేశాల మధ్య సమయ వ్యత్యాసాలతోపాటు ఏపీపీఎస్సీ గ్రూప్-I ప్రిలిమ్స్, ఏపీఎస్ఎస్‌బీ సీఎల్‌ఎల్‌ఈ, సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మినిస్టీరియల్, ఆర్ఆర్‌బీ గ్రూప్-డి, ఎస్ఎస్‌సీ తదితర పోటీపరీక్షల్లో అడిగిన 50కి పైగా ప్రశ్నలు - జవాబులతో రూపొందించిన ఈబుక్ కోసం 'ఈనాడు ఈప్రతిభ జనరల్ నాలెడ్జ్ & కరెంట్ అఫైర్స్ కోర్సు-II'కి సబ్‌స్క్రైబ్ చేసుకోండి. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

భారతదేశ చరిత్ర

ఆర్య/వేద నాగరికత

సింధూ నాగరికత తర్వాత క్రీ.పూ. 1500 - క్రీ.పూ. 600 మధ్యకాలంలో మనదేశంలో ఆర్య నాగరికత వెలసిల్లింది. దీన్ని చరిత్రకారులు భారతదేశ రెండో నాగరికత, మొదటి ఇనుపయుగ నాగరికతగా పేర్కొన్నారు. ఈ నాగరికత గురించి తెలుసుకోవడానికి వేదాలు ప్రధాన ఆధారం. కాబట్టి దీన్ని వేద నాగరికత/సంస్కృతి అంటారు. వేద నాగరికతను రెండు రకాలుగా విభజించారు. క్రీ.పూ.1500 - 1000 మధ్యకాలాన్ని 'తొలివేద కాలం' అని, క్రీ.పూ.1000 - 600 మధ్యకాలాన్ని 'మలివేద కాలం' అని అంటారు.

- ✦ ఆర్యుల జన్మస్థానం, వలసల గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. బ్రిటన్‌కు చెందిన సర్ విలియం జోన్స్ మొదటిసారి 1786లో ఆర్యుల గురించి పరిశోధనలు చేశారు.
- ✦ వీరు మధ్య ఆసియా ప్రాంతం నుంచి భారత్‌కు వలస వచ్చారని అనేక మంది చరిత్రకారులు భావిస్తున్నారు. వీరు మనదేశానికి వచ్చిన మొదటి విదేశీయులు.
- ✦ ఈ కాలంలో ప్రజలు ఆర్య భాషను ఉపయోగించారు. అందుకే దీన్ని 'ఆర్య నాగరికత'గా పేర్కొన్నారు. 'ఆర్య' అనే పదం భాషకు సంబంధించిందని, జాతికి సంబంధించింది కాదని చాలా మంది చరిత్రకారుల భావన.
- ✦ 'ఆర్య' అనే పదానికి కొంత మంది జాతి, వర్ణం, భాష అని వివిధ రకాల నిర్వచనాలు ఇచ్చారు. జర్మన్ పండితుడు 'మాక్స్ ముల్లర్' ఆర్య అనేది ఒక వర్గం మాట్లాడే భాష అని ప్రచారం చేశాడు.



పదకోశాలు

శృతి: ఒకరి నుంచి మరొకరికి మౌఖికంగా అందించే వాఙ్మయం.

స్మృతి: న్యాయశాస్త్ర గ్రంథాలు, ఇతిహాసాలు, పురాణాలు, ఉపనిషత్తులు, వేదాలు.

సభ, సమితి: తొలివేద కాలంలోని సభలు.

గోత్రం: గోశాల లేదా గోవుల మంద.

రుక్కులు: వేదాల్లో శ్లోకాలు.

దశరాజగణయుద్ధం, నాటి వివాహ పద్ధతులు, రుగ్వేదంలో పేర్కొన్న నదులు, తీర్థంకరులు - వారి చిహ్నాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Manager and Executive Posts

The Airports Authority of India (AAI) has released a notification to fill Manager and Junior Executive posts across various departments. The total number of posts is 389. The application fee is Rs.1,000. The last date for submission of online applications is 7 September 2026.

Medical Officer posts

The Indo-Tibetan Border Police (ITBP) has released a notification to fill Medical Officer cadre posts across the Central Armed Police Forces (BSF, CRPF, ITBP, SSB) and Assam Rifles, which operate under the Union Ministry of Home Affairs (MHA). The total number of posts is 282. The application fee is Rs.400. Eligible candidates can apply online before 8 September 2026.

Senior Resident Posts

The Employees' State Insurance Corporation (ESIC) Medical College & Hospital, Bihta, Patna, has released a notification to fill Senior Resident and Super Specialist Senior Resident posts on a contract basis. The total number of posts is 41. The application fee is Rs.500. The Walk-in interview dates are 2026 September 8, 9, and 10.

Did You Apply..?

Today (September 1) is the last date for the following Jobs

☛ 65 Assistant Manager Jobs in Delhi Transco Limited (DTL).
Qualifications: BE/B.Tech.

For more information and other notifications - scan QR code

Linear or Circular Race

1. In a race, Priya runs $\frac{3}{2}$ times as fast as Pooja. Priya gives Pooja a head start of 120 metres. At what distance from the starting point will Priya catch up with Pooja?
A) 300 metres B) 320 metres
C) 360 metres D) 400 metres
E) 112 metres

2. In a 1000-metre race, Amit runs $\frac{4}{3}$ times as fast as Bharat. If Amit gives Bharat a start of 200 metres, by what distance does Amit beat Bharat?
A) 30 m B) 40 m C) 50 m
D) 60 m E) 11 m

3. In an 800 m race, A reaches the finish line in 48 seconds and B reaches in 60 seconds. By what distance does A beat B?
A) 160 m B) 140 m C) 120 m
D) 180 m E) 112 m

4. In a 1500 m race, runner X beats runner Y by 150 m or 10 seconds. What is the time taken by X to complete the race?
A) 80 seconds B) 90 seconds
C) 100 seconds D) 110 seconds
E) 112 seconds

5. A and B start running at the same time from the same point on a circular track of 600 m length at speeds of 15 m/s and 20 m/s in opposite directions. After how much time will they meet at the starting point for the first time?
A) 60 seconds B) 90 seconds
C) 120 seconds D) 150 seconds
E) 112 seconds

6. Two cyclists start simultaneously from the same point on a 1.8 km circular track at speeds of 24 km/h and 36 km/h in the same direction. After how many minutes will they meet anywhere on the track for the first time? (In minutes)
A) 6 B) 7.5 C) 11 D) 12 E) 9

7. In a circular race of 1200 m, P and Q start from the same point at the same time with speeds of 18 km/h and 27 km/h respectively in opposite directions. When will they meet for the first time on the track?
A) 80 sec B) 120 sec
C) 108 sec D) 96 sec
E) 112 sec

8. Two runners A and B start simultaneously from the same point on a 1200 m circular track. A runs at a speed of 10 m/s and B runs at a speed of 8 m/s in the same direction. After how much time will they meet at the starting point for the first time? (in seconds)

Bank Exams

Quantitative Aptitude

A) 400 B) 500 C) 600
D) 720 E) 453

9. Two cars start simultaneously from the same point in the same direction on a circular track of length 3250 m at speeds of 54 km/h and 72 km/h, respectively. After how much time (in seconds) will they meet for the first time?
A) 600 B) 625 C) 650
D) 675 E) 312

10. Two racing cars start at the same time from the same point on a circular track of length 1800 m with speeds of 60 km/h and 84 km/h in opposite directions. After how many seconds will they meet each other for the first time?
A) 45 sec B) 40 sec C) 36 sec
D) 50 sec E) 12 sec

11. In a circular race of 2000 m, two athletes A and B start from the same point at the same time with speeds of 45 km/h and 63 km/h respectively. When will they meet for the first time on the track if they run in the same direction?
A) 350 sec B) 400 sec C) 450 sec
D) 500 sec E) 102 sec

12. Two runners X and Y start at the same time from the same point on a 1600 m circular track. X runs at 20 m/s and Y runs at 12 m/s in opposite directions. After how many seconds will they meet each other for the first time on the track?
A) 40 B) 50 C) 60 D) 70 E) 12

13. In a 1440 m race, runner A reaches the finish line in 48 seconds and runner B reaches the finish line in 60 seconds. By what distance does A beat B?
A) 240 m B) 264 m C) 288 m
D) 312 m E) 222 m

14. In a 1000 m race, P beats Q by 200 m and P beats R by 280 m. In the same race of 1000 m, by how many metres will Q beat R?
A) 80 B) 100 C) 120
D) 140 E) 111

15. In a race of 600 m, runner P gives runner Q a head start of 150 m. If both reach the finish line simultaneously, what is the ratio of the speed of P to the speed of Q?
A) 3 : 2 B) 1 : 3
C) 5 : 4 D) 5 : 3
E) 4 : 3

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

(c) eenadu

ఉద్యోగం.. ఉన్నత విద్య
ఏది ఎంచుకోవాలి?

గేట్ స్కోరుతో ఐఐటీల్లో ఎంటెక్ పూర్తిచేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా మంచి జాబ్‌లో చేరడం ప్రయోజనమా? లేదంటే అదే స్కోరుతో పీఎస్‌యూల్లో చేరిపోతే మేలా? ఈ రెండింటిలో ఎటువైపు మొగ్గుచూపితే భవిష్యత్తు బాగుంటుంది? - విఘ్నేష్

■ గేట్‌లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు సాధారణంగా రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి ఐఐటీ/ ఎన్ఐటీ/ ప్రముఖ విద్యాసంస్థల్లో ఎంటెక్‌లో చేరి ఉన్నత సాంకేతిక విద్యను కొనసాగించడం, రెండోది గేట్ స్కోరుతో నియామకాలు చేపట్టే ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో ఉద్యోగం పొందడం. ఈ రెండింటిలో ఏది మంచిది అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. మీరు బీటెక్‌లో చదివిన బ్రాంచ్ కూడా తెలిస్తే మెరుగైన సలహా ఇవ్వడానికి అవకాశం ఉండేది. మీ కెరియర్ లక్ష్యాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఇంజినీరింగ్‌లో చదివిన బ్రాంచ్, వచ్చిన పీఎస్‌యూ ఆఫర్ లాంటి అంశాలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

▲ త్వరగా ఉద్యోగంలో చేరి ఆర్థికంగా స్థిరపడాలనుకునే వారికి పీఎస్‌యూ మంచి ఎంపిక. ముఖ్యంగా మహారత్న, నవరత్న స్థాయి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం లభిస్తే మెరుగైన వేతనం, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, సెలవులు, ఇతర అలవెన్సులు లాంటి ప్రయోజనాలు ఉంటాయి. ఉద్యోగంలో చేరిన వెంటనే ఆదాయం ప్రారంభమవుతుంది. రెండేళ్ల ఎంటెక్ చదివిన తర్వాత ఉద్యోగం కోసం మళ్లీ ప్రయత్నించాల్సిన అవసరం కూడా ఉండదు. కుటుంబ ఆర్థిక బాధ్యతలు ఉన్నవారు లేదా స్థిరమైన కెరియర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు పీఎస్‌యూ ఆఫర్‌ను వదులుకోకుండా ఉండటం ప్రయోజనకరం.

▲ సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి ఉన్నవారు, ప్రత్యేక నైపుణ్యాలు పెంచుకోవాలనుకునే వారు ఐఐటీలో ఎంటెక్‌ను పరిశీలించవచ్చు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ, సెమీకండక్టర్స్, రోబోటిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ లాంటి రంగాల్లో స్పెషలైజేషన్ చేస్తే మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఐఐటీల్లోని పరిశోధనా వాతావరణం, ఆధునిక ప్రయోగశాలలు, అధ్యాపకుల మార్గదర్శకత్వం, పరిశ్రమలతో అనుసంధానం విద్యార్థుల నైపుణ్యాలను మరింతగా పెంచుతాయి.

▲ ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసిన తర్వాత ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి కూడా ఐఐటీ ఎంటెక్ బలమైన పునాదిని వేస్తుంది. ప్రతిభ, స్పెషలైజేషన్, సాంకేతిక నైపుణ్యాలు బలంగా ఉంటే దీర్ఘకాలంలో ప్రైవేట్ రంగంలో పీఎస్‌యూ కంటే ఎక్కువ వేతనం, వేగవంతమైన కెరియర్ వృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. అయితే, క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా అధిక వేతనం తప్పనిసరిగా వస్తుందని మాత్రం భావించకండి.

ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, ప్రభుత్వ రంగ సౌకర్యాలు ప్రధాన లక్ష్యమైతే పీఎస్‌యూ ఉద్యోగం ఉత్తమ ఎంపిక. సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, పరిశోధన, పీహెచ్‌డీ, టాప్ టెక్నాలజీ కంపెనీలు లేదా అంతర్జాతీయ కెరియర్ లక్ష్యమైతే ఐఐటీ ఎంటెక్ ప్రయోజనకరం. ముఖ్యంగా మంచి పీఎస్‌యూ ఉద్యోగం ఇప్పటికే చేతిలో ఉంటే దాన్ని వదులుకునే ముందు చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. ఏ మార్గం మంచిది అనేది కాకుండా, మీ దీర్ఘకాలిక కెరియర్ లక్ష్యానికి ఏ మార్గం సరిపోతుంది అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ప్రతిభావంతులకు ఆర్థిక ప్రోత్సాహం!

ఎంతోమంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ముందుకొస్తున్నాయి. కొన్ని సంస్థలు ఉన్నత విద్యకు, ఇంకొన్ని దివ్యాంగులకు, మరికొన్ని పాఠశాల విద్యార్థులకు.. ఆర్థిక సాయం అందిస్తూ ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా విద్యను కొనసాగించి, కెరియర్‌లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నాయి.

పీజీతో నెలకు రూ.15 వేలు

పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల చదువుకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నేషనల్ స్కాలర్‌షిప్ ఫర్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ (ఎన్ఎస్‌పీజీ) పేరిట అర్హత ఉన్నవారికి నెలకు రూ.15 వేల చొప్పున పది నెలల పాటు ఆర్థిక సాయం అందిస్తోంది.

● దేశంలోని ఏదైనా విద్యా సంస్థలో ఈ ఏడాది రెగ్యులర్ విధానంలో పీజీ చదువుతోన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు యూజీసీ తీసుకొచ్చిన పథకమిది. ఒక విద్యాసంవత్సరంలో మొత్తం గరిష్ఠంగా లక్షన్నర రూపాయల వరకు ఉపకార వేతనంగా అందుకోవచ్చు. ప్రథమ సంవత్సరంలో ప్రమాణాల మేరకు మార్కులు సాధిస్తే, రెండో ఏడాది కూడా ఆర్థిక సాయాన్ని అందుకోవచ్చు. ఇందుకోసం రెన్యువల్ చేసుకోవాలి. దేశవ్యాప్తంగా పదివేల మందికి ఈ స్కాలర్‌షిప్పులు అందిస్తారు. వీటిలో 30 శాతాన్ని అమ్మాయిలకే కేటాయించారు. వారిలోనూ సింగిల్ గర్ల్ చైల్డ్‌కి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. వీటికి దరఖాస్తుల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మొత్తాన్ని కాలేజీ ఫీజు, ఇంటర్నెట్, రవాణా, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ కొనుగోలుకు ఉపయోగించుకోవచ్చు.

అర్హతలు

ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా కోర్సుతో పాటు విద్యార్థి అకడమిక్ మెరిట్ ఆధారంగా ఈ స్కాలర్‌షిప్పులను ఇస్తారు.

- ఏదైనా సంస్థలో ఫుల్‌టైమ్ లేదా రెగ్యులర్ పీజీ మొదటి సంవత్సరం కోర్సులో ప్రవేశం పొందాలి.
- విద్యార్థికి ఇదే మొదటి పీజీ అయి ఉండాలి.
- పీజీలో చేరేనాటికి వయసు 30 సంవత్సరాల కంటే తక్కువగా ఉండాలి.

దరఖాస్తు

- అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి, వివరాలు నమోదు చేసుకోవాలి.
- నియమ నిబంధనలను పూర్తిగా చదివి టిక్ బటన్ క్లిక్ చేసి, తర్వాతి పేజీలోకి వెళ్లాలి.
- ఫోన్ నంబర్ ఇచ్చి, ఓటీపీతో ధ్రువీకరించుకోవాలి.
- ఈ-కేవైసీ పూర్తయ్యాక, ఆధార్ వెరిఫికేషన్ చేయాలి. ఆ తర్వాత సబ్మిట్ చేయాలి.
- వివరాలన్నీ సరిగ్గా ఉంటే, మీ ఫోన్ నంబర్‌కు ఓ రిఫరెన్స్ నంబర్ వస్తుంది. దాని సాయంతో స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

అవసరమైన ధ్రువపత్రాలు

ఉపకారవేతనాల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. దరఖాస్తు చేసే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు కూడా అప్‌లోడ్ చేయాలి. అప్లికేషన్‌కు ముందే వాటన్నింటినీ సిద్ధంగా ఉంచుకోవాలి.

- పదో తరగతి నుంచి మార్కుల ధ్రువపత్రాలు
- పీజీ కాలేజీ అడ్మిషన్ లెటర్
- గుర్తింపు కార్డు
- ఈ-కేవైసీ పూర్తయిన బ్యాంకు ఖాతా వివరాలు
- పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

వీరికి అవకాశం లేదు

- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చేరేనాటికి 30 ఏళ్లు దాటినవారు.
- ఇప్పటికే పీజీ చదివిన వారు.
- డిస్టెన్స్ లేదా కరస్పాండెన్స్ లేదా పార్ట్ టైమ్‌లో చదువుతోన్నవారు.
- ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతోన్న వారికి పీజీ వరకు మాత్రమే అర్హత ఉంటుంది.

దరఖాస్తు గడువు తేదీ: అక్టోబరు 31, 2026.

వెబ్‌సైట్: https://scholarships.gov.in/home

దివ్యాంగులకు ఏడాదికి రూ.లక్ష

ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన దివ్యాంగుల ఉన్నత విద్యకు కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన కొటాక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భరోసా కల్పిస్తోంది. 'కొటాక్ సురక్షా స్కాలర్‌షిప్పు' పేరిట అర్హులైన డిగ్రీ చదువుతోన్న యువతీయువకులకు కోర్సు పూర్తయ్యే వరకు ఏటా లక్ష రూపాయల చొప్పున అందించనుంది.

● దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా ఈ స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా అకడమిక్ గైడెన్స్, మెంటారింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లోనూ సాయం అందించనున్నారు.

అర్హతలు

- దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండాలి.
- ఇంటర్‌లో 50 శాతానికి పైగా మార్కులు సాధించాలి.
- విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షల్లోపు ఉండాలి.

కావాల్సిన ధ్రువపత్రాలు

- వైకల్య ధ్రువీకరణ పత్రం
- బ్యాంకు పాస్‌బుక్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- ప్రస్తుత విద్యా సంవత్సర ఫీజు వివరాలు, చెల్లించిన రసీదు
- పది, ఇంటర్ మార్కుల మెమో
- కాలేజీ ఐడీ ప్రూఫ్
- ఆధార్ కార్డు
- తల్లిదండ్రులెవరైనా చనిపోతే వారి డెత్ సర్టిఫికెట్

దరఖాస్తుకు తుది గడువు: అక్టోబరు 10, 2026.

వెబ్‌సైట్: https://www.kotakeducationfoundation.org/what-we-do/scholarship/kotak-suraksha-scholarship

పాఠశాల విద్యార్థులకు చేయూత

పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనంపై ఆసక్తి ఉన్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. తపాలా శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే 'దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన' పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ప్రతి నెలా రూ.500 చొప్పున ఏటా రూ.6 వేల స్కాలర్‌షిప్పు అందించనున్నారు.

● చిన్న వయసు నుంచే పాఠశాల విద్యార్థుల్లో పోస్టల్ స్టాంపులపైన అవగాహన తీసుకురావడంతో పాటు చరిత్ర, క్రీడలు, సమకాలీన అంశాల్లో వారిలో జిజ్ఞాసను పెంపొందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. తపాలా బిళ్లల సేకరణ, అధ్యయనాన్ని పిల్లలకు ఓ హాబీలా చేయడమూ ఇందులో భాగమే. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రకటన ఇటీవల వెలువడింది. విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా విద్యాశాఖ/తపాలా శాఖ అధికారుల సూచనల ప్రకారం దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి.

ఎంపిక

ఈ స్కాలర్‌షిప్పునకు విద్యార్థుల ఎంపికను రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో వర్తమాన వ్యవహారాలు, చరిత్ర, జాగ్రఫీ, సైన్స్, క్రీడలు తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత మార్కులు సాధించిన వాళ్లు పోస్టల్ స్టాంపులకు సంబంధించిన ప్రాజెక్టు చేయాలి. ఇందులో ప్రతిభ ఆధారంగా ప్రతి సర్కిల్‌కి 40 మందిని ఎంపిక చేసి, దేశవ్యాప్తంగా మొత్తం 920 మందికి స్కాలర్‌షిప్పులు అందజేయనున్నారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాల్లో మూడు నెలలకు రూ.1500 చొప్పున జమ చేస్తారు.

అర్హతలు

- విద్యార్థి కచ్చితంగా 6, 7, 8 లేదా 9వ తరగతి చదువుతుండాలి.
- స్కూల్‌లో తపాలా అధ్యయనానికి సంబంధించిన క్లబ్‌లో విద్యార్థికి సభ్యత్వం ఉండాలి. ఒకవేళ స్కూల్‌లో తపాలా క్లబ్ లేకపోతే, విద్యార్థికి పోస్టల్ బ్యాంకులో అకౌంట్ అయినా ఉండాలి.
- గతేడాది వార్షిక పరీక్షల్లో 60 శాతం మార్కులు సాధించాలి. (ఎస్సీ, ఎస్టీలకు 5 శాతం మినహాయింపు ఉంటుంది).

దరఖాస్తుకు తుది గడువు: సెప్టెంబరు 16, 2026

పరీక్ష తేదీ: సెప్టెంబరు 30, 2026

వెబ్‌సైట్: www.indiapost.gov.in/

వంద మందికి 'ఐఐసీటీ-నెట్‌ఫ్లిక్స్' సాయం

మన దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న క్రియేటివ్ ఫీల్డ్‌కి అవసరమైన కొత్త నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), నెట్‌ఫ్లిక్స్ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ రెండూ కలిసి క్రియేటివ్ రంగంలో ఉన్న వంద మంది విద్యార్థులు లేదా వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి స్కాలర్‌షిప్పులు ఇవ్వనున్నాయి. ఐఐసీటీ అందించే ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సులైన వర్చువల్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కంటెంట్ క్రియేషన్, మీడియాటెక్ వర్క్‌ఫ్లో, ఆర్ట్ ఆఫ్ క్యారెక్టర్ యానిమేషన్, ఈ-స్పోర్ట్స్, గేమింగ్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఏడాది డిప్లొమా కోర్సులైన ఇంటరాక్టివ్ కామిక్స్ అండ్ సీక్వెన్షియల్ ఆర్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ మాస్టరీలు చదివే విద్యార్థులకు ఫీజులో గరిష్ఠంగా 80 శాతం వరకు ఆర్థిక సాయం అందనుంది. ఉపకార వేతనాలకు సంబంధించిన మరిన్ని వివరాలను వెబ్‌సైట్ www.iict.org/ లో పొందవచ్చు.

కొంకణ్ రైల్వేలో

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ (కేఆర్‌సీఎల్), తాత్కాలిక ప్రాతిపదికన 30 ఆఫీస్ బాయ్/ హెల్పర్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: పదో తరగతి, ఆఫీస్ విధులు, హౌస్‌కీపింగ్ నైపుణ్యాలు అవసరం.

వయసు: 50 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.25,700.

ఎంపిక: వాక్-ఇన్ ఇంటర్వ్యూతో.

ఇంటర్వ్యూ తేదీ: 10.09.2026.

వేదిక: కజాలి క్లబ్, ఆర్ఆర్ఎం ఆఫీస్ దగ్గర, రత్నగిరి, మహారాష్ట్ర.

వెబ్‌సైట్: https://konkanrailway.com/en/vacancy

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఐఐటీ, వడోదరా.. 25 అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ.

వేతన శ్రేణి: రూ.70,900-98,200.

ఎంపిక: రాత పరీక్ష/ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.09.2026.

హార్డ్ కాపీ పంపడానికి చివరి తేదీ: 25.09.2026.

వెబ్‌సైట్: www.iiitvadodara.ac.in/

యంగ్ ప్రొఫెషనల్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ రిసెర్చ్ (ఎన్ఐహెచ్ఆర్), గోరఖ్‌పుర్.. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- కన్సల్టెంట్ (అడ్మినిస్ట్రేటివ్): 01
- యంగ్ ప్రొఫెషనల్-2: 03

అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ/ పీజీ/ బీఏఎంఎస్/ బీఎస్ఎంఎస్/ ఎండీతో పాటు ఉద్యోగానుభవం.

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు.

వేతనం: నెలకు రూ.42,000.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఇంటర్వ్యూ తేదీలు: 11.09.2026 నుంచి 16.09.2026 వరకు.

వేదిక: ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ రిసెర్చ్, బీఆర్‌డీ మెడికల్ కాలేజీ క్యాంపస్, గోరఖ్‌పుర్, ఉత్తర్‌ప్రదేశ్, 273013.

వెబ్‌సైట్: https://www.icmr.gov.in/employment-opportunities

ప్రొఫెసర్లు

సంజయ్ గాంధీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌జీపీజీఐఎంఎస్), లఖ్‌నవూ.. అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ ప్రొఫెసర్: 44
- అసోసియేట్ ప్రొఫెసర్: 16
- ప్రొఫెసర్: 10

అర్హత: ఎంబీబీఎస్ తర్వాత సంబంధిత విభాగాల్లో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీతో పాటు కనీసం మూడేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500- 1,67,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300-2,09,200, ప్రొఫెసర్‌కు రూ.1,68,900-2,20,400.

ఎంపిక: దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలతో.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.09.2026.

చిరునామా: ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, సంజయ్ గాంధీ పోస్టుగ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రాయ్‌బరేలి రోడ్, లఖ్‌నవూ, ఉత్తర్‌ప్రదేశ్.

వెబ్‌సైట్: https://sgpgims.org.in/

రిసెర్చ్ అసిస్టెంట్లు

బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ), వారణాసి.. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- టెక్నికల్ అసిస్టెంట్: 01
- జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01
- సైంటిఫిక్ అసిస్టెంట్: 01
- ఫీల్డ్ అసిస్టెంట్: 03

అర్హత: సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో డిప్లొమా/ డిగ్రీ/ ఎమ్మెస్సీతో పాటు నెట్/ గేట్ స్కోరు ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

స్టైపెండ్: నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.27,000, జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.18,000, ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.10,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో. **ఈమెయిల్ ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ:** 17.09.2026.

ఈమెయిల్: aecllabkr@gmail.com

వెబ్‌సైట్: https://www.bhu.ac.in/site/tempvacancy/1_2_16

ఇస్రోలో సైంటిస్టులు

ఇస్రో సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఐసీఆర్‌బీ).. 175 సైంటిస్టు/ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిస్ట్/ ఇంజినీర్ 'ఎస్సీ' (ఎలక్ట్రానిక్స్): 100
- సైంటిస్ట్/ ఇంజినీర్ 'ఎస్సీ' (మెకానికల్): 53
- సైంటిస్ట్/ ఇంజినీర్ 'ఎస్సీ' (కంప్యూటర్ సైన్స్): 22

అర్హత: సంబంధిత విభాగాల్లో కనీసం 65 శాతం మార్కులతో బీఈ/ బీటెక్.

వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 28 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.56,100.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.09.2026.

వెబ్‌సైట్: www.isro.gov.in

ఎన్ఎస్‌పీసీఎల్‌లో

ఎన్టీపీసీ - సెయిల్ పవర్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఎస్‌పీసీఎల్), దిల్లీ.. 17 ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీచేయనుంది. వీటికి డిప్లొమా/ డిగ్రీ/ పీజీతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

మొత్తం ఉద్యోగాల్లో ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న కొన్ని పోస్టులు

పోస్టు: సీనియర్ అసిస్టెంట్ ఆఫీసర్ (హెచ్ఆర్)

ఖాళీలు: 04

అర్హత: డిగ్రీ, పీజీ/ పీజీ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (హ్యూమన్ రిసోర్స్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ పర్సనల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌తో). విద్యార్హతల డిగ్రీలను 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి. సంబంధిత రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

పోస్టు: సీనియర్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)

ఖాళీలు: 04

అర్హత: ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌తో బీఈ/ బీటెక్. సంబంధిత రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

పోస్టు: సీనియర్ అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)

ఖాళీలు: 04

అర్హత: మెకానికల్/ ప్రొడక్షన్‌తో బీఈ/ బీటెక్. సంబంధిత రంగంలో రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభతో ఎంపిక చేస్తారు. ప్రశ్నాపత్రంలో రెండు భాగాలు ఉంటాయి. మొదటి భాగంలో సబ్జెక్ట్ నాలెడ్జ్ టెస్టు (ఎస్‌కేటీ), రెండో భాగంలో ఎగ్జిక్యూటివ్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఈఏటీ) ఉంటాయి. ఈ రెండింటిలోనూ అర్హత సాధించిన వారిని పర్సనల్ ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్టు చేస్తారు. రాత పరీక్షకు 85 శాతం, ఇంటర్వ్యూకు 15 శాతం వెయిటేజీ ఉంది. ఎంపికైనవారికి వేతన శ్రేణి రూ.40,000 - 1,40,000 ప్రకారం జీతం చెల్లిస్తారు. ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి.

వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 32 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ-ఎన్‌సీఎల్‌లకు రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 07.09.2026 నుంచి 22.09.2026 వరకు స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: https://www.nspcl.co.in/page/10

బీఈఎంఎల్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్‌లు

బీఈఎంఎల్ లిమిటెడ్.. నిర్ణీత కాలానికి 10 నాన్- ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీచేయనుంది. వీటికి ఇంజినీరింగ్ డిప్లొమాతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్షతో నియామకాలుంటాయి.

పరీక్ష ఆన్‌లైన్‌లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. ప్రశ్నాపత్రంలో మూడు భాగాలుంటాయి. పార్ట్-1లో 20 జనరల్ అవేర్‌నెస్ ప్రశ్నలు, పార్ట్-2లో ఇంగ్లిష్ అండ్ రీజనింగ్ 20 ప్రశ్నలు, పార్ట్-3లో సబ్జెక్టు సంబంధిత 60 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు ఉండవు. వ్యవధి రెండు గంటలు.

- రాత పరీక్ష తేదీ, సమయం, వేదికల సమాచారాన్ని అభ్యర్థుల ఈమెయిల్‌కు తెలియజేస్తారు. సంస్థ వెబ్‌సైట్‌లోనూ ప్రకటిస్తారు.
- పరీక్షలో అర్హత కోసం అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులు 60 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 55 శాతం మార్కులు సాధించాలి. వీరిని ధ్రువపత్రాల పరిశీలనకు షార్ట్‌లిస్ట్ చేస్తారు. తేదీ, వివరాల సమాచారాన్ని అభ్యర్థులకు ఈమెయిల్ చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలనకు అర్హులైన వారికి సెకండ్ క్లాస్ రైలు/ బస్సు ఛార్జీలు చెల్లిస్తారు.
- ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం కేటగిరీలవారీగా తుది నియామకాలుంటాయి.

ఎంపికైనవారికి నెలకు రూ.23,910 మూల వేతనం చెల్లిస్తారు. దీనికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, పెర్క్స్, పీఎఫ్, గ్రాట్యుటీ, బోనస్, పనితీరు ఆధారంగా మూల వేతనంపై 3 శాతం వార్షిక పెరుగుదల మొదలైన ప్రోత్సాహకాలుంటాయి.

వివరాలు

అర్హత: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ మెకట్రానిక్స్‌తో మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమాను 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి.

వయసు: జనరల్, ఈడబ్ల్యూఎస్‌లకు 29 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు ఉండదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2026

వెబ్‌సైట్: http://www.bemlindia.in/

(c) eenadu

మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి, భారత రత్న ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కూడా సీఎంతోపాటు ప్రణబ్‌కు నివాళులర్పించారు.

విద్యార్థుల లేఖలను స్వీకరించండి

సీఎంకు రామచందర్‌రావు బహిరంగ లేఖ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యార్థులు లేఖలు రాశారని, ఆ లేఖలను స్వీకరించేందుకు ముఖ్యమంత్రి సమయం ఇవ్వాలని కోరుతూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు సోమవారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, యువ మోర్చా నేతృత్వంలో ఇటీవల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరాటం సాగించామని, ఈ క్రమంలో కళాశాలల్లో విద్యార్థులు సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేఖలు రాసి సంతకాలు చేశారన్నారు. వాటిని అందజేసేందుకు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు యువ మోర్చా నేతలు కలిసి స్వయంగా లేఖలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని రామచందర్‌రావు ఈ లేఖలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది: కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను వారం రోజులపాటు ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. ఆయన సోమవారం తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా హామీలపై ప్రభుత్వం నోరు మెదపడం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై సమయం దొరికినప్పుడల్లా దాడి చేస్తున్నారు' అని మండిపడ్డారు.

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు భాజపా కక్షపూరిత వైఖరికి నిదర్శనం

మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: దళితులపై వివక్షకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇది భాజపా కక్షపూరిత, అహంకార, నిరంకుశ వైఖరికి నిదర్శనమని సోమవారం వారు వేర్వేరు ప్రకటనల్లో మండిపడ్డారు. 'ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ ప్రశ్నిస్తే, సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా రాహుల్‌పైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరం' అని వారు పేర్కొన్నారు.

టిమ్స్ ఆసుపత్రులకు మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: రోడ్లు, భవనాలశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి భవనాలకు తెలంగాణ మహనీయుల పేర్లు పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం రోజున... అల్వాల్ టిమ్స్‌కు టి.అంజయ్య, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండాలక్ష్మణ్ బాపూజీ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ప్రొఫెసర్ జయశంకర్‌ల పేర్లు పెట్టాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) పరిధిలో పది, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి గడువును సెప్టెంబరు 15వ తేదీ వరకు పొడిగించినట్లు టాస్ డైరెక్టర్ కందిమళ్ల లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటించిన గడువు ఆగస్టు 31వ తేదీతో ముగిసింది.

ఇంటర్ ప్రవేశాల గడువు 7 వరకు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని రకాల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఈనెల 7 వరకు గడువు పొడిగించినట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. ఇదే చివరి అవకాశమని, ఇక పొడిగింపు ఉండదని పేర్కొన్నారు.

సాయంత్రం బీటెక్‌లో ప్రవేశానికి 20న ప్రవేశ పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి వివిధ ఉద్యోగులు చేస్తున్నవారికి సాయంత్రం బీటెక్‌లో చేరేందుకు సెప్టెంబరు 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆలస్య రుసుంతో 12వ తేదీ వరకు గడువు ఉందని ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్, ఈసెట్(వర్కింగ్ ప్రొఫెషనల్స్) కన్వీనర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు మొత్తం 14 కళాశాలల్లో సాయంత్రం బీటెక్ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఏడు రకాల కోర్సుల్లో సీట్లకు ఇప్పటివరకు 304 మంది దరఖాస్తు చేశారని చెప్పారు.



బాధ వేరు.. ఆందోళన వేరు

బాధ, ఆందోళన.. వీటి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంటుంది. ఒక విషయం గురించి మీరు ఆందోళన చెందుతున్నట్లయితే.. దాని విషయంలో మీరు ఏదో ఒకటి చేయగలరన్నమాట! బాధ మాత్రం.. ఆ విషయంలో మిమ్మల్ని మీరు పూర్తి నిస్సహాయులుగా భావించినప్పుడు వస్తుంది. కాబట్టి దేని గురించీ బాధపడకండి!

– షేన్ పారిష్, రచయిత

కృష్ణాజలాల దోపిడీపై సీఎం మౌనమెందుకు?

- మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్న

ఈనాడు, హైదరాబాద్- న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్: వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని భారాస శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది తెలంగాణ రైతాంగానికి చేస్తున్న తీరని ద్రోహమని పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా సోమవారం హరీశ్‌రావు ఈ మేరకు విమర్శలు గుప్పించారు. 'ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం మన నీటి హక్కులపై దాడి చేస్తోంది. కృష్ణాబేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టు ఎండిపోతుంటే.. బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించి కేఆర్ఎంబీపై ఒత్తిడి తేవాలి. తెలంగాణలోని కృష్ణాబేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలి. అలాగే రాష్ట్రంలో ఆడబిడ్డల భద్రత రోజురోజుకూ ప్రశ్నార్థకమవుతోంది. రంగారెడ్డి జిల్లాలో నర్సు హత్యోదంతం కలచివేసింది. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణ హత్యకు గురైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి' అని హరీశ్‌రావు విమర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలను కుదించే కుట్ర

రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'భారాస పాలనలో 'మన ఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ సర్కారు మూడేళ్లలో ఒక్క తరగతి గది అయినా కొత్తగా నిర్మించిందా? ఒకవైపు డీఎస్సీ నిర్వహించడం లేదు.. మరోవైపు విద్యా వాలంటీర్లనూ నియమించడం లేదు. స్కావెంజర్లకు వేతనాలు సరిగా రావడం లేదు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వడానికి ముప్పుతిప్పలు పెడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. గుడ్డు ధర రూ.8 ఉంటే ప్రభుత్వం రూ.4 ఇస్తే పిల్లలకు ఎలా వండి పెడతారు? అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలన్నింటిపై మాట్లాడి ప్రభుత్వం పరిష్కరించేలా చూస్తాం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై రేపు భారాస ఛార్జిషీట్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై భారాస ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో సెప్టెంబరు 2న ఉదయం 11 గంటలకు ఛార్జిషీట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పాల్గొంటారు. 'అలాగే పార్టీ గతంలోనే ఇచ్చిన పిలుపుమేరకు.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలను మోసం చేసిన తీరుపై భారాస నేతలు ధర్నాలు నిర్వహిస్తారు. అలాగే బాకీకార్డుల పంపిణీ కార్యక్రమం కూడా రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగుతుంది' అని భారాస సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఉదయ్‌కృష్ణారెడ్డి పిటిషన్‌పై నేడు విచారణ

ఈనాడు, హైదరాబాద్: పొటెన్సీ పరీక్ష నిర్వహణకు సంబంధించి.. అత్యాచార ఆరోపణలతో సస్పెండ్ అయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం.ఉదయ్‌కృష్ణారెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. అప్పటివరకు ఎలాంటి పరీక్షలు నిర్వహించబోమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు ఇచ్చిన హామీని నమోదు చేసింది. పొటెన్సీ పరీక్షను నిర్వహించడానికి కింది కోర్టు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ ఉదయ్‌కృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ కింది కోర్టు ఉత్తర్వులు చట్టవిరుద్ధమన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ దర్యాప్తులో భాగంగానే పరీక్షలు ఉంటాయన్నారు.

సుమంత్ పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరణ

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై నమోదైన కేసులో కఠిన చర్యలు చేపట్టరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. వ్యాపారవేత్తపై దాడిచేసి రూ.10 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సుమంత్ దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాసరావు సోమవారం విచారణ చేపట్టారు. ఇరువైపుల వాదనలు విన్న తర్వాత... పూర్తి వివరాలు సమర్పించడానికి గడువు కావాలని ఏపీపీ వీరమల్ల జితేందర్‌రావు కోరడంతో న్యాయమూర్తి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

జపాన్‌లో తెలంగాణ నర్సులతో మంత్రి వివేక్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ యువతకు జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇచ్చి ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జపాన్‌లో పనిచేస్తున్న తెలంగాణ నర్సులతో ఆయన సమావేశమయ్యారు. అక్కడి భాష నేర్చుకున్న నర్సులకు భారీగా ఉద్యోగ అవకాశాలున్నాయని మంత్రి పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం తొలిబ్యాచ్ కింద జపాన్ వెళ్లిన నర్సులు అక్కడి పనివాతావరణం, ఉద్యోగంపై సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై ప్రభుత్వ అప్పీలుపై నేడు విచారణ

రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టనుంది. ఈ అప్పీలుపై రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చిన హైకోర్టు నంబరు కేటాయించాలని ఆదేశాలు జారీచేసింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీచేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలుచేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అధికరణ 162 కింద ఇవేకాకుండా మరెన్నో పథకాలను అమలుచేస్తూ ఉండవచ్చని, దీంతోపాటు అధికరణ 15(3) కింద మహిళల సంక్షేమానికి పథకాలను అమలు చేయడానికి అవకాశం ఉందని పేర్కొంది. ఈ అధికరణల కింద ప్రభుత్వానికి వచ్చిన అధికారాన్ని పరిశీలించాల్సి ఉందని, దీనిపై మంగళవారం విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది.

పుణె మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం

పలు రైళ్ల దారిమళ్లింపు, రీషెడ్యూల్

ఈనాడు, హైదరాబాద్: పుణె మార్గంలో పలు రైళ్లను దారి మళ్లిస్తున్నారు. పుణె-హడప్సర్ యార్డులలో 3వ రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి అత్యంత కీలకమైన నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చేపట్టనుండటంతో ఆ ప్రభావం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లపై పడనుంది. ఈ నేపథ్యంలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణించే పలు సూపర్ ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారిమళ్లించినట్టు, మరికొన్ని సర్వీసులను రీషెడ్యూల్ చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

దారి మళ్లించిన ముఖ్యమైన రైళ్లు..

✦ ముంబయి ఎల్‌టీటీ-కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్ 17222): సెప్టెంబరు 20న ముంబయిలో బయలుదేరాల్సిన ఈ రైలును పుణె, సతారా, మిరాజ్ జంక్షన్, పండర్‌పూర్, కురుదువాడి, సోలాపూర్ మీదుగా మళ్లించారు.

✦ సికింద్రాబాద్-రాజ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ (22718): అక్టోబరు 3న నడిచే ఈ రైలు సోలాపూర్, కురుదువాడి, మిరాజ్‌జంక్షన్, సతారా, పుణె మీదుగా ప్రయాణిస్తుంది.

✦ ముంబయి ఎల్‌టీటీ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ (18520): అక్టోబరు 4న ప్రయాణించే ఈ సర్వీసును కల్యాణ్, ఇగత్‌పురి, మన్మాడ్, అహిల్యానగర్, దౌండ్ మీదుగా నడుపుతారు.

✦ విశాఖపట్నం-ముంబయి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519): అక్టోబరు 2న వైజాగ్ నుంచి బయలుదేరే ఈ రైలు దౌండ్, అహిల్యానగర్, ఇగత్‌పురి, కల్యాణ్ మీదుగా ముంబయి చేరుకుంటుంది.

✦ ముంబయి సీఎస్ఎంటీ-భువనేశ్వర్ న్యూఎక్స్‌ప్రెస్ (11019): సెప్టెంబరు 20న ప్రయాణించే ఈ సర్వీసును పుణె, సతారా, మిరాజ్‌జంక్షన్, పండర్‌పూర్, కురుదువాడి, సోలాపూర్ మీదుగా దారిమళ్లించారు.

రైళ్ల రీషెడ్యూల్ వివరాలు..

నిర్మాణపనుల కారణంగా ముంబయి నుంచి వచ్చే కొన్ని కీలక సర్వీసులు ఆలస్యంగా ప్రారంభంకానున్నాయి.

✦ ముంబయి సీఎస్ఎంటీ-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (22732): సెప్టెంబరు 20న ముంబయిలో మధ్యాహ్నం 2.10గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు 2గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10గంటలకు బయలుదేరుతుంది.

✦ ముంబయి ఎల్‌టీటీ-కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్ (17222): అక్టోబరు 4న ముంబయిలో మధ్యాహ్నం 1.15గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు 2గంటల ఆలస్యంతో మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరుతుంది.

పాక్షిక రద్దు/గమ్యస్థానాల మార్పు..

✦ కాజీపేట హడప్సర్ ఎక్స్‌ప్రెస్ (17014) సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 1 మధ్య వివిధ తేదీల్లో హడప్సర్ వరకు రాకుండా దౌండ్ స్టేషన్ వరకే నడుస్తుంది. అక్టోబరు 3 సర్వీసును కురుదువాడి స్టేషన్‌వద్దే నిలిపివేస్తారు.

✦ తిరుగు ప్రయాణంలో హడప్సర్-కాజీపేట ఎక్స్‌ప్రెస్ (17013) సెప్టెంబరు 20 నుంచి అక్టోబరు 2 మధ్య ఆయా తేదీల్లో హడప్సర్‌కు బదులుగా దౌండ్ నుంచే ప్రారంభమవుతుంది. అక్టోబరు 4న ఈ రైలు కురుదువాడి స్టేషన్ నుంచి కాజీపేటకు బయలుదేరుతుంది.

ఖరీఫ్‌లో 19% తగ్గిన సాగు విస్తీర్ణం

- వరి విస్తీర్ణంలో 14.36% మేర తరుగు
- తెలంగాణలో 3.29 లక్షల హెక్టార్లలో తగ్గుదల.. పత్తి 1.32లక్షల హెక్టార్ల మేర పెరుగుదల

ఈనాడు, దిల్లీ: దేశంలో 2026-27 ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు 28వ తేదీ నాటికి సాగు విస్తీర్ణం 18.91% తగ్గినట్లు కేంద్ర వ్యవసాయశాఖ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందులో అత్యధికంగా వరిసాగు విస్తీర్ణం 14.36% తగ్గింది. తృణధాన్యాల సాగు 4.21%, నూనెగింజల సాగు 1%, చెరకు సాగు 0.41%, పత్తిసాగు 0.43% మేర తగ్గింది. పప్పుదినుసుల సాగుమాత్రం 1.39% పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి అన్ని పంటలూ కలిపి 1,090.01 లక్షల హెక్టార్లలో సాగుకాగా, ఈ ఏడాది అది 1,071.10 లక్షల హెక్టార్లకు తగ్గింది. వరిసాగు 428.46 లక్షల హెక్టార్ల నుంచి 414.10 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది. ఇందులో కర్ణాటకలో 3.61లక్షల హెక్టార్లు, తెలంగాణలో 3.29 లక్షలు, ఝార్ఖండ్‌లో 1.82 లక్షల హెక్టార్ల మేర తగ్గినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. పప్పుగింజల సాగు యూపీలో 3.97 లక్షల హెక్టార్లు, ఝార్ఖండ్‌లో 93 వేలు, తెలంగాణలో 88 వేలు, రాజస్థాన్‌లో 57వేలు, ఆంధ్రప్రదేశ్‌లో 51వేల హెక్టార్ల మేర పెరిగినట్లు తెలిపింది. చిరుధాన్యాల సాగు కర్ణాటకలో 7.16 లక్షల హెక్టార్లు, మహారాష్ట్రలో 2.41 లక్షలు, హరియాణాలో 77వేలు, ఏపీలో 60వేల హెక్టార్ల మేర తగ్గినట్లు పేర్కొంది. పత్తిసాగు తెలంగాణలో 1.32 లక్షల హెక్టార్ల మేర పెరిగినట్లు తెలిపింది. ఈ నెల 27వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు రిజర్వాయర్లలో సాధారణంకంటే 14.44%, తెలంగాణలోని 8 రిజర్వాయర్లలో 41.56% తక్కువ నీటి నిల్వలున్నట్లు ప్రకటించింది.

ఆగస్టు 27వ తేదీ నాటికి ఏపీలోని వివిధ రిజర్వాయర్ల నీటి నిల్వ పరిస్థితి (ఎఫ్ఆర్ఎల్‌లో%)

రిజర్వాయర్	ఈ ఏడాది	గత ఏడాది	సాధారణ నిల్వ
శ్రీశైలం	73.99	95.26	77.79
సోమశిల	17.90	73.09	43.64
ఏలేరు	19.88	41.42	37.48
కండలేరు	24.67	46.24	23.43
డొంకరాయి	83.30	85.13	0.00
పులిచింతల	40.69	60.03	57.82
బ్రహ్మంసాగర్	42.21	45.14	25.54
తెలంగాణలో			
నాగార్జునసాగర్	27.74	94.95	67.72
శ్రీరాంసాగర్	55.05	98.56	78.03
దిగువమానేరు	49.82	50.79	58.85
నిజాంసాగర్	77.67	94.10	40.44
సింగూరు	15.82	62.01	49.08
జూరాల	92.26	80.53	76.51
మూసీ	62.60	90.82	70.52
కడ్డం	72.24	97.50	85.60



కానిస్టేబుల్ తండ్రి యాదయ్యకు చెక్కు అందిస్తున్న డీజీపీ, ఎస్బీఐ అధికారులు

ప్రమాదాల్లో మరణించిన కానిస్టేబుళ్లకు బీమా చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: వివిధ ప్రమాదాల్లో మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్లకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున వారి కుటుంబాలకు డీజీపీ సీవీ ఆనంద్ బీమా సొమ్ము అందజేశారు. 2018 బ్యాచ్‌కి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తంగి శ్రీనివాస్ 2025లో, నల్గొండ జిల్లా కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 2004 బ్యాచ్‌కి చెందిన హెడ్ కానిస్టేబుల్ బొల్లేపల్లి సైదులు 2025లో, వరంగల్‌కు చెందిన మరో కానిస్టేబుల్ వెంకటరెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరందరికీ ఎస్బీఐలో బీమా ఖాతా ఉండటంతో ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున బీమా అందింది. సోమవారం డీజీపీ కార్యాలయంలో ముత్తంగి శ్రీనివాస్ తండ్రి యాదయ్యకు డీజీపీ రూ.కోటి చెక్ అందించారు. మిగతా ఇద్దరు కానిస్టేబుళ్ల కుటుంబాలకు కూడా రూ.కోటి చొప్పున చెక్కులు ఇచ్చారు.

మండల స్థాయి ప్రజావాణికి 3,319 అర్జీలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణిలో 3,319 అర్జీలు వచ్చాయి. 554 మండలాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవోలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. వీటిల్లో ఒక్కో జిల్లాలో ప్రజలు సగటున 107 దరఖాస్తులు ఇచ్చారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 406 అర్జీలు సమర్పించారు.

7.8% వృద్ధి రేటు నమోదు కావడం హర్షణీయం: కిషన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: భారత్ సాధిస్తున్న వృద్ధిరేటు.. ప్రధాని మోదీ పాలనపై ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2026-27 తొలి త్రైమాసికంలో 7.8% వృద్ధి రేటు నమోదు కావడం భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను మరోసారి చాటిచెప్పిందని హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న మోదీ సంకల్పానికి ఇది నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మీ వీడ్కోలుతో ఫుట్‌బాల్ ఆట మునుపటిలా ఉండదు!

మెస్సీ రిటైర్మెంట్‌పై సీఎం రేవంత్ పోస్టు

మెస్సీతో ఉప్పల్ స్టేడియంలో పాల్గొన్న ఫొటోను పంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ ఆటకు వీడ్కోలు పలికిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనతో గడిపిన అనుభవాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 'ప్రియమైన మెస్సీ. మీరు ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఎంతగానో అలరించారు. ఉత్సాహపరిచారు. అందరిలో స్ఫూర్తిని నింపారు. హైదరాబాద్‌లో మీతో కలిసి ఫుట్‌బాల్ మైదానంలో కాసేపు గడపడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం(గోట్) అయిన మీరు లేని ఫుట్‌బాల్ ఆట ఇకపై మునుపటిలా ఉండదు. మీ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలి' అని సీఎం పేర్కొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా శిక్షణ, డిజిటల్ గ్రంథాలయాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దివ్యాంగుల పాఠశాలల్లో అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, మరుగుదొడ్లు ఇతర మౌలిక వసతులు మెరుగు పర్చాలి. వర్షాకాలం, వచ్చే చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. దివ్యాంగులకు సంబంధించి పాఠశాలలు, సంస్థలు ఎన్ని అద్దె, ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయో వివరాలు సేకరించాలి. ఇలాంటివి ఉంటే కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలి. ఒప్పంద సిబ్బందికి ప్రతి నెలా వేతనాలు అందేలా చూడాలి. దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కొత్త ఉపాధి, స్వయంఉపాధి అవకాశాలు గుర్తించి కార్యాచరణ రూపొందించాలి. కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి' అని సూచించారు.

డిజిటల్ ఎరువుల యాప్ అమలులో అగ్రస్థానంలో తెలంగాణ

రూ.175 కోట్ల ప్రోత్సాహకం మంజూరు చేసిన కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: రైతులు, వారి భూమి, పంటల నమోదు, ఎరువుల పంపిణీని 'అగ్రిస్టాక్' ద్వారా డిజిటల్ అనుసంధానం చేయడంలో తెలంగాణ దేశంలో అగ్రస్థానం నిలిచింది. ఇందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ... రాష్ట్రానికి రూ.175 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని మంజూరు చేస్తూ సోమవారం పత్రాన్ని పంపింది. రైతులకు సంబంధించిన సమస్త సమాచారం నమోదు కోసం కేంద్రం అగ్రిస్టాక్ డిజిటల్ వేదికను ప్రారంభించింది. 2024 సెప్టెంబరు నుంచి దీనిలో దేశవ్యాప్తంగా సమాచారం నమోదవుతోంది. రైతుల నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ)ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయగా.. 2025-26కుగాను రూ.424 కోట్ల ప్రోత్సాహకం లభించింది. ఆ తర్వాత కేంద్రం ఎరువుల పంపిణీకి ప్రత్యేక యాప్‌ను ప్రారంభించింది. రాష్ట్ర రైతులు, భూములు, ఎరువుల వినియోగ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం అందులో నమోదు చేసి కేంద్రానికి పంపింది. దీని ఆధారంగా ఎరువుల పంపిణీ యాప్ సేవలను కేంద్రం రాష్ట్రంలో ప్రారంభించింది. అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థ రైతులకు పారదర్శకంగా సేవలు అందించడంతో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని గుర్తించి 2026-27 కింద రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులను కేంద్రం మంజూరు చేసింది. కేంద్ర ప్రోత్సాహకంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తంచేశారు. వ్యవసాయ రంగంలోని డిజిటల్ సేవల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం నుంచి వరుసగా లభిస్తున్న ప్రోత్సాహకాలే నిదర్శనమన్నారు.

రాష్ట్ర జల సంరక్షణ కార్యక్రమాలు దేశానికి మార్గదర్శకం: మంత్రి ఉత్తమ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అమలుచేస్తున్న గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జియోట్యాగింగ్, భూగర్భ జల పర్యవేక్షణ తదితర జల సంరక్షణ కార్యక్రమాలు దేశానికి మార్గదర్శకమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళ, బుధవారాల్లో దిల్లీలో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించనున్న జాతీయ జలశక్తి సదస్సులో రాష్ట్రం 'సమగ్ర జల భద్రత నమూనా'పై ప్రజంటేషన్ ఇవ్వనుందని మంత్రి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

సీడీవో సీఈగా జహీర్

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజినీర్‌గా ఎం.ఎ.జహీర్‌కు బాధ్యతలు అప్పగించారు. సీఈగా ఉన్న వెంకటకృష్ణ సోమవారం పదవీ విరమణ చేయడంతో అదే కార్యాలయంలో ఎస్ఈగా ఉన్న జహీర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. క్వాలిటీ కంట్రోల్ సీఈగా ఉన్న ఎం.ఎస్.ఎన్.రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో అదే కార్యాలయంలో ఎస్ఈగా ఉన్న కె.రవీందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. శాఖలో మరికొందరు ఎస్ఈలు, ఈఈలు కూడా పదవీ విరమణ చేశారు.

బాహ్య మూల్యాంకనం అసంబద్ధ నిర్ణయం

విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: బోధనకు విఘాతం కలిగించడమే కాకుండా... నిరంతర, సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) స్ఫూర్తికి విరుద్ధంగా విద్యార్థుల జవాబుపత్రాలను ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. జవాబుపత్రాలను మండల కేంద్రంలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి... ఇతర పాఠశాలల టీచర్లతో మూల్యాంకనం చేయించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తాజాగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విధానాన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఒకరు, ఇద్దరు టీచర్లున్న పాఠశాలలే అధికంగా ఉన్నందున వారందరూ 3-5 రోజులపాటు మూల్యాంకనానికి వెళితే బోధనకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఎస్టీయూటీఎస్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జట్టు గజేందర్, మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి సోమవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కార్యదర్శి స్పందిస్తూ ఈ నిర్ణయం తన దృష్టికి రాలేదని, డైరెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు సంఘం నేతలు తెలిపారు.

- సంస్కరణల పేరుతో అధికారులు కేవలం ప్రయోగాలకు పరిమితమైన విధానాలను రూపొందిస్తూ విద్యారంగాన్ని రోజురోజుకూ దిగజారుస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ వ్యాఖ్యానించింది. బాహ్య మూల్యాంకనం తపేరుతో తీసుకున్న నిర్ణయం అసంబద్ధమని, ఏకపక్ష నిర్ణయాల్లో భాగమేనని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ విమర్శించారు.
- ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పాఠాలు చెప్పుకునే వెసులుబాటు కల్పించాలని, బోధనేతర పనులు తగ్గించాలని, టీచర్లను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు.
- బోధనకు అంతరాయం కలిగించే...ఉపాధ్యాయులపై అదనపు పని భారం మోపే బాహ్య మూల్యాంకనం నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్(ఎస్టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందజేశారు.

(c) eenadu

కేసీఆర్‌ది ప్రజారంజకపాలన

వేముల ప్రశాంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: భారాస అధికారంలో ఉన్నప్పుడు మొదలుపెట్టిన మూసీ వంతెనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. "పదేళ్లపాటు ప్రజారంజక పాలన చేసిన కేసీఆర్‌ను పల్లెత్తుమాట అనే అర్హత ఆయనకు లేదు. వెయ్యి రోజుల పాలనపై చెప్పుకోవడానికి ఏమీ లేకనే రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై విమర్శలు చేయడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు" అని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

చెవిరెడ్డి అమెరికా పర్యటనకు కోర్టు అనుమతి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏపీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన వైకాపా నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి వైద్యం నిమిత్తం అమెరికా వెళ్లేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతించింది. చికిత్స కోసం ఇటీవల ఒకసారి అమెరికా వెళ్లగా.. తాజాగా మరోసారి వెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీంతో ఆయనకు సెప్టెంబరు 3 నుంచి 13 వరకు అమెరికా వెళ్లేందుకు షరతులతో కూడిన అనుమతులను న్యాయమూర్తి మంజూరుచేశారు. అమెరికాలో ఎక్కడ ఉంటున్నారు? ఫోన్ నంబరు, మెయిల్ తదితర వివరాలతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ష్యూరిటీలు న్యాయస్థానానికి సమర్పించాలని ఆదేశించారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత పాస్‌పోర్ట్‌ను న్యాయస్థానానికి అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కారుమూరి సునీల్ రిమాండ్ పొడిగింపు

మద్యం కుంభకోణం కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో ఉన్న కారుమూరి సునీల్ రిమాండ్‌ను సెప్టెంబరు 11 వరకు పొడిగించారు. సునీల్ రిమాండ్ సోమవారంతో ముగియడంతో అతన్ని జైలు నుంచి వర్చువల్‌గా న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌ను 11 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మరోపక్క వైకాపా నేతలు, శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్, మాజీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ శాసనసభ్యుడు ప్రసాద్‌లు సోమవారం ములాఖత్‌లో నాగేశ్వరరావును కలిసి పరామర్శించారు.

నాణ్యత లేని ఇంగువ నిల్వల సీజ్

ఏపీవ్యాప్త తనిఖీల్లో 120 నమూనాల సేకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఆహార భద్రత ప్రమాణాల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేసి ఎవరెస్ట్, ఎల్జీ బ్రాండ్లకు చెందిన కొన్ని బ్యాచ్‌ల ఇంగువ నిల్వలను సీజ్ చేశారు. 120 నమూనాలను పరీక్షల నిమిత్తం సేకరించినట్లు జాయింట్ ఫుడ్ కంట్రోలర్ బి. శ్రీనివాస్ తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఎవరెస్ట్, ఎల్జీ బ్రాండ్లకు చెందిన ఇంగువ మార్కెట్లో ఉన్నందున ఆయా నిల్వల విక్రయాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం విధించింది. నాసిరకం నిల్వలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.

సీఎం సమీక్ష నిర్ణయాల అమలుపై ప్రత్యేక దృష్టి

- ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును పర్యవేక్షించడం, సీఎం డ్యాష్‌బోర్డ్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రజావాణి ద్వారా ఫిర్యాదులకు సమర్థంగా పరిష్కారం చూపడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎస్ సంజయ్ జాజు ఉన్నతాధికారులను ఆదేశించారు. జవాబుదారీతనం, శాఖల మధ్య సమన్వయం వంటివి పరిపాలనలో ప్రధాన ప్రాధాన్యాలుగా ఉండాలని సూచించారు. సోమవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలపై శాఖలవారీగా చేపట్టిన చర్యలు, పురోగతిని సీఎస్ సమీక్షించారు. "సీఎం సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి శాఖలు సమగ్రంగా, తాజా సమాచారంతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్టులు(ఏటీఆర్‌లు) సమర్పించాలి. ఏ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? తదితర వివరాలు ఏటీఆర్‌లో స్పష్టంగా ఉండాలి. ప్రభుత్వ కీలక కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సీఎం డ్యాష్‌బోర్డ్‌లో.. ఆయా శాఖలు నమోదు చేస్తున్న సమాచారం కచ్చితంగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా చూడాలి" అని సీఎస్ ఆదేశించారు.

రైల్వే ప్రాజెక్టుల్లో పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలి: సీఎస్

రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిత్తల్ తదితర ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల మేర విస్తరణకు డీపీఆర్‌లను రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, వివిధ రైల్వే మార్గాల డబ్లింగ్ పనులు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రజా రవాణా సదుపాయాల మెరుగుదల తదితర 21 అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు తగు ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. పీఎం గతిశక్తి పథకం కింద నిధులు పొందేందుకు సమగ్ర డీపీఆర్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు.

కొవ్వూరులో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

చాగల్లు, న్యూస్‌టుడే: సింహాచలం నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లికి బొగ్గు తీసుకెళ్తున్న గూడ్స్ రైలు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం పట్టాలు తప్పింది. 58 వ్యాగన్లు, రెండు ఇంజిన్లతో నడుస్తున్న ఈ రైలు 7.30 గంటలకు మూడో ప్లాట్‌ఫామ్ దాటుతుండగా ఇంజిన్ నుంచి రెండో వ్యాగన్ అదుపుతప్పి, రెండు సార్లు పట్టాలు ఎక్కుతూ, దిగుతూ ఆగింది. వెంటనే లోకోపైలట్ అప్రమత్తమై రైలును నిలిపివేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆ లైన్‌లో ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలను నియంత్రించి ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో వందేభారత్, దురంతో ఎక్స్‌ప్రెస్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొంత ఆలస్యంగా నడిచాయి.

అశేష భక్తజనం మధ్యలో ముందుకు సాగుతున్న స్వామివారి రథోత్సవం. అంతరచిత్రంలో ఉత్సవమూర్తికి హారతినిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

రమణీయం రాఘవేంద్రస్వామి రథోత్సవం

మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం ఉత్తరారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్మల్య విసర్జన, ఉత్సవ రాయల పాదపూజ చేశారు. రాఘవేంద్రస్వామి ఉత్సవమూర్తిని మఠం నుంచి ఊరేగింపుగా శ్రీగురుసార్వభౌమ విద్యాపీఠానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి శ్రీమఠానికి తీసుకొచ్చిన తర్వాత వసంతోత్సవం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం నడుమ మహారథోత్సవం వైభవంగా జరిగింది.

వెలిగొండ ప్రవాహంలో కొట్టుకుపోయిన వాహనం

ఒకరి గల్లంతు.. చెట్లెక్కి సాయం కోసం ముగ్గురి నిరీక్షణ

పెద్దారవీడు, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమలసాగర్‌లోకి చేరుతున్న కృష్ణా జలాల ప్రవాహంలో బొలేరో వాహనం కొట్టుకుపోయి ఒకరు గల్లంతయ్యారు. మరో ముగ్గురు చెట్లపైకి చేరుకుని సహాయం కోసం నిరీక్షిస్తున్నారు. నల్లమలసాగర్‌కు సోమవారం జలాలు విడుదల చేయడంతో అవి.. ఇప్పటికే ఖాళీ చేయించిన ముంపు గ్రామాల్లోకి చేరుతున్నాయి. సాయంత్రం వరకు పోలీసులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. రాత్రి ఏడు గంటల సమయంలో నలుగురు వ్యక్తులు పెద్దారవీడు మండలంలోని ముంపు గ్రామం కలనూతలలో అరటితోటలో కాయలు కోసేందుకు బొలెరో వాహనంలో వెళ్లారు. మధ్యలో ఉన్న వాగు దాటుతుండగా ప్రవాహ ఉద్ధృతికి వీరి వాహనం కొట్టుకుపోయింది. అందులో ఉన్న ఒకరు గల్లంతు కాగా, మరో ముగ్గురు సమీపంలోని చెట్లపైకి ఎక్కారు. వారి వద్దనున్న సెల్‌ఫోన్ లైట్లు వేసి, తమను రక్షించాలంటూ కేకలు వేయడంతో కొందరు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకున్నా ప్రవాహ ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది.

విమాన సర్వీసుల సమయాల్లో మార్పు

రేణిగుంట, న్యూస్‌టుడే: వివిధ ప్రదేశాల నుంచి తిరుపతి జిల్లా రేణిగుంటకు రాకపోకలు సాగించే పలు విమాన సర్వీసుల సమయాలను ఆ సంస్థలు మార్పులు చేశాయి. మధ్యాహ్నం 2.40కి దిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా రేణిగుంటకు చేరుకుని మధ్యాహ్నం 3.20కి తిరిగి బయలుదేరే ఎయిర్ ఇండియా విమానం ఇకపై సాయంత్రం 5 గంటలకు ఇక్కడికి చేరుకుని సాయంత్రం 5.55కు బయలుదేరనుంది. మధ్యాహ్నం 1.50కి ఇక్కడినుంచి శివమొగ్గకు వెళ్లే స్టార్ ఎయిర్ విమాన సర్వీసు ఇకపై మధ్యాహ్నం 12.50కి బయల్దేరుతుంది. సెప్టెంబర్‌లో మరికొన్ని విమాన సర్వీసుల సమయాలను మార్చనున్నట్లు తెలిసింది.

'పాత పింఛను'పై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మరో 2 పిటిషన్లు

సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: పాత పింఛను విధానంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించుకోవడానికి కొందరు ఉపాధ్యాయులకు అనుమతిస్తూ తెలంగాణ హైకోర్టు గత ఏడాది జులై 23న... ఈ ఏడాది ఫిబ్రవరి 10న వెలువరించిన రెండు వేర్వేరు ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో మరో రెండు ఎస్ఎల్‌పీలు దాఖలు చేసింది. సోమవారం ఇవి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ జోక్యం చేసుకుంటూ ఇదే అంశంపై దాఖలైన పిటిషన్లపై ఇదివరకే కోర్టు నోటీసులు ఇచ్చి వాయిదా వేసిందని.. అందువల్ల వీటిని కూడా వాటితో జత చేయాలని కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరిస్తూ ఈ రెండు పిటిషన్లలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వుల వరకు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది.

మళ్లీ పెద్ద పోస్టు ఇవ్వరూ...!

పశుసంవర్ధకశాఖలో సస్పెండైన ఉన్నతాధికారి పైరవీ

ఈనాడు, హైదరాబాద్: పశుసంవర్ధకశాఖలో అవినీతి అభియోగాలపై రెండేళ్ల క్రితం సస్పెండ్ అయిన ఉన్నతాధికారి ఒకరు అదే శాఖలో కీలక పోస్టులో మళ్లీ చేరేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. పలువురు ప్రముఖులను కలిసి తనకు అనుకూలంగా ఆదేశాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. ఆయనకు అనుకూలంగా కొందరు ఉన్నతాధికారులు పావులు కదుపుతున్నారని తెలుస్తోంది. రెండేళ్ల క్రితం శాఖాపరమైన పలు అభియోగాలతో ఉన్నతాధికారి అరెస్టు కాగా, ప్రభుత్వం సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ ఆయనపై సస్పెన్షన్ కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆయన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులను కలిసి సస్పెన్షన్ ఎత్తివేయడంతోపాటు పెద్ద పోస్టు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ శాఖలో ప్రస్తుతం పలు ఉన్నతస్థాయి పదవులు ఖాళీగా ఉన్నాయి. అర్హులున్నా... వివిధ కారణాలు చూపుతూ వాటిని భర్తీ చేయడం లేదు. ఇన్‌ఛార్జీలను కొనసాగిస్తున్నారు. సస్పెండ్ అయిన అధికారికి ఇది అనుకూలంగా మారింది. ముఖ్యమైన పోస్టు తీసుకొని మళ్లీ పాగా వేయడం ద్వారా గతంలో వచ్చిన అభియోగాల నుంచి బయటపడి, చక్రం తిప్పాలని భావిస్తున్నారు. దాంతో కొందరు ఉద్యోగులు మంత్రి, కార్యదర్శిని కలిసి ఈ వ్యవహారాన్ని వివరించారు.

పోలవరం భద్రతపై కమిటీ వేసేలా ఆదేశించండి

- హైకోర్టులో విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు పిల్
- విచారణ వాయిదా వేసిన ధర్మాసనం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్ట్ భద్రతను మదింపు చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటుచేసేలా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి, కేంద్ర జల సంఘం ఛైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా ఓ న్యాయవాది స్పందిస్తూ, ఏబీ వెంకటేశ్వరరావు స్వయంగా వాదనలు వినిపిస్తారని చెప్పారు. ప్రస్తుతం సెమిస్టర్ పరీక్ష రాస్తున్నారని, కాసేపు విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇది ఈరోజే విచారణ జరపాల్సినంత అత్యవసరమైన వ్యవహారం కాదని ధర్మాసనం పేర్కొని, విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. 'గ్యాప్-1, గ్యాప్-2 డయాఫ్రమ్ వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాదులు, డిజైన్ విషయంలో ఎనిమిది వారాల్లో నివేదిక సమర్పించేలా ఆదేశించండి. డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి క్వాలిటీ కంట్రోల్, తదితర రికార్డులను సీడబ్ల్యూసీ ముందు ఉంచేలా ఆదేశించండి' అని పిటిషన్లో పేర్కొన్నారు. కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శి, రాష్ట్ర జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీకి చెందిన ప్లానింగ్, డిజైన్ చీఫ్ ఇంజినీర్, సెంట్రల్ వాటర్ కమిషన్ ఛైర్మన్, మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ, బ్యూరో ఇంజినీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, ఏఎఫ్ఆర్‌వై ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎండీ, సెంట్రల్ సాయిల్, మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్, వాటర్, పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ సంస్థ సీఎండీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

కొరియన్ పాప్‌స్టార్ మంచిమనసు..

నేపాల్ వరద బాధితులకు రూ.70 లక్షల విరాళం

ఇంటర్నెట్ డెస్క్: జలప్రళయంతో అతలాకుతలమైన హిమాలయ దేశం నేపాల్‌ను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. తాజాగా కొరియన్ పాప్‌స్టార్ లీ నో దాతృత్వాన్ని చాటుకున్నారు. నేపాల్ వరద బాధితులకు దక్షిణ కొరియా కరెన్సీలో 100 మిలియన్ వన్ (భారత కరెన్సీలో దాదాపు రూ.70 లక్షలు)ల విరాళమిచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఈ మొత్తాన్ని వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పంపించారు.

మత మార్పిళ్ల నిరోధక బిల్లుపై గోవా సర్కారు యూటర్న్

పణజీ: మత మార్పిళ్ల నిరోధక బిల్లును ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లోనే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలన్న ఆలోచనపై గోవా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. స్వపక్షంలోని మైనార్టీ ఎమ్మెల్యేల నుంచి వ్యతిరేకత ఎదురైన నేపథ్యంలో సీఎం ప్రమోద్ సావంత్ సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గోవాలో మత మార్పిళ్ల నిరోధక చట్టం అవసరమే లేదని మైనార్టీ ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు.

మరి ఉద్యోగాలెందుకు పెరగట్లేదు: కాంగ్రెస్

దిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి చెందిందంటూ కేంద్ర ప్రభుత్వం సోమవారం గణాంకాలు విడుదల చేయడంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఏప్రిల్-జూన్‌లో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా ఉందన్నది వాస్తవం కాదని.. అది భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం అందించిన 'గొప్ప వక్రీకృత ముఖచిత్రం' అని పేర్కొంది. నిజంగా ఆర్థిక వృద్ధి అంత ఎక్కువ ఉంటే.. దేశంలో ఉద్యోగాలు, ప్రజల సంపద ఎందుకు పెరగడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు.

పంజాబ్ వర్సిటీ అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్న ఏబీవీపీ

ఈనాడు, దిల్లీ: పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఏబీవీపీ అభ్యర్థి అంకిత్ బిధాన్ అధ్యక్ష పదవిని దక్కించుకున్నారు. సమీప ప్రత్యర్థిపై 506 ఓట్ల మెజారిటీ ఆయన ఈ విజయం సాధించారు. గతేడాది ఏబీవీపీ అభ్యర్థి గౌరవ్‌వీర్ సోహెల్ విజయం సాధించగా, వరుసగా రెండో ఏడాది అధ్యక్ష పీఠాన్ని ఒకే విద్యార్థి యూనియన్ దక్కించుకోవడం యూనివర్సిటీ చరిత్రలో ఇదే తొలిసారి. విద్యార్థుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ప్రాతిపదికగా పనిచేసిన తమకు ఈ తీర్పు లభించిందని ఏబీవీపీ సభ్యులు తెలిపారు.

మీ విన్నపం ఏమిటో ఒకసారి చదవండి

- పిటిషన్ ఎలా ఉందో తెలుసుకుంటారు!
- న్యాయవాది ఎన్.సుదర్శన్‌రావుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన
- ప్రజాహిత వ్యాజ్యాలపై సుప్రీంకోర్టులో సంవాదం

ఈనాడు, దిల్లీ: పురుషుల మాయమాటల వలలో చిక్కుకుని లైంగికంగా మోసపోయిన మహిళలకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 69 నిబంధన కింద భార్య హోదాతో పాటు ఆర్థిక రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. వివాహానికి ముందు లైంగిక సంబంధాలపై ఓ తీర్పులో చేసిన వ్యాఖ్యల పట్లా పిటిషనర్ అభ్యంతరం తెలిపారు. ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలపైనా కేసులు నమోదు చేయాలన్న న్యాయవాది ఎన్.సుదర్శన్‌రావు పిటిషన్.. అపఖ్యాతికరంగా, నిర్లక్ష్యం, ధిక్కారపూరితంగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. బాధ్యతాయుతమైన న్యాయవాదిగా ఉంటూ ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయొద్దని హితవు పలికారు. ఇలాంటి పిటిషన్లు దాఖలుచేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన న్యాయవాది సుదర్శన్‌రావు వాదనలు వినిపించడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యల చేశారు. 'మీరు ఒకసారి మీ పిటిషన్‌లోని విన్నపాన్ని అందరి ముందు చదవండి. కోర్టు హాలులో కూర్చున్న లాయర్లు వింటారు. దేశంలో పిటిషన్ల రచన ఎలా జరుగుతుందో తెలుసుకుంటారు' అని సీజేఐ అన్నారు. అయితే, సుదర్శన్‌రావు చదవకపోవడంతో పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఖర్గేపై పిటిషన్ సందర్భంగా...

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి వ్యతిరేకంగా సుదర్శన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టేస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. దీనిపై సుదర్శన్‌రావు స్పందిస్తూ..'ఖర్గే భాజపా సభ్యులను చంపేయమంటున్నారు. నేను కూడా భాజపా సభ్యుడినే. ఇలాంటి కేసును ఎందుకు కొట్టేస్తున్నారు? దిస్ ఈజ్ టూమచ్. భాజపా సభ్యులను చంపేయమన్న ఖర్గేను, ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్న డిమాండ్‌కు మీరు సమర్థిస్తున్నారా? ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడానికి అంబేద్కర్ మద్దతివ్వలేదు' అని వాదించారు. ఆ న్యాయవాది స్థితిని గమనించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అతని రెండో పిటిషన్‌ను చదమని కోరారు.

సౌదీ-దిల్లీ విమానంలో..

బాంబు అని రాసి ఉన్న టిష్యూ లభ్యం

- విమానాన్ని అహ్మదాబాద్‌లో దింపిన పైలట్లు

అహ్మదాబాద్: సౌదీ అరేబియా నుంచి దిల్లీకి 32 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానంలో బాంబు అని రాసి ఉన్న టిష్యూ పేపర్ లభ్యమవ్వడంతో.. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించేశారు. విమాన సిబ్బందిలో ఒకరికి బాంబ్ అని రాసి ఉన్న పేపర్ వాష్‌రూమ్‌లో లభ్యమవ్వడంతో అహ్మదాబాద్‌కు విమానాన్ని మళ్లించాలని పైలట్లు నిర్ణయించారని అధికారులు వెల్లడించారు. ల్యాండింగ్ అనంతరం విమానాన్ని తనిఖీ చేసిన భద్రతా బలగాలు అందులో అనుమానస్పదంగా ఏదీ లభించలేదని నిర్ధారించినట్లు ఆయన వివరించారు.

దిల్లీ సింహాసనం కోసం జరిగిన యుద్ధంలా ఉంది!

- కాంగ్రెస్, తృణమూల్ వివాదంపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా నౌడాలోని పార్టీ కార్యాలయాన్ని అప్పగించేలా పోలీసులకు ఆదేశాలివ్వాలంటూ కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌధరీ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ కలకత్తా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కార్యాలయం కోసం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న పోరు...స్వాతంత్ర్యానికి ముందు దిల్లీ సింహాసనం కోసం జరిగిన యుద్ధాలను తలపిస్తోందని న్యాయమూర్తి జస్టిస్ సౌగతా భట్టాచార్య వ్యాఖ్యానించారు. తొలుత దిల్లీ సింహాసనం మహమ్మద్ ఘోరీ, ఆ తర్వాత సుల్తాన్‌లు, వారి నుంచి మొగలాయిలు, అటుపిమ్మట ఆంగ్లేయుల వశమైందని పేర్కొన్నారు. నౌడాలోని వివాదాస్పద భవనంపై పూర్తి హక్కులు తమకే ఉన్నాయని పిటిషనర్ అధీర్ రంజన్ భావిస్తున్నట్లయితే సివిల్ కోర్టుకు వెళ్లాలని సూచించారు. నౌడాలో 2004లో నిర్మించిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని 2018లో తృణమూల్ కాంగ్రెస్ ఆక్రమించుకుందని అధీర్ రంజన్ ఆరోపించారు.

సోమవారం దిల్లీలో బీజేవైఎం నూతన అధ్యక్షుడుగా ఎంపికైన హేమంగ్ జోషి. చిత్రంలో మాజీ అధ్యక్షుడు, బెంగళూరు సౌత్ ఎంపీ తేజస్వీ సూర్య

సుప్రీంకోర్టు జడ్జినంటూ మోసంచేసిన సుకేశ్ చంద్రశేఖర్‌కు 8 ఏళ్ల జైలు

దిల్లీ: ఓ కేసులో బెయిల్ పొందటానికి గాను విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తినంటూ ఫోన్ ద్వారా బెదిరించిన నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్‌కు దిల్లీ కోర్టు 8 ఏళ్ల జైలు శిక్ష విధించింది. దోషి వ్యవస్థాగత ద్రోహానికి పాల్పడటమే కాకుండా న్యాయవ్యవస్థ, విచారణ ప్రక్రియ సత్యనిష్ఠను దెబ్బతీసే యత్నం చేశారని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హర్షితా మిశ్ర పేర్కొన్నారు. ప్రభుత్వ పదవిలో ఉన్న వ్యక్తిలా నటించడం, ప్రభుత్వ ఉద్యోగిని వేధించడం, ఆకాశరామన్న సమాచారం ద్వారా బెదిరింపులకు పాల్పడటం వంటి నేరపూరిత చర్యలకు గాను విడివిడిగా శిక్షలు ఖరారు చేసి, అవన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలయ్యేలా జడ్జి తీర్పునిచ్చారు. అవినీతి వ్యవహారంలో పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడు కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను తీసుకుని స్పెషల్ జడ్జికి ఫోన్ చేసి బెదిరించడంతో ఈ కేసు నమోదైంది. సుకేశ్‌ను ఆగస్టు 20నే కోర్టు దోషిగా నిర్ధారించింది. శనివారం శిక్షలు ఖరారు చేస్తూ ఇచ్చిన తీర్పు ప్రతి సోమవారం అందుబాటులోకి వచ్చింది.

సహేతుక, సమర్థనీయ కారణాల్లేని వ్యక్తుల బహిష్కరణ ఉత్తర్వు చెల్లదు: సుప్రీం కోర్టు

దిల్లీ: ఒక నిర్దిష్ట ప్రాంతం నుంచి వ్యక్తులను బహిష్కరించే ఉత్తర్వులు రాజ్యాంగం పౌరులకు హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని సుప్రీంకోర్టు పేర్కొంది. అలాంటి ఉత్తర్వులను జారీ చేయటానికి గల సహేతుక, సమర్థమైన కారణాలను తప్పనిసరిగా జత చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులకూ వాటిని తెలియజేయాలని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్‌నాగు ధర్మాసనం తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్, దాని పొరుగు జిల్లాల నుంచి ఓ వ్యక్తిని బహిష్కరిస్తూ గత ఏడాది జారీ అయిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ తీర్పు వెలువరించింది. కారణాలను తెలపని ఈ ఉత్తర్వు చెల్లదని స్పష్టం చేసింది. ఒక వ్యక్తిపై పలు కేసులు ఉన్నాయనే సాకుతో బహిష్కరణ ఉత్తర్వు ఇవ్వడాన్ని సమర్థించలేమనీ ధర్మాసనం తెలిపింది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన బహిష్కరణ ఉత్తర్వును హైకోర్టులో సవాల్ చేయగా తిరస్కరణకు గురికావడంతో ఆ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ ఉత్తర్వులకు కారణాలను జిల్లా కలెక్టర్ తెలపకపోవడం, ఆ వ్యక్తి వివరణ తీసుకోకపోవడాన్నీ సుప్రీం ధర్మాసనం ప్రస్తావించింది.

రాజ్యాంగం, షరియా పరిరక్షణకు ప్రజా ఉద్యమం: ఏఐఎంపీఎల్‌బీ

దిల్లీ: రాజ్యాంగం, షరియా (ఇస్లామిక్ చట్టం) పరిరక్షణ కోసం దేశవ్యాప్త ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) సోమవారం ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రధాన నగరాల్లో బహిరంగ సమావేశాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపింది. ముస్లింలపై దుర్విచక్షణ, రాజ్యాంగ ఉల్లంఘనలు, మానవ హక్కుల ఉల్లంఘనల వంటి ఘటనలను తెలియజేస్తూ సమగ్ర శ్వేతపత్రాన్ని విడుదల చేస్తామనీ పేర్కొంది.

మనో వ్యధకు సమర్థమైన చికిత్స

దిల్లీ: మానసిక ఆందోళనకు, కుంగుబాటు(డిప్రెషన్) కు చికిత్స ఎలా పనిచేస్తోందో తెలుసుకోవడానికి సాధారణంగా 4 నుంచి 6 వారాలు పడుతుంది. అలా కాకుండా 7-10 రోజుల్లోనే చికిత్స ప్రభావాన్ని తెలుసుకునే కొత్త పద్ధతిని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాన్పూర్(ఐఐటీ-కె), గణేష్ శంకర్ విద్యార్థి స్మారక వైద్య కళాశాల పరిశోధకులు రూపొందించారు. రోగి మెదడు, కడుపు నుంచి వచ్చే విద్యుత్ సంకేతాల విశ్లేషణ. క్లినికల్ లక్షణాల పరిశీలన ద్వారా ఇది సాధించవచ్చని తెలిపారు. నిరంతర విచారం, నిరాశ, దైనందిన కార్యకలాపాలపై నిరాసక్తత వంటి లక్షణాలతో కూడిన మానసిక ఆరోగ్య సమస్యే డిప్రెషన్. దీని బారిన పడినవారిలో 30 శాతం మంది వరకు ఔషధ చికిత్సకు స్పందించకపోవచ్చని అధ్యయనాలు వెల్లడించాయి. పరిశోధకులు ఎలక్ట్రోఎన్సెఫాలోగ్రఫీ(ఈఈజీ), ఎలక్ట్రోగ్యాస్ట్రోగ్రఫీ (ఈజీజీ)ల ద్వారా డిప్రెషన్ బాధితుల మెదడు, కడుపులోని విద్యుత్ సంకేతాలను విశ్లేషించారు. వారు అనుసరించిన పరిశోధనా మోడల్ చికిత్సకు స్పందించని రోగులను 84 శాతం ఖచ్చితత్వంతో గుర్తించింది. దీనివల్ల డిప్రెషన్ చికిత్సను వ్యక్తిగతీకరించవచ్చు. వ్యక్తికి తగిన మందుల వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు.

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రయాగ్‌రాజ్ వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గంగా నది

(c) eenadu